

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు

సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు

ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

విజయవాడ

: fb.com/vaartha Digital

Published from Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

18-8-2025 సోమవారం సంపుటి: 31 సంచిక: 198 పేజీలు: 12 వెల: 6.50


తెరచుకున్న శబరిమలై ఆలయం

గాజా పౌరులకు వీసాలు నిలిపివేసిన యుఎస్

9లో



ఆదివారం న్యూఢిల్లీలో ప్రాజెక్టులు ప్రారంభించి, నిర్మాణ రంగ కార్మికులతో మాట్లాడుతున్న ప్రధాని మోడీ

## వికసిత్ భారత్‌కు 'ఢిల్లీ' ఒక నమూనా

### రూ. 11వేల కోట్ల ప్రాజెక్టులు ప్రారంభించాం

### దేశంలో మొట్టమొదటి 8 లేన్ల ఎక్స్‌ప్రెస్‌వేలు: ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ, ఆగస్టు 17:** దేశరాజధాని ప్రాంతం, రాజధాని నగరం చుట్టూ బిజెపి పాలన కొనసాగుతోందని, దీన్ని చూసే కొందరు ఓర్వలేకపోతున్నారని ప్రధాని నరేంద్రమోడీ పేర్కొన్నారు. బిజెపి భారీ ఎత్తున చేపట్టిన అభివృద్ధిని చూసి వారికి వణుకు ప్రారంభం అయిందన్నారు. మనకే ఢిల్లీ ప్రజల ఆశీర్వాదాలు ఉన్నాయని చూపిస్తుందని కొందరు దీన్ని తట్టుకోలేకపోతున్నారని విమర్శించారు. వారంతా ప్రజలకుదూరంగా ఉన్నారన్నారు. నేషనల్ క్యాపిటల్ రీజియన్‌లో దాదాపు రూ.11 వేల కోట్ల విలువైన రెండు కీలకమైన జాతీయ రహదారి ప్రాజెక్టులను ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జాతికి అంకితం చేశారు. వీటిలో ఢిల్లీ సెక్షన్ లోని ద్వారకా ఎక్స్‌ప్రెస్‌వే, అర్బన్ ఎక్స్‌టెన్షన్ రోడ్ 2 ఉన్నాయి. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ, ఢిల్లీ, హర్యానా ముఖ్యమంత్రులు రేఖ గుప్తా, నయాబ్‌సింగ్ సైనీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని ముండ్కాలో రోడ్ షో నిర్వహించారు. ఢిల్లీకి ద్వారకా ఎక్స్‌ప్రెస్‌వే, అర్బన్ ఎక్స్‌టెన్షన్ రోడ్ కనెక్టివిటీ లభించనున్నది. >>2

# వర్షపు నీరు రిజర్వాయర్లకు మళ్లింపు

## జలవనరుల సంరక్షణతోనే భూగర్భ జలాల పెంపు

### వచ్చే 10,15 రోజుల్లోగా చెరువులకు, కాల్వలకు, చెక్ డ్యామ్‌లకు మరమ్మత్తులు!: సిఎం చంద్రబాబు



**విజయవాడ,ఆగస్టు 17, ప్రభాతవార్తప్రతినిధి:** నీటి వనరులను పూర్తి స్థాయిలో సంరక్షించినప్పుడే భూగర్భ జలాలు పెరుగుతాయని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేసారు. రాష్ట్రంలో సాగు నీటి సంఘాల నిర్వహణపై సిఎం చంద్రబాబు తరచు సంబంధిత శాఖాధికారులతో ఇంటరాక్ట్ అవుతున్నారు,అందులో భాగంగా సమర్ధ నీటి నిర్వహణాంశంపై ముఖ్యమంత్రి పలు ఆదేశాలు జారీ చేస్తున్నారు. సిఎంఒ అందించిన సమాచారాన్ని అనుసరించి. వర్ష కాలంలో పడే నీటిని చెరువుల్లో నింపాలని సిఎం చంద్రబాబు అన్నారు. వెంటనే కాల్వల్లో పూడిక తీయాలన్నారు. పంట కాల్వల నిర్వహణ సరిగా ఉండాలి, వరద నీటి పారుదలకు ఇబ్బంది లేకుండా కాల్వల నిర్వహణ చేపట్టాలి. చెరువులు, కాల్వలను ఏర్పాటు చేసుకోవడం ఎంత ముఖ్యమో.. నిర్వహరణ చేపట్టడమూ అంతే ముఖ్యం. గత ప్రభుత్వంలో కనీసం షట్టర్లు, గేట్ల నిర్వహణ కూడా సరిగా చేయలేదు. కాంట్రాక్టర్లు వాటిని సరి చేయడానికి ముందుకు రాలేదు. అలాంటి పరిస్థితి ఎప్పుడూ ఉండకూడదు. షట్టర్ల రిపేర్లు అనే మాటే ఉండకూడదు. అన్ని చెరువులు, లాకులు, కాల్వలు చెక్ చేసుకోవాలి. అవి సరిగా పని చేస్తున్నాయా లేదా అనేది కూడా చూడాలి. నీటి నిర్వహణపై జిల్లాల వారీగా రేటింగ్స్ ఇస్తాం. ఇరిగేషన్ శాఖలోని ఇంజనీరింగ్ వ్యవస్థను రీఆర్గనైజ్ చేస్తాం." అని చంద్రబాబు స్పష్టం చేశారు.

రాష్ట్రంలో 1000 టిఎంసిలు సర్ఫేస్ వాటర్ ఉండాలి... భూగర్భ జలాలు పెరగాలి. భూమిని జలాశయంగా మార్చుకోవాలి. భూగర్భ జలాలు లేకుంటే.. వేయి అడుగులలోతు నుంచి నీటిని తోడుకోవాల్సిన పరిస్థితి ఉంటుంది. దీని వల్ల మంచినీటి అవసరనాలకు ఉపయోగపడని ఫ్లోరైడ్ నీరు వచ్చే ప్రమాదం ఉంది. అలాగే నీటిని తోడేందుకు ఎక్కువ విద్యుత్ వినియోగం కూడా అవుతుంది. సాగునీటి సంఘాలు భూగర్భ జలాలను పెంచే బాధ్యతనూతీసుకోవాలి. రాష్ట్రంలో మొత్తంగా 40 లక్షల ఎకరాల బోర్ వెల్స్ మీద ఆధారపడ్డాయి. రాష్ట్రంలోని 19 లక్షల బోర్లు ఉంటే.. వాటి కోసం రూ. 8250 కోట్లు విద్యుత్ ఖర్చు పెట్టాల్సి వస్తుంది. భూగర్భజలాలను సమర్థవంతంగా వినియోగించుకుంటే ఇందులో 50 శాతం ఖర్చును తగ్గించుకోవచ్చు.

వర్షాకాలంలో ముందు భూగర్భ జలాలు మూడు మీటర్ల లోతున అందుబాటులో ఉండాలి. వర్షాకాలం తర్వాత ఎనిమిది మీటర్లకు తగ్గకుండా చూడాలి. ఈ విధంగా నీటిని సమర్థవంతంగా నిర్వహించుకుంటే కరవు నివారణ అనేదే ఉండదు. సాగు నీటి సంఘాలు అంటే నీటిని తీసుకోవడమే కాదు.. నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపు వంటి అంశాల పైనా సాగునీటి సంఘాలు బాధ్యత తీసుకోవాలి. నదీ తీర ప్రాంతంలో ఉన్న కొన్ని జిల్లాల్లో భూగర్భ జలాలపై దృష్టి పెట్టడం లేదు. తూర్పు గోదావరి, ఏలూరు, ప్రకాశం వంటి జిల్లాల్లో భూగర్భ జలాలు మరింత పెరగాలి. రాష్ట్రంలోని ప్రాజెక్టుల్లో నీటిని నిల్వ చేసుకోగలిగాం. రిజర్వాయర్లు, బ్యారేజీల్లో మొత్తంగా కలిపి 82.29 శాతం మేర నింపుకోగలిగాం. ఎగువ నుంచి వస్తున్న వరదతో పాటు.. రాష్ట్రంలో పడుతున్న వర్షపు నీటిని సమర్ధంగా రిజర్వాయర్లకు మళ్లించడంలో ప్రభుత్వం విజయవంతమైంది. హంద్రీనీవా ద్వారా రాయలసీమలో ప్రాజెక్టులు నింపాం. ఇకపై వెలుగోడు, ఉత్తరాంధ్ర, గాలేరు నగరి సుజల స్రవంతి ప్రాజెక్టులపై దృష్టి సారిస్తాం. నీటిని ఒడిసిపట్టి ప్రాజెక్టులను ఏ విధంగా నింపామో.. ఇదే విధంగా గ్రామాల్లోని >>2



## కేంద్ర మంత్రులతో నారా లోకేష్ భేటీ

**విజయవాడ,ఆగస్టు17,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో పెండింగ్ ప్రాజెక్టులపై సంబంధిత కేంద్ర మంత్రులతో చర్చించేందుకు రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ ఈరోజు రాత్రి ఢిల్లీ వెళ్లనున్నారు. మంత్రి లోకేష్ సోమవారం ఈమేరకు పలువురు కేంద్రమంత్రులతో భేటీ కానున్నారు. రాష్ట్రంలో కూటమి సర్కారు అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటికే పలుమార్లు కేంద్ర మంత్రులతో భేటీఅయిన లోకేష్ రాష్ట్ర ప్రయోజనాలకోసం నిరంతరంశ్రమిస్తున్నారు. మంత్రి లోకేష్ చొరవతో రాష్ట్రానికి కొత్త ప్రాజెక్టుల రాకతోపాటు వేగవంతంగా >>2

## నేడు ఢిల్లీకి సిఎం

**విజయవాడ,ఆగస్టు17,ప్రభాతవార్తప్రతినిధి:** సిఎం చంద్రబాబు రాత్రికి ఢిల్లీ వెళ్లనున్నారు. ఉపరాష్ట్రపతి అభ్యర్థి నామినేషన్ కార్యక్రమంలో పాల్గొనే అవకాశం ఉంది. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వంలోని పలు కీలక శాఖలకు చెందిన మంత్రులతో రాష్ట్రానికి సంబంధించిన అంశాలపై కూడ చర్చించే ఛాన్స్ ఉందని సమాచారం. కాగా, ఈ రోజు జరుగుతున్న బిజెపి పార్లమెంటరీ బోర్డు సమావేశంలోనే ఉపరాష్ట్రపతి అభ్యర్థి పేరును భారతీయ జనతా పార్టీ ఖరారు చేయనుంది. ఆ తర్వాత ఎన్డీయే ఉపరాష్ట్రపతి అభ్యర్థి ఈ నెల 21వ తేదీన నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఈ కార్యక్రమానికి ఎన్డీయే పాలిత రాష్ట్రాల సిఎంలు,ఉప ముఖ్యమంత్రులు, అలాగే కీలక నేతలు హాజరు కానున్నారు. ఇక,ఉప రాష్ట్రపతి అభ్యర్థి నామినేషన్ కార్యక్రమానికి ముందుగా 20వ తేదీన ఎన్డీయే నేతల భేటీ జరుగనుంది. ఆ సమావేశంలో కూడ సిఎం చంద్రబాబు పాల్గొననున్నారు.

## ఐటీ కంపెనీలను ఆకర్షించేలా టెక్‌హబ్స్ పాలసీ - ఉత్తర్వులు జారీ

**విజయవాడ,ఆగస్టు17,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రానికి ప్రముఖ ఐటీ కంపెనీలను ఆకర్షించేలా ఎపి ల్యాండ్ ఇన్సెంటివ్ ఫర్ టెక్ హబ్స్ (ఎల్ఐఎఫ్టీ) పాలసీ (4.0)ని ప్రకటిస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఫార్చ్యూన్-500,ఫార్చ్యూన్-500 యూరప్,ఫార్చ్యూన్ గ్లోబల్-500,ఫార్చ్యూన్-1,000,ఫోర్బ్స్ గ్లోబల్-2000లో గత మూడేళ్ళలో ర్యాంకింగ్ పొందిన సంస్థలు ఐటి, ఐటిఇఎస్,గ్లోబల్ కేపబుల్ సెంటర్స్(జిసిసిల) ఏర్పాటుకు రాయితీతో భూములు కేటాయిస్తారు. ఒక బిలియన్ డాలర్ల మార్కెట్ క్యాపిటలైజేషన్ ఉండాలనే నిబంధన విధించారు. వీటికి రాష్ట్రంలో ఎక్కడైనా నామమాత్ర ధరకింద ఎకరా 99 పైసలకు కేటాయిస్తారు. ఐటి,ఐటిఇఎస్‌లు ఏర్పాటు చేయాలనుకునే సంస్థలు మూడేళ్లలో కనీసం 3వేల మందికి ఉపాధి కల్పించాలని పాలసీలో పేర్కొన్నారు.

# రూ. 85 కోట్లతో ఫుడ్ టెస్టింగ్ కేంద్రాలు

### 5 రాష్ట్ర స్థాయి పరీక్షా కేంద్రాలు: మంత్రి సత్యకుమార్ యాదవ్

**విజయవాడ,ఆగస్టు17,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రజల ఆరోగ్యదాయక జీవనానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందని రాష్ట్ర వైద్యారోగ్య మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. ఇందులో భాగంగా రాష్ట్రస్థాయిలో సుమారు రూ.86 కోట్లతో 5 ఆహార నాణ్యతా పరీక్షా కేంద్రాల్ని సిద్ధం చేస్తున్నామని తెలిపారు. ఆ మేరకు మంత్రి తన కార్యాలయం ద్వారా ఒకప్రకటన విడుదల చేసారు. ఒక్కో కేంద్రం ఏర్పాటుకు సుమారు రూ. 20 కోట్ల వరకు ఖర్చుపెడుతున్నామని చెప్పారు.

ఈ కేంద్రాల్లో సమకూరే అత్యాధునిక యంత్ర పరికరాల ద్వారా ఆహార పదార్థాల నమూనాలను పరీక్షిస్తారని చెప్పారు. వీటిల్లో తిరుమల, విశాఖలోని ల్యాబొరేటరీ నమూనాల పరీక్షలు మరో నెల రోజుల్లో ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఎఐ)తో కుదిరిన ఒప్పందం మేరకు ఈ కేంద్రాల ఏర్పాటు జరుగుతోందన్నారు.తిరుమల భక్తుల కోసం ప్రత్యేక రాష్ట్ర స్థాయి ల్యాబొరేటరీ అందుబాటులోకి వస్తుందన్నారు. శ్రీవారి భక్తుల ఆరోగ్యమే ప్రధాన ధ్యేయంగా తిరుమలలో స్టేట్ ఫుడ్ ల్యాబొరేటరీ ఏర్పాటు పనులు తుది దశకు చేరుకున్నాయని మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. వచ్చే నెలాఖరునాటికి ఈ ల్యాబొరేటరీని వినియోగానికి సిద్ధం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. గత వైఎస్సార్సీ ప్రభుత్వ హయాంలో కల్తీ నెయ్యి ఘటన వల్ల భక్తుల మనోభావాలు తీవ్రంగా దెబ్బతిన్నాయని చెప్పారు.

ఈ నేపథ్యంలో తిరుమలలో ప్రత్యేకంగా రాష్ట్ర స్థాయి ల్యాబొరేటరీని ఏర్పాటుచేసేందుకు నిర్ణయం జరిగిందన్నారు. ఎఫ్ఎస్ఎస్ఎఐతో కుదిరిన ఒప్పందాన్ని అనుసరించి తిరుమలలో ల్యాబొరేటరీ ఏర్పాట్ల పనుల్ని గత ఏప్రిల్ నుంచి ప్రారంభించినట్లు చెప్పారు. తిరుమలలోని పిండి మిల్లు వద్ద అక్కడి అధికారులు అందజేసిన భవనాన్ని (12,000 చదరపు అడుగులు) ల్యాబొరేటరీ ఏర్పాటుకు అనుగుణంగా మారుస్తున్నట్లు తెలిపారు. సుమారు రూ.19 కోట్ల వ్యయం చేసే ఆహార నమూనాల పరీక్షలు చేసేందుకు గాను యంత్ర



పరికరాలను ల్యాబొరేటరీలో సమకూరుస్తున్నామని చెప్పారు. ఈ ల్యాబొరెటరీలో అన్ని రకాల ఆహార పదార్థాల నమూనాలను పరీక్షిస్తారన్నారు. 24 గంటల పాటు ఈ ల్యాబబొరేటరీ పనిచేసేలా అవసరమైన సిబ్బంది అందుబాటులో ఉంటారని వెల్లడించారు. దేశవిదేశాల నలుమూలల నుంచి వచ్చే భక్తులకు ఆరోగ్య సంరక్షణ ధ్యేయంగా ఈ కేంద్రం పనిచేస్తుందని మంత్రి తెలిపారు. ఇప్పటి వరకు ఆహార పదార్థాల నాణ్యతా >>2



## ఉపరాష్ట్రపతి ఎన్డీయే అభ్యర్థిగా సిపి రాధాకృష్ణన్

### ఖరారుచేసిన బిజెపి పార్లమెంటరీ బోర్డు సమావేశం

**న్యూఢిల్లీ, ఆగస్టు 17:** భారత ఉపరాష్ట్రపతి పదవికి ఎన్డీయే పక్షాల తరపున మహారాష్ట్ర గవర్నర్ సిపి రాధాకృష్ణన్‌ను ఎంపికచేసారు. ఆదివారం జరిగిన బిజెపి పార్లమెంటరీ బోర్డు సమావేశంలో సుదీర్ఘ చర్చల అనంతరం రాధాకృష్ణన్‌పేరును ఖరారు చేసారు. బిజెపి అధ్యక్షుడు జెపినడ్డా రాధాకృష్ణన్ పేరును అధికారికంగా ప్రకటించారు. 1957 మే 4న జన్మించిన సిపి రాధాకృష్ణన్ తమిళనాడులోని కోయంబత్తూరు లోక్‌సభ స్థానంనుంచి రెండుసార్లు బిజెపి తరపున ఎంపిగా ఎన్నికయ్యారు. తమిళనాడు బిజెపి రాష్ట్ర అధ్యక్షుడుగా కూడా పనిచేసారు. 2016 నుంచి 2019వరకూ ఆల్ ఇండియా కాయిర్‌బోర్డు ఛైర్మన్‌గా సేవలందించారు. తమిళనాడు బిజెపి సీనియర్ నాయకుల్లో ఒకరిగా గుర్తింపు పొందారు. 2023 ఫిబ్రవరి 18 నుంచి జార్ఖండ్ గవర్నర్‌గా బాధ్యతలుచేపట్టారు. గతంలో తెలంగాణతోపాటు పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్‌గా కూడా ఆయన అదనపు బాధ్యతలు నిర్వహించారు. ప్రస్తుతం మహారాష్ట్ర గవర్నర్‌గా కొనసాగుతున్నారు. ఉపరాష్ట్రపతి అభ్యర్థిని ఎంపికచేసే అధికారాన్ని ఎన్డీయే పక్షాలు ప్రధాని నరేంద్రమోడీ, బిజెపి అధ్యక్షుడు జెపినడ్డాకు అప్పగించిన సంగతి తెలిసిందే. ఈనెల21వ తేదీ నామినేషన్ల దాఖలుకు చివరితేదీ. ఎన్డీయే పదవికి ఎవరెవరు వస్తారా అన్న ఉత్కంఠతో ఇంతకాల నడిచిన అధికార కూటమి సభ్యుల ఉత్కంఠకు తెరపడింది. రేసులో జమ్ముకాశ్మీర్ గవర్నర్ మనోజ్ సిన్హా వంటి ప్రముఖులపేర్లు తెరపైకి వచ్చాయి. తెలంగాణ గవర్నర్‌గా పనిచేసిన తమిళిసై సౌందరరాజన్ 2024 మార్చి 18న రాజీనామాచేయడంతో తెలంగాణ గవర్నర్‌గా సిపిరాధాకృష్ణన్ అదనపు బాధ్యతలు చేపట్టారు. ఆసమయంలో పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్‌గా ఉన్న సిపిరాధాకృష్ణన్ తెలంగాణ గవర్నర్‌గా కూడాపనిచేసారు. 2024 జూలై 31వరకూ తెలంగాణ గవర్నర్‌గా పనిచేసారు.

2024 ఆగస్టు 6వరకూ పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్‌గాపనిచేసినతర్వాత మహారాష్ట్ర గవర్నర్‌గా నియమితులయ్యారు. ఉపరాష్ట్రపతి ఎంపికలో బిజెపి ఎన్డీయే కూటమి సమతుల్యతను పాటించింది. రాష్ట్రపతి ముర్ము ఒడిశా వాసి కాగా రాధాకృష్ణన్ దక్షిణాది వాసి. కాగా ఉపరాష్ట్రపతి పదవికి ఎన్నిక సెప్టెంబరు 9న జరగనున్నది. ఆగస్టు 22వ తేదీతో నామినేషన్ల ఉపసంహారణ గడువు కూడా ముగుస్తుంది. ఇపుడు ఇండియా కూటమి అభ్యర్థి ఎవరన్నది ఆపార్టీ సమిష్టి నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది.



## 22న త్రైపాక్షిక భేటీ

### ఒకే వేదికపైకి పుతిన్, ట్రంప్, జెలెన్‌స్కీ

**వాషింగ్టన్, ఆగస్టు 17:** ఉక్రెయిన్‌లో యుద్ధానికి ముగింపు పలికే అంశంపై చర్చించేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఇటీవల అలాస్కాలో భేటీ అయ్యారు. అనంతరం త్రైపాక్షిక సమావేశం గురించి ట్రంప్, జెలెన్‌స్కీ ఫోన్‌లో మాట్లాడుకున్నారు. ఈ నేపథ్యంలో ముగ్గురు అధ్యక్షుల మధ్య త్రైపాక్షిక సమావేశం ఆగస్టు 22న ఏర్పాటు చేయాలని ట్రంప్ యోచిస్తున్నట్లు ట్రూత్‌లో పోస్టుచేసారు. పుతిన్‌తో సమావేశం అనంతరం ఈ విషయాన్ని ట్రంప్ యూరోపియన్ యూనియన్ నాయకులతో చెప్పినట్లు సమాచారం. >>2

## 'ఉగ్ర' గ్రూపు సభ్యుడి అరెస్టు

### జిల్లా ఎస్‌పి వి.రత్న



**శ్రీ సత్య సాయి జిల్లా, ఆగస్టు 17, ప్రభాతవార్త ప్రతినిధి :** నిషేధిత ఉగ్రవాద సంస్థలతో సంబంధం ఉన్న వాట్సాప్ గ్రూపుల్లో చురుకుగా పాల్గొని, జిహాదీ సిద్ధాంతాలకు సంబంధించిన ప్రచార పుస్తకాలను ఉంచుకున్న ఒక వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు శ్రీసత్యసాయి జిల్లా ఎస్పీ వి.రత్న తెలియజేశారు. జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో ఆదివారం ఎస్పీ మీడియా సమావేశంలో ధర్మవరం ఇంచార్జ్ డిఎస్పీ నరసింగప్పతో కలిసి ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు.

రాష్ట్ర కౌంటర్ ఇంటెలిజెన్స్ సెల్‌కు రాబడిన సమాచారం మేరకు ఈనెల 16వ తేదీన ఉదయం 05:00 గంటలకు, ధర్మవరం ఇంచార్జి డిఎస్‌పి ఎ.నరసింగప్ప, స్థానిక పోలీస్ >>2

## కూంబింగ్ టీమ్ అదుపులో మావోయిస్టు

### కూంబింగ్ బలగాలపై కాల్పులకు ప్రయత్నించిన మావోయిస్టు అరెస్ట్

### 303 తుపాకీ,9ఎంఎం పిస్తోల్, సామాగ్రి స్వాధీనం: ఎస్పీ అమిత్ బర్దర్



ఆదివారం మీడియాతో ఎస్పీ అమిత్ బర్దర్

**పాడేరు, ఆగస్ట్ 17, ప్రభాతవార్త:** అల్లూరి సీతారామరాజు జిల్లా జి.మాడుగుల మండలం కిల్లంకోట పంచాయతీ, చింతగుప్ప పరిసర ప్రాంతాల్లో శనివారం కూంబింగ్ నిర్వహిస్తున్న పోలీస్‌బలగాలపై మావోయిస్టులు కాల్పులు జరిపేందుకు ప్రయత్నించి నఘటన ప్రదేశం నుండి తప్పించుకొని కొంతమంది మావోయిస్టులు పారిపోయే ప్రయత్నించగా అందులో ఒక మావోయిస్టును అదుపులోకి తీసుకుని ఆ మావోయిస్టు వద్ద లభ్యమైన ఆయుధాలను స్వాధీనం చేసుకున్నామని అల్లూరి జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ వెల్లడించారు.ఆదివారం జిల్లా పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ వివరాలను వెల్లడించారు. అల్లూరి జిల్లా జి.మాడుగుల మండలం కిల్లంకోట పంచాయతీ, చింతగుప్ప పరిసర ప్రాంతాల్లో కూంబింగ్ నిర్వహిస్తున్న పోలీసు బలగాలపై మావోయిస్టులు కాల్పులు జరిపేందుకు ప్రయత్నించి అక్కడ నుండి తప్పించుకొని పారిపోయే ప్రయత్నంలో బలగాలు చాకచక్యంగా ఒక మావోయిస్టును అదుపులోకి తీసుకోవడం జరిగిందని ఎస్పీ తెలిపారు.

పోలీస్ బలగాలు అదుపులోకి తీసుకున్న మావోయిస్టు ఒడిశా రాష్ట్రంకోరాపుట్ జిల్లా భాలియాపుట్టు గ్రామానికి చెందిన చైతో (ఆలియాస్ నరేష్, సంతు) గుర్తించినట్టు ఎస్పీ తెలిపారు. మావోయిస్టు చైతో (ఆలియాస్ నరేష్, సంతు) 2011లో జననాట్య మండలి బృందంలో నరేష్ విప్లవాలకు ఆకర్షితుడై 15 సంవత్సరాలకే మావోయిస్టు పార్టీ సభ్యత్వం పొందాడన్నారు. మావోయిస్టు దళంలో చేరి 2017లో కట్ ఆఫ్ బోయిపరిగూడ మావోయిస్టు దళ కమెండర్‌గా బాధ్యతలు చేపట్టిన నరేష్ ప్రస్తుతం డిసిఎం మెంబర్ మరియు పెదబయలు కోరుకొండ ఏరియా కమిటీ సెక్రటరీగా బాధ్యతలు చేపట్టి మావోయిస్టు కార్యకలాపాలు చేస్తున్నాడని మావోయిస్టు చైతో 8 ఎన్కౌంటర్లో పాల్గొన్నాడని ఎస్పీపేర్కొన్నారు. అదుపులో తీసుకున్న మావోయిస్టు చైతో వద్ద 9 ఎమ్ఎమ్ పిస్టల్,9 ఎమ్ఎమ్ లైవ్ అమ్మునిషన్ 04,303 రైపిల్‌మ్యాగజైన్, 01,303 >>2

## పోలీసులపై గంజాయి స్మగ్లర్ దాడి

### రెండు రౌండ్లు కాల్పులు జరిపిన సిఐ

### భయంతో లొంగిపోయిన స్మగ్లర్



ఆదివారం మీడియాకు వివరాలు అందజేస్తున్న ఈగల్ టీం ఐజి ఆర్‌కె రవికృష్ణ

**నెల్లూరు క్రైం, ఆగస్టు 17, ప్రభాతవార్త:** గంజాయి స్మగ్లర్లు రోజురోజుకీ బరితెగిస్తున్నారు. గతంలో నెల్లూరు పరిధిలో జాతీయ రహదారిపై గంజాయి స్మగ్లింగ్ చేస్తున్న వాహనాన్ని అడ్డుకున్న డిఎస్పీని వాహనంతో గుద్ది తప్పించుకునే ప్రయత్నం చేసిన ఘటన మరువక ముందే మరోసారి అదే స్థాయిలో స్మగ్లర్లు బరితెగించారు. అయితే స్థానిక సిఐ సాంబశివరావు తక్షణమే స్పందించి ఫైరింగ్ చేపట్టడంతో స్మగ్లర్‌చేతులు పైకెత్తి పోలీసులకు సరెండర్ కావడంతప్ప మరోగత్యంతరం లేకపోయింది. ఈ సంఘటనకు సంబం >>2

18-8pg2exHMNWJQE 2nd_18-8pg2exHMNWJQE.qxd 8/18/2025 12:41 AM Page 1





బీహార్‌లోని ససారాంలో ఆదివారం జరిగిన ఓటర్ అధికార్ యాత్రలో ప్రసంగిస్తున్న రాహుల్ గాంధీ

# ఫుడ్ టెస్టింగ్ కేంద్రాలు

>> పరీక్షల నిమిత్తం పొరుగు రాష్ట్రాలకు నమూనాలు పంపిస్తున్నారన్నారు. సిబ్బందికి నమూనాల పరీక్షలపై ప్రత్యేకంగా శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. తిరుమల ఆహార పదార్థాల తయారీకి దేశంలోని వివిధ ప్రాంతాలనుంచి వచ్చే నిత్యావసర వస్తువుల(పాలు, పెరుగు వగైరా) నమూనాలను ఈ కేంద్రంలో పరీక్షించి నాణ్యత ఉన్నట్లు నిర్ధారణ జరిగిన తర్వాతే వాటిని వినియోగిస్తారని చెప్పారు. విశాఖపట్నంలోని రాష్ట్ర స్థాయి ఫుడ్ ల్యాబొరేటరీ కూడా వచ్చే నెలలో ప్రారంభం కానుందని, ఇందులో అవసరమైన అన్ని రకాల యంత్రపరికరాల్ని అందుబాటులోకి తీసుకొచ్చే పనులు చివరి దశకు చేరుకున్నాయన్నారు. గుంటూరు జీజీహెచ్‌లో అలాగే తిరుపతిలో రాష్ట్ర స్థాయి ఫుడ్ ల్యాబొరేటరీలు ఏర్పాటు చేసేందుకు అవసరమైన చర్యలు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. కర్నూలులో ఇప్పటికే ప్రాంతీయ ఫుడ్ ల్యాబొరెటరీ ఉందన్నారు. దీని స్థాయిని పెంచి కొత్తగా భవనాన్ని నిర్మిస్తామని చెప్పారు. దీనికోసం స్థలాన్వేషణ జరుగుతోందన్నారు. ఈ ప్రక్రియ పూర్తయితే కాంట్రాక్టర్లు పనులు మొదలు పెడతారని చెప్పారు. ఒంగోలు, ఏలూరులో ఉన్న పబ్లిక్ హెల్త్ ల్యాబొరెటరీలను ఉన్నతీకరణిస్తున్నామని మంత్రి సత్యకుమార్ యాదవ్ చెప్పారు. ఇప్పటికే నడుస్తున్న ల్యాబుల్లో సుమారు రూ.13 కోట్ల వ్యయంతో అత్యాధునిక పరికరాల్ని సమకూరుస్తున్నామని తెలిపారు. ఇందుకు సంబంధించి పరికరాల కొనుగోలుకు పర్చేజింగ్ ఆర్డర్ కూడా ఇచ్చామని మంత్రి చెప్పారు.



జర్మనీ రాజధాని బెర్లిన్‌లో ఆదివారం 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహించిన ప్రవాస భారతీయులు

# 22న త్రైపాక్షిక భేటీ

>> ఇదిలా వుంటే ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ సోమవారం ట్రంప్‌తో భేటీ కానున్నారు. ఈ సమావేశానికి యూరోపియన్ దేశాల నాయకులను కూడా ట్రంప్ ఆహ్వానించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. జర్మన్ ఛాన్సెలర్ ఫ్రెడరిక్ మెర్జ్ మాట్లాడుతూ.. ట్రంప్, జెలెన్‌స్కీల మధ్య సోమవారం సమావేశం జరుగుతుందని, ఆ తర్వాత ముగ్గురు నేతల మధ్య త్రైపాక్షిక సమావేశం జరిగే అవకాశం ఉందని అన్నారు. యుద్ధం ముగింపుపై సోమవారం కీలక ప్రకటన వెలువడుతుందని భావిస్తున్నట్లు చెప్పారు. కాగా ఉక్రెయిన్‌తో యుద్ధం గురించి ఇటీవల అలాస్కా వేదికగా ట్రంప్, పుతిన్‌లు భేటీ అయ్యి రెండున్నర గంటలకుపైగా చర్చించారు. అయినప్పటికీ ఎలాంటి ఒప్పందానికి రాలేదు. అయితే చర్చలు సానుకూలంగా జరిగాయని సమావేశం అనంతరం ఇరువురు నేతలు ప్రకటించారు. ట్రంప్ మాట్లాడుతూ.. ఒప్పందంపై నిర్ణయం జెలెన్‌స్కీ చేతుల్లోనే ఉందన్నారు. అనంతరం అమెరికా అధ్యక్షుడు తనతో ఫోన్‌లో మాట్లాడినట్లు ఉక్రెయిన్ అధినేత తెలిపారు. త్రైపాక్షిక సమావేశంపై ట్రంప్ చేసిన ప్రతిపాదనకు తాను మద్దతిస్తున్నట్లు జెలెన్‌స్కీ వెల్లడించారు. కీలక అంశాలపై చర్చించుకునేందుకు అది మంచి వేదిక అవుతుందన్నారు. పరిస్థితులను చక్కదిద్దే బలం అమెరికాకు ఉందని ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు.

శాంతి ఒప్పందంపై ఉక్రెయిన్‌కు మద్దతుగా నిలుస్తున్న యూరోపియన్ నాయకులకు జెలెన్‌స్కీ కృతజ్ఞతలు తెలిపారు. అయితే సోమవారం ట్రంప్, జెలెన్‌స్కీ సమావేశం నేపథ్యంలో ఐరోపా నేతలు అప్రమత్తమయ్యారు. గతంలో అమెరికా అధ్యక్షుడితో సమావేశమైన జెలెన్‌స్కీకి చేదు అనుభవం ఎదురైన విషయం తెలిసిందే. అలాంటి ఘటన పునరావృతం కాకుండా ఉండేందుకు ట్రంప్‌తో స్నేహపూర్వకంగా మెలిగే ఫిన్‌లాండ్ అధ్యక్షుడు అలెగ్జాండర్ స్టబ్‌ను, ఇతరులను ఉక్రెయిన్ అధ్యక్షుడికి సాయంగా వాషింగ్టన్‌కు పంపనున్నట్లు యూరప్ దౌత్యవేత్తలు తెలిపారు. ఇరువురి మధ్య ఘర్షణ పునరావృతం కాకుండా చర్చలు సజావుగా జరిగేలా వారు చూసుకోనున్నట్లు సమాచారం. నాటో సెక్రెటరీ జనరల్ కూడా ఈ సమావేశంలో పాల్గొనే అవకాశం ఉందని ఉక్రెయిన్ వర్గాలు చెపుతున్నాయి.

# నారా లోకేష్ భేటీ

>> అనుమతులు మంజూరవుతున్నాయి. దేశంలో అభివృద్ధి చెందిన రాష్ట్రాలకు దీటుగా ఆంధ్రప్రదేశ్‌ను నిలిపేందుకు లోకేష్ ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. రేపటి పర్యటనలో రాష్ట్రానికి ఇటీవల సెమీకండక్టర్ మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ మంజూరు చేసినందుకు కేంద్ర రైల్వే, ఐటి, ఎలక్ట్రానిక్స్ మంత్రి అశ్వనీ వైష్ణవ్‌కు మంత్రి లోకేష్ కృతజ్ఞతలు చెబుతారు. రాష్ట్రంలోని పెండింగ్ ప్రాజెక్టులపై కేంద్ర రోడ్డు రవాణా, రహదార్ల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ, పెట్రోలియం మంత్రి హర్దీప్ సింగ్ పూరి, ఓడరేవులు, జలరవాణాశాఖ మంత్రి సర్బానంద్ సోనోవాల్, వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్‌గోయల్, విదేశాంగ మంత్రి జైశంకర్‌తో మంత్రి లోకేష్ సమావేశమవుతారు. ఈ సందర్భంగా రాష్ట్రప్రభుత్వంతరపున వివిధ ప్రతిపాదనలను కేంద్రమంత్రులకు అందజేస్తారు.

# రిజర్వాయర్లకు మళ్లింపు

>> చెరువులను కూడా నీటితో నింపుకోవాలి. సాగు నీటి కాల్వలను, పంట కాల్వలను పరిరక్షించుకోవాలి. చెరువులు, కాల్వలను పరిరక్షించే పనుల్లో సాగు నీటి సంఘాలు భాగస్వామ్యం కావాలి. రైతుల భాగస్వామ్యం కోసమే సాగునీటి సంఘాలు పెట్టాం. కృష్ణా, గోదావరి నదుల్లో పెద్ద ఎత్తున నీరు సముద్రంలోకి వెళ్తోంది. కొన్ని ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్నా.. వరదలు వస్తున్నా.. కొన్ని ప్రాంతాల్లో ఇంకా వర్షాభావ పరిస్థితులున్నాయి. రాష్ట్రంలో 17 శాతం లోటు వర్షపాతం నమోదైంది. ఈ పరిస్థితుల్లో ప్రతి నీటి బొట్టునూ ఒడిసి పట్టుకోవాల్సిన అవసరం ఉంది. రాష్ట్రంలోని ప్రతి ప్రాంతానికి నీరు చేరేలా చూడాలి. ప్రతి ఎకరాకు నీరు అందించేలా నీటి నిర్వహణ చేసుకోవాలి. మైనర్ ఇరిగేషన్ ట్యాంకులను పూర్తిగా నింపుకోవాలి. రాష్ట్రంలో మొత్తంగా 38 వేల మైనర్ ఇరిగేషన్ ట్యాంకుల ద్వారా భారీ ఎత్తున నీటిని నిల్వ చేసుకోవచ్చు. రైతుల కోసం, నీటి నిర్వహణ, పరిరక్షణ కోసం సాగునీటి సంఘాల వ్యవస్థను ఏర్పాటు చేశాం. దీన్ని అదే స్ఫూర్తితో సాగునీటి సంఘాలు పని చేయాలి." అని చంద్రబాబు సూచించారు.

రాష్ట్రంలో చెరువులు, కాల్వలు, చెక్ డ్యాముల పరిస్థితిని సాగు నీటి సంఘాలు పరిశీలించాలి. సాగునీటి సంఘాలకు ఆయకట్టు ప్రాంతాలే కాకుండా.. క్యాచ్మెంట్ ఏరియా బాధ్యతలను అప్పగిస్తాం. నీటి వనరుల సంరక్షణ నిమిత్తం ఏమైనా చర్యలు తీసుకోవాల్సి వస్తే.. అధికారులతో సమన్వయం చేసుకోవాలి. వచ్చే 10 15 రోజుల్లోగా చెరువలకు, కాల్వలకు,చెక్ డ్యాములకు మరమ్మత్తులు చేయాల్సి వస్తే త్వరితగతిన పూర్తి చేయాలి అని సూచించారు.

# 'మిగులు' వాటాలు తేలాకే కొత్త ప్రాజెక్టులు

## బనకచర్ల ప్రాజెక్టుపై తేల్చాల్సింది కేంద్రమే!

## తెలంగాణ డి.సిఎం భట్టి విక్రమార్క



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు17:** గోదావరినదిపైఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్మించాలనుకుంటున్న గోదావరి-బనకచర్ల ప్రాజెక్టుపై తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కీలక వ్యాఖ్యలు చేశారు. మిగులు జలాల్లో తెలుగు రాష్ట్రాల వాటాలు తేలిన తర్వాతే గోదావరిపై ఎలాంటి కొత్త ప్రాజెక్టులు నిర్మించినా అది చట్టబద్ధంగా, న్యాయంగా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. నీటి వాటాలను నిర్ధారించాల్సిన పూర్తి బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదేనని ఆయన పేర్కొన్నారు. ఆదివారం 'ఓట్ల చోరీ' నిరసన కార్యక్రమంలో పాల్గొనేందుకు విశాఖపట్నంకు వెళ్లిన భట్టి విక్రమార్క మీడియాతో మాట్లాడారు. ఏపీ ప్రతిపాదించిన బనకచర్ల ప్రాజెక్టుపై అడిగిన ప్రశ్నలకు ఆయన స్పందించారు. నదీ జలాల కోసమే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని గుర్తుచేశారు. మా రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులు పూర్తయి, నీటి కేటాయింపులు జరిగిన తర్వాతే మిగులు జలాల అంశంపై ఒక స్పష్టత వస్తుందని ఆయన వివరించారు. రాజకీయ ప్రయోజనాల కంటే రాష్ట్ర ప్రయోజనాలు ముఖ్యం, ఇందిరాసాగర్, రాజీవ్ సాగర్, దేవాదుల వంటి గోదావరిపై మేం చేపట్టిన ప్రాజెక్టులు పూర్తికాలేదు. మా ప్రాజెక్టుల నిర్మాణం తర్వాత వాటాలుతేల్చి మిగిలిన వాటిని సమృద్ధిగా వాడుకోవచ్చునని చెప్పారు. మా అవసరాలు తీరకుండా దిగువ ప్రాజెక్టులు నిర్మాణం జరిగితే ఆ తర్వాత కేటాయింపులు సమస్యలు ఎక్కువవుతాయి. సముద్రంలోకి వెళ్లే జలాల అని మాట్లాడటం అర్థం చేసుకోలేని అమాయకులు ఎవరు లేరు అని పేర్కొన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ పటిష్టంగా ఉంది. అసంతృప్తి అనేది కొందరు ప్రచారం చేస్తున్నారు. చంద్రబాబు, రేవంత్,రాహుల్ హాట్‌లైన్‌పై జగన్ వ్యాఖ్యలు వ్యక్తిగతమైన రాజకీయ ఆరోపణ, రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి గా పార్టీ విధానాలు విశాలమైన ప్రయోజనాలతో ఉంటాయి తప్ప సంకుచితమైన మనస్తత్వంతో ఉండవు అని తెలిపారు. కాగా, ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ ప్రాజెక్టును గట్టిగా సమర్థించారు. పోలవరం నుంచి వృథాగా సముద్రంలోకి పోయే గోదావరి వరద నీటిని బనకచర్లకు తరలించి రాయలసీమను అభివృద్ధి చేయాలనేది తమ లక్ష్యమని చెప్పారు. దిగువ రాష్ట్రంగా వరదల వల్ల తాము నష్టపోతున్నామని, అలాంటి వరద నీటిని వాడుకుంటామంటే అభ్యంతరాలు ఎందుకని ఆయన ప్రశ్నించారు. ఈ ప్రాజెక్టుతో ఏ రాష్ట్ర ప్రయోజనాలకు నష్టం జరగదని భరోసా ఇచ్చారు.

# సభ్యుడి అరెస్టు

>> సిబ్బందితో కలిసి డి.నెం.20/511 వద్ద గల ఇంటిని రైడ్‌సెర్చ్, తనిఖీ చేయడం జరిగిందన్నారు. ఈ తనిఖీలలో కొత్వాల్ నూర్ మహమ్మద్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు తెలియజేశారు. అతను పాకిస్థాన్‌లోని బ్యాన్ చేసిన ఉగ్రవాద సంస్థల ఆధ్వర్యంలో నడుస్తున్న అనేక వాట్సాప్ గ్రూపుల్లో సభ్యత్వం కలిగి ఉన్నట్లు అంగీకరించడం జరిగిందన్నారు. ఈ గ్రూపుల్లో ఉగ్రవాద భావజాలం, దేశ వ్యతిరేక ప్రచారం, జిహాదీ ప్రేరేపణ జరుగుతున్నట్లు వెల్లడైందన్నారు. అతని వద్దనుండి ఒక మొబైల్ ఫోన్, జిహాదీ భావజాలం, ఉగ్రవాద సంస్థల ప్రచారం ఉన్న నిషేధిత సాహిత్యం గల ఒక పుస్తకాన్ని స్వాధీనంలోకి తీసుకోవడం జరిగిందన్నారు. ఈ మేరకు ధర్మవరం వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నెంబర్.170/2025 అండర్ సెక్షన్ 152, 196 (1)(ఏ), 196 (2) ఆర్/డబ్ల్యు 3(5) బి.ఎన్.ఎస్ మరియు సెక్షన్ 13, 38, 39 అన్ లా ఫుల్ ఆక్టివిటీ (ప్రివెన్షన్)యాక్ట్ 1967 ప్రకారం నమోదు చేసి, ముద్దాయిని అరెస్ట్ చేసి కదిరి కోర్టులో హాజరపరచగా జడ్జి 14 రోజులు రిమాండుకు ఆదేశించడంతో కడప సెంట్రల్ జైలుకు ముద్దాయిని తరలించడం జరిగిందన్నారు.

# గంజాయి స్మగ్లర్ దాడి

>> ధించిన వివరాలను ఈగల్ టీం ఐజి ఆర్‌కే. రవికృష్ణ ఆదివారం నెల్లూరు నగర శివార్లలో సంఘటన జరిగిన ప్రదేశంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఆయన తెలిపిన సమాచారం మేరకు.. గంజాయిని సమూలంగా నిర్మూలించాలనే రాష్ట్ర ప్రభుత్వ ఉద్దేశం మేరకు ఎక్కడికక్కడ గంజాయి స్మగ్లర్ల పై ఈగల్ టీంతో పాటు స్థానిక పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచారు. ఈ క్రమంలో తూర్పుగోదావరి జిల్లా నుండి నెల్లూరులోని గంజాయి విక్రేతలకు గంజాయిని అందించేందుకు కొందరు కారులో బయలుదేరి వస్తున్నట్లు సమాచారం అందడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బాలాజీ నగర్ సిఐ సాంబశివరావు, స్టేషన్ సిబ్బందితోపాటు ఈగల్ టీం సిబ్బందితో జాతీయ రహదారి పెన్నా వంతెన వద్ద నిఘా ఉంచారు. మారుతి స్విఫ్ట్ కారులో స్మగ్లర్ రావడాన్ని గమనించి కారును సిఐ తన సిబ్బందితో కలిసి వెంబడించారు. స్థానిక ఎస్వీజీఎస్ కళాశాల సమీపంలో ఉన్న అమ్మకం దారులకు గంజాయిని స్మగ్లర్ అందించే క్రమంలో సిఐ తమ వాహనాన్ని స్మగ్లర్ వాహనానికి అడ్డుగా పెట్టే ప్రయత్నం చేశారు. ఒక్కసారిగా పోలీసులు రంగ ప్రవేశం చేయడంతో దిక్కుతోచని స్మగ్లర్ తన వాహనంతో పోలీసు వాహనాన్ని గుద్దడంతోపాటు అడ్డువచ్చిన కానిస్టేబుల్‌ని కూడా తొక్కించే ప్రయత్నంచేశారు. అతన్ని నియంత్రించే ప్రయత్నం చేసిన కానిస్టేబుల్ ఫిరోజ్‌కు ఈ సంఘటనలో ఈ గాయాలయ్యాయి. వెంటనే తేరుకున్న సిఐ తన సర్వీసు పిస్టల్‌తో రెండు రౌండ్లు కాల్పులు జరిపారు. దీంతో భయాందోళనకు గురైన స్మగ్లర్ పోలీసులకు లొంగిపోయాడు. రాజమండ్రి ప్రాంతానికి చెందిన బీరక ప్రకాష్ అలియాస్ సూర్యప్రకాష్ గత కొన్ని ఏళ్లుగా గంజాయి స్మగ్లింగ్ చేయడమే వృత్తిగా పెట్టుకున్నాడు. పలుసార్లు జైలుకు వెళ్లినప్పటికీ అతని ప్రవర్తనలో ఎటువంటి మార్పు లేదు. తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి నెల్లూరు జిల్లాలోని పలు స్టేషన్లలో అతనిపై కేసులు నమోదై ఉన్నాయి. ఈ క్రమంలోనే ఆదివారం కూడా స్మగ్లింగ్ చేస్తూ బాలాజీ నగర్ పోలీసులకు చిక్కాడు. ముద్దాయి వద్ద నుండి 22 కిలోల గంజాయి, ఒక కారును స్వాధీనం చేసుకున్నారు. గాయపడిన కానిస్టేబుల్‌ను చికిత్సనిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.స్మగ్లర్‌ను పట్టుకోవడంలో ప్రతిభ కనపరిచిన డిఎస్పీ సింధు ప్రియ, సిఐ సాంబశివరావు, ఇతర సిబ్బందిని ఈగల్‌టీం ఐజి రవికృష్ణ, జిల్లా ఎస్పీ కృష్ణ కాంత్ అభినందించారు.

# షిండే పాల్గొన్న వేడుకలో కుప్పకూలిన వేదిక

**థాణె, ఆగస్టు 17:** శ్రీకృష్ణుడి జన్మదినం సందర్భంగా మహారాష్ట్రలో దహి హండి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సంవత్సరం జన్మాష్టమి సందర్భంగా మహారాష్ట్రలోని అనేక ప్రాంతాల్లో ఈ సంప్రదాయ వేడుకలు జోరుగా జరిగాయి. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే థానే సహా ఇతర ప్రాంతాల్లో జరిగిన వేడుకల్లో పాల్గొన్నారు. కానీ, గన్సోలిలో జరిగిన ఒక ఈవెంట్‌లో ఊహించని సంఘటన ఒకటి జరిగింది. షిండే వేదికపై నుంచి దిగుతుండగా, ఉత్సాహంతో ఉన్న కార్యకర్తలు ఒక్కసారిగా వేదికపైకి ఎక్కారు. దీంతో అధిక బరువు వల్ల వేదిక అకస్మాత్తుగా కూలిపోయింది. ఆ క్షణంలో అక్కడ ఉన్న జనం మధ్య గందరగోళం నెలకొంది. అయితే, షిండేని వెంటనే సురక్షిత ప్రదేశానికి తీసుకెళ్లారు. ఈ సంఘటనలో ఎవరికీ గాయాలు కాలేదు. ఈ ఘటనకు సంబంధించిన చిత్రాలు ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతున్నాయి. మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్, ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే ముంబై, థానేలలో జరిగిన అనేక దహిహండి ఈవెంట్‌లలో పాల్గొన్నారు. వీరిద్దరూ తమ శ్రీ ఖాతాల్లో ఈ వేడుకలకు సంబంధించిన ఫొటోలు, వీడియోలను షేర్ చేశారు. ఈ ఉత్సవాల్లో యువత ఉత్సాహంతో పాల్గొన్నారు. షిండే, థానేలోని మాజీ శివసేన ఎమ్మెల్యే రవీంద్ర ఫటక్ నేతృత్వంలో సంకల్ప్ ప్రతిష్ఠాన్ ఆధ్వర్యంలో జరిగిన ఒక ప్రతిష్ఠాత్మక దహిహండి వేడుకలో పాల్గొన్నారు.

# 24గంటల్లో వాయుగుండం

## మూడు రోజుల పాటు భారీ వర్షాలు

**విజయవాడ, ఆగస్టు17,ప్రభాతవార్తప్రతినిధి:** దక్షిణ ఒడిశా,ఉత్తరాంధ్ర తీరప్రాంతంపై అల్పపీడనం కొనసాగుతున్నట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. ఈ అల్పపీడనం మరో 24 గంటల్లో వాయుగుండంగా మారే అవకాశం ఉందని, ఈ నెల 19న దక్షిణ ఒడిశా ఉత్తరాంధ్ర మధ్య తీర ప్రాంతాన్ని దాటవచ్చని వాతావరణ కేంద్రం డైరెక్టర్ భారతి సవ్వడి తెలిపారు. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించారు. ఇప్పటికే విశాఖపట్నం, అనకాపల్లి, బీఆర్ అంబేద్కర్ కోనసీమ, కాకినాడ, పశ్చిమ గోదావరి జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేశారు. శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, తూర్పు గోదావరి, అల్లూరి సీతారామరాజు, ఏలూరు, కృష్ణ, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నంద్యాల జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు ప్రకటించారు. అదే సమయంలో, కర్నూలు, అనంతపురం, వైఎస్సార్ కడప, నెల్లూరు, తిరుపతి, చిత్తూరు జిల్లాలకు ఎల్లో అలర్ట్ ఇచ్చినట్లు అధికారులు వెల్లడించారు. ఐఎండి సూచనల ప్రకారం దక్షిణ ఛత్తీస్‌గఢ్, దాని పరిసర ప్రాంతాలలో అల్పపీడనం కొనసాగుతోందని విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. సోమవారం నాటికి వాయువ్య బంగాళాఖాతం, దానిని ఆనుకుని ఉన్న పశ్చిమమధ్య బంగాళాఖాతంలోమరోక అల్పపీడనం.. ఏర్పడే అవకాశం ఉందన్నారు. వీటి ప్రభావంతో రానున్న మూడు రోజులపాటు కోస్తాలో చెదురుమదురుగా భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు.రాయలసీమలో తేలిక పాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఈదురుగాలులు వీచే అవకాశం ఉందన్నారు. మంగళవారం వరకు మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లరాదని సూచించారు... భారీవర్షాల నేపథ్యంలో ప్రజలు చెట్లక్రింద, శిథిలావస్థలో ఉన్న భవనాలు, హోర్డింగ్స్ వద్ద ఉండరాదని హెచ్చరించారు. అప్రమత్తంగా ఉండాలని, లోతట్టు ప్రాంతప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎట్టిపరిస్థితుల్లోను పొంగిపొర్లే వాగులు, కాలువలు దాటే ప్రయత్నం చేయరాదన్నారు. ఇప్పటికే ప్రభావిత జిల్లాల అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేసినట్లు ప్రఖర్ జైన్ వెల్లడించారు.

# వికసిత్ భారత్‌కు 'ఢిల్లీ' ఒక నమూనా

>> కొత్త ఎక్స్‌ప్రెస్‌వే నుంచి ప్రతి ఒక్కరూ ప్రయోజనం పొందనున్నది. ఈ సందర్భంగా బహిరంగ సభలో ప్రధాని మోదీ మాట్లాడుతూ ఈ రోడ్లు ప్రయాణాన్ని సులభతరం చేయడంతో పాటు ఎన్‌సీఆర్ అభివృద్ధికి కొత్త ఊపునిస్తాయని పేర్కొన్నారు. ఎక్స్‌ప్రెస్‌వే పేరు ద్వారక అని ఈ కార్యక్రమం జరుగుతున్న ప్రదేశం రోహిణి అని, జన్మాష్టమి ఆనందం అని, యాదృచ్ఛికంగా ద్వారకాధీశ భూమి నుంచి వచ్చానని మోడీ పేర్కొన్నారు. ఈ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నేడు దేశ రాజధాని ఢిల్లీ దేశంలో జరుగుతున్న అభివృద్ధి విప్లవాన్ని చూస్తోంది. కొద్దిసేపటి క్రితం ఢిల్లీ ద్వారకా ఎక్స్‌ప్రెస్‌వే, అర్బన్ ఎక్స్‌టెన్షన్ రోడ్‌తో అనుసంధానంతో ఢిల్లీ, గురుగ్రామ్, ఎన్‌సీఆర్ ప్రజల సౌకర్యాన్ని పెంచుతుందని.. ప్రతి ఒక్కరి సమయం ఆదా అవుతుందన్నారు. మన వ్యాపారులు, వ్యాపారవేత్తలు, రైతులు ప్రత్యేక ప్రయోజనాలను పొందబోతుందన్నారు. ప్రపంచం భారతదేశాన్ని చూసినప్పుడు.. మూల్యాంకనం చేసిన సమయంలో మొదటి దృష్టి మన రాజధాని ఢిల్లీపై పడుతుందన్నారు. మనం ఢిల్లీని అభివృద్ధి నమూనాగా మార్చాలని పిలుపునిచ్చారు. ఢిల్లీని గొప్ప నగరంగా మార్చడానికి మనం చేపట్టిన పని నిరంతరం కొనసాగుతోందన్నారు. నేటికీ మనమందరం దీనికి సాక్షులమని.. అది ద్వారకా ఎక్స్‌ప్రెస్‌వే, అర్బన్ ఎక్స్‌టెన్షన్ రోడ్ అయినా ఈ రెండు రోడ్లు అద్భుతంగా నిర్మించినట్లు పేర్కొన్నారు. పెరిఫెరల్ ఎక్స్‌ప్రెస్‌వే తర్వాత ఇప్పుడు అర్బన్ ఎక్స్‌టెన్షన్ రోడ్ ఢిల్లీకి చాలా సహాయపడుతుందన్నారు. అర్బన్ ఎక్స్‌టెన్షన్ రోడ్‌కు మరో ప్రత్యేకత ఉందని ఇది ఢిల్లీని చెత్త నుంచి విముక్తి చేయడంలో సహాయపడుతుందన్నారు. అర్బన్ ఎక్స్‌టెన్షన్ రోడ్‌ను తయారు చేయడంలో లక్షల టన్నుల చెత్తను ఉపయోగించారని వ్యర్థ పదార్థాలను రోడ్డు తయారీలో ఉపయోగించారన్నారు. రేఖ గుప్తా నాయకత్వంలోని ఢిల్లీ బిజెపి ప్రభుత్వం యమునను శుభ్రపరిచే పనిలో నిరంతరం నిమగ్నమై ఉండడంపై సంతోషంగా ఉన్నానని ప్రధాని మోదీ అన్నారు. ఈ సమయంలో యమునా నది నుంచి 16 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను తొలగించారని ఢిల్లీలో చాలా తక్కువ సమయంలో 650 దేవి ఎలక్ట్రిక్ బస్సులు ప్రారంభమయ్యాయన్నారు. భవిష్యత్తులో ఈ ఎలక్ట్రిక్ బస్సులు సుమారు 2వేల సంఖ్యను దాటుతాయని,. గ్రీన్ ఢిల్లీ - క్లీన్ ఢిల్లీ మంత్రాన్ని మరింత బలపరుస్తుందన్నారు. దేశంలోనే మొదటి ఎనిమిది లైన్ల అర్బన్ ఎలివేటెడ్ ఎక్స్‌ప్రెస్‌వే అయిన ఈ ప్రాజెక్టు ఢిల్లీగురుగ్రామ్ మధ్య ప్రయాణాన్ని సులభతరం చేస్తుంది. 10.1 కిలోమీటర్ల మార్గాన్ని రూ.5,360 కోట్లతో నిర్మించారు.

ఈ మార్గం యశోభూమి, ఢిల్లీ మెట్రో బ్లూ, ఆరెంజ్ లైన్లకు, రాబోయే బిజ్వాసన్ రైల్వే స్టేషన్‌కు అనుసంధాస్తింది. గతేడాది మార్చిలో ద్వారకా ఎక్స్‌ప్రెస్‌వేలోని 19 కిలోమీటర్ల హర్యానా విభాగాన్ని ప్రధాని ప్రారంభించారు. తాజాగా ఢిల్లీ విభాగం సైతం అందుబాటులోకి వచ్చింది. దాంతో గురుగ్రామ్ నుంచి ఢిల్లీ ఎయిర్‌పోర్టుకు కేవలం 20 నిమిషాల్లో చేసే అవకాశం ఉంటుంది. ఇక రూ.5,580 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ ప్రాజెక్టు ఢిల్లీకి మూడో రింగ్ రోడ్‌గా పని చేయనున్నది. ఢిల్లీ, సోనిపట్, బహదూర్‌గఢ్ వంటి నగరాలను కలుపుతోంది. అలీపూర్ నుంచి డిచాన్ కలాన్ వరకు నిర్మించారు. నిర్మాణానికి ఘాజీపూర్ ల్యాండ్‌ఫిల్ నుండి సేకరించిన రెండు మిలియన్ టన్నుల వ్యర్థాలను ఉపయోగించడం విశేషం.

# కూంబింగ్ టీమ్ అదుపులో మావోయిస్టు

>> లైవ్ అమ్మునిషన్ 023 కిట్ బ్యాగులు,విప్లవ సాహిత్యాలు స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ అమిత్ బర్దర్‌తెలియజేసారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మావోయిజం అనేది ఒక నిషేధిత సిద్ధాంతమని దానిని విడిచిపెట్టి మావోయిస్టులు స్వచ్ఛందంగా లొంగిపోవాలని ఎస్పీ పిలుపు నిచ్చారు. స్వచ్ఛందంగా లొంగిపోయిన మావోయిస్టులపై ఎటువంటి కేసులు నమోదు చేయకుండా ప్రభుత్వ పునరావాసం కల్పించడంజరుగుతుందని ఎస్పీ హామీ ఇచ్చారు. ఎవరైనా మావోయిస్టులకు ఆశ్రయం ఇచ్చిన వారికి సహాయ సహకారాలు అందించిన వారిపై సంఘ విద్రోహ చర్యలకు పాల్పడుతున్నారని కేసులు నమోదు చేసి కఠినమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్పీ అమిత్ బర్దర్ హెచ్చరించారు. ఈ సమావేశంలో పాడేరు పోలీస్ ఇన్‌స్పెక్టర్ దీనబంధు పాల్గొన్నారు. జి.మాడుల మండలం కిల్లంకోట పరిసరాల్లో మావోయిస్టుల కదలికలు నేపథ్యంలో పోలీసులు అప్రమత్తం అయ్యారు.కూంబింగ్ వెళుతున్న పోలీస్ బలగాలపై మావోయిస్టులు కాల్పులకు ప్రయత్నించగా వాటిని చాకచక్యంగా బలగాలు అప్రమత్తం వ్యవహరించి ఒక మావోయిస్టును అదుపులోకి తీసుకోవడంతో పాటు తుపాకీలు స్వాదీనం చేసుకున్నారు.ఈ ఘటనకు పాల్పడిన మావోయిస్టులు ఎంతమంది ఉన్నారో సమాచారం లేకపోయినా మళ్లీ మావోయిస్టులు కదలికలు ఈ ప్రాంతంలో కనిపిస్తుండటంతో పోలీస్ యంత్రాంగంలోనే కాకుండా ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ కదనం ప్రకారం అరెస్ట్ అయిన మావోయిస్టు చైతో కిల్లంకోట ప్రాంతంలో ఛత్తీస్‌గఢ్ నుంచి మావోయిస్టులు వచ్చే అవకాశాలు ఉన్న దృష్ట్యా క్నిల్లకోట ప్రాంతంలో స్థానిక గిరిజనుల సహకారంతో మావోయిస్టుల సమావేశం నిర్వహించడానికి ముందస్తుగా గిరిజనుల సహకారం తీసుకోవడానికి ప్రయత్నిస్తున్నట్టు తెలిసిందని ఎస్పీ తెలిపారు.దీంతో కిల్లంకోట ప్రాంతాన్ని బలగాలు ప్రత్యేక దృష్టి సారించనున్నారు.ఇదిలా ఉండగా పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వర రాజు సొంత గ్రామం కిల్లంకోట కావడంపై పోలీసులు మరింత అప్రమత్తం అయ్యే అవకాశాలు ఉన్నాయి.

## వారం - వర్జ్యం

18-08-2025, సోమవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
శ్రావణ మాసం, దక్షిణాయణం
వర్ష ఋతువు, కృష్ణపక్షం
దశమి సా.5.24
మృగశిర రా.2.06
వర్జ్యం : ఉ.10.10-11.42
దు.ము.12.38-1.29, 2) ము.3.10-సా.4.01
శుభసమయం: ఉ.9.20-9.50,సా.6.30-7.15
రాహుకాలం - ఉ.7.30-9.00

## వార్తాఫలం

**మేషం :** బాధ్యతలు సమర్థవంతంగా నెరవేరుస్తారు. నూతన పరిచయాలు పెరుగుతాయి.

**వృషభం :** కొత్త పెట్టుబడులకు అనుకూల సమయం. ఆస్తి తగాదాలు తీరి లబ్ధిపొందుతారు.

**మిథునం:** రాజకీయ, పారిశ్రామిక రంగాలవారికి విదేశీపర్యటనలు. వృత్తి, వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి.

**కర్కాటకం :** షేర్లు, భూముల క్రయ విక్రయాలలో లాభాలు పొందుతారు. వాహనాలు కొనుగోలుచేస్తారు.

**సింహం:** ఆర్థికంగా నిలదొక్కుకుంటారు. ఇల్లకు సంబంధించిన నూతన ఒప్పందాలు కుదురుతాయి.

**కన్య :** కొత్త కార్యక్రమాలు చేపట్టి సన్నిహితుల సాయంతో పూర్తిచేస్తారు.

**తుల :** ఆరోగ్యంపట్ల మెలుకువ అవసరం. ఉద్యోగ, వ్యాపారాలలో పట్టుదలతో ముందుకు సాగుతారు.

**వృశ్చికం:** నూతన కార్యక్రమాలు చేపట్టినా సంతృప్తికరంగా సాగవు. వస్తు లాభం.

**ధనుస్సు:** మిత్రులతో ఏర్పడిన వివాదాలు పరిష్కారమవుతాయి. కాంట్రాక్టులు లాభిస్తాయి.

**మకరం:** ఆస్తి వివాదాలు పరిష్కారమవుతాయి. భాగస్వామ్య వ్యాపారులలో స్వల్ప లాభాలు పొందుతారు.

**కుంభం:** షేర్లు, భూముల క్రయ విక్రయాలలో ప్రోత్సాహకరంగా ఉంటాయి. విందు, వినోదాలలో పాల్గొంటారు.

**మీనం :** కొత్త పెట్టుబడులకు తగిన సహాయం లభిస్తుంది. ఇంటాబయటా మీదే పైచేయిగా ఉంటుంది.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# ఇంజనీరింగ్‌లో భారీగా సీట్లు ఖాళీ

## కన్వీనర్ కోటాలో మిగిలిపోయినవే 22.27%

## ఉన్న సీట్లు 1.53 లక్షలు, సీటుకు అర్హులైన వారు 1.28 లక్షలు

**విజయవాడ,ఆగస్టు17,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో ఇంజనీరింగ్ సీట్లు నాలుగో వంతు ఖాళీగా ఉండిపోనున్నాయి. కన్వీనర్ కోటాలో విద్యార్థుల కంటే సీట్లే అధికంగా ఉండటంతో 34,298 సీట్లు మిగిలిపోయాయి. విశ్వవిద్యాలయాల్లోనూ 1,381 సీట్లు ఖాళీగా ఉన్నాయి. యాజమాన్య కోటా కలిపితే ఈ సంఖ్య మరింత భారీగా పెరుగుతుంది.ప్రభుత్వ కన్వీనర్ కోటా సీట్లకు సాంకేతిక విద్యా శాఖ రెండు విడతలుగా ఇ-కౌన్సిలింగ్ నిర్వహించింది. రెండు విడతలు పూర్తయిన తర్వాత చూస్తే...ప్రైవేటు కళాశాలల్లో ఏకంగా 31,811 సీట్లలో ఎవరూ చేరలేదు. ప్రైవేటు విశ్వవిద్యాలయాల్లోనూ 1,126 సీట్లు మిగిలాయి. కౌన్సిలింగ్‌కు రిజిష్టర్ చేసుకున్న విద్యార్థుల కంటే సీట్లే అధికంగా ఉన్నాయి. ఇఎపి సెట్‌లో అర్హత సాధించిన విద్యార్థులు 1,84,248 మంది ఉండగా...వీరిలో కన్వీనర్ కోటాలో చేరేందుకు రిజిష్టర్ చేసుకున్న వారు 1,29,012 మంది. వీరిలో అర్హత సాధించిన వారు 1,28,712 మంది...కానీ ప్రైవేటు వర్సిటీలు,కళాశాలలు,ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో కలిపి కన్వీనర్ కోటా కింద 1,53,964 సీట్లు అందుబాటులో ఉన్నాయి. కౌన్సిలింగ్‌కు అర్హత సాధించిన వారందరికీ సీట్లు కేటాయించినా 25 వేలకు పైగా మిగిలే పరిస్థితి. కొంత మంది అభ్యర్థులు కోరుకున్న కళాశాలల్లో సీట్లు పొందకపోవడంతో మిగులు సంఖ్య మరింత పెరిగింది. ప్రైవేటు కళాశాలల్లో కన్వీనర్ కోటా కింద 70% కాగా యాజమాన్య కోటా 30% ఉంటుంది. ప్రైవేటు విశ్వవిద్యాలయాల్లో ఇది 35%,65%గా ఉంది. యాజమాన్య కోటా సీట్లలోనూ కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్(సిఎస్ఈ) మినహా మిగతా బ్రాంచిల్లో సీట్లు భారీగా మిగిలాయి. అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఎఐసిటిఇ) సీట్లు,కొత్త కళాశాలల మంజూరుపై స్టే నిషేధం ఎత్తివేసింది. మౌలిక సదుపాయాలు చూపిస్తే సీట్లు మంజూరు చేస్తోంది.డీమ్డ్ విశ్వవిద్యాలయాల్లో వంద శాతం సీట్లను యాజమాన్యమే భర్తీ చేసుకుంటోంది. ఎఐసిటిఇ డీమ్డ్ టు బీ వర్సిటీలకు కొత్త అనుమతులు ఇసో_ంది. చాలా మంది వీటిలోనూ ప్రవేశాలు పొందుతున్నారు. ఆయా వర్సిటీలు ప్రత్యేకంగా పరీక్షలు నిర్వహించుకుంటున్నాయి. సిఎస్ఇ బ్రాంచికి డిమాండ్ ఉండటంతో ఇప్పుడు అన్ని విద్యా సంస్థల్లోనూ ఈ సీట్లే అధికంగా ఉన్నాయి.ఈ ఎపి సెట్‌లో టాప్ ర్యాంకులు సాధించిన విద్యార్థులు స్థానికంగా ప్రవేశాలు పొందడం లేదు. ఎన్ఐటి,ఐఐటి,ట్రిపుల్‌ఐటిలు లేదా ఇతర రాష్ట్రాల్లోని పేరొందిన వర్సిటీలు, కళాశాలల్లో చేరుతున్నారు. ఈఎపిసెట్‌లో 200 లోపు ర్యాంకుల్లో ఇద్దరు,టాప్-500 ర్యాంకుల్లో 12 మంది మాత్రమే కౌన్సిలింగ్‌లో పాల్గొన్నట్లు సమాచారం.

18-8Pg3exHMNWJQE 3rd_18-8Pg3exHMNWJQE.qxd 8/18/2025 12:40 AM Page 1



# ఉగ్రవాద మద్దతుదారులపై కఠిన చర్యలు

## ప్రశాంతతను చెడగొట్టే కుట్రలను సహించమని మంత్రి సత్యకుమార్ హెచ్చరిక



**ధర్మవరం,ఆగస్టు17 ప్రభాతవార్త:** శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరంలో ఇటీవల చోటుచేసుకున్న ఉగ్రవాద అనుమానితుల అరెస్టు ఘటనపై పత్రికల్లో వచ్చిన కథనాలను పరిశీలించి రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ స్పందించారు. కేంద్ర నిఘా సంస్థల ఆధారాలు, స్థానిక పోలీసుల అప్రమత్తతతో ఈ అరెస్టులు జరిగినట్టు తెలిపారు. ఉగ్రవాద సంబంధాలున్న అనుమానితుడి అదుపులోకి తీసుకొని విచారణ కొనసాగుతోందని ఆయన స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో కుట్ర కోణం ఉన్న అవకాశాన్ని విస్మరించలేమని పేర్కొంటూ, ధర్మవరంలో ప్రశాంతతను చెడగొట్టే అలజడులు సృష్టించాలనే ప్రయత్నాలు జరుగుతున్నట్టు ఆందోళన వ్యక్తం చేశారు. ధర్మవరం శాంతియుత వాతావరణాన్ని భంగపరచే యత్నాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉగ్రవాద మద్దతుదారులపై కఠిన చర్యలు తీసుకుంటాయని. ప్రజలు ప్రశాంతంగా ఉండాలని, అలజడులకు తావివ్వకూడదని విజ్ఞప్తి చేశారు. ఈ ఘటనపై మరిన్ని వివరాలు అధికారిక నిఘా సంస్థల నివేదికల ద్వారా త్వరలో వెలుగులోకి వస్తాయని. అప్పటి వరకు ఊహాగానాలకు తావివ్వకుండా, సహనంతో ఉండాలని ప్రజ్నలదరినీ కోరారు. అంతేకాక, ధర్మవరం ప్రజల భద్రత, సమాజంలో శాంతివాతావరణాన్ని కాపాడడం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన బాధ్యత అన్నారు మంత్రి యాదవ్.



# సినిమాల్లో మహిళల పట్ల వివక్షను కట్టడి చేయాలి : మంత్రి లోకేష్

**విజయవాడ,ఆగస్టు 17,ప్రభాతవార్త ప్రతినిధి:** సినిమాలు,సీరియళ్ళలో మహిళల పట్ల వివక్షను కట్టడి చేయాల్సిన సమయం ఆసన్నమైందని ఏపీ మంత్రి నారా లోకేష్ తెలిపారు. లింగ వివక్ష,అవమానకరమైన సంభాషణలను నియంత్రించాలన్నారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్'లో పోస్టు చేశారు. మహిళల పట్ల గౌరవం నిజమైన నాగరికర సమాజానికి పునాది అని తెలిపారు. పిల్లలు చూసే విధంగా సినిమాలు సీరియళ్ళు రూపొందాలన్నారు. ఇంట్లో తెరపై చూసేదే వారు నేర్చుకునే అవకాశముందని వివరించారు. ప్రస్తుతం సినిమాల్లో,సీరియళ్ళ అనుచిత అంశాలతో కూడిన అంశాల్లో స్త్రీలను చేర్చడం వారిని కించపరిచే దిశలో వివక్ష చూపించడం సరికాదన్నారు.ఇటువంటి ప్రసారాలను నియంత్రించాల్సిన అవసరం ఉందన్నారు.

# తిరుమల సమాచారం

## సెప్టెంబర్ 24నుండి శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు

**తిరుమల,ఆగస్టు 17 ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవేంకటేశ్వరస్వామి సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాలకు సిద్దమవుతోంది. ఈ ఏడాది జరగనున్న సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాల కార్యాచరణను తిరుమల తిరుపతి దేవస్థానం ఖరారుచేసింది. ఈ ఏడాది ఒక బ్రహ్మోత్సవం మాత్రమే నిర్వహిస్తారు. వాహనసేవలను ఆలయమాఢవీధుల్లో నిర్వహించేందుకు అన్ని రకాల ఏర్పాట్లు చేయడంపై, భక్తులకు ఇబ్బంది లేకుండా వాహనసేవలవీక్షణకు సౌకర్యాల కల్పనపై అన్నమయ్యభవనంలో ఇప్పటికే టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి అధ్యక్షతన ప్రాథమిక సమీక్ష నిర్వహించారు. సెప్టెంబర్ 24వతేదీ నుంచి అక్టోబర్ 2వరకు సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించేందుకు ముహూర్తం ఖరారుచేసినట్లు తెలిపారు. బ్రహ్మోత్సవాల నిర్వహణ విషయంలో గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని జిల్లా యంత్రాంగంతో సమన్వయం చేసుకుని బ్రహ్మోత్సవాలను వైభవంగా విజయవంతంగా నిర్వహించే ఏర్పాట్లు చేపడుతామన్నారు. ఈ ఏడాది కూడా పెద్దసంఖ్యలో భక్తులు విచ్చేసే అవకాశముందని, ఇందుకు అనుగుణంగా పటిష్టంగా ఏర్పాట్లుచేయాలని అధికారులను ఆదేశించారు. బ్రహ్మోత్సవాల సమయంలో ప్రత్యేక దర్శనాలు వృద్ధులు, దివ్యాంగులు, చంటిపిల్లల తల్లిదండ్రులకు దర్శనాలు రద్దు చేయడం జరుగుతుంది. బ్రహ్మోత్సవాల్లో



గరుడసేవ కు భక్తులు అశేషసంఖ్యలో విచ్చేసే అవకాశం ఉండటంతో విస్తృతంగా ఏర్పాట్లు చేపడతారు. సామాన్యభక్తులకు ఎక్కువగా దర్శనసమయం కల్పించేందుకు ఆ తొమ్మిదిరోజులు బ్రేక్ దర్శనాలు రద్దుచేశారు. ప్రోటోకాల్ విఐపిలకు మాత్రమే బ్రేక్ దర్శనాలు మంజూరుచేస్తారు.

**సెప్టెంబర్ 24న సిఎం పట్టువస్త్రాలు:** ఈ ఏడాది సెప్టెంబర్‌లో మొదలయ్యే తిరుమలేశుని సాలకట్ల బ్రహ్మోత్సవాలకు తొలిరోజు సెప్టెంబర్ 24వతేదీన ధ్వజారోహణంరోజునే రాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు రాష్ట్రప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు సమర్పిస్తారు. బ్రహ్మోత్సవాల్లో సెప్టెంబర్ 24వతేదీ రాత్రి తొలివాహనంగా పెద్దశేషవాహనం, సెప్టెంబర్ 28 గరుడసేవ, 31న స్వర్ణరథం, 1వతేదీ రథోత్సవం, 2న చక్రస్నానం జరుగుతాయి. పోలీసుల తో సమన్వయం చేసుకుని పటిష్టమైన భద్రత కల్పించేలా చూడనున్నారు. బ్రహ్మోత్సవాల సమయంలో తిరుమలలో మాఢవీధుల్లో ప్రత్యేక గ్యాలరీలు ఏర్పాటుచేసి ,భక్తులకు అసౌకర్యం కలగకుండా చూస్తారు.

# డిజిటల్ మీడియాలో పర్యాటక ప్రాంతాల విస్తృత ప్రచారం

## పర్యాటకులను ఆకట్టుకునేలా ఎపిటిడిసి చర్యలు

**విజయవాడ.ఆగస్టు17ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రం లోని పర్యాటక,చారిత్రక,వారసత్వ సందకు ప్రతీకగా నిలిచిన ప్రదేశాల వైపు పర్యాటకులను ఆకర్షించేందుకు ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) ప్రత్యేక చర్యలు చేపట్టింది. డిజిటల్ మాధ్యమాల్లో ప్రచారం చేస్తూ అంతర్జాతీయ పర్యాటకులనూ ఆకర్షించే ప్రయత్నం చేస్తోంది. రాష్ట్రం లోని వివిధ ప్రాంతాల ప్రత్యేకతలపై వేర్వేరుగా రూపొందించి వీడియోలతో ప్రచారం చేస్తోంది. వీటిని అందరూ లైక్,షేర్ చేసి మన ప్రాంతాల ప్రత్యేకతను ప్రపంచానికి చాటి చెప్పాలని ఏపీటీడీసీ ఒక ప్రకటనలో కోరింది.కృష్ణాజిల్లా మచిలీపట్నం సమీపం లోని పెడన కలంకారీ ప్రత్యేకతను వివరిస్తూ రూపొందించిన వీడియోలో సహజ రంగులతో కూడిన అద్దకం,భారతీయ హస్తకళల్లో ప్రాచీనమైన కలంకారీ చిత్రకళను,కళాకారుల నేపుణ్యాన్ని వివరించింది.బాపట్ల జిల్లా లోని భట్టిప్రోలు బౌద్దస్తూపం నిర్మాణం క్రీ.పూ.3వ శతాబ్ధంలో జరిగిందని తెలుగులో లభ్యమైన తొలి శాసనబంగా ఇక్కడి శాసనాలకు పేరుందని మరో వీడియోలో పేర్కొంది. అలనాడు వాణిజ్య, విద్యా కేంద్రంగా విరాజిల్లిన భట్టిప్రోలను సందర్శిం చాలని కోరింది. గుంటూరు జిల్లా మంగళగిరిలో జాతీయస్థాయిలో పేరున్న మంగళగిరి చేనేత, ఫ్యాబ్రిక్ ఉత్పత్తుల గొప్పతనాన్ని...పానకాల లక్ష్మీ నర్సింహస్వామి దేవాలయ ప్రాశస్త్యాన్ని ఓ వీడియోలో వివరించింది. చీరల అల్లిక,నిజాం డిజైన్ బోర్డర్,నాణ్యమైన రంగుల అద్దకం తదితర అంశాలు ఇందులో పొందుపర్చింది. ఇక్కడి చేనేతకు జాతీయస్థాయిలో భౌగోళిక గుర్తింపు (జీఐ) దక్కిందని పేర్కొంది. మానవ కృషి,కళానైపుణ్యం కలిసి తయారయ్యే ఈ చీరలు వస్త్రాలు మాత్రమే కావని, జ్ఞాపకాలు, భావోద్వేగానికి ప్రతీకలని పేర్కొంది

గుంటూరు జిల్లా ఉండల్లి గుహల గొప్పతనం వివరిస్తూ ఉండవల్లిలో ఉలితో చెక్కిన గుహలను తప్పక సందర్శిం చాలని పర్యాటకులను మరో వీడి యోలో ఆహ్వానించింది. విజయవాడ సమీపం లోని ఈ ప్రాంతంలో విష్ణుకుండినుల కాలానికి చెందిన బ్రహ్మ,విష్ణు,మహేశ్వరుల ఆలయాలతో పాటు 20 అడుగుల ఏకశిల అనంత పద్మనాభస్వామి విగ్రహం ప్రత్యేక ఆకర్షణఅని పేర్కొంది. జాతీయ ప్రాముఖ్యత కల్గిన కేంద్ర రక్షిత స్మారక కట్టడాల్లో ఒకటని ఏపీటీడీసీ తెలిపింది.

# క్వాంటం టెక్నాలజీస్‌పై శిక్షణ

## నేటి నుంచి సెప్టెంబర్ 11వ తేదీ వరకు శిక్షణ

## ఉన్నత విద్యామండలి చైర్మన్ కె మధుమూర్తి

**విజయవాడ,ఆగస్టు17,ప్రభాతవార్తప్రతినిధి:** క్వాంటం టెక్నాలజీస్‌పై అధ్యాపకులకు రాష్ట్రవ్యాప్తంగా శిక్షణ ఇస్తున్నామని ఉన్నత విద్యామండలి చైర్మన్ కె మధుమూర్తి వెల్లడించారు. జైపూర్‌లోని మాలవ్య నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎంఎన్ఐటి), సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం(డిఎస్‌టి), ఐబిఎం, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ, మద్రాస్ ఐఐటీల సహకారంతో ఈ కార్యక్రమం చేపడుతున్నామని శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 18 నుంచి సెప్టెంబర్ 11వ తేది వరకు 20 రోజుల పాటు ఆన్‌లైన్‌లో 40 గంటలు జరుగుతుందని వెల్లడించారు. భౌతిక శాస్త్రం, రసాయన శాస్త్ర, కంప్యూటర్ సైన్స్, గణితం, లైఫ్ సైన్సెస్, ఆర్థిక శాస్త్రం, వాణిజ్యం, వ్యవసాయం, వైద్య శాస్త్రాలు, మత్స్య, ఉద్యానవన, ఫార్మాస్యూటికల్స్ వంటి బహుళ విభాగాల్లో 1000 మంది అధ్యాపకులకు శిక్షణ ఇస్తామని తెలిపారు. 2026 ఏప్రిల్ వరకు దశల వారీగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు.

# ఆన్‌లైన్‌లో నేటి నుండి నవంబర్‌నెల ఆర్జితసేవా టిక్కెట్లు

## 21న వర్చువల్ సేవా టిక్కెట్లు , 23న అంగప్రదక్షిణ టోకెన్లు

**తిరుమల, ఆగస్టు 17ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవేంకటేశ్వర స్వామి రోజువారీ,వారాంతపు ఆర్జితసేవలకు సంబంధించి నవంబర్‌నెలకోటా టిక్కెట్లు సోమవారం ఉదయం నుండి టిటిడి ఆన్‌లైన్‌లో విడుదల చేస్తోంది. ఇందుకు టిటిడి ఐటి విభాగం అన్ని ఏర్పాట్లుచేసింది. కాగా నవంబర్ నెలనుండి శ్రీవాణి ట్రస్ట్ బ్రేక్ దర్శనాల టిక్కెట్ల దర్శన సమయం సాయంత్రం 4.30గంటలకు నిర్ణయించింది. ఈ సేవా టిక్కెట్లు ఆన్‌లైన్ డిప్ విధానంలో,కొన్నిసేవలు ముందువచ్చిన భక్తులకు ముందు అనే ప్రాతిపదికన ఆన్‌లైన్‌విధానంలో భక్తులు నేరుగా బుక్‌చేసుకునే సదుపాయం కల్పిస్తున్నారు. నేడు 18వతేదీ ఉదయం 10గంటలకు ఆన్‌లైన్‌లో ఆర్జితసేవా టిక్కెట్లు విడుదల చేస్తే 20వతేదీ ఉదయం 10గంటల వరకు నమోదు చేసుకోవచ్చు. ఈ టిక్కెట్లు పొందిన భక్తులు 20వతేదీ నుండి 22వతేదీ మధ్యాహ్నం 12గంటలలోపు సొమ్ముచెల్లించి టిక్కెట్లు మంజూరవుతాయి. 21వ తేదీ ఉదయం 10గంటలకు కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జితబ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకారసేవల టిక్కెట్లను విడుదల చేయనుంది. 21న ఆన్‌లైన్‌లో వర్చువల్ సేవా టిక్కెట్లను మధ్యాహ్నం 3గంటలకు విడుదలవుతాయి. 23వతేదీ అంగప్రదక్షిణ టోకెన్లు ఉదయం 10గంటలకు , శ్రీవాణి బ్రేక్ టిక్కెట్లు కోటా రోజుకు 500 లెక్కన ఉదయం 23న 11గం టలకు విడుదల చేస్తారు. వృద్దులు దివ్యాంగులు దర్శన కోటా ఆగస్ట 23న మధ్యాహ్నం 3గంటలకు విడుదల చేస్తారు. 300 రూపాయలు ప్రత్యేక ప్రవేశ దర్శన టిక్కెట్ల కోటా 25న ఉదయం 10గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు. గదుల కోటాను మధ్యాహ్నం 3గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు. భక్తులు ఆన్‌లైన్‌లో స్వామివారి దర్శన టిక్కె ట్లును 'టిటిదేవస్థానమ్స్.ఎపి.జివొవి.ఇన్‌'వెబ్‌సైట్‌ద్వారా బుక్‌చేసుకోవాలి.

# సాహిత్యరంగం బలహీనపడుతున్నప్పుడు నిబద్ధతగల సంస్థలు తప్పనిసరి

**విజయవాడ,ఆగస్టు17,ప్రభాతవార్తప్రతినిధి:** సాహిత్యరంగం బలహీనపడుతున్నప్పుడు నిబద్ధత గల సాహిత్య సంస్థలు తప్పనిసరిగా అవసరమవుతాయని వక్తలు అన్నారు. స్థానిక ఐఎన్ఏ హాలులో విశ్వసాహితీ కళావేదిక ఆవిర్భావ సభ జరిగింది. ఈ సభను బహుగ్రంథకర్త, కృష్ణాజిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి డా.జి.వి.పూర్ణచందు జ్యోతి ప్రకాశనం చేసి ప్రారంభించారు. అనంతరం పూర్ణచందు మాట్లాడుతూ సాహిత్యం ప్రవహించే నది అనుకుంటే ఆ నదిని పరిరక్షించే పచ్చని చెట్లు సాహితీ సంస్థలేనన్నారు.

డా గుమ్మా సాంబశివరావు మాట్లాడుతూ ఆధునిక సాహిత్యానికి మూలం ప్రాచీన సాహిత్యమేనని, ఈ తరం కవులు ప్రాచీన సాహిత్యాన్ని అధ్యయనం చేయాలన్నారు. నవమల్లెతీగ మాసపత్రిక సంపాదకుడు కలిమిశ్రీ మాట్లాడుతూ రాజకీయాలకంటే ముందు సాహిత్యరంగంలో ప్రజాస్వామ్యం అవసరమన్నారు.

స్వేచ్ఛాజీవు లైన కవులపై కొన్ని సంస్థల నిర్వాహకులు నిర్బంధం విధిస్తున్నారన్నారు. సాహిత్యరంగంలో ప్రజాస్వామ్య విలువలపై చర్చజరగాల్సిన అవసరముందన్నారు. సీనియర్ జర్నలిస్టు డా. విజయకుమార్ మాట్లాడుతూ కవులు లౌకికవా దులు కావాలన్నారు. సభకు అధ్యక్షత వహించిన గోళ్ళ నారాయణరావు మాట్లాడుతూ సంస్థల మధ్య సమన్వయం వుండాలన్నారు. పరసంస్థ సహనం పాటించాలన్నారు. కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకురాలు కొల్లి రమావతి మాట్లాడుతూ భాషాభివృద్ధి లక్ష్యంగా తాము విశ్వసాహితీ కళావేదికను ఏర్పాటు చేసామన్నారు. కవులకు,సాహిత్యవేత్తలు తమ సంస్థ అండగా ఉంటుందన్నారు. సంస్థ బాధ్యులు రంగిశెట్టి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జరిగిన శతాధిక కవి సమ్మేళనంలో కవులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సాయంత్రం సభకు డా.గజల్ శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. తెలుగు భాషా వికాసానికి కృషి చేయాల్సిన బాధ్యత సాహిత్య సంస్థపై ఉంద న్నారు. కవి సమ్మేళనంలో పాల్గొన్న కవుల్ని సత్కరించారు.

# ఏసీఏ అధ్యక్షుడిగా కేశినేని శివనాథ్

## కార్యదర్శిగా సానా సతీష్‌బాబు

**విజయవాడ,ఆగస్టు17,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఏసీఏ అధ్యక్షుడిగా విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని),కార్యదర్శిగా రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు,కోశాధికారిగా దండమూరి శ్రీనివాస్,సంయుక్త కార్యదర్శిగా బి.విజయ్‌కుమార్, కౌన్సిలర్‌గా గౌర్ విష్ణుతేజ్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడి పదవికి నామినేషన్ వేసిన బండారు నర్సింహారావు సమర్పించిన ధృవీకరణ పత్రాల్లో వివరాలు సరిగ్గా లేకపోవడంతో తిరస్కరణకు గురైనట్లు రిటర్నింగ్ అధికారి నిమ్మగడ్డ సతీష్‌కుమార్ తెలిపారు. గుంటూరు జిల్లా తాడేపల్లి లోని విజయవాడ క్లబ్‌లో అనంతపురం జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధికార ప్రతినిధి మ్యాంచో ఫెర్రర్ అధ్యక్షతన శనివారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో కార్యవర్గ ఎన్నిక జరిగింది. ఎన్నికైన సభ్యులకు రమేష్‌కుమార్ ధృవీకరణ పత్రాలు అందచేశారు. వచ్చే నెలలో ఉపాధ్యఓ పదవికి ఎన్నికలు నిర్వహిస్తామని ఏసిఏ సభ్యులు తెలిపారు. ఈ కార్యవర్గం పదవీకాలం 2028 వరకు ఉంది. వైకాపా హయాం లోని ఎపెక్స్ కౌన్సిల్ కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక రాజీనామా చేయడంతో మిగిలిన ఏడాది కాలానికి అప్పట్లో ఏసిఏ అధ్యక్షుడిగా కేశినేని శివనాథ్,కార్యదర్శిగా సానా సతీష్‌బాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆ కార్యవర్గ పదవీకాలం ఇటీవల ముగియడంతో తాజాగా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

# దసరా ఉత్సవాల్లో భక్తులకు మెరుగైన సౌకర్యాలు

**ఇంద్రకీలాద్రి, ఆగస్టు 17, ప్రభాతవార్త:** దుర్గమ్మవారి ఆలయంలో 2025 దసరా ఉత్సవాల ఏర్పాట్లకు సంబంధించి సివి చారిటీస్‌లో రూపొందించిన క్యూలైన్ నమూనాను ఇఒ వికె శీనా నాయక్ ఆదివారం పరిశీలించారు. కొన్ని మార్పులను అధికారులకు సూచించారు.

అనంతరం మాట్లాడుతూ సెప్టెంబర్ 22 నుండి అక్టోబర్ 02 వరకు జరిగే దసరా ఉత్సవాలకు భక్తులకు మరిన్ని సదుపాయాలు కల్పించడానికి గతంకంటే మరింత మెరుగుగా, అధునాతనంగా దసరా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

**భక్తుల విరాళాలు:** దుర్గమ్మవారి ఆలయంలో నిర్వహించే నిత్యాన్నదాన పథకానికి ఆదివారం తణుకుకు చెందిన కందుల లక్ష్మణరావు, విజయవెంకట లక్ష్మిలు రు.1,00,116ల విరాళంగా అందించారు. దాతల కుమారుడు రామప్రసాద్, కోడలు ప్రభాచంద్ర, మనుమలు శ్రీయాన్స్ లక్ష్మణ అభిరాం, కుమార్త లక్ష్మి సహస్రల పేరిట ఈ విరాళాన్ని ఇచ్చారు. దాతలకు దుర్గమ్మవారి దర్శన ఏర్పాట్లు చేసిన అనంతరం వారికి దుర్గమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, మెమెంటోలు అందించారు. వేదపండితులు వేదాశీర్వచనం పలికారు.




దాతలకు దుర్గమ్మ వారి జ్ఞాపిక అందిస్తున్న దృశ్యం



నమూనా క్యూలైన్లు పరిశీలిస్తున్న ఇఓ

# సెప్టెంబర్ 5నుండి తిరుచానూరు పద్మావతి అమ్మవారి పవిత్రోత్సవాలు

**తిరుమల,ఆగస్టు 17ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యంలోని తిరుచానూరు పద్మావతిఅమ్మవారి ఆలయంలో సెప్టెంబర్ 5వతేదీ శుక్రవారం నుండి 7వతేదీ ఆదివారం వరకు మూడురోజులు పవిత్రోత్సవాలు అత్యంత వైభవంగా జరగనున్నాయి. ఈ ఉత్సవాలకు సెప్టెంబర్ 2వతేదీ మంగళవారం సాయంత్రం విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, మృత్సంగ్రహణం, సేనాధిపతి ఉత్సవం ,అంకురార్పణ చేపట్టనున్నారు. ఆలయంలో యాత్రికుల వల్లగానీ, సిబ్బంది వల్లగానీ తెలిసీతెలియక దోషాలు జరుగుతుంటాయి. ఇలాంటి వాటివల్ల ఆలయ పవిత్రతకు ఎలాంటి లోపం రానీయకుండా నివారించేందుకు మూడు రోజులపాటు పవిత్రోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. సెప్టెంబర్ 5వతేదీ ప్రవిత్రప్రతిష్ట, 6న పవిత్ర సమర్పణ, 7వతేదీ పూర్ణాహుతి కార్యక్రమాలు జరగనున్నాయి. 750 రూపాయలు చెల్లించి పవిత్రోత్సవాలు టిక్కెట్ పొందే గృహస్థభక్తులకు 2లడ్డూలు, 2వడలు



బహుమానంగా అందజేస్తారు. ఆలయంలో పవిత్రోత్సవాల సందర్భంగా సెప్టెంబర్ 2న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం, సెప్టెంబర్ 4న అంకురార్పణ సందర్భంగా అమ్మవారికి జరిగే తిరుప్పావడ, కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, 5వతేదీ అభిషేకానంతరం దర్శనం, లక్ష్మీపూజ సేవలు రద్దుచేశారు. అలాగే సెప్టెంబర్ 5,6,7 తేదీల్లో మూడురోజులు కల్యాణోత్సవం, బ్రేక్ దర్శనం, వేద ఆశీర్వచనం, కుంకుమార్చన, ఊంజల్‌సేవలు టిటిడి రద్దు చేసింది.

# అందరికీ మంచి జరగాలని వేడుకున్నా



**తిరుమల,ఆగస్ట్ 17ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటే అందరికీ మంచి జరుగుతుందని,ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని వేడుకున్నట్లు జార్ఖండ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అంబుజనాథ్ తెలిపారు. ఆదివారం ఉదయం విఐపి బ్రేక్ దర్శనాల ప్రారంభసమయంలో ఆలయం వద్దకు వచ్చిన జస్టిస్ అంబుజనాథ్‌కు ఆలయ అధికారులు స్వామి వారి దర్శనం చేయించారు. వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. ఆలయ అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.



# తిరుమలలో ఉట్లోత్సవం

**తిరుమల,ఆగస్టు17ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలలో ఆదివారం సాయంత్రం గోకులాష్టమి పర్వదినం మరుసటిరోజు ఉట్లోత్సవం వేడుకగా జరిగింది.సాంప్రదాయంగా ఆనవాయితీ ప్రకారం మధ్యాహ్నం ఆలయం నుండి శ్రీమలయప్పస్వామి బంగారు తిరుచ్చిపై, శ్రీకృష్ణస్వామి మరో తిరుచ్చిపై ఉత్సవమూర్తులను ఆలయానికి ఎదురుగా ఉన్న పెద్దజీయర్ మఠానికి మంగళవాయిద్యాల నడుమ వేంచేపు చేశారు.. ఇక్కడ వేదోక్తంగా ఆస్థానం చేపట్టారు. పెద్దజీయర్‌స్వామికి, టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరికి పరివట్టంతో స్వామివారి దర్శనం కల్పించారు. అనంతరం ప్రసాద నివేదన చేసి భక్తులకు పంపిణీ చేశారు. అక్కడ నుండి బేడి ఆంజనేయస్వామి ఆలయం మీదుగా బయలుదేరిన మలయప్పస్వామి, శ్రీకృష్ణస్వామి ఆలయం ముందుకు వచ్చారు. ఇక్కడ హథీరాంజీమఠం వారినుండి ప్రత్యేక పూజలు, నివేదనలు అందుకుని యువకులు ఉట్టికొట్ట డాన్ని పర్యవేక్షించారు. ఆలయం ఎదురుగా తోలుత ఉట్లోత్సవం ఉత్సాహంగా సాగింది. ఆ తరువాత వరుసగా దక్షిణమాఢవీధి, పడమరమాఢవీధి, ఉత్తరమాఢవీధుల్లో ఏర్పాటు చేసిన ఉట్లను యువత ఆద్యంతం కోలాహలంగా ఉట్లోత్సవంలో ఉట్టికొట్టి గోవిందనామస్మరణ చేశారు. చిరుజల్లులు పలకరించగా ఉట్లోత్సవం వైభవంగా ముగిసింది. ఈ కార్యక్రమంలో పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి దంపతులు, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం దంపతులు, ఆలయ పేష్కార్ రామకృష్ణ, ఆలయ పారుపత్తేదార్ హిమత్‌గిరి, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

# వెంకన్న దర్శనానికి 40గంటలుపైనే..



**తిరుమల,ఆగస్టు 17 ప్రభాతవార్తప్రతినిధి:** మూడు రోజులు వరుససెలవులు, వారాంతం కలిసి రావడంతో తిరుమల భక్తజనసంద్రంగా మారింది. ఏడుకొండల వెంకన్న దర్శనానికి భక్తులు భారీగా తరలివ స్తున్నారు. ఆదివారం ఉదయం కూడా యధావిధిగా భక్తుల లైన్లు ఆలయం వెలుపల ఐదుకిలోమీటర్లు చేరాయి. శిలాతోరణం వద్ద నుండి సామాన్యభక్తులు వైకుంఠమ్ 2 క్యూకాంప్లెక్స్‌కు చేరుకునే పరిస్థితి ఉంది. ఆదివారం ఉదయానికి వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లలోని కంపార్టుమెంట్లు నిండిపోయి భక్తులు వెలుపల క్యూలైన్లలో నిరీక్షిస్తున్నారు. దీంతో స్వామివారి సర్వదర్శ నానికి 25గంటలు కంపార్టుమెంట్లలో ఉన్నవారికి కేటాయించగా, వెలుపల వున్న భక్తులకు 40గంటలుపైగానే నిరీక్షణ తప్పడం లేదు. ప్రత్యేక ప్రవేశ దర్శనానికి పదిగంట లపైగానే భక్తులు నిరీక్షిస్తున్నారు. ఆదివారం సాయంత్రం వరకు 49వేలమంది భక్తులకు మహాలఘు దర్శనం చేయించారు. మరో 30వేలమందివరకు భక్తులు అర్ధరాత్రివరకు దర్శనం చేసుకునే వీలుందని టిటిడి వర్గాలు తెలిపాయి. శనివారం రాత్రివరకు 87,759 మంది భక్తులకు మహాలఘులో దర్శనం చేయించారు. కానుకల రూపంలో హుండీ ఆదాయం 4.16కోట్లు చేకేరింది. గత 15రోజులు భక్తులు రద్దీ కొనసాగుతుండటంతో ఇప్పటివరకు 12.12లక్షలమంది భక్తులు ఈనెలలో స్వామివారిని దర్శించుకున్నారు. హుండీ ఆదాయం 63.24కోట్ల రూపాయలు లభించింది. సాధారణంగానే వారాంతం శని, ఆదివారాలు భక్తులు భారీగా తిరుమలకు వస్తారు. అయితే వరుసగా మూడురోజులు సెలవులతో దేశం నలుమూలలనుండి భక్తులు భారీగా తిరుమలకు చేరుకోవడంతో సామాన్య భక్తుల సంఖ్య అనూహ్యంగా పెరిగింది. వెలుపల క్యూలైన్లలో ఉన్న భక్తులకు శ్రీవారి సేవకులు నిరంతరాయంగా పాలు, కాఫీ, తాగు నీరు,అన్నప్రసాదాలు, అల్పాహారం అందిస్తున్నారు.

# సంగోపాంగ శ్రీనివాస విశ్వశాంతి మహాయాగం

**తిరుమల, ఆగస్టు 17ప్రభాతవార్తప్రతినిధి:** లోకక్షేమం, ప్రజల ఐశ్వర్యం ఆయురారోగ్యం సంపదలు కాంక్షిస్తూ తిరుమల ధర్మగిరి వేంకటేశ్వర వేదవిజ్ఞానపీఠంలో సంగోపాంగ శ్రీనివాస విశ్వశాంతి మహాయాగం మొదలైంది. ఆదివారం సాయంత్రం వేదోక్తంగా ఈ యాగాన్ని 32మంది వేదపండితుల సమక్షంలో నిర్వహిస్తున్నారు. ఈ మహాయాగంలో వేదపారాయణం, సుందరకాండపారాయణం తదితర వైదిక క్రతువులు చేపడతారు. ఆగస్టు 20వతేదీ పూర్ణాహుతితో యాగం పరిసమాప్తమవుతుంది. నాలుగురోజులపాటు జరిగే ఈ యాగంలో ఆదివారం సాయంత్రం ఆచార్యవరణం, మేదినీ పూజ, మృత్సంగ్రహణం, అంకురార్పణ, వేదారంభం కార్యక్రమాలు వేదోక్తంగా నిర్వహించారు. ఈ యాగంలో టిటిడి అదనపు ఇఒచిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, ఎస్వీవేదవిజ్ఞానపీఠం ప్రిన్సిపాల్ కుప్పాశివసుబ్రమణ్యం అవధాని, అర్చకులు, వేదపండితులు పాల్గొన్నారు.



# 'శ్రీవాణి'కి ఐదింతలు డిమాండ్

## జారీచేసేది 800 టిక్కెట్లు, క్యూలో ఐదువేలమంది భక్తులు

**తిరుమల,ఆగస్టు 17ప్రభాతవార్తప్రతినిధి:** మూడు రోజులు వరుససెలవులు, వారాంతం రద్దీపెరగడంతో తిరుమలలో ఏరోజుకారోజు శ్రీవాణి బ్రేక్ దర్శనాలకు డిమాండ్ విపరీతంగా పెరిగింది. ఆఫ్‌లైన్‌లో ప్రత్యేక కౌంటర్‌లలో 800 టిక్కెట్లు జారీచేస్తుండగా ఐదింతలు రెట్టింపయిన భక్తులు ఈ టిక్కెట్లకు ఐదువేల మంది వరకు క్యూలైన్లలో బారులుతీరి నిలబడు తున్నారు. ఆదివారం సాయంత్రం దర్శనానికి సంబంధించి శనివారం రాత్రి 9గంటల ప్రాంతంలో శ్రీవాణి టిక్కెట్లు జారీచేసే కౌంటర్ ప్రాంతంలో భక్తులు బారులు తీరారు. అయితే గత రాత్రి జరిగిన తోపులాట, రద్దీతో ఆదివారం ఉదయం 10గంటలకే భక్తులకు దర్శన టిక్కెట్లు జారీచేశారు. శనివారం రాత్రి క్యూలో ముందు గానే వచ్చిన భక్తులను విజిలెన్స్ సిబ్బంది ముందుగా సమాచారం అందించి అక్కడకు వెనక్కుపంపారు. దీంతో



ఆదివారం వేకువజామున 4గంటలనుండే భారీగా భక్తులు ఈ కౌంటర్‌వద్ద నిలబడ్డారు. ఓవైపు చిరుజల్లులు కురుస్తున్నా,విపరీతమైన చలిగాలులు వున్నా భక్తులు ఖాతర్‌చేయలేదు. తమకు ఆ దేవుని దర్శనం చేసుకుంటే చాలనే విశ్వాసం వ్యక్తం చేశారు. సాధారణరోజుల్లోకూడా శ్రీవాణికి విపరీతమైన డిమాండ్ ఉంది. పైగా ఉదయం టిక్కెట్లు జారీచేస్తే సాయంత్రం ఆలయంలోపల కులశేఖరపడివద్ద మొదటిగడప నుండి శ్రీవేంకటేశ్వరస్వామిని ప్రశాంతంగా, కళ్లారా మరీ దగ్గరగా దర్శనం చేసుకునే భాగ్యం ఉండటంతో చాలావరకు భక్తులు ఈ దర్శనాలపై ఆధారపడుతున్నారు. టిటిడి అధికారులు ఈ టిక్కెట్లను పెంచాలని భక్తులు కోరుతున్నారు. సాదారణరోజుల్లోనూ 1,500మంది వరకు భక్తులు శ్రీవాణికోసం డిమాండ్ ఉంది. ఇక వారాంతం,ప్రత్యేక సెలవురోజుల్లో ఈ రద్దీ ఐదింతలు రెట్టింపవుతోంది. మరీ టిటిడి అధికారులు భక్తుల అవసరానికి ఎలా స్పందిస్తారనేది చూడాల్సిందే. రానున్న రోజుల్లో సామాన్య భక్తులు కూడా దేవదేవుడిని మరింత దగ్గరగా ప్రశాంతంగా దర్శనం చేసుకునే వీలుకలిగేలా శ్రీవాణి బ్రేక్ దర్శనాలపైనే ఆధారపడే సూచనలు లేకపోలేదు. ప్రస్తుతం రోజువారీగా 2వేలమంది భక్తులు శ్రీవాణి బ్రేక్ దర్శనం చేసుకుంటున్నారు.

జీవితాన్ని ఇచ్చిన తల్లిదండ్రులకు, జ్ఞానవంతునిగా చేసిన ఉపాధ్యాయులకు మించిన గౌరవించతగినవారు లేరని తెలుసుకో.

-తిరుక్కురళ్

# కాలుష్య కౌగిలిలో నగరాలు!

ఒళ్లి ఒర్లి వారుపోతారు, వండుక తిని మనం పోదాం అన్నట్లుగా ఉంది కాలుష్య నియంత్రణ విషయంలో కొందరు అధికారులు, మరికొందరు పారిశ్రామికవేత్తలు వ్యవహరిస్తున్న తీరు. కాలకూట విషంగా మారుతున్న కాలుష్య విషవాయువుల నుంచి ప్రజలను కాపాడేందుకు పాలకులు చట్టాల మీద చట్టాలు చేస్తున్నా, ఎందరిపైనో చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పుకుంటున్నా కాలుష్యకాటుకు బలయ్యేవారి సంఖ్య అంతకంతకు పెరుగుతుండడంఆందోళన కలిగించే అంశం. ఈ సమస్యను పరిష్కరించడంలో ప్రభుత్వాలు మీనమేషాలు లెక్కబెడుతూ జాప్యం చేస్తే కాలుష్య రక్కసి కాటుకు దేశవ్యాప్తంగా కోట్లాది మంది బలికాక తప్పదని పర్యావరణ శాస్త్రజ్ఞులు హెచ్చరిస్తున్నారు. జీవించే హక్కు కల్పించమని కోరుతూ కొందరు ఈ కలుష్యకాసారంలో చిక్కుకున్న నిర్భాగ్యుల వేదన అరణ్యరోదనగా మిగిలిపోతున్నది. కాలుష్య నియంత్రణ మండలిని ఏర్పాటు చేశారు. అనేక చట్టాలు తెచ్చారు. చర్యలు తీసుకుంటున్నారు. అయినా అవేమీ ఈ కాలుష్యం నుండి ప్రజలను కాపాడలేకపోతున్నాయి. ముఖ్యంగా నగరాల్లో కాలుష్యం అంతకంతకు పెరిగి ఇప్పుడు అది నగరాల పరిసర ప్రాంతాలకు కూడా విస్తరిస్తున్నది. ఈ కారణంగానే దేశరాజధాని ఢిల్లీలో పరిస్థితి ఆందోళనకరంగా తయారైంది. అక్కడ వాయు కాలుష్యం కారణంగా గాలి పీల్చితే పొగ అలవాటులేకపోయినా కేన్సర్ వచ్చే ప్రమాదం ఉందనే సంకేతాలు వెల్లడవుతున్నాయి. మరికొందరు ఢిల్లీ నివాసులు వర్ష, చలికాలాల్లో నగరాన్ని వదిలి రెండు,మూడు నెలల పాటు దూరంగా వెళ్లిపోతున్నారు. ఢిల్లీయే కాదు దేశంలో అనేక నగరాల్లో అదే పరిస్థితి. ప్రపంచ జనాభాలో ప్రస్తుతం సగం నగరాల్లోనే నివసిస్తున్నది. మరో మూడు దశాబ్దాల నాటికి నగర జనాభా అదనంగా మూడువందల కోట్లకు పెరుగుతుందని అధికారుల అంచనా. భూభాగంపై నగరాల వైశాల్యం రెండు, మూడు శాతానికి మించకపోయినా కాలుష్యంలో మాత్రం అది ప్రపంచ జనాభా ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపే స్థాయిలోవిస్తరిస్తున్నది. ప్రపంచవ్యాప్తంగా స్థూల దేశీయోత్పత్తిలో అరవై శాతం ఆరువందల పట్టణాల్లో కేంద్రీకృతమై ఉందంటే నగరాల ప్రాధాన్యత ఏమేరకు ఉందో చెప్పనవసరం లేదు. ప్రధానంగా వ్యవసాయరంగంలో ఏర్పడిన సంక్షోభం గ్రామీణ ప్రాంతాన్ని అతలాకుతలం చేస్తుండడంతో వలసలు పెరిగిపోయాయి. అందుకే గ్రామీణ జనాభా తగ్గుతుండగా పట్టణాల్లో, నగరాల్లో జనాభా యేడాది యేడాదికి ఊహించని రీతిలో పెరిగిపోతున్నది. భారత దేశంలో అయితే పట్టణీకరణ అందుకోలేనంతగా పెరుగుతున్నది. 2001లో పట్టణ ప్రాంతాల్లో జనాభా ఇరవైఎనిమిదన్నర కోట్లకు ఉంటే ఇప్పుడది నలభై కోట్లకుపైగా పెరిగిపోయిందని చెబుతున్నారు. ఈ నగరాల్లో పెరుగుతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా నిర్దిష్టమైన ప్రణాళిక ప్రకారం కనీస వసతులు కూడా కల్పించలేకపోతున్నారు. ఎన్నో పథకాలు చేపడుతున్నా అవి అవసరాలను తీర్చలేకపోతున్నాయి. 2005లో ప్రారంభించిన జవహర్‌లాల్‌నెహ్రూ జాతీయ పట్టణ నవీకరణ కార్యక్రమం (జెఎన్ఎన్‌యుఆర్ఎం) కింద పట్టణ ప్రాంతాల్లో మరికొన్ని సౌకర్యాలు కల్పించి జీవనం కల్పించేందుకు ప్రయత్నాలు చేస్తున్నా పెరుగుతున్న అవసరాలను అవి అందుకోలేకపోతున్నాయి. భారత్‌లో గతంలో ఆరు మెట్రోనగరాలు చెన్నై, ఢిల్లీ, బెంగలూరు, కోల్‌కత్తా, హైదరాబాద్, ముంబయిలలో ఒక ప్రైవేట్ సంస్థ నిర్వహించిన సర్వేలో విస్తుపోయే విషయాలు వెలుగు చూశాయి. విస్తరణ, తదితర అంశాల్లో ఒక నిర్దిష్టమైన ప్రణాళిక లేకుండా చేపట్టడం వల్ల తీవ్రమైన దుష్ప్రభావం ప్రజారోగ్యంపై చూపుతున్నదనేది ఆ నివేదిక వెల్లడించింది. ముఖ్యంగా నగరాల్లో వాయు, నీటికాలుష్యంవల్ల పౌరుల ఊపిరితిత్తులకు తూట్లు పొడుస్తుందని హెచ్చరించారు. చెన్నై, కోల్‌కతా, ముంబాయిలలో వాహన కాలుష్యం తీవ్రంగా ఉంది. తర్వాత స్థానం పారిశ్రామిక కాలుష్యం. బెంగళూరులో పరిస్థితి మరొకరకంగా ఉంది. పరిశ్రమల కారణంగా అక్కడ వాయుకాలుష్యం తీవ్ర స్థాయికి చేరినట్లు ఆ సర్వేలో బయటపడింది. ఇక వాహనాలు, నీటి కాలుష్యంలో హైదరాబాద్ అగ్ర స్థానంలో ఉంది. నిర్మాణరంగం వల్ల గాలిలో దుమ్ము, ధూళి చేరుతుండడంతో ప్రజారోగ్యం రానురాను ప్రశ్నార్థకంగా మారింది. హైదరాబాద్ మహానగరంలో ఈవాయు కాలుష్యానికి నీటి కాలుష్యం కూడా తోడుకావడంతో పరిస్థితి ఆందోళనకరంగా తయారైంది. నగర శివార్లలోని పరిశ్రమల నుండి గాలిలోకి వదులుతున్న కాలుష్యాలకు అడ్డూఅదుపు లేకుండాపోతున్నది. ఇక నీటి కాలుష్యం పరిస్థితి ఆందోళనకరంగా మారుతున్నది. నగరశివార్లలోని పరిశ్రమల నుండి విషపూరితమైన రసాయనిక కలుషిత జలాలు శుద్ధి చేయకుండా మూసీలో కలిసిపోతున్నాయి. వాస్తవానికి ఈ సమస్య ఇప్పటికిప్పుడు కొత్తగా పుట్టుకొచ్చిందికాదు. ప్రభుత్వ విధానాలు, కొందరు అధికారుల అవినీతి, అసమర్థత, అంతులేని నిర్లక్ష్యం కారణంగా రోజురోజుకు పెరిగిపోతున్నది. ఫలితంగా మూసీతోపాటు ఎన్నో చెరువులు, కుంటలు, కాలుష్యకాసారాలుగా మారిపోయాయి. కొన్ని చెరువులు అయితే చేపలు, ఇతర జలచరాలు ఏవీ జీవించలేని పరిస్థితి ఏర్పడింది. పశుపక్ష్యాదులతోపాటు మానవ జీవనం కూడా ప్రశ్నార్థకంగా మారే సంకేతాలు వెలువడుతున్నాయి. ఇప్పటికైనా ఈ కాలుష్య నియంత్రణ విషయంలో పాలకులు చట్టాలు చేసి చేతులు దులుపుకుంటే సరిపోదు. అవి త్రికరణశుద్ధిగా అమలుకు కృషి చేయాల్సిన అవసరం ఉంది.

నీది కాదని తెలిసిన దాన్ని కూడా నీదనుకోవడం నిజంగా నేరం.



ఠాగూర్

ఒక పనిని బాగా చేయడం మాత్రమే కాకుండా మరింత బాగా చేయాలన్న అదనపు కోరికను సామర్థ్యం అంటారు.



హెచ్. గిల్బర్ట్

## ప్రజావాక్కు



### కఠిన శిక్షలు వేగవంతం చేయాలి

ఈమధ్య ఇళ్ళల్లోకి దొంగలు యధేచ్ఛగా ప్రవేశించి ఇంట్లోని వారిని హింసించి బీరువాలను పగలగొట్టి దొరికినంత దోచుకుని పారిపోతున్నారు. ఇళ్లకు తాళాలు వేసి గుడికి వెళ్ళినా ఏదైనా ఊరికి వెళ్ళినా రెక్కీలు నిర్వహించి చటుక్కున వచ్చి ఏదోవిధంగా వారొచ్చిన పనిని నిర్విఘ్నంగా చేసుకుపోతున్నారు. ఆడవారి మెడలో చైన్ స్నాచింగ్‌లు నిత్యకృత్యం అయిపోతున్నాయి. బ్యాంకు ఎ.టి.ఎమ్. మిషన్లను చాకచక్యంగా ఓపెన్ చేసి అందులోని కాష్ మొత్తాన్ని దోచుకువెడుతున్నారు. నిన్నగాక మొన్న హైద్రాబాద్ చాందానగర్‌లోనున్న ఖజానా నగల దుకాణంలో పట్టపగలు పిస్టళ్లతో మొహాలకు గుడ్డలు కట్టుకుని నగలను దోచుకెళ్లారు. సిసికెమెరాల్లో కనిపించిన వారి ఆచూకి ఇంతవరకు తెలియరాలేదు. ఇందుకు కారణాలు ఈజీగా డబ్బు సంపాదించవచ్చనే దురాలోచన. చట్టాలను కొత్తగా మారిస్తే సరిపోదు. కఠిన శిక్షలు వేగవంతం చేయాలి.

- ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

### ప్రాజెక్టులు నిర్మించాలి

తెలంగాణ సాధారణ వర్షాపాతం ఇప్పుడు కురుస్తున్న వర్షాలకు ఎక్సెస్ రైన్ ఫాల్ వచ్చి ఉంటుంది అలా వచ్చిన నీటిని ఎంత వరకు స్టోర్ చేస్తున్నాం అనే దాని మీద తెలంగాణ భవిత ఆధారపడి ఉంటుంది అని గుర్తు పెట్టుకోవాలి. ఎందుకంటే తెలంగాణకు సముద్ర మార్గం కానీ అంతర్జాతీయ నీటి ప్రవాహం మార్గం కానీ లేదు. భూమిలోపలికి నీటినిఇంకేటట్టు చేయడం, చెక్‌డ్యామ్‌ల నిర్మాణం చేపట్టాలి. తెలంగాణ ఉద్యమంలో నీళ్లు అనేదిఒక మేజర్ ఆబ్జెక్టీవ్‌గా ఉన్నప్పుడు గత ప్రభుత్వం కోట్ల రూపాయలతో చెక్ డ్యామ్‌లు నిర్మించినప్పుడు ఈ ప్రభుత్వం ఎందుకు ఆ పని చేయకూడదు.

- భారత అవినాష్, జనగామ

### మద్యం కేంద్రాలను నిషేధించాలి

ఇటీవల ఏపిలో కొత్తగా ఏర్పాటు చేసిన మద్యం విక్రయ కేంద్రాలు కొన్ని నగరాలలో జనవాడల మధ్య ఉంటున్నాయి. మద్యసేవకులు మోతాదు ఎక్కువై అక్కడ ఇతరులతో ఘర్షణలు శృతి మించి కొట్టుకుంటూ ఆ దృశ్యం భయం కలుగుతున్నది. కొత్త షాప్‌లకు ప్రదేశం కాస్త దూరంగా ఉంటే ఈ సమస్య కొంత తగ్గుతుంది.

- కె.రామారావు, విశాఖపట్నం

### పరిష్కారం చూపాలి

ఇటీవల జాతీయ స్థాయిలోనడుస్తున్న కేంద్ర ఉద్యోగుల ఆరోగ్య పథకం మొత్తం ఆన్లైన్ సదుపాయాన్ని వేరే కొత్త సి డాక్ అనే సాఫ్ట్వేర్‌కి మార్చారు. మార్పు ఏదైనా మెరుగైన సదుపాయం, సులువు ఉంటే లబ్ధిదార్ల సేవలకు ఇబ్బంది ఉండదు. ఇది ఉచిత పథకం కాదు. ఒక వ్యక్తి సుమారు 35000 చొప్పున్న కట్టిన తర్వాత గుర్తింపు కార్డులు జారీచేశారు. సుమారు ఐదు సంవత్సరాలు సేవలు జరిగిన పథకంలో ఇప్పుడు కొత్త విధానంవారి అర్హత, వాలిడిటీలు తప్పుగా చూపిస్తూ తప్పుడు సమాచారంతో లబ్ధిదారులకు వైద్యం కోసం సేవలు నిరాకరించడం జరిగింది. స్థానిక కేంద్ర అధికార్లు సదరు ఫిర్యాదుని ముఖ్యంగా భావించి , డేటా మార్పిడి కోసం వారి పరిశీలనతో త్వరగా ఎగువ స్థాయి కేంద్రానికి నివేదికతో పాటు ,ఆన్లైన్ వ్యవస్థను వాడుకోవాలి. ఇది చాలా మందికి ఇదే సమస్య వచ్చిందనడం, తాము సరిచేయలేమని చెప్పడం కన్నా పరిష్కారం చూపాలి.

- బొల్లోజు మేఘనాధం, విశాఖపట్నం

### ఉచిత బస్సు అందరికి ఇవ్వకూడదు

ఆడ, మగ సమానం అని చెప్పడానికి ఎంత ప్రయత్నిస్తున్నప్పటికీ ఒకటిమాత్రం కాదు. ఆడవారి దుస్తులు వేరు మగ వారు దుస్తులువేరు. ఆడవారి అవసరాలు వేరు మగవారి అవసరాలు వేరు. ఆడవారు చేయగలిగిన పనులకు మగవారు చేయగలిగిన పనులకు వ్యత్యాసం ఉంటుంది. ఆంధ్రప్రదేశ్ ప్రియతమ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారికి ప్రియాతి ప్రియమైన శిష్యుడైనటువంటి రేవంత్ రెడ్డి ప్రవేశపెట్టిన స్త్రీలకు ఉచిత బస్సు పథకం ఆర్థిక కష్టాలకు కారణమై అభాసుపాలయ్యింది. హైదరాబాదులో ఆటో డ్రైవర్ల ఆగ్రహానికి హేతువయ్యింది. ఉచిత బస్సు ప్రయాణం ఆర్థికంగా వెనకబడిన వారికి అనుమతించాలి.

- వీరగంట భాస్కర్ రావు, బొబ్బిలి

### రైళ్ల హాల్ట్ పునరుద్ధరణ మాట గాలికేనా?

వ్యాపార, వ్యవసాయ విద్యారంగాల్లో ఎంతో అభివృద్ధి చెందిన పశ్చిమ గోదావరి జిల్లాఅత్తిలిలో టిక్కెట్లు విక్రయాలు తక్కువగా ఉన్నాయన్న సాకుతో 2021 సంవత్సరం కరోనా సమయంలో అత్తిలి రైల్వే స్టేషన్లో పలు ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్ట్ రద్దు చేశారు. కరోనా భయం పూర్తిగా తొలగి ప్రయాణికుల సంఖ్య పెరిగినా, హాల్ట్‌ల పునరుద్ధరణ విషయం మాత్రం గాలికి వదిలివేసినట్లుగా కనిపిస్తుంది.

-డి. వెంకటరెడ్డి, ఊరదాళ్ళపాలెం ప.గోజిల్లా

మనవి
ఎడిట్ పేజీకి..
ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)


# ఎన్నికల సంఘం స్వయం ప్రతిపత్తిని కాపాడాలి!

**ఎలక్షన్ కమిషన్ స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన సంస్థ అయినప్పటికీ ఎన్నికల కమిషన్ నిర్వహణకు, కమిషన్ సభ్యుల వ్యక్తిగత అవసరాలకు అవసరమైన నిధులన్నీ ప్రభుత్వమే మంజూరు చేయాల్సి రావడం వల్ల వారు కఠినంగా వ్యవహరించలేకపోతున్నారు. అందువల్ల ఎన్నికల సంఘానికి, సంఘం సభ్యులకు అవసరమైన నిధులు అధికారంలో వున్న ప్రభుత్వంపై ఆధారపడకుండా బడ్జెట్టులోనే ప్రత్యేకంగా కేటాయించే విధంగా చట్టంలో ఏర్పాటు చేయాలి. అంతేకాకుండా ఎన్నికల కమిషన్ సభ్యులుగా పదవీ విరమణ చేసినఅనంతరం ప్రభుత్వ పరమైన పదవులు ఆశించడంవల్ల కూడా నిస్పాక్షికంగా వ్యవహరించ లేకపోతున్నారు. ఇదేసమయంలో పదవీ విరమణఅనంతరం ఎన్నికల కమిషన్ సభ్యులు ఎటువంటి ప్రభుత్వ పదవులు స్వీకరించడానికి అవకాశం లేకుండా చట్టాన్ని సవరించాలి. అంతేకాకుండా ఎలక్షన్ కమిషన్ సభ్యుల నియామక కమిటీలో ప్రతిపక్ష నాయకునితోపాటు సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిని కూడా చేర్చాల్సిన అవసరం వుంది.**



అన్నవరపు బ్రహ్మయ్య

ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ గత ఎన్నికల్లో ఎలక్షన్ కమిషన్ పాల్పడిన అక్రమాలపై దేశవ్యాప్తంగా అలజడి చేస్తున్నప్పటికీ అమెరికా అధ్యక్షుడు భారతదేశంపై విధించిన పన్నుల అంశం బిజెపి ప్రభుత్వాన్ని కాపాడుతోంది. ప్రతిపక్షనేత, కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ బీహార్ ఓటర్ల జాబితాలో జరిగిన అక్రమాలేకాకుండా కర్ణాటక రాష్ట్రంలో జరిగిన ఎన్నికలలో ఒక లోక్‌సభ నియోజకవర్గంలో లక్షకు పైగా దొంగ ఓటర్లను చేర్చించడం, ఒకే ఇంటి నెంబరులో వందల సంఖ్యలో ఓటర్లను నమోదు చేయడం వంటి అంశాలను వెలుగులోకి తీసుకువచ్చినప్పటికీ ఈ అంశాలు పూర్తిస్థాయిలో ప్రజల దృష్టికి వెళ్లడం లేదు. అధికారం దుర్వినియోగం చేసి, ఎన్నికల కమిషన్‌ను తమ చెప్పుచేతలలో పెట్టుకోవడం అధికారంలో వున్న రాజకీయ పార్టీలకుకొత్తమే కాదనే వాదనలు కూడా వినిపిస్తున్నాయి. ఉదాహరణకి 1971లో సార్వత్రిక ఎన్నికల్లో రాయబరేలి నియోజకవర్గం నుంచి ఇందిరాగాంధీ గెలిచారు. ఆమెపై పోటీచేసి ఓడిపోయిన రాజ్ నారాయణ్ ఎన్నికలలో అక్రమాలు జరిగాయని, ఇందిర ఎన్నికను సవాల్ చేస్తూ అలహాబాద్ హై కోర్టులో కేసు వేశాడు. అలహాబాద్ హైకోర్టు జూన్ 12, 1976న తీర్పు చెబుతూ ఎన్నికలలో అక్రమాలు జరిగాయని నిర్ధారిస్తూ ఇందిరా గాంధీని దోషిగా భావించి ఆరు సంవత్సరాల పాటు ఎన్నికలలో పాల్గొన రాదని కూడా తీర్పు చెప్పింది. జూన్ 24న సుప్రీం కోర్టు ఈ తీర్పు అమలు కాకుండా స్టే విధించడం, ఆ తర్వాత పరిణామాలలో 1975లో ఎమర్జెన్సీ విధించడం అందరికీ విదితమే. ఈ కారణంగానే ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతోపాటుఇండియా కూటమి నేతలు చేస్తున్న ఆందోళనకు ప్రాధాన్యత లేకుండా పోతుందని కొంతమంది మేధావులు అభిప్రాయపడుతున్నారు. భారత రాజ్యాంగం ప్రకారం ఈ వ్యవస్థ నియంత్రణ లేకుండా స్వతంత్రంగా వ్యవహరించే వ్యవస్థలలో భారత ఎన్నికల కమిషన్ ఒకటి. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత 1950వ సంవత్సరంలో భారత ఎన్నికల సంఘం ఏర్పడింది. ఈ చట్టం ప్రకారం ఒకే వ్యక్తి ఎన్నికల కమిషన్‌గా వ్యవహరించేవారు. అయితే 1989, అక్టోబరులో భారత ఎన్నికల సంఘం చట్టంలో మార్పులు తీసుకువచ్చారు. ఈ మార్పు ప్రకారం ఎన్నికల సంఘంలో ఒకరే కాకుండా మొత్తం ముగ్గురు సభ్యులతో కూడిన సంఘాన్ని ఏర్పాటు చేశారు. ముగ్గురిలో ఒకరు ప్రధాన ఎన్నికల అధికారిగా, మిగిలిన ఇరువురు సభ్యులుగా వుంటారు. ముగ్గురిలో ఒకరు ప్రధాన అధికారి అయినప్పటికీ ఇతర సభ్యులపై పెత్తనం చేయకూడదు. ఏ నిర్ణయమైనా ముగ్గురు కలిసి తీసుకోవాలి. నిజానికి శేషన్ బాధ్యతలు స్వీకరించడానికి ముందే ముగ్గురు సభ్యులను నియమించాలని నిర్ణయించినప్పటికీ అది ఆచరణలోకి రాలేదు. ఈలోగా 1990లో శేషన్ ఎన్నికల అధికారిగా అధికారంలోనికి వచ్చాడు. 'నీతివంతులు సింహం వలే జీవింతురు' అనే సూక్తికి నిదర్శనం మాజీ ఎన్నికల కమీషనర్ టి.ఎన్.శేషన్ అని చెప్పవచ్చు. ఇప్పటి వరకు 31 ఎన్నికల సంఘాలు పనిచేయగా వీరిలో శేషన్‌కు ముందు లేదా తర్వాత పనిచేసిన ఏ ప్రధాన ఎన్నికల అధికారి శేషన్ మాదిరిగా పేరు తెచుకోలేకపోయారు. 1990 నుంచి 1996 డిసెంబరు వరకు భారత ప్రభుత్వ ఎన్నికల కమీషనర్‌గా పనిచేసిన శేషన్ తీసుకు వచ్చిన విప్లవాత్మకమైన మార్పులు, పనిచేసిన విధానం దేశం ఎప్పటికీ మర్చిపోలేదు. ఆయన పనిచేసినంతకాలం రాజకీయ పార్టీల నాయకుల గుండెల్లో దడ పుట్టించాడు. ఎన్నికల అధికారిగా శేషన్ తీసుకు వచ్చిన విప్లవాత్మక మార్పులు, కచ్చితంగా వ్యవహరించిన తీరుతో భీతిల్లిన రాజకీయవేత్తలు 1993లో అక్టోబర్ 1, నుంచి దాన్ని ముగ్గురు సభ్యులు ఉన్న కమిషన్‌గా మార్పుచేశారు. ఎన్నికల సంఘం సభ్యులను ఎంపిక చేయడానికి ప్రధాన మంత్రితోపాటు ప్రతిపక్ష నాయకుడు, ప్రధాన మంత్రి సూచించిన కేంద్రమంత్రి వర్గంలోని ఒక సభ్యునితో ఒక కమిటీ ఏర్పడాలని భారత రాష్ట్రపతి నిర్దేశించారు. దేశానికి ఒక్కరే ప్రధాని ఒక్కరే రాష్ట్రపతి ఒక్కరే ముఖ్యమంత్రి ఉన్నట్లుగా ఒక్కరే చీఫ్ ఎలక్షన్ కమిషనర్ ఉండాలని ఆ సమయంలో కొంతమంది మేధావులు అభిప్రాయపడ్డారు. ఈ అంశంపై సుప్రీమ్ కోర్టులో కేసుదాఖలైంది. ఎన్నికల సంఘం సభ్యుల ఎంపికపై నిర్దిష్టమైన చట్టం చేసే వరకు ప్రధాన మంత్రితోపాటు ప్రతిపక్ష నాయకుడు, సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తితో కూడిన కమిటీ ఎన్నికల సంఘం సభ్యులను సూచించాలని సుప్రీం కోర్టు ప్రకటించింది. ఎన్నికల సంఘం సభ్యుల నియామకం విషయంలో సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి సభ్యునిగా వుండటం ఇష్టంలేని కేంద్రప్రభుత్వం పార్లమెంటు ఎన్నికల సంఘం సభ్యుల నియామక చట్టానికి సంబంధించిన సెక్షన్ 7ను సవరిస్తూ 2023లో చట్టం చేసింది. ఈ సవరణ చట్టం ప్రకారం సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి ప్రస్తావన లేకుండా ప్రధానమంత్రి, ప్రతిపక్ష నాయకుడితోపాటుప్రధాన మంత్రి సూచించిన కేంద్రమంత్రి వర్గంలోని ఒక సభ్యునితో ఒక కమిటీ ఏర్పడాలని భారత రాష్ట్రపతి నిర్దేశించారు. సవరించిన చట్టం ప్రకారం కేంద్ర ఎన్నికల సంఘం ముగ్గురు సభ్యులను ఎంపికచేసే ముగ్గురు సభ్యుల కమిటీలో ఇరువురు (ప్రధానమంత్రి, ఆయన సూచించే మరో కేంద్రమంత్రి అధికార పార్టీకి చెందినవారే కావడం, ప్రతిపక్ష నాయకుడు ఒక్కరే సభ్యునిగా వుండటం వల్ల ఆయన మాటకు విలువ లేకుండా పోతోంది. ఎలక్షన్ కమిషన్ స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన సంస్థ అయినప్పటికీ ఎన్నికల కమిషన్ నిర్వహణకు, కమిషన్ సభ్యుల వ్యక్తిగత అవసరాలకు అవసరమైన నిధులన్నీ ప్రభుత్వమే మంజూరు చేయాల్సి రావడం వల్ల వారు కఠినంగా వ్యవహరించలేకపోతున్నారు. అందువల్ల ఎన్నికల సంఘానికి, సంఘం సభ్యులకు అవసరమైన నిధులు అధికారంలో వున్న ప్రభుత్వంపై ఆధారపడకుండా బడ్జెట్టులోనే ప్రత్యేకంగా కేటాయించే విధంగా చట్టంలో ఏర్పాటు చేయాలి. అంతేకాకుండా ఎన్నికల కమిషన్ సభ్యులుగా పదవీ విరమణ చేసినఅనంతరం ప్రభుత్వ పరమైన పదవులు ఆశించడంవల్ల కూడా నిస్పాక్షికంగా వ్యవహరించ లేకపోతున్నారు. ఇదేసమయంలో పదవీ విరమణఅనంతరం ఎన్నికల కమిషన్ సభ్యులు ఎటువంటి ప్రభుత్వ పదవులు స్వీకరించడానికి అవకాశం లేకుండా చట్టాన్ని సవరించాలి. అంతేకాకుండా ఎలక్షన్ కమిషన్ సభ్యుల నియామక కమిటీలో ప్రతిపక్ష నాయకునితోపాటు సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిని కూడా చేర్చాల్సిన అవసరం వుంది.




# మహిళా రక్షణ మాటల్లోనేనా?

ఎస్.సీతారామయ్య

అర్ధరాత్రి వేళ మహిళ వీధిలో ఒంటరిగా తిరగ్గలిగినప్పుడే దేశానికి నిజమైన స్వాతంత్ర్యం వచ్చినట్టు అన్న మహాత్మా గాంధీ మాటకు ఇంకెప్పుడు సార్థకత? కొంత కాలంగా విద్యార్థినులపై జరుగుతున్న దారుణాలు ఆందోళన కలిగిస్తున్నాయి. సామాజికంగా, శాంతి భద్రతలపరంగా మన వెనుకబాటుతనాన్ని, పాలకుల నిర్లక్ష్య ధోరణులను ఎత్తి చూపుతున్నాయి. విద్యా నైపుణ్యాలను అందించి, వికాసానికి తోడ్పాడాల్సిన విద్యాలయ ప్రాంగణాలు కూడా అమ్మాయిల పట్ల అభద్రతా వలయాలుగా మారటం విచారకరం, జాతీయ నేర నివారణ విభాగం గణాంకాల ప్రకారం దేశంలో రోజుకు 86 అత్యాచారాలు నమోదవుతున్నాయి. ఇందులో 90 శాతం దారుణాలు తెలిసిన వ్యక్తుల ద్వారానే జరుగుతుండడం గమనార్హం. బాధితుల్లో 10 శాతం మంది 18 ఏళ్లలోపు వారు కాగా, 66శాతం మంది 18-30 ఏళ్ల లోపువారు ఉంటున్నారు. చదువుకున్న చోట, శిక్షణ పొందుతున్న చోట విద్యార్థినులకు రక్షణ లేకపోవటం అత్యంత విచారకరం. ఉపాధ్యాయ విద్యార్థిని పట్ల ఓ అధ్యాపకుడి వేధింపులకు పాల్పడితే కళాశాలకు వెళ్లిన విద్యార్థిని విగత జీవిగా తుప్పల్లో పడి ఉంటే మహిళలకు ఇంకేం భద్రత? తమ మాట వినకుంటే భవిష్యత్తుకు నష్టం కలిగిస్తామన్న బెదిరింపులతో కొంతమంది శిక్షకులు, అధ్యాపకులు,సిబ్బంది వికృత చేష్టలకు పాల్పడడం నిత్యకృత్యంగా మారుతోంది. ఎటుపోతున్నది మన సంప్రదాయం? మన ఆచార వ్యవహారాలతో వచ్చిన సంస్కారం, మన కట్టుబాట్లు ఏమైపోతున్నాయి? మన యువత, అసలు మనమంతా ఎటుపోతున్నాం? ఏది పరిష్కార మార్గం? మన దేశ సంపదగా భావించిన మన జీవన విధానాన్ని గురించి, మన విద్యా వ్యవస్థలతో పాటు మన ప్రభుత్వాల నిర్వాకం గురించి మాట్లాడాల్సిన అవసరం ఆసన్నమయింది. క్షణం ఆలస్యం చేస్తే ప్రతిక్షణం ఇక బాధపడక తప్పదు. స్కూళ్ళల్లో,కాలేజీలల్లో, పని ప్రాంతాల్లో మహిళలపై ఈమధ్య జరుగుతున్న దాష్టీకాలు లెక్కకు మిక్కిలి అవుతున్నాయి. నిజానికి విద్యాలయాలల్లో ఇంతకు మునుపు సేఫ్ అనుకున్న ప్రదేశాలల్లో ఇలాంటి ఘోరాలు జరుగుతుండటంతో సభ్య సమాజం తలదించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈసంవత్సరం జులై 14న, బాలాసోర్ లోని ఫకీర్ మోహన్ అటానమస్ కాలేజీలో బి.ఈడీ చదివే 20 సంవత్సరాల విద్యార్థిని సెల్ఫ్ ఇమ్మొలేషన్‌కు పాల్పడి 80శాతం కాలిన గాయాలతో మరణించింది. ఆమెకు జరిగిన అవమానం హృదయ విదారకం. ఆ కాలేజీలో ఒక సీనియర్ ఆధ్యపకుడు తనను లైంగికంగా అనేక సార్లు వేధించటానికి పాల్పడటం, ఆ విషయాన్ని ప్రిన్సిపాల్ దృష్టికి అనేకసార్లు తీసుకోచ్చినా ఫలితం లేకపోవటంతో ప్రిన్సిపాల్ ఆఫీసు ముందే ఆమె బలవన్మరణానికి పాల్పడింది. ఆ తర్వాత వేధింపులకు పాల్పడిన వారిని అరెస్టు చేశారు. చేతులు కాలిన తర్వాత ఆకులు పట్టుకోవటంఅంటే ఇదే! ఆ చర్యే ఆ అమ్మాయి చనిపోకమునుపు, ఫిర్యాదు చేసిన వెంటనే తీసుకున్నట్లయితే ఒక విలువైన ప్రాణం దక్కేది. కోల్‌కతా లా కాలేజీ విద్యార్థినిపై సహ విద్యార్థుల అత్యాచారం, ఐఐఎం విద్యార్థినిపై కళాశాల హాస్టల్లోనే అఘాయిత్యం జరిగాయి. బెంగాల్లో అధికార పార్టీకి చెందిన విద్యార్థి సంఘం నాయకులు ఈ దుర్మార్గం వెనుక ఉన్నారని వార్తలు వచ్చాయి. గతేడాది కోల్‌కతాలోని ఆర్జికర్ హాస్పిటల్లో జూనియర్ డాక్టర్ అత్యాచారానికి, హత్యకు గురి కావడం దేశవ్యాప్త ఆందోళనలకు దారి తీసింది. కడప జిల్లా పొద్దుటూరుకు చెందిన ఇంటర్ విద్యార్థిని కళాశాలకు వెళ్లి, గండికోటలో అనుమానాస్పద స్థితిలో విగతజీవిగా కనిపించింది. ఏం జరిగిందో పోలీసు దర్యాప్తులో తేలాల్సి ఉంది. కొద్ది రోజుల క్రితం ఒక వైద్య కళాశాలలో పారా మెడికల్ విద్యార్థినులు తమను ల్యాబ్ అసిస్టెంటు, మరో ముగ్గురు సిబ్బంది లైంగిక వేధింపులకు గురిచేస్తున్నట్టు ఫిర్యాదు చేశారు. ఏలూరులోని స్పోర్ట్స్ ఆధారిటీ ఆఫ్ ఇండియా కేంద్రంలో క్రీడాకారిణుల పట్ల కోచ్లు లైంగిక వేధింపులకు పాల్పడినట్టు గతనెలలో వచ్చినవార్తలు సంచలనం కలిగించాయి. అధ్యాపకులు విద్యార్థినులను మానసికంగా, శారీరకంగా అవమానిస్తున్న తీరు బాధాకరం. చదువు చెప్పటంఅటుంచి, ఇలాంటి అమానుషాలకు తలపడే పంతుళ్లు ఇంకేం విద్యాబుద్ధులు నేర్పుతారు? అసలు ఎందుకు విద్యా సంస్థలలో ఇలాంటి సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి? ఇలాంటి వాటిపై కొద్దిపాటి సమాచారం తమ దృష్టికి వచ్చినా యాజమాన్యాలూ, అధికారులూ తక్షణ చర్యలు తీసుకోవాలి. ఏ పేరుతో ఆలస్యంచేసినా అది దుర్మార్గుల దుశ్చేష్టలకు ఊతమిచ్చినట్టే అవుతుంది. అలాగే, నేర నిరూపణ చేయటంలోనూ పోలీసు యంత్రాంగం తరచూ విఫలమవుతుంది. సంచలనం కలిగించిన అయేషామీరా, రిపితేశ్వరి ఉదంతాలు రెంటిలోనూ నిందితులకు ఇప్పటికీ శిక్ష పడలేదు. దర్యాప్తులో చోటు చేసుకునే వైఫల్యాలు కూడా నేర ప్రవర్తకులకు పరోక్ష ధైర్యాన్నిస్తాయి. దీనికితోడు సినిమాల్లో, వెబ్‌సిరీస్లో, సోషల్ మీడియాలో అడ్డూ అదుపూలేని విషసంస్కృతి ప్రవహిస్తోంది. దీనిని నియంత్రించడంతో పాటు పనిప్రాంతాల్లో, విద్యా వైద్యకేంద్రాల్లో భద్రతను కట్టుదిట్టం చేయాలి. స్త్రీ పురుష సమానత్వ భావనను ఇంటా బయటా పెంపొందించాలి. అప్పుడే ఆడపిల్లలపై అకృత్యాలకు అడ్డుకట్ట పడుతుంది.

# ట్రంప్ టారిఫ్ తుఫాన్‌తో మత్స్య రైతులు విలవిల

అప్పన్న గొనప

డొనాల్డ్ ట్రంప్ నాయకత్వంలోని అమెరికా ప్రభుత్వం భారత సముద్ర ఆహార ఎగుమతులపై విధించిన 50 శాతం అధిక సుంకం నిర్ణయం, భారత్‌అమెరికా వాణిజ్య సంబంధాల్లో ఇప్పటివరకు సంభవించిన అత్యంత తీవ్రమైన పరిణామంగా నిలిచింది. ఈ చర్యతో భారతదేశం నుంచి అమెరికాకు జరిగే సముద్ర ఆహార ఎగుమతులపై తీవ్రమైన ఆర్థిక భారంపడనుంది. సుమారుగా 60,000 కోట్ల రూపాయల విలువైన భారత సముద్ర ఆహార ఎగుమతుల్లో దాదాపు 40 శాతం అమెరికా మార్కెట్‌కి చెందుతున్నదిగా పరిశ్రమ వర్గాల అంచనా. తాజా సుంకాల ప్రభావంతో రూ. 24,000 కోట్ల మేర నష్టంవాటిల్లే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది. ఈ ప్రభావం కేవలం దిగుమతిదారులకే పరిమితం కాకుండా, భారతదేశంలోని లక్షలాది మంది మత్స్యకారులు, రైతులు, ప్రాసెసింగ్ కార్మికులు, రవాణాదారులు, ష్రింక్ రైతుల జీవనాధారాలపై నేరుగా ప్రతికూల ప్రభావం చూపుతోంది. భారతదేశం ప్రపంచంలో సముద్ర ఆహార ఎగుమతుల ప్రధాన కేంద్రంగా ఉన్నప్పటికీ, అమెరికా తీసుకున్న ఈ నిర్ణయం అంతర్జాతీయ వాణిజ్య సమతుల్యతకు విఘాతం కలిగించేదిగా మారింది. భారత్‌కు పోటీగా ఉన్న ఎక్వెడార్‌కు 10శాతం, ఇండోనేషియాకు 19శాతం, వియత్నాం దేశానికి 20 శాతం మాత్రమే దిగుమతి సుంకాలు ఉండగా, భారతదేశంపై 50శాతం సుంకం విధించడం భారత ఉత్పత్తులను అమెరికన్ మార్కెట్ నుంచి తప్పించి వేసే విధంగా ఉంది. ఇది మన రైతులు తమ ఉత్పత్తులకు సరైన ధరలు పొందలేని పరిస్థితిని కలిగిస్తుంది. పెట్టుబడులకు భద్రత లేకపోవడం వల్ల రైతుల ఉత్సాహం క్షీణిస్తోంది. వ్యవసాయ రంగంపై పెట్టుబడి పెట్టాలన్న సంకల్పాన్ని కూడా ఇది ప్రభావితం చేస్తోంది. ప్రస్తుత తరుణంలో రైతుల్లో తీవ్రమైన సందిగ్ధత నెలకొంది. మార్కెట్‌పై స్పష్టత లేకపోవడం, తక్కువ ధరల భయం, పెట్టుబడి తిరిగి వచ్చే నమ్మకం లేకపోవడం వలన కొందరు రైతులు సాగును పూర్తిగా నిలిపివేశారు. ఇది కేవలం వ్యక్తిగత ఆదాయ నష్టమే కాకుండా, గ్రామీణ ఆర్థిక వ్యవస్థకూ ఆర్థిక సంక్షోభాన్ని తలపెట్టే ప్రమాదం. భారత ప్రభుత్వం ఈచర్యను తీవ్రంగా ఖండించింది. ఇది కేవలం వాణిజ్య చర్య మాత్రమే కాకుండా, దేశ వ్యవసాయ స్వావలంబనకు నేరుగా దెబ్బ తీసే చర్యగా భావించింది. ప్రధాని చేసిన వ్యాఖ్యలు 'రైతుల సంక్షేమం కోసం ఏదైనా త్యాగానికి సిద్ధంగా ఉన్నాను' అన్నవి రైతులకు ధైర్యాన్ని ఇచ్చేలా ఉన్నాయి. వ్యవసాయ రంగం, మత్స్యకారుల హక్కులు, గ్రామీణ జీవన విధానం ఇవన్నింటిపై ప్రభుత్వం అమరంగా నిలవబోతున్నదన్న సంకేతం ఇచ్చింది. అమెరికాతో వాణిజ్య చర్చలు విఫలమైన నేపథ్యంలో, భారత్ తన ప్రాథమిక నిబంధనలను తాము రాజీపడబోమన్న స్పష్టతతో ముందుకు సాగుతోంది. దేశ ప్రయోజనాల పరిరక్షణకు ఇది తప్పనిసరి. ఈ పరిణామాలు భారత్ విదేశీ మార్కెట్లపై అధికంగా ఆధారపడే విధానాన్ని పునఃపరిశీలించే అవకాశాన్ని కల్పిస్తున్నాయి. ప్రభుత్వం ఇప్పటికే కొత్త మార్కెట్లను అన్వేషించే దిశగా అడుగులు వేసింది. యూరోప్, జపాన్, కొరియా, రష్యా వంటి దేశాల్లో భారత సముద్ర ఆహార ఉత్పత్తులకు అవకాశాలు ఉన్నాయని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి. ఆయా దేశాల నిబంధనలకు అనుగుణంగా ప్రాసెసింగ్, క్వాలిటీ, ట్రేసబిలిటీ వంటి అంశాల్లో మెరుగుదల చేయాల్సిన అవసరం ఉంది. దేశీయంగా కూడా వినియోగాన్ని పెంపొందించేందుకు ఆరోగ్య ప్రయోజనాలపై అవగాహన కార్యక్రమాలు ప్రారంభించాలన్న దిశగా ప్రభుత్వ ఆలోచనలు సాగుతున్నాయి. ఈ రంగంలో ముఖ్యంగా చిన్న రైతులు, మహిళా కార్మికులు పెద్ద ఎత్తున ఆధారపడుతున్నారు. ఈ ఆదాయ ప్రవాహం ఆగిపోవడం గ్రామీణ జీవనరీతిని పూర్తిగా సంక్షోభంలోకి నెట్టే ప్రమాదాన్ని కలిగిస్తోంది. పరిశ్రమల్లో సగటున 15 శాతం నిల్వగా ఉన్న ఉత్పత్తులు తక్కువ ధరలకు అమ్మకానికి దారి తీయడం, ప్రాసెసింగ్ యూనిట్ల మూతలు పడే ప్రమాదం, ఈ వ్యవస్థలో పనిచేస్తున్నవేలాది మందికి ఉద్యోగ నష్టం కలిగే ప్రమాదం కూడా గమనించదగినది. ప్రస్తుతం ఈ సమస్యకు తక్షణ పరిష్కారం అవసరం. ప్రభుత్వం ఇప్పటికే కొన్ని చర్యలు చేపట్టినప్పటికీ, రుణ మాఫీలు, ఉత్పత్తి సబ్సిడీలు, స్థిరమైన మార్కెట్ లింకేజీలు, ఎగుమతులకు ప్రమాణపత్రాలు, సాంకేతిక మద్దతు వంటి అంశాల్లో మరింత ప్రభావవంతమైన చర్యలు అవసరం. రాష్ట్ర ప్రభుత్వాలు కూడా సమన్వయంతో వ్యవహరించి రైతులకు ప్రత్యక్ష సహాయాన్ని అందించాల్సిన బాధ్యతను మరిచిపోవద్దు. ఈ సంక్షోభం మానవీయ ప్రభావంతో పాటు వ్యవసాయ విధానాలలో ఉన్న లోపాలను బయటపెడుతోంది. పరిమిత మార్కెట్లపై ఆధారపడటం ఎంత ప్రమాదకరమో ఇది బలంగా చాటింది. వ్యవసాయ రంగాన్ని విస్తృతంగా అభివృద్ధి చేయాలంటే మార్కెట్ విస్తరణ, నిల్వ సదుపాయాల పెంపు, విలువ ఆధారిత ప్రాసెసింగ్ కేంద్రాల ఏర్పాటు వంటి వ్యూహాలు వెంటనే అమలు చేయాల్సిన అవసరం ఉంది. ఇప్పుడు జరుగుతున్న పరిణామాలు తాత్కాలికంగా కనిపించినా, దీర్ఘకాలికంగా పరిశ్రమపై తీవ్ర ప్రభావాన్ని చూపవచ్చు. మత్స్య పరిశ్రమ దేశ ఆర్థిక వ్యవస్థలో కీలకమైన భాగంగా ఉంది. ఈ రంగానికి తగిన ప్రోత్సాహం లభించకపోతే గ్రామీణ ఆదాయ భద్రత ప్రమాదంలో పడుతుంది. ప్రభుత్వం, పరిశ్రమలు, రైతులు అందరూ కలిసికట్టుగా ముందుకు సాగినప్పుడే ఈ సంక్షోభానికి స్థిర పరిష్కారం దొరుకుతుంది. ఈ సమస్యను అవకాశంగా మలచుకోవడం మన చేతుల్లోనే ఉంది. ధైర్యవంతమైన నిర్ణయాలు, వ్యూహాత్మక ఆలోచనలు, సమర్థవంతమైన కార్యాచరణ ద్వారా రైతుల జీవనోపాధిని కాపాడుకోవడమే కాకుండా, దేశ ఆర్థిక భద్రతను నిలబెట్టుకోవచ్చు. ఇప్పుడు తీసుకునే చర్యలు, రైతుల పట్ల మన గౌరవాన్ని సూచించేవే కావాలి. మన భవిష్యత్తు వ్యవసాయ రంగాన్ని పునర్నిర్మించేందుకు ఇదే సరైన సమయం.



అమరావతి వార్త

## వి.ఆర్.సిద్ధార్థకు ఏపి బెస్ట్ కాలేజ్ ప్రిన్సిపల్ అవార్డు



పెనమలూరు ఆగస్టు17,ప్రభాతవార్త : సిద్ధార్థ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ డీమ్డ్ విశ్వవిద్యాలయం ప్రో వైస్ ఛాన్సలర్ డా.ఏ.వి.రత్నప్రసాద్ ను ప్రతిష్టాత్మక ఐఎస్టిఈ ఆంధ్రప్రదేశ్ స్టేట్ అవార్డు బెస్ట్ ఇంజనీరింగ్ కాలేజ్ ప్రిన్సిపల్ 2024 అవార్డు వరించింది.ఆదివారం ఈ అవార్డును మదనపల్లె ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ నిర్వహించిన వేడుకలో న్యూఢిల్లీ అధ్యక్షులు,జెఎన్టియు అనంతపురం వైస్ ఛాన్సలర్,ఐఎస్టిఈ ఎగ్జిక్యూటివ్ కమిటీసభ్యులు ప్రధానం చేసారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అకడమీషియన్ పరిశోధకులుగా మూడు దశాబ్దాలకు పైగా సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ గా,విజన్ లీడర్‌షిప్,అకడమిక్స్,రీసెర్చ్,ప్లేస్‌మెంట్స్ వంటి అనేక రంగాల్లో విజయాలను సాధించి జాతీయస్థాయిలో అగ్రగామి ఇంజనీరింగ్ కళాశాల గుర్తింపు పొందిందని తెలిపారు. సిద్ధార్థ అకాడమీ మేనేజ్మెంటు, వైస్‌ఛాన్సలర్ పి.వెంకటేశ్వరరావు అధ్యాపకవర్గం, పూర్వవిద్యార్థులు పుష్పక అక్షరమాలలతో అభినందించారు.



# వరద ముంపు ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలు పునరావాస కేంద్రాలకు తరలి రావాలి : కమీషనర్ ధ్యానచంద్ర

**నగరపాలక సంస్థ సిబ్బందికి సహకరించమని విజ్ఞప్తి**

**వినకపోతే పోలీసు,రెవెన్యూ శాఖ సహకారంతో పునరావాస కేంద్రాలకు తరలించాలని ఆదేశాలు**



విజయవాడ కార్పొరేషన్,ఆగస్టు 17,ప్రభాతవార్త: కొండ ప్రాంతాల్లో,వరద ముంపు ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలు పునరావాస కేంద్రాలకు తరలి రావాలని,మున్సిపల్ సిబ్బందికి సహకరించాలని మున్సిపల్ కమీషనర్ ధ్యానచంద్ర అన్నారు. ఆదివారం సాయంత్రం శాఖాధిపతులు,స్పెషల్ ఆఫీసర్లతో ఆయన టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదానికి గురయ్యే అవకాశమున్న ఇల్లులు ఎన్ని,అందులో నివసిస్తున్న ప్రజలు ఎంతమంది ఉన్నారు అని అసిస్టెంట్ సిటీ ప్లానర్లను అడగ్గా సర్కిల్-1 అసిస్టెంట్ సిటీ ప్లానర్ చంద్రబోస్ కొండ ప్రాంతాల్లో ప్రమాదానికి గురయ్యే ఇళ్ళు 10 ఉన్నాయని,సర్కిల్-3 అసిస్టెంట్ సిటీ ప్లానర్ మోహన్ బాబు 15 ఉన్నాయని,15లో అత్యంత ప్రమాదానికి గురి అయ్యే ఇల్లు రెండు ఉన్నాయని,వారికి ఎంత అవగాహన కల్పించినా వారు ఇప్పుడు కాదు తర్వాత వెళ్తామని దాటేస్తున్నారని తెలిపారు. దాంతో కొండ ప్రాంతాల్లో ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉన్న ఇళ్ళను పూర్తి స్థాయిలో పరిశీలించి సంపూర్ణ నివేదికను తమకు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. వరద హెచ్చరికలు ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ జారీ చేసిన దగ్గర నుంచి విజయవాడ నగరపాలక సంస్థ అధికారులు వరద ముంపు కొండ ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలకు హెచ్చరికలు జారీ చేసి,సురక్షిత ప్రదేశాలకు తరలిరావాలని అవగాహన కల్పిస్తున్నప్పటికీ వారు వినని పక్షంలో పోలీసు,రెవిన్యూ శాఖ సహకారంతో వారిని పునరావాస కేంద్రాలకు తరలించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి ముంపు ప్రాంతానికి దగ్గరలో అన్ని వసతులు కల్పించిన ఒక పునరావాస కేంద్రం ఉండేటట్టు ఖచ్చితంగా చూసుకోవాలని,ఎస్టేట్ ఆఫీసర్ ఏ.శ్రీధర్‌ను ఆదేశించారు. ప్రతి పునరావాస కేంద్రంలో ప్రజలకు భోజన సదుపాయాలను ముందుగానే ఏరాపటు చేసుకోవాలని ఆదేశించారు. స్పెషల్ ఆఫీసరుల తమ తమ వార్డుల్లో గల వర్షపు ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలను ప్రత్యేక శ్రద్ధ తీసుకొని వారికి ఖచ్చితంగా అవగాహన కల్పించి హెచ్చరికలు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు.

## కమీషనర్ ఆదేశాల మేరకు బుడమేరులో వ్యర్థాల తొలగింపు

విజయవాడ కార్పొరేషన్,ఆగస్టు 17,ప్రభాతవార్త: మున్సిపల్ కమీషనర్ ఆదేశాల మేరకు బుడమేరులో కాలువ ప్రవాహానికి అడ్డంగా ఉన్న వ్యర్థాలను ఇంజనీరింగ్ సిబ్బంది తొలగించారు. ఎప్పటికప్పుడు డీ సిల్టింగ్ చేస్తున్నప్పటికీ,బుడమేరు ప్రవాహంలో అంతరాయాన్ని గమనించిన ఇంజనీరింగ్ సిబ్బంది బుడమేరు కాలువ మొత్తం డ్రోన్ ద్వారా పరిశీలించారు. ఈ పరిశీలనలో రామవరప్పాడు పంచాయితీ పరిధి లోని ఎస్ఎల్వి గ్రాండ్ వద్ద గుర్రపు డెక్క వ్యర్థాలు పేరుకుపోవడం గమనించి, బుడమేరు ప్రవాహంలో ఎటువంటటి అంతరాయం రాకూడదనే ఉద్దేశ్యంతో లాంగ్ ఆర్మ్ స్ట్రోక్ లైనర్,జెసిబిలతో పేరుకుపోయిన వ్యర్థాలను గుర్రపుడెక్కలను తొలగించారు.



బుడమేరు,బందరు, ఏలూరు,రైవస్ కాల్వలు నగర పరిధిలో ఉన్నప్పటికీ వాటి చిట్టచివరి స్థానం ఎక్కడున్నా అవి నగర పరిధి కాకపోయినా వాటి ద్వారా నగర పరిధిలోని కాల్వలో ఇబ్బంది కలుగుతుందన్న ఉద్దేశ్యంతో కాలువలు చిట్టచివరి వరకు ఎటువంటి అంతరాయం లేకుండా చూసుకోవాలని అధికారులను ఎప్పటికప్పుడు ఆదేశిస్తూ కమీషనర్ ధ్యానచంద్ర పర్యవేక్షిస్తున్నారు. అందులో భాగంగా ఆయన ఆదేశాలను అనుసరిస్తూ విజయవాడ నగర పరిధిలోని బుడమేరు ప్రవాహంలో ఎటువంటి అంతరాయి లేకపోయినప్పటికీ,నగర పరిధి కాని ప్రాంతాల్లో అంతరాయం ఉన్నందున,విజయవాడలో బుడమేరు నీరు నిల్చిపోయే అవకాశం ఉన్నందున నగర పరిధి కాని ప్రాంతాల్లో వ్యర్థాలను తొలగించే చర్యలు తీసుకుంటున్న చీఫ్ ఇంజనీర్ ఆర్.శ్రీనాథ్ రెడ్డి,పర్యవేక్షణ ఇంజనీరు సత్యన్నారాయణ,సత్యకుమారి,ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాసరెడ్డి,డిప్యూటీ ఇంజనీర్స్ సింథూరలను ఈ సందర్భంగా కమీషనర్ ధ్యానచంద్ర అభినందించారు. అధికారులు నిత్యం అప్రమత్తంగా ఉంటూ కృష్ణానది పరివాహక ప్రాంతాల్లో ఎటువంటి ఇబ్బందులు కల్గకుండా చేసుకోవాలని ఎటువంటి సందేహాలున్న వెంటనే తనను సంప్రదించాలని ఆయన కోరారు.

## ఫ్లడ్ రెస్పాన్స్ టీం అప్రమత్తంగా ఉండాలి

విజయవాడ కార్పొరేషన్,ఆగస్టు 17,ప్రభాతవార్త: ఫ్లడ్ రెస్పాన్స్ టీం అప్రత్తంగా ఉండాలని మున్సిపల్ కమీషనర్ ధ్యానచంద్ర పేర్కొన్నారు. ఆదివారం రాత్రి రామలింగేశ్వరనగర్ సాయిరాం కట్ పీసెస్ వీధి చివర ఉన్న రిటైనింగ్ వాల్ వద్ద ఫ్లడ్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా ఏర్పాటు చేసిన ఏర్పాట్లను ఆయన పరిశీలించారు.



రానున్న రెండు మూడు రోజుల్లో భారీ నుండి అతి భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నందున కార్పొరేషన్ పరిధిలో ఉన్న వరద ముంపు ప్రాంతాల్లో ముందస్తు జాగ్రత్త చర్యలుగా ఫ్లడ్ రెస్పాన్స్ టీంలను అక్కడ మూడు షిఫ్ట్‌లలో అందుబాటులో ఉంచాలని, మిషనరీ అంతా దానికి తగ్గట్టుగా అందుబాటులో ఉంచాలని,అధికారులు ఎప్పటిప్పుడు పర్యవేక్షిస్తూ ఎటువంటి ఇబ్బంది తలెత్తనివ్వకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో చీఫ్ ఇంజనీర్ ఆర్.శ్రీనాథ్‌రెడ్డి,సిటీ ప్లానర్ కె.సంజయ్ రత్నకుమార్,చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె.అర్జునరావు,ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సామ్రాజ్యం తదితరులు పాల్గొన్నారు.

## పాలకొల్లులో మంత్రి నిమ్మల రామానాయుడు కుమార్తె నిశ్చితార్థ వేడుకకు హాజరైన మంత్రి లోకేష్

గుంటూరు-ప్రభాతవార్త ప్రతినిధి, ఆగస్టు 17: రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు కుమార్తె నిశ్చితార్థ వేడుకకు విద్య,ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ హాజరయ్యారు. పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లులోని ఎస్ కన్వెన్షన్ లో జరిగిన ఈ వేడుకలో పాల్గొని కాబోయే దంపతులు శ్రీజ, పవన్ లను ఆశీర్వదించారు. వారికి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.



అంతకుముందు నిశ్చితార్థ కార్యక్రమంలో పాల్గొనేందుకు పాలకొల్లు చేరుకున్న మంత్రి నారా లోకేష్, రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ కు మంత్రి నిమ్మల రామానాయుడు ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు, నాయకులు గజమాలతో ఘనస్వాగతం పలికారు. మంత్రి నారా లోకేష్ ను జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, మంత్రి అనగాని సత్యప్రసాద్, తణుకు ఎమ్మెల్యే అరిమిల్లి రాధాకృష్ణ, నర్సాపురం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్, నర్సాపురం నియోజకవర్గ టీడీపీ ఇంఛార్జ్ పొత్తూరి రామాంజనేయ రాజు, భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత మెగా వైద్యశిబిరానికి విశేష స్పందన

జగ్గయ్యపేట, ఆగస్టు 17, ప్రభాతవార్త :అందరికి ఆరోగ్యం కావాలి అదే అసలైన అభివృద్ధి అనే సంకల్పంతో జయప్రద ఫౌండేషన్ చైర్మన్ తొండెపు దశరథజనార్ధన్ చేపట్టిన ఉచిత మెగా వైద్యశిబిరాలకు విశేష స్పందన లభిస్తోంది. ఆదివారం స్థానిక జెడ్పి బాలుర హైస్కూలులో ఏర్పాటుచేసిన వైద్యశిబిరంలో గత రెండు రోజులుగా 653 మందికి వైద్య పరీక్షలు, వైద్య సేవలు నిర్వహించారు. ఈనెల 5వ తేదీన రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ జయప్రద ఫౌండేషన్ ఉచిత మెగా వైద్యశిబిరాన్ని జగ్గయ్యపేట పట్టణంలో ప్రారంభించిన విషయం తెలిసిందే. అప్పటి నుండి ప్రతి వార్డు పరిధిలో కూడా పేదలకు వైద్యసేవలు అందించేందుకు శిబిరాలను నిర్వాహకులు కొనసాగిస్తున్నారు.




ఆదివారం నిర్వహించిన శిబిరంలో 383 మందికి కంటి పరీక్షలు చేశారు. వీరిలో 277 మందికి కళ్ళజోడ్లు అవసరం ఉన్నట్లు గుర్తించారు. త్వరలో వీరందరికి ఉచితంగా కళ్ళజోళ్ళు ఏర్పాటు చేయనున్నారు. 232 మందికి జనరల్ వైద్యానికి సంబంధించి పరీక్షులు నిర్వహించి అవసరమైన మందులు అందజేశారు. 35 మందికి శంకర్ నేత్రాలయం (విజయవాడ)లో శస్త్రచికిత్సలు చేసేందుకు గుర్తించారు. 31 మందికి ఎక్స్ రేలు, 41 మందికి ఇసిజి, 653 మందికి రక్త, షుగర్ పరీక్షలు చేసి వారికి అవసరమైన మందులు అందించారు. కార్యక్రమంలో శిబిర కోఆర్డినేటర్ కట్టా వెంకటనరసింహారావు, మైనేని రాధాకృష్ణ, ముల్లంగి రామకృష్ణారెడ్డి, హైస్కూలు హెచ్ఎం పారేపల్లి నాగేశ్వరరావు, ఫౌండేషన్ వాలంటీర్లు, ఆశ వర్కర్లు, ఆర్పీలు, వాగ్దేవి కాలేజీ నర్సింగ్ విద్యార్థినులు పాల్గొన్నారు. ఈనెల 18వ తేదీ ఉదయం గం.9ల నుండి స్థానిక ఆర్టీసి కాలనీ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ వద్ద వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ ప్రతినిధులు వెల్లడించారు.

## ముత్యాలమ్మకు వైభవంగా పూలంగి సేవ

జగ్గయ్యపేట, ఆగస్టు 17, ప్రభాతవార్త :శ్రావణమాసం ఆఖరి ఆదివారం సందర్భంగా జగ్గయ్యపేట పట్టణంలోని ప్రాచీన ముత్యాలమ్మవారి ఆలయంలో అమ్మవారికి పుష్పాలంకరణ సేవ నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు.



దేవస్థాన అభివృద్ధి, శ్రావణమాస ఉత్సవ కమిటి అధ్యక్షులు అప్పన మణికుమార్, కార్యదర్శి కొత్తా రమేష్‌కుమార్, జాయింట్ సెక్రటరీ కొంకిమళ్ళ సురేష్, కోశాదికార అప్పన వెంకట పిచ్చయ్య, కమిటి సభ్యులు వెంకటశ్రీరంగం, దేవరశెట్టి నాగప్రసాదు, తునికిపాటి నాగమల్లేశ్వరచారి, ఆరేపల్లి వెంకటేశ్వర్లు అమ్మవారి వేడుకలను పర్యవేక్షిస్తూ భక్తులకు సహాయ సహకారాలు అందించారు. కాగా ఈనెల 19వ తేదీన శ్రావణమాస 4వ మంగళవారం శ్రీచండీ మూల మంత్ర హోమం ఉదయం గం.10 జరుగుతుందని ఆసక్తికలిగిన వారు సంప్రదించాలని సూచించారు.

## గ్రామ పంచాయతీ నిధులు విడుదల చేయాలి.. సర్పంచ్‌ల ఫోరం తేళ్లూరి సురేష్ డిమాండ్

ఎ కొండూరు, ఆగస్టు 17, ప్రభాతవార్త :ఎన్టిఆర్ జిల్లా తిరువూరు నియోజకవర్గం వెనుకబడ్డ మెట్ట ఎస్సీ నియోజకవర్గంలోని వివిధ మండలాల్లో గ్రామ పంచాయతీలకు స్వర్ణ పంచాయతీలు కింద పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని, సెక్రటరీలను ఆదేశిస్తున్నారు. కాని గత ప్రభుత్వంలో గాని, ఈ కూటమి ప్రభుత్వంలో గాని నిదులు మంజూరు లేక గ్రామాల్లో మాకున్న కొద్దిపాటి సాగు భూములను మరియు భార్యల మెడలో తాళిబొట్లు తనఖా పెట్టి అప్పుల్లో కూరుకుపోయివున్నామని తిరువూరు నియోజకవర్గ సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు మండలంలోని కోడూరు సర్పంచ్ తేళ్లూరి సురేష్ ఆదివారం మీడియాకు తెలిపి వాపోయారు. గత ప్రభుత్వంలో ఈ ప్రభుత్వంలో నిధులు రాక సర్పంచ్‌లు గౌరవ వేతనాలు రాక ఎంపిటిసి మెంబర్లు సమావేశాలకు తప్ప ఉత్సవ విగ్రహాల్లా గ్రామాల్లో నిలిచారని వీరు ఆందోలన వ్యక్తం చేశారు. ప్రస్తుతం వర్షాకాలం సీజన్‌లో వర్షాల వల్ల పారిశుధ్యం దోమలబెడద ఎక్కువగా ఉండటంతో నిధుల లేమితో పంచాయతీలు కునారిల్లుతున్నాయని స్థానిక ఎంపిహెచ్‌సి నుండి కనీసం ఈ నాలుగేళ్లలో పారిశుధ్య పనులకు ఏ మందులు ఇవ్వలేదని ఆరోపించారు. ఇకనైనా ఈ గ్రామ పంచాయతీ సర్పంచ్‌ల ఈతిబాధలను అర్థం చేసుకుని సెక్రటరీలపై ఒత్తిడి తెచ్చి పనులు చేయించి తమకు ఆర్థిక ఇబ్బందులకు గురి చేయవద్దని ఇప్పటికైనా గ్రామ పంచాయతీలకు వెంటనే నిధులు విడుదల చేసి గ్రామాల అభివృద్ధి పారిశుధ్యం దోమల నివారణకు చర్యలు తీసుకుని ప్రజారోగ్యాన్ని కాపాడి ప్రజలను ఆదుకోవాలని సురేష్ కూటమి ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## ఓఆర్ఎస్ఎల్ నుండి జీరో ఎలక్ట్రోలైట్

విజయవాడ, ఆగస్టు 17, ప్రభాతవార్త :భారత దేశంలో నంబర్ 1 ఎలక్ట్రోలైట్ డ్రింక్ అయిన ఓఆర్ఎస్ఎల్ జీరోను విడుదల చేయడం ద్వారా దాని ఎలక్ట్రోలైట్ మరియు హైడ్రేషన్ ఫోర్ట్‌ఫోలియోను విస్తరించింది. చక్కెర జోడించని ఈ ఎలక్ట్రోలైట్ పానీయం అసలైన మామిడి గుజ్జుతో తయారు చేయబడి సమగ్రమైన సైన్స్ ఆధారిత హైడ్రేషన్ 30 నిబద్ధతను బలోపేతం చేస్తుంది.

## రేపూడి తండాలో డెంగ్యూ కేసులు లేవు: వైరల్ జ్వరాలు మాత్రమే.. జిల్లా మలేరియా అధికారి డా॥మోతిబాబు

ఎ కొండూరు, ఆగస్టు 17, ప్రభాతవార్త :ఎన్టిఆర్ జిల్లా మలేరియా అధికారి డాక్టర్ మోతిబాబు ఎ కొండూరు మండలం రేపూడి తండా గ్రామంలో మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (ఎంపిహెచ్‌సి) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద శిబిరాన్ని ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా డాక్టర్ మోతిబాబు, ఇన్‌చార్జ్ వైద్యాధికారి డాక్టర్ కె.శ్రీనివాసరావుతో కలిసి మీడియాతో మాట్లాడుతూ డిఎం అండ్ హెచ్‌వో డాక్టర్ ఎం సుహాసిని ఆదేశాల మేరకు గత 15 రోజుల నుండి స్థానిక ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి జ్వరపీడితులను పరీక్షించి దగ్గు జలుబు ఉన్నవారు మొత్తం 12మంది మాత్రమే చికిత్స చేయించుకున్నట్లు తెలిపారు. ఈ సీజనల్ వైరల్ జ్వరాలు మాత్రమేనని మండలంలో డెంగ్యూ జ్వరాల కేసులు ఎక్కడ నమోదు కాలేదని వైద్యాధికారులు తెలిపారు. రేపూడి తండా గ్రామంలో పారిశుధ్య చర్యలు ఇంటింటి ఫీవర్ సర్వే లార్వా దోమల సర్వే నిర్వహిస్తున్నట్లు వీరు తెలిపారు.




మండల పిహెచ్‌సిలో సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉంటారని మండల ప్రాంత ప్రజలు జ్వరపీడితులు ఈ కేంద్రం ద్వారా వైద్య సేవలు వినియోగించుకోవాలని డాక్టర్ మోతిబాబు, డాక్టర్ కె శ్రీనివాసరావు కోరారు. కంబంపాడులోని ఒక ప్రముఖ వైద్యుడి వద్దకు నమ్మకంతో మండల ప్రాంత రోగులు వైద్యం చేయించుకుంటారని ప్లేట్‌లెట్స్ పరీక్షలు నిర్వహించి రక్తకణాలు తగ్గినవారికి చికిత్స చేస్తున్నారని తెలిపారు. ఇంకా ఈ కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి బాబు వలీ, హెచ్‌వి పద్మావతి, ఎఎన్ఎం ప్రమీలారాణి, ఎంఎల్‌హెచ్‌సి కళ్యాణి సచివాలయాల సిబ్బంది, ఎఎన్ఎంలు ఆశావర్కర్లు పాల్గొన్నారు.

## యోగా జీవితంలో భాగంకావాలి: ఎమ్మెల్యే నజీర్

గుంటూరు తూర్పు, ఆగస్టు 17 (ప్రభాతవార్త) : యోగాను జీవితంలో భాగం చేసుకోవాలని, ప్రతి రోజు కొంత సమయాన్ని యోగాకు కేటాయించాలని తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనార్టీ కమిటీ ఛైర్మన్ మొహమ్మద్ నసీర్ సూచించారు. ఆదివారం స్థానిక అరండల్‌పేటలోని కెనడీ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ గుంటూరు జిల్లా ఆధ్వర్యంలో నిర్వహించిన యోగా చాంపియన్ షిప్ 2025విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ భారతదేశం అభివృద్ధి చెందుతున్న దేశంగా ప్రస్తుతం ఉందని, కానీ అభివృద్ధి చెందిన దేశంగా మారాలంటే ప్రతి ఒక్కరూ ఆరోగ్యవంతంగా జీవించాలని పేర్కొన్నారు.




నియోజకవర్గంలో యోగా కేంద్రాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. అందరికీ ఐశ్వర్యంకంటే ఆరోగ్యం ప్రధానమని చెప్పారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలంటే యోగాను అనుసరించాలని సూచించారు. యోగా గురువులు కొంత సమయాన్ని పేద వర్గాలు నివశించ ప్రాంతాల్లో యోగా కేంద్రాల నిర్వహణకు కేటాయించాలని కోరారు. తద్వారా ప్రతి ఒక్కరికీ ఆరోగ్యాన్ని, మానసిక ఆనందాన్ని అందించిన వారవుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కెనడీ స్కూల్ డైరెక్టర్ కె.శ్రీకాంత్, యోగసన స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు అంకమ్మరావు, యోగా టీచర్ వెంకట్, టీడీపీ నేత చిట్టాబత్తుని చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

## నగదు పోగొట్టుకున్న గుర్తుతెలియని వ్యక్తి

గుంటూరు తూర్పు, ఆగస్టు 17 (ప్రభాతవార్త) : లాలాపేట పోలీస్ స్టేషన్ సిఐ ఎ.వి.శివప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం గుంటూరు టౌన్‌లాలాపేట పోలీస్ స్టేషన్ పరిధిలో గల నల్లచెరువు 9వ లైనుశ్రీనివాస్ రైస్ మార్ట్ దగ్గర కొంత డబ్బులను గుర్తు తెలియని వ్యక్తి రోడ్‌పై పోగొట్టుకున్నట్లు, షాప్ ఓవర్ రాజనాల శ్రీనివాసరావు మరియు సయ్యద్ ఆదాంషా సంపత్ నగర్ వాస్తవ్యులు లాలపేట పోలీస్ స్టేషన్‌కు తీసుకొని వచ్చి డబ్బులను ఎస్సై బాలనాయక్ అప్పగించటమైనది. సదరు డబ్బుకు సంబంధించిన వారు లాలాపేట పోలీస్ వారిని సంప్రదించాలన్నారు.

## మరాఠా రాష్ట్రస్థాయి కమిటీ సమావేశం

గుంటూరు విద్య,ఆగష్టు 17,ప్రభాతవార్త : స్థానిక అరండల్‌పేటలోని మరాఠా రాష్ట్ర సంఘం ఆంధ్రప్రదేశ్ రిజిస్టర్డ్ కమిటి రాష్ట్రస్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు.మరాఠా రాష్ట్ర సంఘం ఆంధ్రప్రదేశ్ అధికారిక చిహ్నం (లోగో) సంఘం గౌరవాధ్యక్షులు గంగాధర్ రావు తెన్నేతి ఆవిష్కరించగా మరాఠాల వివాహ సంబంధాల విషయంలో ఎదుర్కొంటున్న తీవ్ర సమస్యను సంఘం గమనించి శాశ్వత పరిష్కారంగా మరాఠా కళ్యాణం డాట్‌కమ్ అనె వెబ్‌సైట్‌ను సంఘ కార్యనిర్వాహక అధ్యక్షులు సిందే రవిచంద్రరావు ఉపాధ్యక్షులు కదం శ్రీనివాసరావు ఆవిష్కరించారు. అన్ని భాషల్లో రూపొందించిన ఈ వెబ్‌సైట్ సేవలు దేశంలోని మరాఠాలు అందరూ ఉచితంగా పొందవచ్చని మరాఠా రాష్ట్ర సంఘం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు మరాఠా వెంకట్ సోమాజీ తెలిపారు.అంతేకాక ఇదే సమావేశంలో 6అక్టోబర్ 2025తేదిన ఉభయ తెలుగు రాష్ట్రాల్లో మరాఠాల,శ్రీఛత్రపతి శివాజీ మహారాజ్ రాకకు ప్రధానమైన శ్రీచత్రపతి శివాజీ మహారాజ్ దక్షిణ దిగ్విజయ్ దివస్ కార్యక్రమం కార్యాచరణ మరియు నిర్వహణ బాధ్యతలు,కమిటీ సభ్యులకు నియామక పత్రాలు,ప్రమాణ స్వీకారం నిర్వహించడం జరిగింది.కార్యక్రమంలో గౌరవ సలహాదారులు వెంకటేశ్వరరావు దుమ్నే,ఉపాధ్యక్షులు రామ్మోహన్‌రావు మోతే,మరాఠా ప్రజలు పాల్గొన్నారు.




## కాలేజీ ఫీజు వితరణ

గుంటూరు కల్చరల్,ఆగష్టు 17,ప్రభాతవార్త : మానవతా కార్యాలయంలో ఇంటర్ బైపిసీ మొదటి సంవత్సరం చదువుతున్న ప్రతిభగల విద్యార్థిని ఎనుముల వెంకట మురళీ ప్రియకు శ్రీలలితా పరమేశ్వరీ స్పిన్నింగ్ మిల్స్ ప్రొప్రైటర్స్ టి.మల్లేశ్వరరావు,సూర్యప్రకాష్ కాలేజి ఫీజు వితరణ చేశారు.



## రజకుల రాజకీయ,ఆర్థిక అభ్యున్నతికి కృషిచేసిన టిడిపి : ఎమ్మెల్యే గళ్ళా మాధవి

గుంటూరు క్రైమ్,ఆగష్టు 17,ప్రభాతవార్త : రజకుల రాజకీయ,ఆర్థిక అభ్యున్నతికి కృషిచేసింది తెలుగుదేశం పార్టీయే నని పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు.నియోజకవర్గంలోని పార్టీ కార్యాలయంలో పలు ప్రాంతాల రజక ముఖ్య నాయకుల ఆత్మీయ సమావేశానికి ఎమ్మెల్యే గళ్ళా మాధవి ముఖ్యఅతిధిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రజకులు ఎప్పటినుంచో తమ పని తాము చేసుకుంటూ,వారికి వచ్చే రూ.10లతో జీవనం సాగించేవారు.అయితే రజకుల రాజకీయ,ఆర్థిక అభ్యున్నతికి చిత్తశుద్ధితో కృషిచేసిన పార్టీ తెలుగుదేశమే.టిడిపి హాయాంలో రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని కేంద్రానికి ప్రతిపాదనలు పంపడం,అధ్యాయన కమిటీ ఏరాటు చేయడం జరిగిందన్నారు.



రజకుల సంక్షేమం కోసం కోట్లాది రూపాయలు కేటాయించి,ధోభీఘాట్‌ల నిర్మాణం చేపట్టి,ఉచిత విద్యుత్,ఆదరణ పథకం ద్వారా పనిముట్లు అందించడం లాంటి అనేక నిర్ణయాలు తీసుకుందన్నారు.రజకుల్లో యువ నాయకత్వాన్ని ప్రోత్సహించే దిశగా టిడిపి మరింత బలంగా ముందుకు వెళ్తుందని అందులో భాగంగానే తనను ఎమ్మెల్యే చేసిందని,తన పరిధిలో రజకులకు మెరుగైన రాజకీయ అవకాశాలు కల్పిస్తానని,రజకులకు జరుగుతున్న ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం అని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా రజక నాయకులు మాట్లాడుతూ రజకుల సంక్షేమం కోసం ఎల్లప్పుడూ కృషిచేస్తున్న ఎమ్మెల్యే మాధవి ని మేము మా ప్రతినిధిగా చూస్తున్నాం.భవిష్యత్తులో రజకులకు మరింత రాజకీయ అవకాశాలు కల్పించే నాయకత్వం గళ్ళా మాధవిదే అని విశ్వాసం వ్యక్తం చేశారు.కార్యక్రమానికి గుంటూరు,పరిసర ప్రాంతాల రజక నాయకులు,సోదరులు పెద్దఎత్తున హాజరయ్యారు.

## వీనుల విందుగా పద్మావతి సారనాధన్ శాస్త్రీయ సంగీత కచేరి




గుంటూరు కల్చరల్,ఆగష్టు 17,ప్రభాతవార్త : స్థానిక లక్ష్మీపురంలోని శ్రీత్యాగరాజ సాంస్కృతిక సంఘం కార్యదర్శి వల్లూరి కృష్ణకిషోర్ ఆధ్వర్యంలో శ్రీత్యాగరాజ కళావేదికపై నెలవారీ కార్యక్రమంలో భాగంగా కలకత్తా పద్మావతి సారనాధన్ శాస్త్రీయ సంగీత కచేరి వీనుల విందుగా జరిగింది.వీరికి వయోలిన్ పై గాయత్రి శివాని,మృదంగంపై ఆర్.అనంతకృష్ణన్,చక్కటి వాయిద్య సహకారాన్ని అందించారు.ఉపాధ్యక్షులు ఎస్.గిరిజాశంకర్ కళాకారులను సత్కరించారు.

## విజేతలైన విద్యార్థులకు బహుమతి ప్రదానం

గుంటూరు కల్చరల్,ఆగష్టు 17,ప్రభాతవార్త : స్థానిక బృందావన్ గార్డెన్స్‌లోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణంలోని శ్రీపద్మావతి కళ్యాణ వేదికపై సంస్కార భారతి ఇండ్ల శ్రీధర్‌బాబు బృందం ఆధ్వర్యంలో కార్యక్రమాలను ఆలయ పాలకమండలి ఉపాధ్యక్షులు లంక విజయబాబు,అతిధులు సామాజిక కార్యకర్త కామేపల్లి వెంకటేశ్వర్లు, హోమియో వైద్యులు ఎం.శ్రీనివాసరెడ్డి, న్యాయవాదులు నారదాసు వీరమణి,తోట శ్రీనివాస్,ప్రొఫెసర్ ఏ.రాధాకృష్ణమూర్తి, పొత్తూరు సుబ్బారావు పాల్గొని జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు.



శ్రీకృష్ణ జన్మాష్టమి కి నిర్వహించిన అనేక పరీక్షల్లో రాష్ట్రంలోని అనేక ప్రాంతాల నుండి పాల్గొని విజేతలైన విద్యార్థిని విద్యార్థులకు బహుమతి ప్రధానం చేశారు.తొలుత చిన్నారులు జగడపు చనువుల,వెంకటేశ్వర కళ్యాణం,కాళింగ నర్తనం నృత్య ప్రదర్శనలతో ప్రారంభించారు.దూర ప్రాంతాల నుండి పాల్గొన్న విద్యార్థులకు ఉదయం బహుమతి ప్రధానం చేశారు.సాయంత్రం గుంటూరు తదితర ప్రాంతాల వారికి సాయంత్రం 6గంటల నుండి బహుమతి ప్రదానం జరుగుతుందన్నారు.

## 108 మంది పేదలకు పెన్షన్లు నిత్యావసరాల పంపిణీ

గుంటూరు విద్య,ఆగష్టు 17,ప్రభాతవార్త : స్థానిక అరండల్‌పేటోని అవోప కార్యాలయంలో అవోపా అధ్యక్షులు కెవి బ్రహ్మం అధ్యక్షతన 108మంది పేదలకు పెన్షన్లు,నిత్యావసరాలు పంపిణీ జరిగింది.ముఖ్యఅతిధిగా డాక్టర్ పోలిశెట్టి శ్రీనివాస్,అవోప రాష్ట్ర అధ్యక్షులు తటవర్తి రాంబాబు పాల్గొన్నారు.డాక్టర్ పోలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ అవోపా ఆధ్వర్యంలో ప్రతినెలా 108మంది పేదలకు ఒకొక్కరికి రూ.500లు చొప్పున పెన్షన్ ఇవ్వడం,రూ.1000ల విలువ చేసే నిత్యావసర సరుకులు,విద్యార్థులకు ఉపకార వేతనాలు ఇవ్వడం అభినందనీయమన్నారు,తన వంతు సాయాన్ని అందిస్తానని,వృద్ధులతో ఆరోగ్యంగా ఉండేందుకు పలు సూచనలు చేశారు. అవోప రాష్ట్ర అధ్యక్షులు తటపర్తి రాంబాబు మాట్లాడుతూ అవోపా సమాజ సేవకు ఎప్పుడూ ముందుంటుందన్నారు.వచ్చే నెలలో పేద విద్యార్థులకు రూ.40లక్షల స్కాలర్‌షిప్పులు ఇస్తున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో ట్రెజరర్ మహాంకాళీ శ్రీనివాసరావు,ప్రొగ్రామ్ కోఆర్డినేటర్ మద్ది సాయి రమేష్,ఊటుకూరు నాగేశ్వరరావు,కోటి స్వామి గుప్తా,వెంకట్రావు,మద్దికోటి రత్నం తదితరులు పాల్గొన్నారు.



పల్నాడు జిల్లా వార్త





## ఉచిత రక్తనాళాల వైద్యశిబిరాన్ని ప్రారంభించిన ప్రత్తిపాటి



చిలకలూరిపేట,ఆగస్టు17,ప్రభాతవార్త: జయజయసాయి ట్రస్ట్, ఎవిఎస్‌వాస్క్ కలర్ ఆసుపత్రి హైదరాబాద్ వారిచే సంయుక్తంగా పట్టణంలోని సుబ్బయ్యతోటలో ఉన్న శ్రీ చైతన్య టెక్నోస్కూల్‌లో ఆదివారం నిర్వహించిన ఉచిత రక్తనాళాల వైద్య శిబిరాన్ని మాజీమంత్రి, స్థానిక శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు ప్రారంభించారు. తొలుత దత్తసాయి సన్నిధిలో ప్రత్తిపాటి ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్తిపాటిని జయ జయసాయి ట్రస్ట్ చైర్మన్ పూనపాటి బాలాజీ సత్కరించారు. వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడుతూ ఉచితంగా ఏర్పాటుచేసిన వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరూ ఉపయోగించుకొని తమ ఆరోగ్యాలను కాపాడుకోవాలని, వైద్యుల ద్వారా తగిన సూచనలు పొంది తగు మందులు వాడి జాగ్రత్తలు వహించాలని ప్రత్తిపాటి తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు పావులూరి హనుమంతురావు, దేవరకొండ నాగేశ్వరరావు, కాంపౌండర్స్ అసోసియేషన్ అధ్యక్షులు కె నాగేశ్వరరావు, ఎవిఎస్ ఆసుపత్రి డాక్టర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## నియోజకవర్గ టిడిపి డాక్టర్స్ విభాగం అధ్యక్ష, కార్యదర్శులుగా డాక్టర్ పేర్ని కృష్ణమోహన్, మారెళ్ల ఇందిర

చిలకలూరిపేట,ఆగస్టు17,ప్రభాతవార్త: తెలుగుదేశం పార్టీ సంస్థాగత ఎన్నికలలో భాగంగా నియోజకవర్గ, పట్టణ, మండల కార్యవర్గాల ఎన్నికల ప్రక్రియ గత కొన్ని రోజులుగా కొనసాగుతుంది. దీనిలో భాగంగా ఆదివారం నియోజకవర్గ డాక్టర్స్ విభాగం అధ్యక్షులుగా ప్రముఖ దంత వైద్యులు డాక్టర్ పేర్ని





కృష్ణమోహన్, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ మారెళ్ల ఇందిరలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమపై నమ్మకం ఉంచి తమను ఎంపిక చేసిన మాజీమంత్రి, స్థానిక శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావుకు ధన్యవాదాలు తెలిపారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను, రాష్ట్రాభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే ప్రత్తిపాటి చేస్తున్న కృషిని ప్రజలలోకి విస్తృతంగా తీసుకువెళతామని తెలియచేశారు. ఈ ఎన్నిక కార్యక్రమంలో పార్టీ నాయకులు నెల్లూరి సదాశివరావు, షేక్ కరిముల్లా, పఠాన్ సమద్‌ఖాన్, మద్దుమాల రవి, జవ్వాజి మదన్‌మోహన్, బండారుపల్లి సత్యనారాయణ, కామినేని సాయిబాబు, మురకొండ మల్లిబాబు,షేక్ అజారుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## పట్టణ టిడిపి మహిళా అధ్యక్ష,కార్యదర్శులుగా కూనల ప్రమీల, యాదల సుజాత

చిలకలూరిపేట,ఆగస్టు17,ప్రభాతవార్త: తెలుగుదేశం పార్టీ సంస్థాగత ఎన్నికలలో భాగంగా నియోజకవర్గ, పట్టణ, మండల కార్యవర్గాల ఎన్నికల ప్రక్రియను టిడిపి కమిటీ నిర్వహిస్తుంది. పట్టణ తెలుగుమహిళా అధ్యక్షురాలిగా 22వ వార్డు టిడిపి కౌన్సిలర్ కూనల ప్రమీల, ప్రధాన కార్యదర్శిగా యాదల సుజాతను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమపై నమ్మకం ఉంచి తమను ఎంపిక చేసిన మాజీమంత్రి, స్థానిక శాసనసభ్యులు ప్రత్తిపాటి



పుల్లారావుకు ధన్యవాదాలు తెలిపారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను, రాష్ట్రాభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే ప్రత్తిపాటి చేస్తున్న కృషిని ప్రజలలోకి విస్తృతంగా తీసుకువెళతామని తెలియచేశారు. ఈ ఎన్నిక కార్యక్రమంలో పార్టీ నాయకులు నెల్లూరి సదాశివరావు, షేక్ కరిముల్లా, పఠాన్ సమద్‌ఖాన్, మద్దుమాల రవి, జవ్వాజి మదన్‌మోహన్, బండారుపల్లి సత్యనారాయణ, కామినేని సాయిబాబు, మురకొండ మల్లిబాబు,షేక్ అజారుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.


## గణపవరం కోదండ రామాలయంలో ప్రమాణస్వీకారం చేసిన నూతన కమిటీ



నాదెండ్ల,ఆగస్టు17,ప్రభాతవార్త: మండలంలోని గణపవరం గ్రామంలో ఉన్న శ్రీ కోదండ రామాలయ నూతన కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షులుగా కాటా వెంకటేశ్వర్లు, కార్యదర్శిగా జంపని వెంకటరత్నం, కోశాధికారిగా గాలి బుచ్చియ్య, నార్నె శివయ్య, ఉపాధ్యక్షులుగా గుర్రం ఆదినారాయణలు ఆలయం ఆవరణలో ఆదివారం ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు వలేటి వెంకటేశ్వరరావు, కెల్లంపల్లి సుందరరావు, కెల్లంపల్లి అచ్చియ్య తదితరులు పాల్గొన్నారు.

## కనపర్రు పాలకేంద్రం సభ్యులకు బోనస్ పంపిణీ

నాదెండ్ల,ఆగస్టు17,ప్రభాతవార్త: మండలంలోని కనపర్రు పాలకేంద్రంలో సభ్యులకు ఆదివారం బోనస్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ ఆర్థిక సంవత్సరంలో పాలకేంద్రం,డైరీ రెండు సొమ్ములనుంచి రైతులకు రూ 3,16 లక్షల ప్రోత్సాహకాలను అందజేశారు. ఈ సందర్భంగా సంఘం డైరీ పాలకమండలి సభ్యుడు పావులూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ మార్కెట్‌లో వినియోగదారులకు పాల ఉత్పత్తులు అందించడంతో పాటు సంఘం డైరీ అగ్రగామిగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాలకేంద్రం అధ్యక్షుడు మేడబలిమి ప్రతాప్, నరసరావుపేట మేనేజర్ నరేష్‌బాబు, సూపర్‌వైజర్ వసంతరావు, పాలకేంద్ర కార్యవర్గ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.



## విజెఎల్ పెరల్స్&జ్యువెలర్స్ షోరూం ప్రారంభం

చిలకలూరిపేట,ఆగస్టు17,ప్రభాతవార్త: పల్నాడు జిల్లా తెలుగుదేశం పార్టీ వాణిజ్యవిభాగం అధ్యక్షుడు వెల్లంపల్లి రవిశంకర్ ఆధ్వర్యంలో పట్టణంలోని కొమ్మినేని వీరశంకరరావు ఆసుపత్రి ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన రెండవ బ్రాంచ్ విజెఎల్ పెరల్స్,జ్యువెలర్స్ షోరూంను ఆదివారం మాజీమంత్రి, స్థానిక శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని,మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ కరిముల్లా,మండల పార్టీ అధ్యక్షులు జవ్వాజి మదన్‌మోహన్, టిడిపి నాయకులు గుర్రం సాంబశివరావు, రామమల్లు బదరి నారాయణమూర్తి, షోరూం అధినేత వెల్లంపల్లి శంతన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## కొలిశెట్టి రమణమ్మకు 'మర్రి' నివాళి

చిలకలూరిపేట,ఆగస్టు17,ప్రభాతవార్త: పట్టణంలోని రాగన్నపాలెంకు చెందిన కొలిశెట్టి సుబ్రహ్మణ్యం తల్లి కొలిశెట్టి రమణమ్మ ఇటీవల మృతిచెందారు. కాగా ఈమె పెదకర్మను ఆదివారం వారి స్వగ్రామంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న శాసనమండలి సభ్యుడు మర్రి రాజశేఖర్, సోమేపల్లి వెంకటసుబ్బయ్య, సోమేపల్లి శ్రీనివాసరావులు రమణమ్మ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. వారి కుటుంబసభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలియచేశారు. రాజశేఖర్‌తో పాటు గేరా లింకన్, ఎవియం సుభాని,బైరా వెంకటకోటి, సాతులూరి కోటి, షేక్ అబ్దుల్లా, అత్తులూరి షరీఫ్, పమిడి శ్రీనివాస్, నన్నపనేని వెంకట్రామయ్య, రమేష్, నార్నె హనుమంతరావు, కొండెబోయిన అంజనేయులు, జాలాది సుబ్బారావు, గడిపూడి దశరధరామయ్య, గంధి అంజనేయులు, శ్యామ్సన్, ఏలియా, డేవిడ్, నిడమానూరి హనుమంతరావు, నరేంద్రరెడ్డి, కళ్యాణ్, విజయ్, మస్తాన్, విజయ్‌యాదవ్, అఖిల్, వేణు తదితరులు పాల్గొని నివాళులు అర్పించారు.

## ప్రత్తిపాటి నివాసంలో టిడిపి ఫ్లోర్ లీడర్ గంగా శ్రీనివాసరావు జన్మదిన వేడుకలు

చిలకలూరిపేట,ఆగస్టు17,ప్రభాతవార్త: తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, టిడిపి మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ గంగా శ్రీనివాసరావు జన్మదిన వేడుకలు ప్రత్తిపాటి నివాసంలో ప్రత్తిపాటి సమక్షంలో ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ప్రత్తిపాటి గంగా శ్రీనివాసరావుతో కేక్ తినిపించి



పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియచేశారు. ప్రత్తిపాటి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నాటినుండి శ్రీనివాసరావు తండ్రి గంగా రామారావు ఏ విధంగా అయితే పార్టీ సిద్ధాంతాలను, నాయకుని ఆదేశాలను శిరసావహిస్తూ కష్టపడ్డారో ఎన్నో ఎదురైనా పార్టీ ఉన్నతికి విశేషంగా కృషి చేశారో అదేబాటలో ఆయన కుమారుడు శ్రీనివాసరావు కూడా కృషి చేస్తున్నారని వివరించారు. నాదెండ్ల మండలం గణపవరం గ్రామ తెలుగుదేశం పార్టీ బలోపేతానికి శక్తి వంచన లేకుండా కృషి చేశారని తెలిపారు. మున్సిపాలిటీలో తెలుగుదేశం పార్టీ పక్ష నాయకుడిగా అవినీతి మంత్రి దోపిడిని, అక్రమాలను కౌన్సిల్ సమావేశాల సాక్షిగా ఎండగట్టారని అన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ కరిముల్లా, మాజీ చైర్మన్ తేళ్ల సుబ్బారావు, గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ కందుల రమణ, టిడిపి నాయకులు నల్లమోతు హరిబాబు, బండారుపల్లి సత్యనారాయణ, జవ్వాజి మదన్‌మోహన్,కామినేని సాయిబాబు, పఠాన్ సమద్‌ఖాన్, మద్దుమాల రవి, మురకొండ మల్లిబాబు, ఆరికట్ల కోటేశ్వరరావు, గట్టినేని రమేష్, జవ్వాజి బుచ్చిబాబు, షేక్ అజారుద్దీన్, గుర్రం నాగపూర్ణచంద్రరావు, వివిధ హోదాలలో ఉన్న పార్టీ నాయకులు, మున్సిపల్ కౌన్సిలర్లు, గణపవరం గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొని శ్రీనివాసరావుకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియచేశారు.

## డాక్టర్ విలియం కేరి జీవితం ఆదర్శనీయం : ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ

నరసరావుపేట, ఆగస్టు 17 ప్రభాతవార్త : డాక్టర్ విలియం కేరి జీవితం ఆదర్శనీయమని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు అన్నారు. ఆదివారం విలియం కేరి 256వ జన్మదిన వేడుకలను స్థానిక ప్రకాష్‌నగర్‌లోని మున్సిపల్ వసతి గృహంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు మాట్లాడుతూ భారతదేశంలో విలియం కేరి చేసిన సేవలను గుర్తు చేశారు. సాహిత్య, సామాజిక సేవలను కొనియాడారు. సామాన్య వక్తిగా పుట్టి అసాధారణ సేవలతో ఆయన జీవించారని తెలిపారు. బాప్టిస్ట్ మిషనరీ సొసైటీని స్థాపించి క్రైస్తవ మత ప్రచారంతో పాటు ఉచితంగా ఎందరికో విద్య, వైద్య సేవలను అందించారని తెలియజేశారు. బైబిల్‌ను బెంగాలి, తెలుగు, మరాఠీ, హిందీ, సంస్కృతం తదితర 40 భారతీయ భాషలలో అనువదించడం జరిగిందన్నారు. అదే విధంగా కళాశాలను స్థాపించి ఆధునిక విద్యా వ్యవస్థకు పునాది వేశారన్నారు. సతీసహగమన నిషేదానికి, స్త్రీ విద్యకు ఎంతో కృషి చేశారని, వారే తమకు స్ఫూర్తి అని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, ఆట వస్తువులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, స్వచ్ఛంధ సేవా సంస్థ ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## వెంకటేశ్వర యోగా సేవా కేంద్రం ఆధ్వర్యంలో ర్యాలీ

నరసరావుపేట, ఆగస్టు 17 ప్రభాతవార్త : వెంకటేశ్వర యోగా సేవా కేంద్రం ఆధ్వర్యంలో పట్టణంలో శాంతి ర్యాలీని ఆదివారం నిర్వహించారు. కార్యక్రమ నిర్వాహకులు, యోగాచార్యులు జెల్లి శ్రీనివాసరావు, వీరాంజనేయులు, లక్ష్మీనారాయణ, శివప్రసాదరావు, శారదా, కొండారెడ్డి తదితరులు పాల్గొని మాట్లాడారు. శ్లోకాలు రాసి అప్పజెప్పినవారికి ప్రతిభా పురస్కారాలను అందజేశారు. 7వ యోగా శిక్షణా కార్యక్రమం విజయవంతంగా ముగిసిందన్నారు. సుఖ దు:ఖాలను సమానంగా స్వీకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో శిక్షణ పూర్తి చేసుకున్న స్థానికులు పలువురు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య నిర్వహణలో నిర్లక్ష్యం...ప్రబలుతున్న అంటువ్యాధులు

### - మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డికి స్థానికుల ఫిర్యాదు

నరసరావుపేట, ఆగస్టు 17 ప్రభాతవార్త : పారిశుద్ధ్య నిర్వహణ లోపాలతో అంటువ్యాధులు ప్రబలుతున్నాయని పట్టణంలోని షాలేంనగర్ నివాసితులు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డికి తెలియజేశారు. ఆదివారం వైఎస్సార్‌సీపీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పార్టీ నాయకులతో కలిసి గుడ్‌మార్నింగ్ నరసరావుపేట కార్యక్రమాన్ని నాయకులతో కలిసి నిర్వహించారు. స్థానిక కుమ్మరిబజార్, రైల్వేస్టేషన్ ఫస్ట్ గేటు సెంటర్, షాలేంనగర్ ప్రాంతాలలో పర్యటించి స్థానికులను కలిశారు. కుమ్మరిబజార్‌లో పది రోజులుగా చెత్త తీయడం లేదని, కుళ్ళిపోయిన కూరగాయలు, పండ్లతో ఆ ప్రాంతం అంతా దుర్వాసన వస్తుందని స్థానికులు తెలిపారు. రైల్వేస్టేషన్ ఫస్ట్ గేటు వద్ద ఉన్న బాలికల కళాశాల హాస్టల్ ఎదురు చెత్తకుప్పలు, బీర్ బాటిల్స్‌తో ఇబ్బందిగా ఉందన్నారు. అక్కడ నివాస ప్రాంతంలోని మహిళలు అర్ధరాత్రి వరకు మందుబాబులు తాగి అల్లరి చేస్తున్నారని తమకు తెలియజేశారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వ పాలనలో పట్టణం అధ్వాన్నంగా ఉందన్నారు. పరిశుభ్రత ఎక్కడా లేకపోవడంతో వర్షాలకు డెంగ్యూ, మలేరియా, విష జ్వరాలు వ్యాపిస్తున్నట్లు తెలిపారు. 15 నెలల కాలంలో అభివృద్ధి కార్యక్రమాలు సైతం జరగడం లేదన్నారు. నైట్ స్వీపింగ్ వర్కర్లు మున్సిపల్ కార్మికులచే పని చేయించడం వలన ఇటువంటి ఇబ్బందికర పరిస్థితులు వచ్చాయన్నారు. దోమలు రాకుండా వర్షాకాలంలో ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవడం లేదన్నారు. పారిశుద్ధ్య మెరుగుదలకు చర్యలు తీసుకోవాలన్నారు. పట్టణ విలీన ప్రాంతాలలో పరిస్థితి మరింత అధ్వాన్నంగా ఉందన్నారు. జిల్లా అధికారులు పురపాలక సంఘ పరిధిలోని పరిస్థితులపై చర్యలు తీసుకోవాలన్నారు. గుడ్‌మార్నింగ్ నరసరావుపేట కార్యక్రమాన్ని కొనసాగిస్తామని, పారిశుద్ధ్య నిర్వహణ పట్ల అధికారులు శ్రద్ధ తీసుకునేవరకు నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ కమిటీ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



## వల్లపుచెరువు నుండి వృధా అవుతున్న నీటిని అరికట్టాలి

నరసరావుపేట, ఆగస్టు 17 ప్రభాతవార్త : పట్టణంలోని బైపాస్‌రోడ్డులో ఉన్న వల్లపుచెరువు నుండి భారీగా నీరు వృధా అవుతుంది. రెండు వైపుల నుండి కట్టలు తెగిపోవడంతో నీరు బయటకు వెళ్తుంది. చప్టా మీదుగా రెండు మూడు అడుగుల ఎత్తుల వరకు నీరు ప్రవహిస్తుంది. సమస్యను పరిష్కరించాలని పట్టణ వినియోగదారుల సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు కుంచాల స్వామి ఈ సందర్భంగా అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఆ ప్రాంతంలోని పది గ్రామాల నివాసితులు చప్టా పై నుండి రాకపోకలు సాగిస్తున్నారని తెలిపారు. పాచి పేరుకుపోయి టూ వీలర్స్, ఆటోలు అనేక మార్లు చప్టాపై ప్రమాదాలకు గురి కావడం జరిగిందన్నారు. చెరువుకట్ట మట్టి కోతకు గురి కావడంతో పాటు గండ్లు పడ్డాయన్నారు. చెరువుకట్ట పూర్తిగి తెగిపోతే పట్టణ పరిధిలోని స్టేడియం, బిసి కాలనీ, చంద్రబాబునాయుడు కాలనీలు ముంపుకు గురవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాకపోకలకు ఇబ్బందిగా ఉన్న చప్టాపై నీరు ప్రవహించకుండా వల్లపుచెరువు గండ్లు పూడ్చాలని ఈ సందర్భంగా కుంచాల స్వామి విజ్ఞప్తి చేశారు.

## ఎస్‌టియు జిల్లా కార్యాలయంలో ఉపాధ్యాయుల సమావేశం


నరసరావుపేట, ఆగస్టు 17 ప్రభాతవార్త : ఎస్‌టియు జిల్లా కార్యాలయంలో ఆదివారం ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. అధ్యక్షులు ఎల్.వి.రామిరెడ్డి సమావేశానికి అధ్యక్షత వహించారు. నాయకులు జోసఫ్‌సుధీర్‌బాబు, చంద్రజిత్, కోటేశ్వరరావు, సుభాని, గంగాధర్‌బాబు, వెంకటకోటయ్య, ఏమండీ, కరిముల్లా, ఏసయ్య, రామలింగయ్య, ఆంజనేయులు తదితరులు సమావేశంలో పాల్గొన్నారు. నాయకులు మాట్లాడుతూ తరగతి గదులు, విద్యార్థి భాగస్వామ్యం, ప్రతి స్పందనలు తదితర కార్యక్రమాల కోసం ఉపాధ్యాయులు వందల పేజీలు పరీక్షలు రాస్తున్నారని తెలిపారు. అదే విధంగా మోడల్ స్కూల్ పేరిట ప్రభుత్వం చేపట్టిన సంస్కరణల వలన విద్యార్థుల సంఖ్య తగ్గుతుందన్నారు. బోధనా సమయాన్ని హరిస్తూ ప్రభుత్వం ప్రైవేట్ పాఠశాలలకు మేలు కలిగించే కార్యక్రమాలను అమలు చేయాలని కుట్ర చేస్తుందన్నారు. ఉపాధ్యాయుడ్ని పాఠాలు బోధించకుండా ప్రభుత్వ విధానాలు కొనసాగడం సరికాదని నాయకులు విమర్శించారు.





## రంగురాళ్ళు దొరుకుతాయి అనే ప్రచారాలను నమ్మవద్దు : ఎస్.ఐ. సురేష్

నకరికల్లు, ఆగస్టు 17 ప్రభాతవార్త : రంగురాళ్ళు దొరుకుతాయనే ప్రచారాలను నమ్మవద్దని, ఇటువంటి అసత్య ప్రచారాలు చేసే వారిపై చర్యలు తీసుకుంటామని ఎస్.ఐ. సురేష్ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మండలంలోని త్రిపురాపురం గ్రామ సమీపంలో ఉన్న కొండల్లో రంగురాళ్ళు దొరుకుతాయనే ప్రచారం జరుగుతుందన్నారు. దీని వలన దూర ప్రాంతాల నుండి అనేక మంది వ్యయ ప్రయాసలతో ఇక్కడకు వస్తున్నారని తెలిపారు. అనవసరంగా ఎక్కడి నుండో వచ్చి రోజుల తరబడి రంగురాళ్ళ కోసం వెతుకుతున్నారని తెలిపారు. కొందరు డబ్బులు ఖర్చు చేసుకొని ఉట్టి చేతులతో తిరిగి వెళ్తున్నారని, ఇటువంటి తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని సూచించారు. రంగురాళ్ళ కోసం వచ్చినవారికి ఎస్.ఐ. సురేష్, వారి సిబ్బంది కౌన్సిలింగ్ నిర్వహించారు.



## పేద విద్యార్థికి బొల్లు రాజేశ్వరి - కృష్ణారావు ఛారిటబుల్ ట్రస్ట్ చేయూత

నరసరావుపేట, ఆగస్టు 17 ప్రభాతవార్త : బొల్లు రాజేశ్వరి – కృష్ణారావు ఛారిటబుల్ ట్రస్ట్ ఆదివారం సేవా కార్యక్రమాన్ని నిర్వహించింది. బొల్లు రాజేశ్వరి 27వ వర్ధంతిని పురస్కరించుకొని కుందురువారిపాలెం గ్రామానికి చెందిన బొక్కిసం విజయలక్ష్మికి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ ఛైర్మన్ బొల్లు వెంకట కృష్ణారావు, సభ్యులు బొల్లు రాజేంద్రప్రసాద్, మార్లపాటి రామకృష్ణ, కోమటినేని నాసరయ్య, వి.వి.ఎ.ఎల్.వరప్రసాద్, వెంకటేశ్వర్లు మాట్లాడారు. తిరుమల ఇంజనీరింగ్ కళాశాలలో బిటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విజయలక్ష్మికి రూ.20 వేలను ఆర్థిక సహాయంగా అందించామని తెలిపారు. చదువుకునే ప్రతిభ ఉండి ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నవారికి ట్రస్ట్ అండగా నిలుస్తుందని ఈ సందర్భంగా వారు తెలియజేశారు.





## పఠాన్ ఖాసింఖాన్ నిస్వార్ధ ప్రజా నాయకుడు: జీవీ

వినుకొండ,ఆగస్టు17,ప్రభాతవార్త: దివంగత వినుకొండ మాజీ సర్పంచ్ పఠాన్ ఖాసింఖాన్ ప్రజలకు నిస్వార్ధ సేవలు అందించారని ప్రభుత్వ చీఫ్‌విప్,ఎమ్మెల్యే జీ.వీ ఆంజనేయులు అన్నారు. ఆదివారం పఠాన్ ఖాసింఖాన్ వర్ధంతి పురస్కరించుకొని స్థానిక పెద్ద మసీదు వద్ద గల ఖాసింఖాన్ కాంస్య విగ్రహానికి చీఫ్‌విప్ జీ.వీ,డీసీసీబీ ఛైర్మన్ మక్కెన మల్లికార్జునరావులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన ప్రజలకు చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, ఖాసింఖాన్ అభిమానులు పాల్గొన్నారు.



## మైదాన ప్రాంత గిరిజన హక్కులు,అభివృద్ధికి ప్రభుత్వాలు కృషి చేయాలి

### జిపిఎస్ జాతీయ అధ్యక్షులు,మాజీ రాష్ట్ర ఎస్టీ కమీషన్ సభ్యులు వడిత్యా శంకర్‌నాయక్

వినుకొండ,ఆగస్టు17,ప్రభాతవార్త: మైదాన ప్రాంత గిరిజనులకు అన్యాయం జరుగుతోందని ,గిరిజనులకు అసెంబ్లీల్లో ప్రాతినిధ్యం కల్పించాలని గిరిజన ప్రజా సమాఖ్య జాతీయ అధ్యక్షుడు,మాజీ ఎస్టీ కమీషన్ సభ్యులు వడిత్యాశంకర్‌నాయక్ అన్నారు. పట్టణంలోని జాషువా కళా ప్రాంగణం నందు గిరిజన ప్రజా చైతన్యయాత్ర రౌండ్‌టేబుల్ సమావేశం ఆదివారం నిర్వహించారు. సమావేశానికి గిరిజన ప్రజా సమాఖ్య జాతీయ అధ్యక్షుడు,మాజీ ఎస్టీ కమీషన్ సభ్యులు వడిత్యాశంకర్‌నాయక్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో మైదాన ప్రాంత గిరిజనులకు రాజకీయ రిజర్వేషన్ కల్పించి,గిరిజన హక్కుల పరిరక్షణకై కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని చెప్పారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 79 ఏళ్ళు గడుస్తున్నా ఇంకా గిరిజనులకు సరైన రాజకీయ, ఆర్థిక ఎదుగుదలకు నోచుకోలేదన్నారు. నేటికీ అనేక ప్రాంతాల్లో గిరిజనులు కూడు,గూడు,గుడ్డ లేక తీవ్రంగా అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు పూర్తి స్థాయిలో గిరిజనులకు అందడం లేదని ప్రభుత్వాలు దృషి సారించాల్సి ఉందని తెలిపారు. ఎస్టీ జాబితాలో ఇతర వర్గాల వారిని చేర్చడం వల్ల గిరిజనుల ప్రయోజనాలు దెబ్బతింటున్నాయన్నారు. మైదాన ప్రాంత గిరిజనుల అభివృద్ధికి అండగా ప్రతి ఒక్కరు ఉండాలన్నారు. అనంతరం ప్రజా చైతన్యయాత్ర వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు రాజునాయక్,రాష్ట్ర కార్యదర్శి రవినాయక్,బీఎస్పీ పార్టీ కార్యదర్శి రాజు,పల్నాడు జిల్లా యువజన నాయకుడు జరపల కృష్ణానాయక్,యువజన అధ్యక్షులు హనుమంతునాయక్,పల్నాడు జిల్లా అధ్యక్షులు రంగనాయక్,గౌరవ అధ్యక్షులు విష్ణునాయక్, ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం బాలాజీనాయక్, డాక్టర్ కోటేశ్వరరావు నాయక్, ఒంగోలు జిల్లా అధ్యక్షులు సైదానాయక్,మాచర్ల జెడ్పిటిసి మల్లుసామి,రేమిడిచర్ల సర్పంచ్ బ్రహ్మం,రాంజీనాయక్,వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



## వైభవంగా వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

రాజుపాలెం, ఆగస్టు 17 ప్రభాతవార్త : మండల కేంద్రమైన రాజుపాలెంలో పద్మావతి గోదా సమేత వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. వేడుకలలో భాగంగా ఆదివారం యోగశాలలో పూర్ణాహుతి, శాంతి కళ్యాణం, ఉత్సవమూర్తులకు గ్రామోత్సవం జరిగిందని ఆలయ ఛైర్మన్ పొత్తూరి వెంకట రామ సుబ్బారావు తెలియజేశారు. వేద పండితుల ఆధ్వర్యంలో స్వామివారికి, అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. స్వామివారిని, అమ్మవారిని దర్శించుకునేందుకు రాజుపాలెం గ్రామస్తులతో పాటు జిల్లా నలుమూలల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని, అమ్మవారిని కనులారా దర్శించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. అనంతరం భక్తులకు భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆలయ ఛైర్మన్ పొత్తూరి వెంకట రామ సుబ్బారావు తెలియజేశారు. అలాగే 18వతేదీ సోమవారం నిత్యారాధన, మంగళశాసనం, నవకలశ స్వపనం, చక్రతీర్థోత్సవం, యాగశాలలో పూర్ణాహుతి, కుంభప్రోక్షణ, తీర్థ ప్రసాద గోష్టి ఉంటాయన్నారు. చివరి రోజైన 19వతేదీన మంగళవారం నిత్యారాధన, మంగళశాసనం, ఉత్సవ హవన స్వపనం, తీర్థ ప్రసాద గోష్టి, ఆచార్యులకు, ఋత్వికులకు సన్మానం వంటి కార్యక్రమాలు ఉంటాయన్నారు.



## వైభవంగా శ్రీకృష్ణుని ఊరేగింపు

పిడుగురాళ్ల, ఆగస్టు 17 ప్రభాతవార్తః త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక పిడుగురాళ్ల ఉత్సవ కమిటి ఆధ్వర్యాన ఆదివారం పట్టణంలో శ్రీకృష్ణుని ప్రతిమను అంగరంగ వైభవంగా ఊరేగించారు. శ్రీకృష్ణాష్టమిని పురస్కరించుకొని ఈ ఊరేగింపు జరిపారు. రైల్వేస్టేషన్, వాసవీనగర్, జానపాడు రోడ్డు, మెయిన్ రోడ్డు మీదుగా ఈ ఊరేగింపు సాగింది. మాచర్ల రోడ్డులోని హరివిల్లు అపార్ట్‌మెంట్ వద్ద వేదికను నిర్మించి శ్రీకృష్ణుని ప్రతిమను కొలువుదీర్చి పూజలు జరిపారు. ఈ కార్యక్రమంలో కమిటి అధ్యక్షుడు కటికం సైదారావు, అరుణ, కార్తీక్, నారాయణమ్మ, అనురాధ, వెంకటలక్ష్మి, శ్రీను, వీరయ్య, రాఘవ, సుందర, రామాంజినేయులు, గంగయ్య, కోటేశ్వరమ్మ, వెంకటేశ్వర్లు నాయక్ తదితరులు పాల్గొన్నారు.



## దేశరక్షణలో జనసేవదళ్ కృషి ఎంతో ఉంది

నరసరావుపేట, ఆగస్టు 17 ప్రభాతవార్త : దేశరక్షణలో జనసేవదళ్ కృషి ఎంతో ఉందని సిపిఐ జిల్లా కార్యదర్శి మారుతీవరప్రసాద్ అన్నారు. ఆదివారం ప్రత్యేక శిక్షణా కార్యక్రమాన్ని స్థానికంగా ప్రారంభించారు. కార్యక్రమానికి నాయకులు కాసా రాంబాబు, సత్యనారాయణరాజు, ఉప్పలపాటి రంగయ్య, అంజిరెడ్డి తదితరులు శిక్షణలో పాల్గొని మాట్లాడారు. సిపిఐ రాష్ట్ర 28వ మహాసభలు ఒంగోలు నగరంలో ఆగస్టు 23,24,25 తేదీలలో జరుగుతున్నాయన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మహాసభలకు విచ్చేసే పార్టీ శ్రేణులతో ప్రజా ప్రదర్శన ఉంటుందన్నారు. ప్రదర్శనలో అగ్రభాగాన రెడ్‌షర్ట్ వాలంటీర్స్ మార్చ్ ఫాస్ట్ చేస్తారన్నారు. కార్యకర్తల కవాతు నిర్వహించడంతో పాటు అగ్ని ప్రమాదాలు, వరదలు, తుఫాన్‌లు సంభవించే సమయంలో సైనికుల వలే శిక్షణ పొందిన కార్యకర్తలు పని చేస్తారని నాయకులు మారుతీవరప్రసాద్, కాసా రాంబాబులు తెలియజేశారు.


## నివాస గృహాలు, ఖాళీ స్థలాల సర్వే చేపట్టిన పంచాయితీ అధికారులు

యడ్లపాడు, అగస్టు 17, ప్రభాతవార్త : పంచాయితీ రాజ్ శాఖ అధ్వర్యంలో నివాస గృహాలు, ఖాళీ స్థలాలు సర్వే కార్యక్రమాన్ని అధికారులు ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వం రూపకల్పన చేసిన స్వమిత్వ పథకంలో భాగంగా అధికారులు మండలంలోని నివాస గహాలు, ఖాళీ స్థలాలు సర్వే పున:ప్రారంభించటం జరిగిందని, 2020లో ప్రవేశపెట్టబడిందన్నారు. గతంలో డ్రోన్ సర్వే ద్వారా గ్రామ కంఠాల సరిహద్దులు గుర్తించటంతో పాటు మ్రరిపాలెం, దింతెనపాడు గ్రామాల్లో గతంలోనే సర్వే పూర్తి చేశారని, మండలంలోని 10రెవెన్యూ గ్రామాల్లో ఇటీవల సర్వే పున:ప్రారంభించామని, అక్టోబర్ నెలాఖరుకు మందలంలోని 13600ఇళ్లు, ఖాళీ స్థలాల్లో సర్వే పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఇన్‌చార్జీ ఎంపీడీవో షేక్ జాకీర్ హుస్సేన్ అదివారం తెలిపారు. సర్వే పూర్తయిన అనంతరం వచ్చే అభ్యంతరాలపై గ్రామసభలు నిర్వహిస్తామన్నారు. తదుపరి గృహ యజమానులకు అస్థిహక్కు పత్రాలు పంపిణీ చేస్తామన్నారు. సర్వేలో భాగంగా అధికారులు ఇళ్లకు వచ్చినప్పుడు గృహ యజమానులు హద్దులు చూపించి సహకరించాలని కోరారు.



## పత్తి పంటలో కలుపు నివారణా చర్యలు

యడ్లపాడు, అగస్టు 17, ప్రభాతవార్త : కురుస్తున్న వర్షాలకు ఇప్పటికే మొలకెత్తిన పత్తిపంటలో కలుపువిపరీతంగా రావటంతో రైతులు అందోళనకు గురవుతున్నారు. వ్యవసాయం చేయాలంటే భూమిలో ఉన్న ఒక మోస్తరు నెమ్ముకారణంగా వీలు పడే పరిస్తితులు కానరావటంలేదు. ఇటువంటి పరిస్తితులలో కలుపు నివారణకు అధికారులు, శాస్త్రవేత్తలు అందజేస్తున్న సలహాలను పాటించవల్సిందిగా వారు కోరుతున్నారు. వేసవిలో దుక్కి దున్నిన తరువాత జల్లులు పడిన తరువాత తుంగ మరియు గరిక వచ్చే నేలల్లో ముందుగానే జాగ్రత్తలు తీసుకోవాలని, వాటిని నిర్మూలించుటకుగాను గ్లైఫోసెట్ అనే రసాయనాన్ని 10మిల్లీలీటర్ల చొప్పున 1లీటరు నీటిలో కలిపి గడ్డి మొక్కలు బాగా తడిసేటట్లు పిచికారి చేయాలని, అయితే దీనితోపాటు 10లీటర్ల ట్యాంకుకు 150గ్రాముల అమ్మోనియం సల్ఫేట్ కూడా కలిపి పిచికారి చేసిన తర్వాత దాదాపుగా 15రోజులపాటు భూమిని దున్నకూడదని, ఈ విధముగా చేసిన తర్వాత చక్కగా కలుపు లేకుండా దుక్కి తయారు చేసుకొని విత్తనాన్ని విత్తుకోవాలని, పెండి మిథాలిన్ అనే రసాయనాన్ని ఎకరానికి 1లీ చొప్పున బిటి ప్రత్తిని నాటిన 24గంటల లోపుగా భూమిపై పిచికారి చేయాలన్నారు. దీనితో చాలి వెడల్పు అకులు కలిగిన కలుపు మొక్కలు నివారించవచ్చునని, పై రెండు పద్దతులు అనివార్యకారణాల వలన అవలంభించనప్పుడు ఫ్యారాక్వాట్ రసాయనాన్ని ఎకరాకు 1-1.5లీటర్ల చొప్పున నాటిన 25నుండి 30 రోజులకు మరియు 45నుండి60 రోజులకు రెండు దఫాలుగా పంపు నాజిల్ పై పడగ వంటి పరికరాన్ని అమర్చి సాళ్ళ మధ్య ఉన్న కలుపు మొక్కలపై మాత్రమే పడేటట్లుగా జాగ్రత్త వహించి పిచికారి చేసుకోవాలన్నారు. ఈ విధముగా రసాయనిక కలుపుమందును బిటి ప్రత్తి సాగులో వాడిన ఎడల కలుపును తక్కువ ఖర్చుతో చాలా వరకు నిర్మూలించవచ్చు అని శాస్త్రవేత్తలు తెలుపుతున్నారు.



## పొన్నూరు మండలంలో అధిక వర్షపాతం నమోదు కావచ్చు

**-అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలి**

**-ఎలాంటి సమస్య ఎదురైనా ఎదుర్కోవాలి-తహశీల్దార్ మహమ్మద్ జియావుల్ హక్**

పొన్నూరు, ఆగస్టు 17,ప్రభాతవార్త: పొన్నూరు మండలంలో అధిక వర్షపాతం నమోదు అయ్యే అవకాశం ఉందన్న వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ మహమ్మద్ జియావుల్ హక్ తెలిపారు. సోమవారం మండలంలో అత్యధిక వర్షపాతం నమోదు అయ్యే అవకాశాలున్నాయన్నారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు ఎలాంటి విపత్కర సమస్య ఎదురైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని కోరారు. ఎక్కడైనా అధిక వర్షపాతం వల్ల లో తట్టు ప్రాంతాలు జలమయమయ్యే అవకాశం ఉంటే అక్కడ ఉండే ప్రజలను రక్షిత ప్రదేశానికి చేర్పించాలన్నారు. రక్షిత ప్రదేశానికి చేర్పించాక వారికి అవసరమైన ఆహారం, త్రాగునీరు తదితరాలను అందించేందుకు కూడా సిద్ధంగా ఉండాలన్నారు. అవసరమైతే లోతట్టు ప్రాంత ప్రజలను ప్రభుత్వ భవనాల్లోకి తరలించేందుకు కూడా సిద్ధంగా ఉండాలన్నారు. అదేవిధంగా డ్రైనేజి సమస్య, ట్రాఫిక్ సమస్య, విద్యుత్ సమస్య తదితరాలను సత్వరమే పరిష్కరించేందుకు ఆయా శాఖల అధికారులు సిబ్బందిని అప్రమత్తం చేయాలన్నారు.



## నేడు షాపుల అద్దె లైసెన్స్‌కు వేలం



పొన్నూరు, ఆగస్టు 17,ప్రభాతవార్త: శ్రీ విరాట్ విశ్వకర్మ వారి దేవస్థానానికి చెందిన మూడు షాపులను అద్దెకు ఇచ్చేందుకు అద్దె లైసెన్స్ పొందేందుకు ఈ నెల 18వ తేదీ ఉదయం 11గంటలకు వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు కార్యనిర్వహణాధికారి ఎన్‌వివిఎన్ మల్లేశ్వరి తెలిపారు. ఇందుకు సంబంధించిన వేలం పాటలు తెనాలి గంగానమ్మపేటలో వేంచేసియున్న శ్రీ వేణుగోపాలస్వామి వారి దేవాలయం ఆవరణలో జరుగుతాయన్నారు. మూడు సంవత్సరాల కాలపరిమితికి ఈ వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. హిందూ దేవాదాయ ధర్మాదాయశాఖ నిబంధనల ప్రకారం అన్యమతస్తులు పాటలో పాల్గొనకూడదన్నారు. ప్రతి పాటదారుడు పాటకు ముందు రూ.5వేలు ధరావత్తు చెలి ంచి పాటలో పాల్గొనాలన్నారు. హెచ్చుపాటదారుని పేర పాట కొట్టివేసిన వెంటనే అడ్వాన్స్‌గా మూడు నెలల అద్దెను చెల్లించాలన్నారు. ప్రతి ఏటా అద్దెదారుడు సంవత్సరము ముందుగానే అద్దెను చెల్లించాలన్నారు. పూర్తి వివరాలకు దేవాలయం కార్యాలయంలో సంప్రదించాలని మల్లేశ్వరి చెప్పారు.

## రెండు దశాబ్దాల కల నెరవేరింది

**-టిడిపి నియోజకవర్గ నాయకుడు బొప్పన బాపనయ్య**

పొన్నూరు, ఆగస్టు 17,ప్రభాతవార్త: గత రెండు దశాబ్దాల నుంచి ఈ రోడ్డు నిర్మాణం చేపట్టాలని ప్రజలు ఎన్నిమార్లు అధికారులకు మొరపెట్టుకున్నా ఏ ప్రభుత్వం స్పందించలేదని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తక్షణమే ఈ మట్టిరోడ్డును సీసీ రోడ్డుగా మార్చడం జరిగిందని టిడిపి నియోజకవర్గ నాయకుడు బొప్పన బాపనయ్య అన్నారు. మండల పరిధిలోని కసు ్రు గ్రామంలో మాలెమ్మ గుడి దేవాలయం రోడ్డు మట్టి రోడ్డు కావడంతో చిన్నపాటి వర్షానికే రోడ్డంతా చిందవందరగా అయ్యేదన్నారు.



ఇలాంటి పరిస్థితిలో గుడికి వెళ్ళి మొక్కులు తీర్చుకోవడం కష్టంగా ఉండేదన్నారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో ఎన్నోమార్లు పంచాయితీ అధికారులకు సూచించిన ప్రయోజనం లేదన్నారు. ఆరవసారి ఎమ్మెల్యేగా విజయదుందుబి మోగించిన ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ దృష్టికి తీసుకెళ్ళగా, అందుకు స్పందించిన నరేంద్ర తక్షణమే పంచాయితీ నిధులు రూ.7.50లక్షలతో నిర్మించాలని అధికారులను ఆదేశించారు. దీంతో ఆదివారం ఈ రోడ్డు నిర్మాణ పనులను చేపట్టారు. బొప్పన బాపనయ్య దగ్గరుండి సీసీ రోడ్డును నాణ్యతా ప్రమాణాలు సక్రమంగా ఉండేవిధంగా వేయిస్తున్నారు. దీంతో గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## పొన్నూరులో భారీ వర్షం-జలమయమైన రోడ్లు

పొన్నూరు, ఆగస్టు 17,ప్రభాతవార్త: ఆదివారం ఉదయం నుంచి వాతావరణంలో మార్పులు వచ్చాయి. దీంతో కొద్ది సేపు ఎండ...మరికొద్ది సేపు సన్నటి చినుకులు....ఇంకొద్దిసేపు చల్లదనం...ఈ విధంగా సాయంత్రం వరకు కొనసాగిన వాతావరణం ఒక్కసారిగా ఉన్నట్టుండి భారీ వర్షం కురిసింది. దీంతో పట్టణంలోని రోడ్లన్నీ జలమయమయ్యాయి. ఆర్టీసి డిపో ఎదురు రోడ్డులో భారీగా నీరు నిలిచిపోయాయి. ముబారక్ నగర్ నాలుగో లైన్‌లో డ్రేనేజీలు పొంగడంతో వర్షపు నీరు మొత్తం రోడ్లపై ప్రవహించి రోడ్లన్నీ తటాకంలా మారాయి. మహమ్మదీయ మసీదు రోడ్డు చిన్నపాటి చెరువులా మారిపోయింది. దీంతో



పాదచారులు, వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. రోడ్లన్నీ మోకాలు లోతు నీళ్ళు ప్రవహించాయి. మునిసిపల్ అధికారులు పన్నులు వసూలు చేసుకొని చేతులు దులుపుకోవడం కాదు....రోడ్లు, కాలువలు సక్రమంగా పారుదల అయ్యేవిధంగా చూడాలని ఆయా ప్రాంతాల వాసులు కోరుతున్నారు. పన్నులు వసూలు చేసేటప్పుడు ఉన్నటువంటి ఉత్సాహం......సౌకర్యాలు కల్పించడంలో లేకపోవడం విచారకరమని పలువురు వాపోతున్నారు. కాలువలను ముందుగానే శుభ్రం చేసినట్లయితే ఇలాంటి దుస్థితి ఉండేది కాదని పలువురు అంటున్నారు. కాలువల్లో పూడిక తూ. తూ మంత్రంగా కాకుండా పూర్తిస్థాయిలో నాణ్యతా ప్రమాణాలతో ఉండే విధంగా చూడాలని పౌరులు కోరుతున్నారు.

## తిరుమలశెట్టికి విశిష్ట పురస్కారం

పొన్నూరు, ఆగస్టు 17,ప్రభాతవార్త: విజయవాడలోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాలులో విశ్వసాహితీ కళావేదిక ప్రారంభోత్సవ కార్యక్రమంలో పొన్నూరుకు చెందిన తిరుమలశెట్టి ఉమాశంకర్‌కు విశిష్ట పురస్కారాన్ని అందజేశారు. మన పొన్నూరు బ్లడ్ వెల్ఫేర్ అసోసియేషన్ ద్వారా ఆయన సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ పలువురికి ఆదర్శంగా నిలిచిన ఉమాశంకర్‌ను ఘనంగా సత్కరించారు. ఉమాశంకర్ చేస్తున్న సేవలను కొనియాడారు. తిరుమలశెట్టి ఉమాశంకర్ మాట్లాడుతూ కవులు అందరూ రక్తదానం మీద కవితలు రాసి తమ కవితలతో ప్రజలలో చైతన్యం తెచ్చి మేము సైతం రక్తదానం చేయాలి అనే విధంగా ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో గంగ్రీ రంగిశెట్టి రమేష్, నన్నపనేని రాంబాబు, విశ్వసాహితీ కళావేదిక అధ్యక్షురాలు కొల్లి రమాదేవి, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు సంబంధించిన కవులు పాల్గొన్నారు.



## గుండె సంబంధిత వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

పొన్నూరు, ఆగస్టు 17,ప్రభాతవార్త: ప్రతి ఒక్కరూ గుండె సంబంధిత వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ కిరీటి నల్లమోతు సూచించారు. స్థానిక రవి హాస్పిటల్‌లో ఆదివారం ఉచిత గుండె వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరీటి మాట్లాడుతూ రవి హాస్పిటల్‌లో సూపర్ స్పెషాలిటీ సేవలను ప్రారంభించినట్లు చెప్పారు. 24గంటలు కార్డియాలజీ సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. గుండె సంబంధిత వ్యాధులు గుర్తించినట్లయితే తక్షణమే వైద్యుని సంప్రదించి మేరకు మందులు వాడాలన్నారు. గుండె సంబంధిత నొప్పులు వచ్చినప్పుడు అజాగ్రత్త చేయకుండా వైద్యుని సంప్రదించాలన్నారు. బరువు ఎక్కువ ఉన్నవారు బరువు తగ్గాలన్నారు. గుండె జబ్బులున్నవారు నెలకొకసారి కానీ, మూడు నెలలకు ఒకసారి కానీ పరీక్షలు చేయించుకోవాలన్నారు. డాక్టర్ నల్లమోతు రూతేంద్ర మాట్లాడుతూ రవి హాస్పిటల్‌లో అన్ని గుండె సంబంధిత వ్యాధులకు చికిత్స చేయడం జరుగుతుందన్నారు. గుండె సంబంధిత వ్యాధులతో పాటు పాయిజన్ కేసులు, స్త్రీల సమస్యలు,జనరల్ కేసులు కూడా చూడడం జరుగుతుందన్నారు. స్వర్గీయ డాక్టర్ నల్లమోతు రవీంద్రనాథ్ ఠాగూర్ సూచించిన మార్గాన్ని అనుసరిస్తూ, వారి ఆశయ సాధన కోసం పనిచేస్తున్నట్లు చెప్పారు. గ్రామీణ ప్రాంతావాసులకు కూడా నాణ్యమైన వైద్యం అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు.



## భక్తిశ్రద్ధలతో ప్రారంభమైన శ్రీ వేంకటేశ్వరుని ఉత్సవాలు



పొన్నూరు, ఆగస్టు 17,ప్రభాతవార్త: పట్టణంలో వేంచేసియున్న శ్రీ సహస్రలింగేశ్వరస్వామి, శ్రీ వీరాంజనేయస్వామివారి దేవాలయం ప్రాంగణంలో కొలువై ఉన్న శ్రీ పద్మావతి గోదాదేవి సమేత శ్రీ స్వర్ణ వేంకటేశ్వరస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం అత్యంత భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. తొలిరోజు పూజకు సంబంధించిన కార్యక్రమాలను అర్చకస్వాములు నిర్వహించారు. ఉదయం 7గంటలకు ప్రాతఃకాలార్చన విశేషపూజ, పంచామృత స్నపన, పెండ్లికుమారుని చేయడం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం విష్వక్సేన పూజ, పుణ్యాహవాచన, అంకురార్పణ,వాస్తుపూజ, వాస్తుహోమము, ధ్వజపట ప్రతిష్ఠ, ధ్వజారోహణము నిర్వహించారు. ఈ ఉత్సవాలు తిలకించేందుకు భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. గరుడ పొంగలి ప్రసాదాన్ని భక్తులకు పంపిణీ చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా కార్యనిర్వాహణాధికారి గద్దె వెంకట శివనాగేంద్రం పర్యవేక్షణలో సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

## 21, 22 తేదీల్లో ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిబిరం

పెదనందిపాడు ఆగస్టు 17 (ప్రభాతవార్త) ఈనెల 21, 22 తేదీల్లో మండలంలోని బోయపాలెం లోని శ్రీ అనంతలక్ష్మి స్పిన్నింగ్ మిల్ ఆవరణలో మహిళలకు సామినేని చారిటబుల్ ట్రస్ట్ మరియు కాకతీయ కమ్యూనిటీ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు పెదనందిపాడు మాజీ ఎంపీపీ నర్రా బాలకృష్ణ, జిల్లా తెలుగుదేశం పార్టీ నాయకులు చెన్నుపాటి శివ నాగేశ్వరరావు లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కోరారు.

## నాగార్జునసాగర్‌కు భారీగా పెరిగిన వరద ప్రవాహం

### - 22 క్రస్టుగేట్ల ద్వారా నీటి విడుదల

విజయపురిసౌత్, ఆగస్టు 17 ప్రభాతవార్త: ఎగువ శ్రీశైలం నుంచి వరద ప్రవాహం అధికంగా ఉండటంతో, నాగార్జునసాగర్ ప్రాజెక్టు అధికారులు ఆదివారం 22 క్రస్టుగేట్లను అయిదు అడుగుల మేర ఎత్తి నీటిని విడుదల చేస్తున్నారు. క్రస్టుగేట్ల స్పిల్‌వే నుంచి సుమారు 1.70 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. క్రస్టుగేట్ల నుంచి ఉప్పొంగి ప్రవహిస్తున్న కృష్ణా జలాలు కనువిందు చేశాయి. నీటి విడుదల జలసౌందర్యాన్ని చూసేందుకు పర్యాటకులు పోటెత్తారు. వరుస సెలవులు రావడంతో నాగార్జునసాగర్ డ్యాం వద్ద పర్యాటకుల సందడి నెలకొంది. ఎగువ నుంచి భారీగా వరద నీరు వచ్చి చేరడంతో జలాశయం నిండుకుండలా మారింది. అధికారులు గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేయడంతో పరవళ్ళు తొక్కుతున్న కృష్ణా జలాలను కళ్లారా చూసేందుకు సందర్శకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతున్న దృశ్యాలను తమ కెమెరాల్లో బంధిస్తూ, సెల్ఫీలు తీసుకుంటూ ఆనందం వ్యక్తం చేశారు. ఒకేసారి పెద్ద సంఖ్యలో వాహనాల్లో రావడంతో విజయపురిసౌత్, సాగర్ టీ-జంక్షన్ వద్ద కొద్దిసేపు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు ట్రాఫిక్‌ను నియంత్రించి వాహనాలు సాఫీగా ముందుకు సాగేలా చర్యలు చేపట్టారు. ప్రస్తుతం జలాశయానికి వరద ప్రవాహం కొనసాగుతుండటంతో అధికారులు పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు.



## నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక..రద్దు



బాపట్ల,ఆగస్టు17,ప్రభాతవార్త: ప్రకాశం బ్యారేజ్‌కు వరద నీరు అధికంగా రావడాన్ని దృష్టిలో ఉంచుకుని, జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ముందస్తు చర్యలలో భాగంగా, రేపు సోమవారం బాపట్ల జిల్లాలో జరగాల్సిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ప్రజలు ఈ విషయం గమనించాలని సూచించారు.

## పెదవడ్లపూడిలో ఘనంగా మక్కా మసీదుకు భూమి పూజ

మంగళగిరి, ఆగస్టు 18, ప్రభాతవార్త : మంగళగిరి నియోజకవర్గంలోని పెదవడ్లపూడి గ్రామం రైలుపేట ప్రాంతంలో మక్కా మసీదు నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంనకు మంగళగిరి వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ జవ్వాది కిరణ్ చంద్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. గ్రామంలోని ప్రజల సహకారం వల్లే ఈ నిర్మాణం సాధ్యమవుతోందని, భవిష్యత్తులో ఈ మసీదు ద్వారా ముస్లిం సోదరులు చిరకాల కోరిక నెరవేరిందన్నారు. తన వంతు సహాయం గా 200 సిమెంట్ కట్టలు మక్కా మసీదు నిర్మాణంనికి అందజేస్తున్నట్టు తెలిపారు. మక్కా మసీదు అనేది మా ముస్లిం సోదరుల ఆత్మీయ కోరిక. ఈ మసీదు పూర్తయితే ఆ ప్రాంతానికి ఒక ఆధ్యాత్మిక కేంద్రమే కాకుండా సామాజిక సామరస్యానికి ప్రతీకగా నిలుస్తుందన్నారు.మసీదు నిర్మాణానికి గ్రామస్థుల నుంచి వస్తున్న సహకారం ప్రశంసనీయం అని, త్వరితగతిన నిర్మాణ పనులు పూర్తి చేసి ప్రార్ధనలకు అందుబాటులోకి తేవడానికి కృషి చేస్తామని తెలిపారు.



## మహిళ ఆత్మహత్య

తాడేపల్లి,ఆగష్టు 17,ప్రభాతవార్త : పట్టణ పరిధిలోని నులకపేటలో ఉండే మహిళ ఆదివారం ఉంట్లో పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది.అప్పులు ఇచ్చిన వడ్డీ వ్యాపారస్తులు వేధింపుల తట్టుకోలేక కృష్ణవేణి అనే మహిళ నాలుగు పేజీల మరణ వాంగ్మూలం రాసి పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకుంది.తన చావుకు కారణం ఫలానా వ్యక్తులు అని అందులో పేర్కొంది.చావు బతుకుల మద్య ఉన్న మహిళను బంధువులు గమనించి వెంటనే హస్పటల్‌కు తరలించారు.అక్కడ చికిత్స పొందుతూ కృష్ణవేణి మృతి చెందింది.కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నట్లు తాడేపల్లి సిఐ వీరేంద్రబాబు తెలిపారు.

## సామాన్యులకు భారమైన స్మార్ట్ మీటర్లను అడ్డుకుందాం,ప్రజాసంఘాల పిలుపు:

తెనాలి టౌన్ ఆగస్టు 17 (ప్రభాతవార్త):సామాన్య ప్రజల బ్రతుకు లకు భారం అవుతున్న స్మార్ట్ మీటర్ల ను అడ్డుకుందామని ప్రజాసంఘాల నాయకులు పిలుపునిచ్చారు.ఆదివారం చెంచుపేట లోని ప్రజా సంఘాలకార్యాలయంలో విద్యుత్ వినియోగ దారుల ప్రజా వేదిక ఆధ్వర్యంలో జరిగిన సదస్సు కు సీఐటీయూ జిల్లా కార్యదర్శి కేబీ.ప్రసాద్ అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,స్మార్ట్ మీటర్లు పేరుతో ప్రజలు అడుగడుగునా కష్టాలు కడగండ్లు ఏదురుకుంటూ వున్నారని,స్మార్ట్ మీటర్ ద్వారా అడ్డగోలుగా విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నారని,వారాల తరబడి పవర్ సప్లయ్ పున రుద్దరించుట లేదని చెప్పారు. జిల్లా రైతుసంఘం నాయకులు ఎం.శివసాంబిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ఏన్నికల్లో ఇచ్చిన హామీ ప్రక్కన పెట్టి ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. సిఐటియు నాయకులు షేక్ హుస్సేన్ వలి, పోస్టల్ రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు పి.జోనేష్,కే.లక్ష్మణ్ రావు ఎం.ఉమా మహేశ్వర రావు సిపిఐఎంఎల్ నాయకులు జి.సుబ్బారావు, డాల్ మిల్ వర్కర్స్ యూనియన్ నాయకులు జి.వెంకటసుబ్బయ్య, ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు జి.రవీంద్ర, ఎస్.సుబ్రహ్మణ్యం, కే.శివశంకర్ రావు, కే.దుర్గా ప్రసాద్, కటకం సాంబశివరావు,మహిళా సంఘం నాయకురాలు,ఎన్ రాజ్యలక్ష్మి ్మ, వై.ఈశ్వరి, ముద్దెన సాంబశివరావు, తదితరులు పాల్గొన్నారు.



## రైతులకు ఉచితంగా విత్తనాలు పంపిణీ చేయాలి: రైతుసంఘం డిమాండ్

తెనాలి ఆగస్టు 17 (ప్రభాతవార్త):ఇటీవల కురిసిన భారీవర్షాల కారణంగా పంట నష్టపోయిన రైతాంగానికి ఉచితంగా విత్తనాలు పంపిణీ చేయాలని రైతుసంఘం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఆదివారం రూరల్ మండల గ్రామాలైన నందివెలుగు,ఖాజీపేట, గ్రామాల్లో పర్యటించి భారీవర్షాలకు నీటమునిగిన పంటలను పరిశీలించారు. రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు ములకా శివసాంబిరెడ్డి మాట్లాడుతూ ఇప్పటివరకు రైతులు ఎకరానికి పదివేలురూపాయలు పైగా పెట్టుబడి పెట్టారని,భారీవర్షాలతో రైతులకు కోలుకోలేని దెబ్బ తగిలిందని,ఐతే అతివృష్టి లేదంటే అనావృష్టి అన్నట్టుగా ఉంది అన్నదాతల పరిస్థితని, నిన్నటి వరకు చినుకు జాడకోసం ఎదురుచూసిన రైతులకు ఉప్పెనలా వచ్చిన భారీవర్షం తీరనికష్టాన్ని మిగిల్చిందని,పంటపొలాలాన్ని నీటమునిగి చెరువులను తలపిస్తున్నాయని,సుమారు పదివేల ఎకరాలకు పైగా ముంపునకు గురయ్యాయని అయన పేర్కొన్నారు. ప్రతిరైతుకు ఎకరానికి పదివేల రూపాయలు నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు.



## రెండోపెళ్లి చేసుకున్న ప్రబుద్ధుడి అరెస్ట్

తెనాలి ఆగస్ట్ 17 (ప్రభాతవార్త):మొదటిభార్యకు విడాకులివ్వకుండా,పెళ్ళైన సంగతి తెలియనివ్వకుండా, రెండోపెళ్లి చేసుకున్న ప్రబుద్దుడిని అరెస్ట్ చేసిన తెనాలి తాలూకా పోలీసులు.వివరాల్లోకి వెళితే రూరల్ గ్రామమైన కొలకలూరు కి చెందిన లింగం శెట్టి భూలక్ష్మి ్మ,తన భర్త లింగం శెట్టి ఉమామహేశ్వరరావు తనకు విడాకులు ఇవ్వకుండానే రెండు పెళ్లి చేసుకొని ఇద్దరు ఆడ పిల్లలను కని వాళ్ళ పేర్ల మీద రేషన్ కార్డ్, ఆధార్ కార్డ్, మరియు కొన్ని ప్రాపర్టీ రిజిస్ట్రేషన్ చేయించిన ఆధారాలతో ఇచ్చిన ఫిర్యాదు మేరకు లింగంశెట్టి ఉమామహేశ్వరరావు పైన, రెండవ పెళ్లి చేసుకోవడానికి సహకరించిన వారిపైన మొత్తం ఏడుగురిపైన కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తాలూకా పోలీసులు ఒక ప్రకటనలో తెలిపారు.

## మండలంలో ఎరువులు అందుబాటులో ఉన్నాయి.. రైతులు ఆందోళన చెందవద్దు



కొల్లూరు, ఆగస్టు 17 (ప్రభాతవార్త) : మండలంలో ఎరువులు అందుబాటులో ఉన్నాయని, రైతులు ఎవరూ ఆందోళన చెందవలసిన అవసరం లేదని కొల్లూరు మండల వ్యవసాయశాఖ అధికారి వి.నరేంద్రబాబు ఆదివారం తెలియజేశారు. కొల్లూరు మండలంలో యూరియా 110మెట్రిక్ టన్నులు, డిఏపి 150మెట్రిక్ టన్నులు, పటాస్ 60 మెట్రిక్ టన్నులు, ఎస్ఎస్‌పి 80మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ 230మెట్రిక్ టన్నులు, ఎరువులు నిలవలు ఉన్నాయని రైతులు ఎవరూ ఆందోళన చెందవలసిన అవసరం లేదని ఆయన తెలియజేశారు. పిఏసిఎస్ ప్రైవేటు డీలర్ల, జీడీ సిఎంఎస్ సంస్థల ద్వారా రైతులకు అందుబాటులో ఉంచామని అయితే ఈనెల 20వ తేది బుధవారం నుండి రైతు సేవా కేంద్రంలో ద్వారా ఎరువులను అందిస్తామని రైతులకు తెలియజేశారు.

## పెదనందిపాడు మండల శాలివాహన అధ్యక్షునిగా సుబ్బారావు



పెదనందిపాడు ఆగస్టు 17 (ప్రభాతవార్త)గుంటూరు జిల్లా కుమ్మర శాలివాహన సంక్షేమ సంఘం అధ్యక్షులు ఇందుర్తి వెంకట శివ నారాయణ ఆదేశాల మేరకు పెదనందిపాడు మండల అధ్యక్షుడిగా నిజాంపట్నం వెంకట సుబ్బారావు. ఉపాధ్యక్షుడిగా కానుగుల నాగభూషణం లను నియమించడం జరిగింది. ఈ మేరకు సుబ్బారావుకు జిల్లా కేంద్రం నుండి ఉత్తర్వులు అందాయి. మండల అధ్యక్షులుగా తననియామకానికి సహకరించిన గుంటూరు జిల్లా యువజన అధ్యక్షుడు మామిళ్ళపల్లి సుబ్బారావు జిల్లా అధ్యక్షుడు వెంకట శివ నారాయణలకు . నిజాంపట్నం వెంకట సుబ్బారావు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

## రైతు సమస్యలు పరిష్కరించకపోతే కలెక్టరేట్ వద్ద ధర్నా

పెదనందిపాడు ఆగస్టు 17 (ప్రభాతవార్త) గుంటూరు ఛానల్ పర్చూరు వరకు పొడిగింపు పనులకు నిధులు కేటాయించి వెంటనే పనులు ప్రారంభించాలని. నల్లమడ వాగు శాశ్విత వరద ముంపు నివారణ పనులను వెంటనే ప్రారంభించాలని నల్లమడ రైతు సంఘం అధ్యక్షులు డాక్టర్ కొల్లా రాజమోహన్రావు డిమాండ్ చేశారు. ఆదివారం రాత్రి పెదనందిపాడు కామ్రేడ్ కొల్లా వెంకయ్య గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన నల్లమడ ప్రాంత రైతు సంఘ సమావేశంలో వారు మాట్లాడారు. ప్రభుత్వం వెంటనే కృషి చేయకపోతే గుంటూరు కలెక్టర్ ఆఫీస్ వద్ద నిరసన దీక్ష చేయాల్సి వస్తుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో సంఘ కార్యదర్శి యార్లగడ్డ అంకమ్మ చౌదరి. గోవాడ సత్యనారాయణ .ఈదర భ్రమరాంబ. మన్నవ హరిప్రసాద్. జాష్టి వీరయ్య చౌదరి. కొల్లా రామన్. తదితర రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

## గుంటూరు జిల్లా కుమ్మర శాలివాహన సంఘం నూతన కమిటీ ఎన్నిక

**అధ్యక్షునిగా ఇందుర్తి వెంకట శివన్నారాయణ ఏకగ్రీవం**

గుంటూరు, ఆగస్టు 17, ప్రభాతవార్త: గుంటూరు జిల్లా శాలివాహన సంఘం నూతన కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. ఆంధ్రప్రదేశ్ కుమ్మర శాలివాహన సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు తుగ్గిలి నాగేంద్ర నాయకత్వంలో కమిటీ నియామకం చేశారు. గుంటూరు జిల్లా అధ్యక్షులుగా ఇందుర్తి వెంకట శివన్నా రాయణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గుంటూరు పట్టణ అధ్యక్షులుగా యనగందల పూర్ణచంద్రరావు, గుంటూరు జిల్లా యువజన అధ్యక్షులుగా మావిళ్ళపల్లి సుబ్బారావు, గుంటూరు పట్టణ మహిళా అధ్యక్షురాలుగా చిరుతన గళ్ళ భూలక్ష్మిలను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఆంధ్రప్రదేశ్ కుమ్మరి శాలివాహన కార్పొరేషన్ డెవలప్‌మెంట్ ఛైర్మన్ పేరెపి ఈశ్వర్,రాష్ట్ర గౌరవ అధ్యక్షులు పద్మ నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి జెజవాడ ఆదిశేషయ్య, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పారెళ్ళ బసవేశ్వరరావు,రాష్ట్ర కమిటీ తరుపున హాజరై జిల్లా కమిటీ నియామకం చేయడం జరిగింది. గుంటూరు జిల్లా అధ్యక్షులుగా నియామకమైన ఐ.వి శివన్నారాయణ మాట్లాడుతూ జిల్లాలో ఉన్న సంఘీలందరినీ కలుపుకొని పోతూ శాలివాహన సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తామన్నారు. తమ వద్దకు వచ్చిన ప్రతి సమస్యను శాయశక్తుల పరిష్కరించేందుకు కృషి చేయడం జరుగుతుందని పేర్కొన్నారు.



## నేతల చిత్రపటాలకు మహిళల పాలాభిషేకం

మాచర్ల, ఆగస్టు 17 ప్రభాతవార్త: ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించిన సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, విద్యాశాఖ మంత్రి లోకేష్, మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేసి మహిళలు కృతజ్ఞతలు తెలిపారు. మాచర్ల పట్టణ టీడీపీ అధ్యక్షుడు కొమెర దుర్గారావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ మదార్‌సాహెబ్, పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## వరికపూడిసెల పూర్తే నా లక్ష్యం!

**- కూటమి ప్రభుత్వంలో రైతే రాజు! - రైతులను దగా చేసిన జగన్‌రెడ్డి**

**- ట్రాక్టర్ ర్యాలీలో ఎంపీ లావు, ఎమ్మెల్యే జూలకంటి**

మాచర్ల, ఆగస్టు 17 ప్రభాతవార్త: దశాబ్దాల కల వరికపూడిసెల పూర్తి చేయకుంటే నా పదేళ్ల రాజకీయ జీవితం వ్యర్థమని నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. ఆదివారం అన్నదాత సుఖీభవ పథకాన్ని విజయవం తంగా అమలు చేసిన సందర్భంగా కూటమి ప్రభుత్వానికి, సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలుపుతూ మాచర్ల పట్టణంలో ఆదివారం ట్రాక్టర్లతో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎంపీ లావు, స్థానిక ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానంద రెడ్డి పాల్గొని మాట్లాడారు. ర్యాలీలో నియోజకవర్గ వ్యాప్తంగా దాదాపు 500 ట్రాక్టర్లతో రైతులు పోటెత్తారు. పట్టణంలోని శ్రీశైలం రోడ్డులోని ఆంజనేయస్వామి దేవాలయం నుంచి మార్కెట్ యార్డు వరకు సాగిన ర్యాలీలో వేలాదిగా రైతులు పాల్గొన్నారు. స్వయంగా ట్రాక్టర్‌ను నడిపి ఎంపీ లావు, ఎమ్మెల్యే జూలకంటి అభివాదం చేవారు. స్థానిక రింగురోడ్డు, పార్కుసెంటర్, బస్టాండ్, చంద్రవంక వంతెన, నెహ్రూనగర్ మీదుగా మాచర్ల మార్కెట్ యార్డు వరకు సాగిన ర్యాలీలో కూటమి ప్రభుత్వానికి సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన వేదికపై ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి మాట్లాడారు. పదేళ్ల రాజకీయ జీవితంలో ఈ ప్రాంత ప్రజల దశాబ్దాల కల వరికపూడిసెల ప్రాజెక్టును పూర్తి చేయడమే లక్ష్యమని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. వెనుకబడిన మాచర్ల నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలంటే సాగు, తాగునీరు కీలక పాత్ర పోషిస్తాయని, అవి పుష్పలంగా ఉండాలంటే అందుకు తగిన విధంగా ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్మాణాలను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబుకు వివరించామన్నారు. వరికపూడిసెల, జల్‌జీవన్ మిషన్ ద్వారా వాటర్ గ్రిడ్‌ను పూర్తి చేస్తే.. ఈ ప్రాంత ప్రజలకు, రైతులకు ఎంతో మేలు జరుగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే రైతు ఉత్పత్తులను జిల్లా మార్కెట్ యార్డుకు తరలించేందుకు అనువుగా నియోజకవర్గంలో అనేక రహదారులను కలుపుతూ, రాష్ట్ర జాతీయ రహదారుల నిర్మాణాలకు రూ.2,500 కోట్లు ఖర్చు చేశామని గుర్తు చేశారు. వరుణుడు కరుణించి సమృద్ధిగా వర్షాలు పడుతున్నాయని, ప్రాజెక్టులు మొత్తం వరద నీటితో నిండి జలకళ సంతరించుకున్నాయని వివరించారు. సూపర్‌సిక్స్ హామీలన్నీ అమలవుతున్నాయని, రైతుల ఆర్థిక అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన వెల్లడించారు.



### రైతులను దగా చేసిన జగన్

రైతు సంక్షేమానికి తిలోదకాలు వదిలి.. రైతులను దగా చేసిన దగుల్బాజీ జగన్‌రెడ్డి అని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వంలో రైతే రాజుగా జగన్‌రెడ్డి రద్దు చేసిన అనేక సంక్షేమ పథకాలను తిరిగి అమలు చేస్తుందని ఆయన గుర్తు చేవారు. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న లక్షలాది మంది రైతులకు ఆర్థిక చేయూత అందిందని వివరించారు. వ్యవసాయ శాఖాధికారులు ఏడీఏ వి.జగదీశ్వరరెడ్డి, ఏఓలు లక్ష్మారెడ్డి, అమీర్‌రెడ్డి, బాలగంగాధర్, డి.పాపకుమారి, నియోజకవర్గస్థాయి రైతులు, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మహిళా సాధికారతే ధ్యేయం....

మాచర్ల, ఆగస్టు 16 ప్రభాతవార్త: మహిళల సాధికారతే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని మాచర్ల శాసనసభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఉద్ఘాటించారు. శనివారం పట్టణంలో ఓ కల్యాణ మండపంలో పూజిత మహిళా సొసైటీ ద్వారా శిక్షణ పొందిన మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్లు, బ్యూటీషియన్ కిట్లు పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే జూలకంటి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శిక్షణలో ఎంపిక చేసిన మహిళలకు, యువతులకు సంస్థ ద్వారా ఉచితంగా అందించే కుట్టుమిషన్లను, బ్యూటీషియన్ కిట్లను ఆయన చేతులమీదుగా అందజేశారు. పూజిత మహిళా సొసైటీ అధ్యక్షురాలు కోటేశ్వరి, పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




## తిరుమల కొండపైకి ఉచిత బస్సు ఏర్పాటుపై పరిశీలన: ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి

మాచర్ల, ఆగస్టు 16 ప్రభాతవార్త: తిరుమల కొండపైకి మహిళా భక్తులకు ఉచితంగా బస్సు సౌకర్యం ఏర్పాటు చేసే విషయాన్ని పాలక వర్గం పరిశీలిస్తుందని, అడగకుండా వరాలిచ్చే నాయకుడు చంద్రబాబు అని ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి అన్నారు. శనివారం కృష్ణాష్టమిని పురస్కరించుకుని మండల కేంద్రమైన రెంటచింతలలో శ్రీకృష్ణ దేవాలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. తొలుత ఆలయ మర్యాదలతో వేద పండితులు పూర్ణకుంభంతో ఆలయంలోకి తోడ్కొని వెళ్లారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉన్నా ఇచ్చిన హామీకి కట్టుబడి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఏకైక సీఎం చంద్రబాబు అని అన్నారు. స్త్రీశక్తితో మహిళా స్వావలంబనకు ఊతమిచ్చారన్నారు. ఆస్తిహక్కులో వాటా కల్పించి, 1996లో ఆర్టీసీలో మహిళా కండక్టర్లకు అవకాశం కల్పించింది అప్పటి సీఎం చంద్రబాబు, రవాణా శాఖ మంత్రి హరికృష్ణేనని జంగా గుర్తు చేశారు. ప్రజలందరి భాగస్వామ్యంతో సనాతన ధర్మ ప్రచార కార్యక్రమాలను విస్తృతం చేసేందుకు శ్రీవారి బ్రహ్మోత్సవాలను నభూతోనభవిష్యతి అనే రీతిలో నిర్వహించనున్నామన్నారు. సంక్షేమ నిధికి ఇచ్చిన రూ.6 కోట్లు మొత్తాన్ని ఉద్యోగులకు చెల్లించేందుకు సైదులుయాదవ్, మాజీ సర్పంచ్ సుంకయ్య, చిన్ని యాదవ్, కోటేశ్వరరావు, ప్రభురాజు యాదవ్, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షులు సుమంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన

పిడుగురాళ్ల, ఆగస్టు 17 ప్రభాతవార్తః మండలంలోని తుమ్మలచెరువులో ఆదివారం కాటూరి మెడికల్ కళాశాల సౌజన్యంతో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిభిరానికి విశేష స్పందన లభించింది. 20 మందికి కంటికి అదనపు పరీక్షలు కాటూరు వైద్యశాలలో నిర్వహిస్తామని వైద్యులు చెప్పారు. అలాగే పది మందికి గుండెకు సంబంధించిన పరీక్షలు చేయాల్సి ఉందన్నారు. ఈ శిభిరాన్ని ఎంపీపీ అల్లు సత్యవతి పిచ్చిరెడ్డి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు దీపిక, అభిలాష్, ఆశిక, శ్రీసన, అమీనా, విద్యాధర్, పునీత, విద్యాలహరి, హారిక, మార్కెటింగ్ మేనేజర్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



వార్త, సోమవారం 18, ఆగస్టు 2025

# 'షో టైం' సినిమా తీద్దాం రండి



ప్రముఖ నిర్మాత, ఎకె ఎంటర్ టైన్మెంట్స్ అధినేత అనిల్ సుంకర ఒక కొత్త రియాల్టీ షోకు శ్రీకారం చుట్టారు. సినిమా రంగంలో రాణించాలనుకునే ఔత్సాహికులకు ఒక అద్భుతమైన అవకాశాన్ని ఈ రియాల్టీ షో ద్వారా కల్పించనున్నారు. మొత్తం 16 సినిమా స్క్రిప్ట్స్, ఆ స్క్రిప్ట్‌ను పరిశీలించడానికి 12 మంది జడ్జీలు, సినిమాకు స్క్రిప్ట్ సెలెక్ట్ చేయడం నుంచి ఆర్టిస్టులు, రచయితలు ఇలా 24 విభాగాల్లో పని చేసే టెక్నీషియన్లను మొత్తం 75 రోజుల్లో ఎన్నుకునే విధానాన్ని రియాల్టీ షో రూపంలో ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారు. 'షో టైం' సినిమా తీద్దాం రండి అనే ఉపశీర్షికతో ఒక రియాల్టీ షోను తీసుకురాబోతున్నారు. దీనికి సంబంధించి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నిర్మాత అనిల్ సుంకర మాట్లాడుతూ.. చాలామంది సినిమా తీయాలన్నా కళతో తమ దగ్గర ఉన్న డబ్బులన్నీ పెట్టి సినిమా నిర్మిస్తారు కానీ దాన్ని విడుదల చేయడానికి చాలా కష్టాలు పడతారు. చాలామంది డబ్బులు పోగొట్టుకున్న సందర్భాలు కూడా చూసానని అనిల్ సుంకర చెప్పారు. అలాగే ఈ రోజుల్లో సినిమా నిర్మాణ వ్యయం కూడా విపరీతంగా పెరిగిందని, ప్రొడక్షన్ లో చాలావరకు అనవసరమైన ఖర్చులను తగ్గించాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఇలాంటి సవాళ్లు ఎన్నో సినిమా తీసే నిర్మాతకు ఎదురవుతున్నాయని వాటన్నింటినీ ఈ రియాల్టీ షోద్వారా చూపించే ప్రయత్నం చేస్తున్నట్లు చెప్పారు. అన్ని రియాల్టీ షోలా మాదిరిగానే ఇది కూడా ఎలాంటి స్క్రిప్ట్ లేని రియాల్టీ షో అని, ఇది ఒక ప్రముఖ ఓటీటీలో ఇంటర్నేషనల్ వైడ్‌గా స్ట్రీమింగ్ అవబోతుందని దానికి సంబంధించిన వివరాలను త్వరలోనే తెలియజేస్తానని తెలిపారు. ఇక ఈ షో కు మొత్తం 16 స్క్రిప్టును ఎంపిక చేసుకొని అందులో 4 బెస్ట్ స్క్రిట్లను 12 మంది జడ్జీలు ఫైనల్ చేస్తారని తెలిపారు. ఆ ఫైనల్ అయిన స్క్రిప్టుకు అన్ని విభాగాల్లో పనిచేసే నిపుణులను ఆర్టిస్టులను షోలోనే ఎన్నుకుంటారని వివరించారు. ఇక ఆ స్క్రిప్ట్స్ నేరుగా ఆసక్తి ఉన్న నిర్మాతలు బెడ్డింగ్ చేసి ఒక కోటి రూపాయలలో కేవలం 30 రోజులలోనే సినిమా పాటలతో సహా షూటింగ్ జరిపేలా ఒక అద్భుతమైన ప్రణాళికను రెడీ చేయబోతున్నట్లు వివరించారు. ఈ రియాల్టీ షో కి సంబంధించి ఆ తర్వాత షో గురించి మరిన్ని వివరాలు త్వరలోనే తెలియజేస్తామని చెప్పారు.


# 'హలగలి' మూవీ చేయడం నా అదృష్టం

## ప్రెస్ మీట్‌లో హీరో డాలీ ధనంజయ



ట్యాలెంటెడ్ హీరో డాలీ ధనంజయ, సప్తమి గౌడ ప్రధాన పాత్రల్లో సుకేష్ నాయక్ దర్శకత్వంలో యార్లగడ్డ లక్ష్మీ శ్రీనివాస్ సమర్పణలో కళ్యాణ్ చక్రవర్తి ధూళిపల్ల నిర్మిస్తున్న హిస్టారికల్ ప్రాజెక్ట్ 'హలగలి'. ఈ చిత్రం రెండు భాగాలుగా తెరకెక్కుతోంది. కన్నడ, తెలుగు, తమిళం, మలయాళం, హిందీలో చిత్రీకరిస్తున్నారు. గ్రాండ్‌గా జరిగిన ప్రెస్ మీట్‌లో ఈ సినిమా గ్లింప్స్‌ని లాంచ్ చేశారు మేకర్స్. ధనంజయ్‌ను కమాండింగ్ అవతార్ ప్రజెంట్ చేసిన గ్లింప్స్ గ్రేట్ ఇంపాక్ట్ క్రియేట్ చేసింది. ప్రెస్ మీట్‌లో హీరో డాలీ ధనంజయ మాట్లాడుతూ, తెలుగు ప్రేక్షకులు చూపిస్తున్న ప్రేమకి కృతజ్ఞతలు. హలగలి అన్ టోల్డ్ స్టోరీ. ఈ సినిమాలో పార్ట్ కావడం గర్వంగా భావిస్తున్నాను. హలగలి కర్ణాటకలో గ్రేట్ ఎమోషన్. నిర్మాత కళ్యాణ్, డైరెక్టర్ సుకేష్ చాలా ప్యాషన్‌తో ఈ ప్రాజెక్టుని రూపొందిస్తున్నారు. కథ వినగానే ఈ ప్రాజెక్టులో పార్ట్ అవ్వాలి అనిపించింది. ఈ గ్లింప్స్ మీ అందరికీ నచ్చడం ఆనందంగా వుంది. మరిన్ని క్రేజీ అప్డేట్స్ రాబోతున్నాయి. తప్పకుండా సినిమా ఒక మంచి ఎక్స్పీరియన్స్ ఇవ్వబోతుంది. అందరి అంచనాలను అందుకుంటుంది. మీ అందరి సపోర్ట్‌కి థాంక్యూ. తప్పకుండా ఈ సినిమా చాలా మంచి ప్రాజెక్ట్ అవుతుంది. హీరోయిన్ సప్తమి గౌడ మాట్లాడుతూ, ఈ సినిమా చేయడం గొప్ప అదృష్టంగా భావిస్తున్నాను. ఇది చరిత్రలో చాలా ముఖ్యమైన చాప్టర్. త్వరలోనే నా క్యారెక్టర్‌కి సంబంధించిన గ్లింప్స్ కూడా రిలీజ్ కాబోతోంది. చాలా మాస్ క్యారెక్టర్ చేశాను. ఇది మన నేల కథ. డైరెక్టర్ చాలా అద్భుతంగా రాశారు. చాలా బిగ్ స్కేల్‌లో ఈ సినిమా తీస్తున్నారు. ఈ సినిమాలో సెట్స్ చాలా అద్భుతంగా ఉంటాయి. ధనుంజయతో ఇది నా సెకండ్ ఫిల్మ్. ఆయనతో స్క్రీన్ షేర్ చేసుకోవడం చాలా ఆనందంగా ఉంది. ఈ సినిమా తప్పకుండా మీ అందరిని అలరిస్తుంది ప్రొడ్యూసర్ కల్యాణ్ చక్రవర్తి మాట్లాడుతూ, ఈ సినిమా హీరో లుక్ కట్ చేసినప్పుడే మాకు ఫుల్ కాన్ఫిడెన్స్ వచ్చేసింది. ఫస్ట్ స్టెప్‌లోనే సక్సెస్ అయిపోయామనే ఫీలింగ్ కలిగింది. డైరెక్టర్ సుఖేష్‌పై నాకు చాలా నమ్మకం ఉంది. చాలా ప్యాషన్‌తో ఈ సినిమాను తీశారు. హలగలి చరిత్రలో ఒక అధ్యాయం. బ్రిటిష్‌కి వ్యతిరేకంగా వారు చేసిన పోరాటం చిరస్మరణీయం. కన్నడలో పదో తరగతి పాఠ్యాంశంలో కూడా ఇది ఉంది. దీని గురించి చాలామంది రీసెర్చ్‌లు చేశారు. ఈ సినిమా గురించి రీసెర్చ్ చేస్తున్నప్పుడు మాకు గూస్ బంప్స్ వచ్చాయి. ఇది ఒక పార్ట్‌లో చెప్పాల్సింది కాదు. రెండు పాటలుగా చెప్పాల్సిన కథని అప్పుడే నిర్ణయించుకున్నాము. సినిమాలో డాలీ క్యారెక్టర్ చాలా పవర్ఫుల్గా అద్భుతంగా ఉండబోతుంది. సప్తమి గారిది మాస్ క్యారెక్టర్. అద్భుతంగా పెర్ఫార్మ్ చేశారు. ఈ సినిమా కోసం అందరూ చాలా హార్డ్ వర్క్ చేశారు. ఈ సినిమాకి పనిచేసిన అందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు. డైరెక్టర్ సుకేష్ మాట్లాడుతూ, అందరికీ నమస్కారం. 40 పర్సెంట్ షూటింగ్ కంప్లీట్ అయింది. ఇది ఒక పార్ట్ లో చెప్పే కథ కాదు. ఈ కథ వెనుక చాలా గొప్ప చరిత్ర ఉంది. అందుకే రెండు పార్ట్స్ గా తీసుకొస్తున్నాం. ఈ సినిమా ఆడియన్స్ గొప్ప థియేట్రికల్ ఎక్స్ పీరియన్స్ ఇస్తుంది అన్నారు.

# 'అర్జున్ చక్రవర్తి' యాంథమ్ రిలీజ్



విజయ రామరాజు టైటిల్ రోల్ పోషించిన స్పోర్ట్స్ డ్రామా 'అర్జున్ చక్రవర్తి'. విక్రాంత్ రుద్ర దర్శకత్వం వహించిన ఈ సినిమాని నిర్మాత శ్రీని గుబ్బల నిర్మించారు. ఇప్పటికే ఈ సినిమాకు 46 ఇంటర్నేషనల్ ఫిల్మ్ అవార్డ్స్ వచ్చాయి. ఇటివలే రిలీజైన టీజర్, సాంగ్‌కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. ఇప్పుడు మేకర్స్ అర్జున్ చక్రవర్తి యాంథమ్ రిలీజ్ చేశారు. విఘ్నేష్ బాస్కరన్ ఈ సాంగ్ ని పవర్ ఫుల్ కంపోజ్ చేశారు. విక్రాంత్ రుద్ర రాసిన లిరిక్స్ స్ఫూర్తిదాయకంగా వున్నాయి. దీపక్ బ్లూ, బృథ్వీవ్ సత్యకుమార్, విఘ్నేష్ పాయ్ తమ ఎనర్జిటిక్ వోకల్స్ కట్టిపడేశారు. ఈ సాంగ్‌లో విజయరామరాజు ఫిజికల్ ట్రాన్స్ ఫర్మేషన్ అవుతున్న విజువల్స్, వండర్ ఫుల్ లోకేషన్స్ అద్భుతంగా వున్నాయి. ఈ సాంగ్ విన్న వెంటనే అందరినీ కనెక్ట్ అవుతుంది. ఈ చిత్రంలో హర్ష్ రోషన్, అజయ్, అజయ్‌ఘోష్, దయానంద్ రెడ్డి కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి జగదీష్ చీకాటి డీవోపీ, ప్రదీప్ నందన్ ఎడిటర్, సుమిత్ పటేల్ ప్రొడక్షన్ డిజైనర్. ఈ చిత్రం ఆగస్టు 29న ప్రేక్షకుల ముందుకు రానుంది. నటీనటులు: విజయ రామరాజు, సిజా రోజ్, హర్ష్ రోషన్, అజయ్, అజయ్ ఘోష్, దయానంద్ రెడ్డి, దుర్గేష్.




# జాన్వీ ఫ్యాషన్ సెన్స్



ప్రస్తుతం జాన్వీ కపూర్ యూనిక్ వీడియో ఇంటర్నెట్‌లో వైరల్‌గా షేర్ అవుతోంది. ముఖ్యంగా జాన్వీ ఫ్యాషన్ సెన్స్ పరంగా రోజురోజుకు కొత్తదనంతో షైన్ అవుతోందని అభిమానులు ప్రశంసిస్తున్నారు. నెలవంకను తలపించే లేగకళ్లు.. అందంగా విరబోసిన శిరోజాలు.. గాలికి ఊగిసలాడే భారీ చెవి లోలాకులు.. వైట్ కలర్ టైట్ టాప్, కాంబినేషన్ ఫ్లోరల్ పరికిణీ,.. ఈ వేషధారణ ఎవరిది? అని అనుకుంటున్నారా? నిస్సందేహంగా అది జాన్వీకపూర్. పబ్లిక్‌లో ఇంత అందంగా తనను తాను ప్రెజెంట్ చేసుకునే స్కిల్ జాన్వీకి మాత్రమే ఉంది. అతిలోక సుందరి నటవారసురాలు అలా నవ్వులు చిందిస్తూ ఫోటోగ్రాఫర్లకు హాయ్ చెబుతూ లేదా శిరోజాలను అందంగా సవరిస్తూ, ఎంత ముచ్చటగా కనిపిస్తోంది. వెండి తెరపై తొలిసారి చూసుకున్నపుడు రజనీ ఏం చేశారో తెలుసా? ప్రస్తుతం జాన్వీ కపూర్ యూనిక్ వీడియో ఇంటర్నెట్‌లో వైరల్‌గా షేర్ అవుతోంది. ముఖ్యంగా జాన్వీ ఫ్యాషన్ సెన్స్ పరంగా రోజురోజుకు కొత్తదనంతో షైన్ అవుతోందని అభిమానులు ప్రశంసిస్తున్నారు. జెన్ జెడ్ కిడ్స్‌లో జాన్వీఫ్యాషన్ సెన్స్‌యూనిక్‌గా ఉంటుందని కొందరు కీర్తించారు. పబ్లిక్ అటెన్షన్ తనవైపు తిప్పేసుకోవడంలో జాన్వీని మించిన వారే లేరు! అంటూ ప్రశంసలు కురిపిస్తున్నారు. కెరీర్ మ్యాటర్‌కి వస్తే... జాన్వీకపూర్ తదుపరి రామ్‌చరణ్ పెద్దిలో నటిస్తోంది. ఉప్పెన ఫేం బుచ్చిబాబు ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమా చేస్తున్న సమయంలోనే జాన్వీ బ్యాక్ టు బ్యాక్ సినిమా అవకాశాలు వచ్చినా ప్రస్తుతానికి అడపాదడపా మాత్రమే హిందీలో నటిస్తోంది. ప్రస్తుతం సిద్ధార్థ్ మల్హోత్రాతో కలిసి పరమ్ సుందరి రిలీజ్ ప్రమోషన్స్‌లో జాన్వీ బిజీ బిజీగా ఉంది. తన తాజా చిత్రం ప్రమోషన్స్ కోసం లక్నో బయల్దేరుతున్నప్పటి వీడియో ఇది. బాలీవుడ్ మీడియా వెంటపడి మరీ జన్వీని ఇంత అందంగా ప్రెజెంట్ చేసింది. స్టిల్ ఫొటోగ్రాఫర్లు లేదా వీడియో జర్నలిస్టులు వెంబడించి విసిగించినా కానీ, అది సెలబ్రిటీలను హైప్ చేయడం కోసం మాత్రమేననేది ఆలియా లాంటి ప్రముఖులు కాస్తయినా గ్రహించాలి. అప్పుడప్పుడు జరిగే తప్పులను క్షమించాలి.

## కుటుంబ అనుబంధాలతో

# 'నేను నా లల్లి'



కథ, స్క్రీన్ ప్లే, దర్శకత్వ బాధ్యతలతో పాటు హీరోగా నటిస్తూ.. తనే స్వయంగా 'నేను నా లల్లి' అనే చిత్రాన్ని నిర్మిస్తున్నారు ఎన్.ఎన్.ఆర్ చౌదరి. నేడు ఆయన పుట్టినరోజు (ఆగస్టు 18). ఈ సందర్భంగా చిత్రానికి సంబంధించిన పలు విశేషాలను వివరిస్తూ... మా సినిమా షూటింగ్ మొత్తం విజయవంతంగా పూర్తయింది. నిర్మాణానంతర పనులన్నీ చకచకా సాగుతున్నాయి. దీనిలో భాగంగానే ఎడిటింగ్ డబ్బింగ్ కూడా పూర్తయ్యింది. ప్రస్తుతం డిఏకి ఎఫెక్ట్స్‌కి.. అదేవిధంగా ఆర్ఆర్ కి ఇవ్వడం జరిగింది. చాలా పకడ్బందీగా ఎంతో స్పీడ్‌గా పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ శరవేగంగా జరుగుతోంది. మా 'నేను నా లల్లి' సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునే విధంగా ఉంటుంది. సినిమా కూడా మేము అనుకున్న పద్ధతిలోనే చాలా బాగా వచ్చింది. మా యూనిట్ సభ్యులంతా సినిమాపై ఎంతో నమ్మకంగా ఉన్నారు. సినిమా బాగా తెరకెక్కడానికి వారంతా ఎంతగానో శ్రమించారు. వారందరి శ్రమ వల్లే సినిమా ఆద్యంతం ప్రేక్షకులను వినోదంలో ముంచెత్తడం ఖాయం. ఆ బలమైన నమ్మకం మాకుంది. ప్రేక్షకులకు ఒక మంచి ఫ్యామిలీ ఎఫెక్షన్స్ ఉండేలా చిత్రాన్ని అందిస్తున్నందుకు చాలా ఆనందంగా ఉంది. కథ, స్క్రీన్ ప్లే, దర్శకత్వ బాధ్యతలతో పాటు హీరోగా నటిస్తూ.. నేనే స్వయంగా కథపై నమ్మకంతోనే 'నేను నా లల్లి' చిత్రాన్ని నిర్మిస్తున్నాను. ఈ చిత్రానికి సంబంధించిన పాటలు కూడా నేనే రాయడం జరిగింది. థియేటర్ కు వచ్చిన ప్రతీ ఒక్కరూ ఈ చిత్రాన్ని చూసి ఎంతగానో ఎంజాయ్ చేస్తారన్న గట్టి నమ్మకం మాకుంది. మా నమ్మకం నిజమని చిత్రాన్ని చూశాక మీరే మెచ్చుకుంటారు. ఈ సినిమాలో నటించిన ప్రతీ ఒక్కరికీ చక్కటి పేరు వస్తుంది. అందరూ తమతమ పాత్రల్లో ఇమిడిపోయి ప్రతిభను కనబరిచారు అని పేర్కొన్నారు. హీరోయిన్ తస్లీమ్ మాట్లాడుతూ .. సినిమాలో నటిస్తున్నప్పుడు ఎంతగానో ఆనందపడ్డాను. నా పాత్ర ఫ్యామిలీ ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంటుందన్న నమ్మకం నాకు కలిగింది. ఒక ఫ్యామిలీలో ఉండే అమ్మ, నాన్న, అక్క, చెల్లి, తమ్ముడు, అన్న ఇలా అందర్నీ సినిమా ఆలోచనలో పడేస్తుంది. ఎంత చక్కటి సినిమా చూశామన్న అనుభూతి ప్రతీ ఒక్కరికీ కలుగుతుంది. మా దర్శకుడు, నిర్మాత, హీరో అయిన ఎన్.ఎన్.ఆర్ చౌదరి గారు ఎక్కడా రాజీపడకుండా చిత్రాన్ని అందంగా.. అందరూ మెచ్చేలా తెరకెక్కించారు. వారి శ్రమ తెరపై చూడాల్సిందే అని అన్నారు. ఈ చిత్రంలోని ఇతర పాత్రల్లో పద్మ జయంతి, హేమ సుందర్, పద్మా రెడ్డి తదితరులు నటించారు. ఈ చిత్రానికి సంగీతం: ఎం.ఎల్. రాజా, మాటలు: మెండెం శ్రీధర్, డీఓపీ : శ్రీనివాసచారి , మేకప్: సాంబశివరావు, డాన్స్: మాస్టర్ కపిల్, ఆర్ట్ డైరెక్టర్ : నాని పండు, ఫైట్ : మాస్టర్ తుఫాన్, పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ : డ్రీమ్ స్టూడియో , బ్యానర్ : పవన్ తేజ ఫిలిం, కథస్క్రీన్ ప్లేపాటలుదర్శకత్వం నిర్మాత : ఎన్.ఎన్.ఆర్ చౌదరి.

# త్వరలో '1990' మూవీ!



ఎమ్.ఎమ్.సి బ్యానర్‌పై అరుణ్, రాణి వరద్ హీరో హీరోయిన్లుగా తెరకెక్కుతున్న చిత్రం 1990. కర్ణాటకలో జరిగిన యదార్థ సంఘటన ఆధారంగా తెరకెక్కిన ప్రేమ కథా చిత్రం. అద్భుతమైన లొకేషన్స్ లో పాటలు చిత్రికరించిన ఈ చిత్రం. సినిమా షూటింగ్ పూర్తి చేసుకొని త్వరలో తెలుగు, కన్నడ, మలయాళం, తమిళ భాషల్లో విడుదల కాబోతోంది. నందకుమార్ సి.ఎమ్ దర్శకత్వంలో రాబోతున్న ఈ సినిమాకు నిర్మాత చంద్ర శేఖర్ బిఎస్. ఇటీవల విడుదలైన ఈ చిత్ర టీజర్‌కు మంచి రెస్పాన్స్ లభించింది. త్వరలో ఈ మూవీ సాంగ్స్ ట్రైలర్ విడుదల కానున్నాయి. ఇసి. మహారాజ్ సంగీతం అందించిన ఈ సినిమాకు హాలేస్ సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. ఎడిటర్ : కృష్ణ, కొరియోగ్రాఫర్: సాధిక్ సర్దార్, నిర్మాత: చంద్ర శేఖర్ బిఎస్, సహనిర్మాత : అరుణ్ కుమార్, పిఆర్ఓ: లక్ష్మీ నివాస్.

# అమెరికాలో '43వ ది వరల్డ్ లార్జెస్ట్ ఇండియా డే' పెరేడ్‌లో విజయ్ దేవరకొండ



ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ అసోసియేషన్స్ ఆధ్వర్యంలో అమెరికాలోని న్యూయార్క్‌లో జరిగిన ది వరల్డ్ లార్జెస్ట్ ఇండియా డే పెరేడ్‌లో గ్రాండ్ మార్షల్‌గా పాల్గొని సందడి చేశారు హీరో విజయ్ దేవరకొండ. మాడిసన్ అవెన్యూలో సర్వే భవంతు సుఖినః అనే థీమ్‌తో జరిగిన పరేడ్ వేడుకలకు గ్రాండ్ మార్షల్‌గా విజయ్ దేవరకొండ వ్యవహరించారు. ఈ వేడుకల్లో స్థానిక అమెరికన్స్‌తో పాటు భారీ సంఖ్యలో అమెరికాలోని ప్రవాస భారతీయులు పాల్గొన్నారు. ఈ వేడుకల్లో ప్రఖ్యాత ఎంపైర్ బిల్డింగ్ మన జాతీయ జెండాలోని మూడు రంగుల విద్యుత్ కాంతులతో వెలిగిపోయింది. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఈ మువ్వన్నెల లైటింగ్ ను విజయ్ దేవరకొండ స్విచ్చాన్ చేశారు. ఈ సందర్భంగా విజయ్ దేవరకొండ మాట్లాడుతూ, అందరికీ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు. ప్రవాస భారతీయ సోదరులు మన దేశ గొప్పదనాన్ని ప్రపంచానికి చాటుతున్నారు. ఎంపైర్ స్టేట్ బిల్డింగ్ పై మన మూడు రంగులు చూడటం సంతోషాన్ని కలిగిస్తోంది. దేశం కోసం వీళ్లు చేస్తున్న కాంట్రిబ్యూషన్ చూస్తుంటే గర్వంగా ఉంది. మన పెద్దలు ఎంతోమంది చేసిన త్యాగాలు, వారి కృషివల్లే మనం ఈ రోజు ఇంత ఆనందంగా స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకోగలుగుతున్నాం, జీవించగలుగుతున్నాం అన్నారు.

18-8Pg5 9th page_18-8Pg5.qxd 8/17/2025 11:29 PM Page 1



# ఓట్ల చోరీకి మరోసారి బిజెపి కుట్ర

బీహార్ ఓటర్ అధికార యాత్రలో రాహుల్ గాంధీ



**పాట్నా, ఆగస్టు 17:** కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపు కోసం కొత్త కుట్ర జరుగుతోందని రాహుల్ గాంధీ ఆరోపించారు. ఆదివారం బీహార్‌లోని ససారాంలో ఓటర్‌అధికార్ యాత్రను ఆయన ప్రారంభించారు. అంతకు ముందు రాహుల్ గాంధీ మాట్లాడుతూ ఎన్నికల సంఘంపై ఆయన తీవ్ర ఆరోపణలు సంధించారు. బీహార్‌లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ద్వారా ఓట్లను తొలగించడం, జోడించడం ద్వారా ఎన్నికల్లో ఓట్లను దొంగిలించడానికి కొత్త కుట్ర జరుగుతోందని విమర్శించారు. రాజ్యాంగాన్ని రక్షించేదుకే తాను ఈ యాత్ర చేపట్టినట్లు ఆయన వివరించారు. దేశవ్యాప్తంగా జరిగిన అసెంబ్లీ, లోక్ సభ ఎన్నికల్లో ఇలాగే ఓట్లు చోరీకి గురయ్యాయని ఆరోపించారెందారు. బీజేపీ ఎస్ఐఆర్ ద్వారా ఓట్ల దొంగిలించేదుకు కుట్ర జరుగుతుందని మండిపడ్డారు. దీని ద్వారా దేశ ప్రజలకు ఎన్నికల సంఘం ఎలా ఓట్లను చోరీ చేస్తుందో అర్థమవుతుందని చెప్పారు. అయితే ఓటుచోరీపై తాను ప్రెస్ కాన్ఫరెన్స్ నిర్వహించిన తర్వాత అఫిడవిట్ సమర్పించాలని తనను ఎన్నికల సంఘం కోరిందన్నారు. కానీ బీజేపీ నేతలు చేసిన ఆరోపణలపై మాత్రం ఎన్నికల సంఘం స్పందించ లేదన్నారు. బీహార్‌లో ఓట్ల చోరీని తాము అనుమతించబోమని ఆయన స్పష్టం చేశారు. పేదవారికి ఓటు ఒకటే అధికారమని తెలిపారు. వారి ఓటును లాక్కోనే అధికారం ఎవరికి లేదన్నారు. ఇక ప్రతి ఎన్నికల్లో బీజేపీనే ఘన విజయం సాధిస్తుందని తెలిపారు. మహారాష్ట్రతోపాటు పలు ఎన్నికల్లో ఇండియా కూటమి ఘన విజయం సాధిస్తుందని పలు ఒపీనియన్ పోల్స్ స్పష్టం చేశాయని గుర్తు చేశారు. 2024, సార్వత్రిక ఎన్నికల్లో కాదు.. అంతకు ముందు జరిగిన మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో సైతం ఇండియా కూటమిదే అధికారమని తేల్చి చెప్పాయని పేర్కొన్నారు. కానీ ఆ ఎన్నికలన్నింటిలో బీజేపీ భాగస్వామ్య పక్షాలే గెలిచాయని వివరించారు. దాదాపు కోటి ఓట్లను కొత్తగా ఓటర్ల జాబితాలో చేర్చడం ద్వారా ఈ గెలుపు సాధ్యమైందని ఎంపీ రాహుల్ గాంధీ వివరించారు. అయితే బీహార్‌లో ఓటర్ల జాబితా సవరణకు వ్యతిరేకంగా ఇండియా కూటమిలోని భాగస్వామ్య పక్షాలు ఆందోళన చేస్తాయని తెలిపారు. మరికొన్ని నెలల్లో జరగనున్న బీహార్ అసెంబ్లీఎన్నికల జరుగనున్నాయని పేర్కొన్నారు. వాటి లక్ష్యంగా ఓటు హక్కు తొలగించేందుకు ఎన్నికల సంఘం తన వంతు ప్రయత్నం చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓటు అధికార్ యాత్ర ప్రారంభ కార్యక్రమంలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, రాష్ట్రీయ జనతాదళ్ అధ్యక్షుడు లాలూ ప్రసాద్ యాదవ్, ఆ పార్టీ నేత తేజస్వీ యాదవ్‌తోపాటు ఇండియా కూటమికి చెందిన నేతలు పలువురు పాల్గొన్నారు. ఆగస్టు 17వ తేదీన ససారాంలో ప్రారంభమైన ఈ యాత్ర సెప్టెంబర్ 1వ తేదీతో పట్నాలో ముగియనుంది.

## కతువా జిల్లాలో భారీ వరదలకు నలుగురి మృతి

**శ్రీనగర్, ఆగస్టు 17:** జమ్మూకశ్మీర్‌లోని కథువా జిల్లాలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. గత రాత్రి కురిసిన భారీ వర్షాలు నలుగురి ప్రాణాలను బలితీసుకున్నాయి. మరికొందరు గాయపడ్డారు. వరద ప్రవాహం కారణంగా ఒక గ్రామానికి బాహ్య ప్రపంచంతో పూర్తిగా సంబంధాలు తెగిపోవడంతో సహాయక చర్యలకు ఆటంకం ఏర్పడుతోంది. ఈ ప్రకృతి విపత్తు కారణంగా జిల్లాలో తీవ్ర నష్టం వాటిల్లింది. రైల్వే ట్రాక్‌తో పాటు జాతీయ రహదారి కూడా దెబ్బతిన్నట్లు కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌పైనా వరద ప్రభావం పడిందని ఆయన 'ఎక్స్'లో వెల్లడించారు. పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నామని, పౌర, సైనిక, పారామిలిటరీ బలగాలు సహాయక చర్యల్లో నిమగ్నమయ్యాయని ఆయన పేర్కొన్నారు. ఈ దుర్ఘటనపై జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపిన ఆయన, క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ప్రభావిత ప్రాంతాల్లో తక్షణమే సహాయక చర్యలు చేపట్టాలని, బాధితులకు అవసరమైన అన్ని రకాల సహాయాన్ని అందించాలని అధికారులను ఆదేశించారు. భారీ నుంచి అతి భారీ వర్షాలు కొనసాగుతున్న నేపథ్యంలో కథువా జిల్లా యంత్రాంగం ప్రజలకు కీలక హెచ్చరికలు జారీ చేసింది. నదులు, వాగులు, కొండచరియలు విరిగిపడే ప్రమాదం ఉన్న ప్రాంతాలకు దూరంగా ఉండాలని సూచించింది. ఆకస్మిక వరదల ముప్పు పొంచి ఉన్నందున అత్యంత అప్రమత్తంగా ఉండాలని, అనవసర ప్రయాణాలు మానుకోవాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

## హిమాలయ రాష్ట్రాల్లో క్లౌడ్‌బరస్ట్‌లతో అతలాకుతలం



**శ్రీనగర్, ఆగస్టు 17:** జమ్మూకాశ్మీర్‌లో గత కొన్ని రోజుల నుంచి క్లౌడ్ బరస్ట్‌లు వరుస విషాదాలకు దారి తీస్తున్నాయి. గత గురువారం కిస్త్‌వార్‌లోని చషోటి గ్రామంలో క్లౌడ్ బరస్ట్ చోటుచేసుకుంది. దీంతో 60 మంది చనిపోయారు. శనివారం కథువా జిల్లాలో క్లౌడ్ బరస్ట్ చోటుచేసుకుంది. ఈ ఘటనలో నలుగురు చనిపోయారు. ఇలా జమ్మూకాశ్మీర్‌లో విలయం సృష్టిస్తున్న క్లౌడ్ బరస్ట్‌తో అపారనష్టం జరిగింది. అతి తక్కువ సమయంలో,అతి తక్కువ భౌగోళిక ప్రాంతంలో, అతి ఎక్కువ వర్షపాతం పడటాన్ని క్లౌడ్ బరస్ట్‌అని అంటారు. 20 నుంచి 30 చదరపు కిలోమీటర్ల పరిధిలో గంటలకు 10 సెంటీ మీటర్ల వర్షపాతం పడితే దాన్ని క్లౌడ్ బరస్ట్ అంటారు. ఒక్కోసారి ఉరుములు, పిడుగులతో భారీ స్థాయిలో కురిసే వర్షాల కారణంగా వరదలు సైతం వస్తుంటాయి. స్వల్ప పరిధిలో రెండు గంటల వ్యవధిలో 5 సెంటీమీటర్లు లేదా అంతకంటే ఎక్కువ వర్షపాతం పడితే మినీ క్లౌడ్ బరస్ట్ అంటారు. అయితే, తక్కువ సమయంలో కురిసే అన్ని భారీ వర్షాలను క్లౌడ్ బరస్ట్‌లు అనలేము. కొన్ని వాతావరణ పరిస్థితులు ఉంటేనే క్లౌడ్ బరస్ట్ అంటాము. రుతు పవనాలు దేశంలోకి ప్రవేశించినపుడు అరేబియా సముద్రంలోనుంచి తేమతో కూడిన గాలులు వీస్తాయి. ఇవి అధిక తేమ కలిగిన మేఘాలుగా మారతాయి. వాతావరణం లో వేడి వల్ల ఈ మేఘాలు కరుగుతూ ఉం టాయి. అలా కరిగి, కరిగి మేఘాలు బరువెక్కుతాయి. ఏదో ఒక చోట పేలిపోతాయి. అలా తక్కువ ప్రాంతంలో, తక్కువ సమయంలో భారీ వర్షం పడి వినాశనం జరుగుతుంది. 1970లో ఉత్తరాఖండ్‌లోని అలకనందా లోయలో క్లౌడ్ బరస్ట్ కారణంగా భారీ విధ్వంసం జరిగింది. అలకనందా నదికి వరద నీరు పోటెత్తటంతో ప్రాణ, ఆస్తి నష్టం సంభవించింది. 1993లో ఉత్తరాఖండ్‌లోని పితోరాఘర్ జిల్లా, మల్ప గ్రామంలో క్లౌడ్ బరస్ట్ కారణంగా కొండచరియలు విరిగిపడ్డాయి. దీంతో కైలాష్ మానస సరోవర్ యాత్రకు వెళుతున్న భక్తులు చాలా మంది చనిపోయారు. 2003 నుంచి 2004 మధ్య కాలంలో ఉత్తరాఖండ్‌లోని కులు, చమలీ ఏరియాలో మినీ క్లౌడ్ బరస్ట్ చోటుచేసుకుంది. దీంతో కొండ ప్రాంతంలో ఆస్తి నష్టం సంభవించింది. 2010లో లడఖ్‌లోని లేహ్‌లో క్లౌడ్ బరస్ట్ కారణంగా పెను విషాదం చోటుచేసుకుంది. దాదాపు 200 మంది చనిపోయారు. వందల మంది గాయపడ్డారు. 2022 జమ్మూకాశ్మీర్‌లో అమర్‌నాథ్ గుహ దగ్గర క్లౌడ్ బరస్ట్ చోటుచేసుకుంది. ఈ ఘటనలో పలువురు చనిపోయారు.

## తెరుచుకున్న శబరిమలై: ప్రత్యేక పూజలు నిర్వహించిన ప్రధానాచార్యులు



**పతనంతిట్ట, ఆగస్టు 17:** కేరళలోని ప్రసిద్ధ శబరిమల అయ్యప్పస్వామి ఆలయం తలుపులు తెరుచుకున్నాయి. వార్షిక చింగం మాస పూజల కోసం శనివారం సాయంత్రం ఐదు గంటలకు ఆలయ పూజారులు తలుపులు తెరిచారు. ప్రధాన పూజారి అరుణ్ కుమార్ నంబూద్రి తంత్రి కందరరు మహేష్ మోహనరు సమక్షంలో ఆలయ దీపాలను, ఆళి (పవిత్ర అగ్నిగుండం)ను వెలిగించారు. వేలాది మంది అయ్యప్ప భక్తులు భారీ వర్షాన్ని లెక్కచేయకుండా వేడుకను తిలకించారు. చింగం మాస పూజలను పూర్తి అయ్యే వరకు పడిపూజ కార్యక్రమం ప్రతిరోజూ సాయంత్రం 6:30 గంటలకు జరుగుతుంది. అదే సమయంలో సెప్టెంబర్ 20న పంబా నది ఒడ్డున గ్లోబల్ అయ్యప్ప సమావేశం జరుగుతుందని దేవాదాయ శాఖ మంత్రి వీఎన్ వాసవన్ ప్రకటించారు. ఇంత పెద్ద ఎత్తున సమావేశం నిర్వహించడం ఇదే మొదటిసారి కాబట్టి, ఒక చారిత్రాత్మక కార్యక్రమంగా నిలవనుందని తెలిపారు. వివిధ దేశాల నుంచి 3,000 మంది ప్రతినిధులు హాజరవుతారని భావిస్తున్నట్లు తెలిపారు. రూ.1,300 కోట్ల విలువైన మాస్టర్ ప్లాన్ సిద్ధంచేసామన్నారు. శబరిమల ప్రపంచ ఖ్యాతిని పెంచే లక్ష్యంతో జరిగే ఆ సమావేశంలో కేంద్ర మంత్రులు, ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు పాల్గొంటారు. శబరిమల సంప్రదాయాలను కాపాడుతూ, భక్తుల ప్రయోజనాలను గౌరవిస్తూ, శబరిమలని ప్రపంచ తీర్థయాత్ర కేంద్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని మంత్రి వాసవన్ పేర్కొన్నారు. ప్రభుత్వం రూ.1,300 కోట్ల విలువైన మాస్టర్ ప్లాన్‌ను రూపొందించిందని తెలిపారు. అందులో శబరిమల విమానాశ్రయం, కొత్త రైల్వే లైన్ సహా వివిధ ప్రణాళికలు ఉన్నాయి. విమానాశ్రయం 2028 నాటికి ప్రారంభమయ్యే అవకాశం ఉంది. అదే సమయంలో జిల్లా పరిపాలన ఆధ్వర్యంలో పథనంతిట్టలో ప్రధాన నిర్వాహక కమిటీ కార్యాలయం ఏర్పాటు చేయనున్నారు. పంబా, పెరునాడ్, సీతాథోడ్‌లలో అదనపు కార్యాలయాలు ఉంటాయి. ప్రతినిధులకు బస్సుల ద్వారా రవాణా, వసతి ఏర్పాట్లు చేయనున్నారు. పంబాతో సహా ఆ ప్రాంతంలోని ఆసుపత్రులలో ఆధునిక వైద్య సౌకర్యాలు కల్పించనున్నారు. వాహనాల పార్కింగ్ కొండపై ఉండనుంది. స్వచ్ఛంద సంస్థలు పారిశుధ్యం, శుభ్రపరిచే విషయంలో సహాయం చేస్తాయి.



## పాకిస్థాన్‌లో పట్టాలు తప్పిన ప్యాసింజర్‌రైలు

**కరాచి, ఆగస్టు 17:** పొరుగుదేశంలో ప్యాసింజర్‌రైలు పట్టాలు తప్పింది. ఆదివారం పెషావర్ నుంచి కరాచీకి వచ్చే ప్యాసింజర్‌రైలులోని నాలుగు బోగీలు ఆకస్మికంగా పట్టాలు తప్పాయి. లోద్రాన్ రైల్వేస్టేషన్ సమీపంలో ప్రయాణీకులతో బయలుదేరిన ప్యాసింజర్‌రైలు ఆకస్మికంగా పట్టాలు తప్పింది. ఈరైలు కరాచీకి చేరుకునేలోపే ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఒకరు మృతిచెందగా మరో 20 మందికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్నవెంటనే రైల్వే అధికారులు సంఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించారు. పట్టాలు తప్పిన బోగీల్లో ఉన్న ప్రయాణీకులను బయటకు తీసారు. గాయపడిన వారిని ఆసుపత్రులకు తరలించారు. లోద్రాన్ డిప్యూటి కమిషనర్ డాక్టర్ లుబ్నా నజీర్‌ప్రకారం మరో ఇద్దరు వ్యక్తులపరిస్థితి విషమంగా ఉంది. వీరంతా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రమాదానికి గల కారణం ఇంకా నిర్ధారణ కాలేదు. ప్రమాదం తర్వాత ఈమార్గంలో కొన్ని గంటలపాటు రాకపోకలు నిలిపివేసారు. ట్రాక్ పునరుద్ధరించి తర్వాతనే రైళ్ల రాకపోకలు ప్రారంభం అయ్యాయి.

## ప్రియురాలికోసం కట్టుకున్న భార్యనే కడతేర్చిన బిజెపినేత

**అజ్మీర్, ఆగస్టు 17:** ప్రియురాలితో కలిసి జీవించేందుకు కట్టుకున్న భార్యనే అత్యంత దారుణంగా హత్య చేశాడో భర్త. ఈ ఘోరాన్ని కప్పిపుచ్చేందుకు దోపిడీ నాటకం ఆడినా, పోలీసుల విచారణలో అసలు నిజం బయటపడింది. రాజస్థాన్‌లోని అజ్మీర్‌లో జరిగిన ఈ ఘటన స్థానికంగా సంచలనం సృష్టించింది. బిజెపినేత అయిన భర్తే ఈ దారుణానికి పాల్పడటం గమనార్హం. అజ్మీర్‌కు చెందిన బిజెపి నాయకుడు రోహిత్ సైనీకి సంజు అనే మహిళతో వివాహమైంది. అయితే, అదే ప్రాంతానికి చెందిన రీతూ సైనీ అనే మరో మహిళతో రోహిత్‌కు కొంతకాలంగా వివాహేతర సంబంధం ఉంది. ఈ క్రమంలో తమ బంధానికి భార్య సంజు అడ్డుగా ఉందని భావించారు. ఈ నెల 10న సంజు అనుమానాస్పద స్థితిలో ఇంట్లో మరణించారు. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు విచారణ చేపట్టగా రోహిత్ పొంతనలేని సమాధానాలు చెప్పాడు. ఇంట్లోకి చొరబడిన దొంగలు, తన భార్యను హత్య చేసి విలువైన వస్తువులు ఎత్తుకెళ్లారని పోలీసులను నమ్మించే ప్రయత్నం చేశాడు. అయితే, అతని ప్రవర్తనపై అనుమానం వచ్చిన పోలీసులు తమదైన శైలిలో విచారించడంతో నేరాన్ని అంగీకరించాడు. ఈ కేసు వివరాలను అడిషనల్ ఎస్పీ (రూరల్) దీపక్ కుమార్ మీడియాకు వెల్లడించారు. "ప్రియురాలు రీతూ ప్రోద్బలంతోనే రోహిత్ తన భార్యను హత్య చేసినట్లు అంగీకరించాడు. తమ మధ్య నుంచి సంజును తొలగించుకోవాలని రీతూ ఒత్తిడి చేయడంతో ఈ దారుణానికి పాల్పడినట్లు తెలిపాడు.

ఘటన జరిగిన 24 గంటల్లోనే కేసును ఛేదించామని ఆయన వివరించారు. ఈ కేసులో ప్రధాన నిందితుడైన రోహిత్ సైనీతో పాటు, హత్యకు ప్రేరేపించిన అతని ప్రియురాలు రీతూ సైనీని కూడా అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. ఇద్దరినీ అదుపులోకి తీసుకుని మరింత లోతుగా విచారిస్తున్నారు.



## ఉగ్రవాదంపై పోరులో భారత్‌కు దక్షిణ కొరియా మద్దతు

### జైశంకర్ ధన్యవాదాలు

**న్యూఢిల్లీ, ఆగస్టు 17:** పహల్గామ్ ఉగ్రదాడి, ఉగ్రవాదంపై పోరాటంలో దక్షిణ కొరియా విదేశాంగ మంత్రి చో హ్యున్ భారత్‌కు సంఘీభావం ప్రకటించారు. భారత ప్రభుత్వం, ప్రజలతో తమ దేశం నిలుస్తుందని పేర్కొన్నారు. జాతీయ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో చో హ్యున్ దక్షిణ కొరియా ఉగ్రవాదాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. ఈ విషయంలో తాము చాలా కఠినంగా, దృఢంగా ఉన్నామన్నారు. ఏదైనా ఉగ్రవాద దాడిని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తామన్నారు. భారత ప్రభుత్వం, భారత ప్రజలతో ఉంటామన్నారు.

## న్యూయార్క్‌లో కాల్పుల కలకలం.. ముగ్గురి మృతి

**వాషింగ్టన్, ఆగస్టు 17:** అమెరికాలో కాల్పుల ఘటన కలకలం రేపింది. న్యూయార్క్ సిటీలోని రద్దీగా ఉన్న ఓ క్లబ్‌లో గుర్తుతెలియని వ్యక్తులు జరిపిన కాల్పుల్లో ముగ్గురు మృతి చెందారు. మరో ఎనిమిది మందికి గాయాలయ్యాయి. న్యూయార్క్ సిటీలో తుపాకీ హింస రికార్డు స్థాయిలో తగ్గిపోయిన వేళ ఈ కాల్పులు చోటుచేసుకున్నాయి. స్థానిక కాలమానం ప్రకారం ఆదివారం తెల్లవారుజామున 3.30 గంటల ప్రాంతంలో క్లబ్‌లో ఓ వివాదం చెలరేగిన తర్వాత పలు ఆయుధాలతో ఈ కాల్పులు జరిగినట్లు అనుమానిస్తున్నామని న్యూయార్క్ పోలీసు కమిషనర్ జెస్సికా టిష్ వెల్లడించారు.

ఘటనాస్థలం నుంచి 36 షెల్ కేసింగ్‌లను, సమీపంలోని వీధిలో ఓ తుపాకీని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మృతుల వయసు 27 నుంచి 61 యేళ్ల మధ్యలో ఉంటుందని చెప్పారు. గాయపడిన వారిలో ముగ్గురు మహిళలు ఉన్నారని, వారంతా ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు.



## పదవీ కాంక్షలేదు: ఆసిఫ్ మునీర్

**ఇస్లామాబాద్, ఆగస్టు 17:** పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ ఆసీం మునీర్ తనను తాను రక్షకుడిగా చెప్పుకునేందుకు తాపత్రయపడుతున్నారు. రాజకీయాలు, అత్యున్నత స్థానాలపై పదవీ కాంక్ష లేదని ప్రకటించడం గమనార్హం. దేశ సేవ కోసమే భగవంతుడు తనను పుట్టించాడని.. ప్రజలను కాపాడటం తప్ప తనకు మరో ఆలోచన ఉండదని అన్నారు. పాకిస్థాన్ అధ్యక్షుడు ఆసిఫ్ అలీ జర్దారీని బలవంతంగా గద్దెదించి దేశ సైనిక దళాల ప్రధానాధికారి ఆసీం మునీర్ ఆ స్థానాన్ని ఆక్రమించనున్నారంటూ గత కొద్ది రోజులుగా వస్తున్న వార్తలపై ఆయన స్పందిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. దేశంలో రాజకీయగా ఉద్రిక్తతలను సృష్టించడానికి కొందరు ఇటువంటి వార్తలను ప్రచారం చేస్తున్నారన్నారు.

## గాజా పౌరులకు వీసాలు నిలిపివేసిన యుఎస్

**వాషింగ్టన్, ఆగస్టు 17:** ఇజ్రాయెల్–హమాస్ యుద్ధం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న గాజా ప్రజలపై మరో పిడుగు పడింది. ఇకపై గాజా ప్రజలకు వీసాలు నిలిపివేస్తున్నట్లు అమెరికా ప్రభుత్వం ప్రకటించింది. ఇజ్రాయెల్ దాడుల్లో గాయపడిన అనేకమంది ప్రజలు చికిత్స కోసం యుఎస్‌కు వస్తున్నారని ట్రంప్ యంత్రాంగానికి ఫిర్యాదు అందడంతో ఈ చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. తాత్కాలిక వైద్య-మానవతా వీసాలను జారీ చేయడానికి ఉపయోగించే ప్రక్రియపై సమీక్ష నిర్వహిస్తున్నామని ఇందులో భాగంగా గాజా ప్రజలకు అన్నిరకాల వీసాలు నిలిపివేస్తున్నామని అమెరికా విదేశాంగ శాఖ వెల్లడించింది.





## భారత్ గడ్డపైకి అడుగుపెట్టిన శుభాంశు శుక్లా

### ఢిల్లీ సీఎం, కేంద్ర మంత్రులు ఘనస్వాగతం

**న్యూఢిల్లీ, ఆగస్టు 17:** యాక్సియం-4 మిషన్‌తో భారత రోదసి చరిత్రలో తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకున్న వ్యోమగామి శుభాంశు శుక్లా భారత్‌కు చేరుకున్నారు. అంతరిక్ష యాత్ర విజయవంతమయ్యాక అమెరికాలో ఉన్న ఆయన, ఆదివారం తెల్లవారుజామున స్వదేశానికి విచ్చేశారు. ఈ నేపథ్యంలో ఆయనకు భార్య కామ్నా శుక్లా, కుమారుడు సమక్షంలో కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్, ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖ గుప్తా శుభాంశుకు ఘన స్వాగతం పలికారు. శుక్లాశుభాంశు స్వదేశానికి చేరుకోవడం భారత్‌కు గర్వకారణమైన క్షణంగా కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ అభివర్ణించారు. భారతదేశానికి గర్వకారణమైన క్షణం అని ఇస్రోకు కీర్తినిచ్చే క్షణం అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో ఇందుకు దోహదపడిన వ్యవస్థకు కృతజ్ఞత తెలుపుతూ, దేశ అంతరిక్ష పరిశోధనలు భారత్‌సైతం చేయగలిగిందన్నారు. భారతమాత దిగ్గజ పుత్రుడు శుభాంశు శుక్లా ఈరోజు తెల్లవారుజామున ఢిల్లీలో అడుగుపెట్టారు. ఆయనతో పాటు మిషన్ గగన్‌యాన్‌కు ఎంపికైన వ్యోమగాముల్లో ఒకరైన గ్రూప్ కెప్టెన్ ప్రశాంత్ బాలకృష్ణన్ నాయర్ కూడా ఉన్నారని మంత్రి తెలిపారు. యాక్సియం4 మిషన్ విజయవంతం తర్వాత తొలిసారి భారత్‌కు వస్తున్నానంటూ శుక్లా శనివారం పోస్టు ద్వారా తెలిపారు. స్వదేశానికి తిరిగి వచ్చేందుకు విమానంలో కూర్చున్నప్పుడు భావోద్వేగానికి గురైనట్లు చెప్పారు. మిషన్ కోసం గతేడాది నుంచి తన స్నేహితులు, కుటుంబసభ్యులకు దూరంగా ఉన్నట్లు వెల్లడించారు. ఇది తనను ఎంతో బాధించిందని పేర్కొన్నారు. వారిని కలిసి తన అనుభవాలను పంచుకునేందుకు ఎంతో ఉత్సాహంగా ఎదురుచూస్తున్నానని అన్నారు. అయితే భారత్‌కు వచ్చిన శుక్లా, సోమవారం మోదీతో భేటీ అయ్యే అవకాశం ఉన్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఈనెల 23న జరిగే జాతీయ అంతరిక్ష దినోత్సవంలో కూడా శుక్లా పాల్గొంటారని వెల్లడించాయి. ఇటీవల నిర్వహించిన యాక్సియం4 మిషన్ ప్రయోగం విజయవంతమైంది. రోదసిలో 18 రోజులు గడిపి మానవాళికి ప్రయోజనం కలిగించే పలు ప్రయోగాలను నిర్వహించిన శుభాంశు శుక్లా బృందం జులై 15న భూమికి తిరిగి వచ్చింది. ఆ వెంటనే వ్యోమగాములను క్వారంటైన్ సెంటర్‌కు తరలించారు. వ్యోమగామి శుభాంశు శుక్లాతో పాటు పెగ్గీ విట్సన్ (అమెరికా), స్లావోస్జ్ ఉజ్నాన్స్కి (పోలండ్), టిబర్ కపు ఈ బృందంలో ఉన్నారు.

## బిగ్‌బాస్ విజేత ఎల్విస్ యాదవ్ ఇంటివద్ద కాల్పులు




**గురుగ్రామ్, ఆగస్టు 17:** ప్రముఖ యూట్యూబర్, బిగ్ బాస్ ఓటీటీ 2 విజేత ఎల్విష్ యాదవ్ నివాసం వద్ద కాల్పుల ఘటన తీవ్ర కలకలం రేపింది. హర్యానాలోని గురుగ్రామ్‌లో ఉన్న ఆయన ఇంటిపై ఈ తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు కాల్పులకు తెగబడ్డారు. ఉదయం 5 నుంచి 6 గంటల మధ్య బైక్‌పై వచ్చిన ముగ్గురు దుండగులు ఎల్విష్ యాదవ్ ఇంటిని లక్ష్యంగా చేసుకుని కాల్పులు జరిపారు. దాదాపు 25 నుంచి 30 రౌండ్ల వరకు కాల్పులు జరిపి అక్కడి నుంచి పరారైనట్లు పోలీసులు వెల్లడించారు. అదృష్టవశాత్తు ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని వారు తెలిపారు. కాల్పులు జరిగిన సమయంలో ఎల్విష్ యాదవ్ (27) పని నిమిత్తం హర్యానా బయట ఉన్నట్లు తెలిసింది. అయితే, ఆయన కుటుంబ సభ్యులు, ఇంటి కేర్‌టేకర్ మాత్రం ఇంట్లోనే ఉన్నారు. ఈ భవనంలోని రెండు, మూడు అంతస్తుల్లో ఎల్విష్ కుటుంబం నివాసం ఉంటోంది. ఘటన గురించి సమాచారం అందుకున్న వెంటనే గురుగ్రామ్ పోలీసులు వెంటనే అక్కడికి చేరుకున్నారు. సెక్టార్56 పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఈ ఘటనపై ఉన్నతాధికారులు దర్యాప్తు ప్రారంభించారు. క్లూస్ టీమ్ ఘటనా స్థలం నుంచి ఫోరెన్సిక్ ఆధారాలను సేకరించింది. దుండగులను గుర్తించేందుకు సమీపంలోని సీసీటీవీ ఫుటేజీని పోలీసులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. కాగా, ఈ ఘటనపై ఎల్విష్ యాదవ్ కుటుంబ సభ్యులు ఇంకాఅధికారికంగా పోలీసులకు ఫిర్యాదు చేయలేదని తెలిసింది. దుండగులు ఎందుకు కాల్పులకు తెగబడ్డారనే కోణంలో పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు.

# సంక్షిప్తంగా..


## 4 కిలోమీటర్ల టార్గెట్‌ను ఛేదించిన ఉక్రెయిన్ సైనికుడు

### రష్యా సైనికుడిని హతమార్చి రికార్డు



**హైదరాబాద్, ఆగస్టు 17:** రష్యాతో జరుగుతున్న యుద్ధంలో ఉక్రెయిన్‌కు చెందిన ఓ స్నైపర్ అసాధారణ ప్రతిభతో ప్రపంచ రికార్డును తన ఖాతాలో వేసు కున్నాడు. ఏకంగా 13,000 అడుగుల (దాదాపు 4 కిలోమీటర్లు) దూరం నుంచి రష్యా సైనికుడిని గురితప్పకుండా కాల్చిచంపి చరిత్ర సృష్టించాడు. ఈ విషయాన్ని కీవ్‌పోస్ట్ పత్రిక అధికారికంగా ప్రకటించింది. పొక్రొవ్స్క్ ప్రాంతంలో ఆగస్టు 14న ఈ ఘటన చోటుచేసుకున్నట్లు సైనిక వర్గాలు తెలిపాయి. స్థానికంగా తయారు చేసిన శక్తివంతమైన ఎలిగేటర్ 14.5 ఎంఎం రైఫిల్‌తో ఈ స్నైపర్ ఇద్దరురష్యాసైనికులను మట్టుబెట్టినట్లు సమాచారం. ఈ క్లిష్టమైన ఆపరేషన్‌ను విజయవంతం చేయడానికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), డ్రోన్ టెక్నాలజీనిఉపయోగించుకున్నట్లు మిలిటరీ జర్నలిస్ట్ యూరి బుట్సోవ్ ధ్రువీకరించారు.

## ఒడిశాలో 20 మెట్రిక్ టన్నుల బంగారం నిక్షేపాలు



**భువనేశ్వర్, ఆగస్టు 17:** ఒడిశాలో భారీ స్థాయిలో బంగారు ఖనిజ నిక్షేపాలు బయటపడినట్లు జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జీఎస్ఐ) ప్రకటించింది. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో సుమారు 10 నుంచి 20 మెట్రిక్ టన్నుల నిక్షేపాలను గుర్తించినట్లు తెలిపింది. సుందర్‌గఢ్, నవరంగ్ పూర్, కియోంజర్, దేవగఢ్ జిల్లాల్లో ఇప్పటికే బంగారు నిక్షేపాల వెలికితీత పెద్ద ఎత్తున కొనసాగుతోంది. ఈ క్రమంలో మైనింగ్ కార్పొరేషన్, జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా సంయుక్తంగా ఈ పరిశోధనలు చేపట్టాయి. అంతర్జాతీయ మార్కెట్లో పసిడి ధర చుక్కలను అంటుతున్న వేళ ఒడిశాలో బంగారు నిక్షేపాల సంగతి బయటపడడంతో అక్కడి ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## భారతీయ తాలిబన్ 'ఆర్ఎస్ఎస్'

### కాంగ్రెస్ సీనియర్‌నేత బికె హరిప్రసాద్



**న్యూఢిల్లీ, ఆగస్టు 17:** రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆరెస్సెస్)ను 'ఇండియన్ తాలిబన్లు'గా అభివర్ణిస్తూ కాంగ్రెస్ సీనియర్ నేత బీకే హరిప్రసాద్ చేసిన వ్యాఖ్యలు రాజకీయ దుమారం రేపాయి. స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ప్రధాని నరేంద్ర మోదీ ఆరెస్సెస్‌పై ప్రశంసలు కురిపించిన నేపథ్యంలో హరిప్రసాద్ ఈ సంచలన వ్యాఖ్యలు చేశారు. దీనిపై అధికార బిజెపి తీవ్రంగా స్పందించింది. జాతీయవాద సంస్థలను అవమానించడం, నిషేధిత సంస్థలను ప్రేమించడం కాంగ్రెస్‌కు అలవాటుగా మారిందని ఘాటుగా బదులిచ్చింది. కర్ణాటక ఎమ్మెల్సీ అయిన బీకే హరిప్రసాద్ మాట్లాడుతూ "దేశంలో శాంతికి భంగం కలిగించేందుకు వారు (ఆరెస్సెస్) ప్రయత్నిస్తున్నారు. నేను ఆరెస్సెస్‌ను తాలిబన్లతో మాత్రమే పోలుస్తాను. వాళ్లు భారతీయ్కతాలిబన్లు. అలాంటి వారిని ప్రధాన మంత్రి ఎర్రకోటనుంచి ప్రశంసిస్తున్నారని విమర్శించారు.

## 13 మంది చనిపోయారు: అంగీకరించిన పాకిస్థాన్

**కరాచి, ఆగస్టు 17:** భారత వాయుసేన జరిపిన ఆపరేషన్ సిందూర్ మెరుపు దాడుల్లో తమకు భారీ నష్టం వాటిల్లిన విషయాన్ని పాకిస్థాన్ ఎట్టకేలకు పరోక్షంగా అంగీకరించింది. ఈ సైనిక చర్యలో 13 మంది సైనిక సిబ్బంది సహా 50 మందికి పైగా ప్రాణాలు కోల్పోయినట్టు ఘటన జరిగిన మూడు నెలల తర్వాత అంగీకరించింది. తమ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మరణించిన సైనికులకు మరణానంతరం శౌర్య పతకాలను ప్రదానంచేసి, ఈ నిజాన్ని ప్రపంచం ముందుఒప్పుకుంది. అధ్యక్ష భవనంలో జరిగిన ఓకార్యక్రమంలో ప్రధాని షెహబాజ్ షరీఫ్ ఆపరేషన్ సిందూర్ సమయంలో మరణించిన సైనిక సిబ్బందికి మరణానంతరం పురస్కారాలు అందజేశారు. ఈదాడుల్లో భోలారీ ఎయిర్‌బేస్‌పై జరిగిన దాడిలో మరణించిన స్క్వాడ్రన్ లీడర్ ఉస్మాన్ యూసఫ్‌కు 'తమ్ఘాఇబసాలత్' పురస్కారాన్ని ప్రకటించారు. ఆయనతో పాటు హవల్దార్ ముహమ్మద్ నవీద్,నాయక్ వకార్ ఖాలిద్, లాన్స్‌నాయక్ దిలావర్ ఖాన్‌లకుమరణానంతరం ఈ పురస్కారాన్ని ఇచ్చారు. భారత దాడులు జరిగిన నూర్‌ఖాన్, సర్గోధా, జాకోబాబాద్, భోలారీ,షోర్‌కోట్ వైమానిక స్థావరాల్లో పలువురు గాయపడినట్లు కూడా సమాచారం.

18-8Pg6exHMNWJQE 10_18-8Pg6exHMNWJQE.qxd 8/18/2025 12:43 AM Page 1





# రైతులకు అండగా కూటమి ప్రభుత్వం

## సొసైటీలు అన్నదాతలకు ఉత్తమ సేవలందించాలి: ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి

**ఇందుకూరుపేట, (నెల్లూరు), ఆగస్టు 17, ప్రభాతవార్త:** అన్నం పెట్టే అన్నదాతలకు అండగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. ఇందుకూరుపేటలో ఉన్న అగ్రికల్చర్ క్రెడిట్ సొసైటీ చైర్మన్ అమర్నాథ్‌రెడ్డి, డైరక్టర్ల ప్రమాణ స్వీకారం కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక రైతులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతమ్మ మాట్లాడుతూ సొసైటీ చైర్మన్, డైరక్టర్లుగా ప్రమాణ స్వీకారం చేసిన వారు రైతులకు ఉత్తమ సేవలు అందించాలని ఆమె అన్నారు. అమరేంద్రరెడ్డికి ఎలక్షన్ టైంలో మంచి పదవి ఇవ్వాలని ఆలోచించామని, కష్టపడే తత్వం ఉన్న వ్యక్తి అని, అందుకే సొసైటీ చైర్మన్‌గా నియమించినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తూ సంక్షేమ పాలన సాగిస్తున్నారన్నారు. అన్నదాత సుఖీభవతో రైతుల ఖాతాలో నగదు జమ చేశారని, తల్లికి వందనం పథకాన్ని అమలు చేశారన్నారు. ఇటీవల మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించి మాట నిలబెట్టుకున్నారని వెల్లడించారు. సహకార బ్యాంకింగ్ వ్యవస్థ పటిష్టంగా ఉంటే రైతులకు చాలా ప్రయోజనకరంగా ఉంటుందన్నారు.

రైతులకు ఎరువులు, పురుగు మందులు, ఆక్వా సాగు అధికంగా ఉన్న ప్రాంతాల్లో రైతులకు చేపల మేతకు కూడా సొసైటీ అందిస్తుందని చెప్పారు. కొత్త చైర్మన్ రైతుల అవసరాలను దృష్టిలో రైతుల ప్రయోజనాలను కాపాడుతూ అభివృద్ధికి పాటుపడ తారని ఆకాంక్షించారు. కార్యక్రమంలో దువ్వూరు కళ్యాణ్‌రెడ్డి, కోడూరు కమలాకర్‌రెడ్డి, బ్యాంకు చైర్మన్ గండవరపు అమర్నాథ్‌రెడ్డి, డైరక్టర్ పెనుబల్లి కృష్ణ చైతన్య, డైరక్టర్ శూదలగుంట ప్రేమలత, జడ్పీ వైస్ చైర్మన్ జయలక్ష్మి, ఇందుకూరుపేట మండల అధ్యక్షుడు పవన్ రెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు రావిళ్ళ వీరేంద్ర నాయుడు, చెంచు కిషోర్ యాదవ్, దేవిరెడ్డి రవీంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# విభిన్న ప్రతిభావంతుల విద్యకు కార్యాచరణ

## 125 అటిజం కేంద్రాల ఏర్పాటుకు ఎస్ఎస్ఏ చర్యలు

**విజయవాడ, ఆగస్టు17,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలోని విభిన్న ప్రతిభావంతులకు చదువు నేర్పడంతో పాటు వారి భవితకు బాటలు వేసేందుకు ఏపీ ప్రభుత్వం కీలక కార్యచరణ అమలె చేస్తుంది.ఆంధ్రప్రదేశ్ సమగ్ర శిక్షా అభియాన్ (ఎస్ఎస్ఏ) కృషి చేస్తోంది.ఇలాంటి విద్యార్థులను సాధారణ పాఠశాలల్లో చేర్పించడం ద్వారా వారికి సమాన అవకాశాలు కల్పిస్తోంది. ట్యాబ్‌లలో 33 రకాల యాప్‌లను ఇన్స్టాల్ చేసి,బోధన చేయిస్తోంది. ఫ్యామిలీ యాప్‌కు పిల్లల ఐడీని లింక్ చేయడం ద్వారా విద్యార్థి ఎంత సేపు యాప్ ఉపయోగించారో పర్యవేక్షిస్తున్నారు. దివ్యాంగ విద్యార్థుల అభ్యున్నతి కోసం ఇప్పటికే 679 భవిత కేంద్రాలు ఏర్పాటు చేయగా...దేశంలో తొలిసారి అటిజం పిల్లల కోసం పట్టణాల్లో 125 కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 85,046 మంది ప్రత్యేకావసరాలు కల్గిన విద్యార్థులకు ప్రత్యేక విద్యను అందిస్తున్నారు.ఏటా బడి బయట ఉన్న ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తించేందుకు సర్వే చేస్తారు. గుర్తించిన తర్వాత ప్రభుత్వ పాఠశాలల్లో నమోదు చేస్తున్నారు.భవిత కేంద్రాల్లో పిల్లలకు ఫిజియోథెరపీ,స్పీచ్‌థెరపీలతో పాటు ప్రత్యేక శిక్షణ పొందిన ఉపాధ్యాయులతో చెప్పిస్తున్నారు.తీవ్రమైన వైకల్యంతో పాఠశాలలకు రాలేని పిల్లలకు ప్రతి శనివారం వారి ఇంట్లోనే బోధన చేస్తున్నారు.చదువుకు సహాయంగా భత్యంగా ఇస్తున్నారు.దివా ్యంగ పిల్లలకు నెలకు రూ.600 చొప్పున రవాణా భత్యాన్ని అందిస్తున్నారు. ప్రాథమిక స్థాయిలో 3,932,సెకండరీ స్థాయిలో 4,058 మందికి ఈ భత్యాన్ని ఇస్తున్నారు. బాలికలకు నెలకు రూ.200 అదనంగా ఇస్తున్నారు. సొంతంగా బడికి రాలేని వారికి సహాయకుల భత్యాన్ని అందిస్తున్నారు. 1-8 తరగుల్లో నమోదై 40% హాజరు ఉన్న పిల్లల సహాయకులకు నెలకు రూ.600 చొప్పున ఇస్తున్నారు.ఇంటివద్దనే ఉండే వారికి పది నెలలకు రూ.3 వేలు ఇస్తున్నారు. ప్రాథమిక స్థాయిలో 6,790 మంది ఈ సహాయాన్ని పొందుతున్నారు.

వారంలో 3 రోజులు ఫిజియోథెరపి స్టులు భవిత కేంద్రాలను సందర్శించి సేవలు అందిస్తున్నారు.క్రీడల కోసం ప్రత్యేకంగా జిల్లాకు రూ.లక్ష వరకు వ్యయం చేస్తున్నారు.భవిత కేంద్రాల్లో రూ.7వేల చొప్పున గౌరవ వేతనమిస్తూ సహాయకులను నియమించారు.

## అఖిల భారత రాష్ట్ర ప్రభుత్వఉద్యోగుల సమాఖ్య

# జాతీయ ఉపాధ్యక్షుడిగా అలపర్తి విద్యాసాగర్ ఎన్నిక

**విజయవాడ,ఆగస్టు17,ప్రభాతవార్తప్రతినిధి:** అఖిల భారత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య జాతీయ ఉపాధ్యక్షుడిగా అలపర్తి విద్యాసాగర్ ఎన్నికయ్యారు.న్యూఢిల్లీలో జరుగుతున్న అఖిల భారత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య జాతీయ కార్యవర్గ సమావేశంలో ఎన్‌జిజిఓ ఆంధ్రప్రదేశ్ సంఘ రాష్ట్ర అధ్యక్షుడుని జాతీయ ఉపాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మూడు రోజుల తారీకులలో న్యూఢిల్లీ ఫరీదాబాద్ లో జరుగుతున్న అఖిల భారత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య కార్యవర్గ సమావేశంలో 29 రాష్ట్రాల నుంచి రాష్ట్ర సంఘ నాయకులు పాల్గొన్నారు. జాతీయ ప్రధాన కార్యదర్శి సుకుమార్ ఎన్నికను ప్రతిపాదిస్తూ అలపర్తి విద్యాసాగర్ పేరును జాతీయ ఉపాధ్యక్షుడిగా సూచించారు. జాతీయ కార్యవర్గ సభ్యులందరు.రాష్ట్రాల ప్రతినిధులు ఎన్నికను ఏకగ్రీవంగా మద్దతు తెలిపారు. ఎన్నికను ఏకగ్రీవంగా జరిగినట్లు ప్రకటించారు.రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డివి రమణ జాతీయ కార్యవర్గ సభ్యుడిగా ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా ఆలపర్తి విద్యాసాగర్ జాతీయ కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతూ తన బాధ్యతలో మరింత పెరిగాయని, జాతీయ స్థాయిలో జరిగే ఉద్యమాల కార్యాచరణ బాధ్యత కూడా తన మీద ఉంటుందని, ముఖ్యంగా జాతీయస్థాయిలో జరిగే సిపిఎస్ రద్దు, కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ, లేబర్ కోడ్ వంటి అంశాలపై ఉద్యమించాల్సిన అవసరం ఉంటుందన్నారు.

ఈ కార్యక్రమాన్ని, ఎన్నికలు నడిపించిన చైర్మన్ సుభాష్ లాంబ, ప్రధాన కార్యదర్శి సుకుమార్ కు జాతీయ కార్యవర్గ సభ్యులకు ధన్యవాదాలు తెలియజేశారు. నూతనంగా ఎన్నికైన విద్యాసాగర్ ను సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి వి రమణ, ఆల్ ఇండియా వుమెన్ సబ్ కమిటీ కన్వీనర్ రాజ్యలక్ష్మి, విబిబివీ నాయకులు రవిశంకర్, కిషోర్ మరియు మాజీ నాయకులు మహమ్మద్ ఇక్బాల్ అభినందనలు తెలిపి సత్కరించారు.

# కొందరు పార్టీ రాష్ట్ర నేతలకు బిజెపి తెలంగాణలో అధికారంలోకి రావడం ఇష్టం లేదు: రాజాసింగ్

**హైదరాబాద్ (గోషామహల్), ఆగస్టు 17, ప్రభాతవార్త:** తెలంగాణ బిజెపి అధ్యక్ష పదవిని మాజీ ఎమ్మెల్సీ రామచందర్‌రావుకు అప్పగించడాన్ని నిరసిస్తూ నిరసనగా రాజాసింగ్ బిజెపి గుడ్‌బై చెప్పిన విషయం తెలిసిందే. వెంటనే శాసనసభ్యుడు రాజాసింగ్ రాజీనామాను అధిష్ఠానం కూడా ఆమోదించారు. ఈ నేపథ్యంలో తెలంగాణ బిజెపి పార్టీపై గోషామహల్ నియోజకవర్గం శాసనసభ్యులు టి.రాజాసింగ్ మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు.ఆయన ఓ మీడియా చానల్ ప్రతినిధితో మాట్లాడుతూ తెలంగాణలో బిజెపి ప్రభుత్వం రాదు అని మరోసారి సంచలమైన వ్యాఖ్యలు చేశారు.ప్రతి జిల్లాలో నా మనిషే అంటే ఎన్నో ఏళ్ల నుండి ప్రాణంపెట్టి పని చేసిన పాత కార్యకర్తలు ఎక్కడికి పోవాలి అన్నారు.బిజెపి అధిష్ఠానం కూడా తెలంగాణ రాష్ట్రంపై దృష్టి సారించడం లేదని,ఇతర రాష్ట్రాల మీద ఉన్న శ్రద్ద తెలంగాణ రాష్ట్రంపై లేదన్నారు.బిజెపి అధిష్ఠానానికి తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి రావాలని ఇష్టం లేదని మరోసారి సంచలమైన వ్యాఖ్యలు చేశారు.రాష్ట్రంలోని పెద్ద బాబులు చెప్పిందే అధిష్ఠానం వింటుందన్నారు.వాళ్ల పేర్లు చెప్పలేను అన్నారు. వాళ్ల వల్ల తెలంగాణ బిజెపికి చాలా నష్టం జరుగుతుందని శాసన సభ్యులు రాజాసింగ్ తీవ్రఆరోపణలు చేశారు. బిజెపి గతంలో రాజా సింగ్ రాజీనామాను అమోదించినప్పటికి మరోసారి తాజాగా చేసిన వ్యాఖ్య లపై అధిష్ఠానం ఏవిధంగా స్పందిస్తుందో వేచి చూడాల్సిందే.

# 20 నుంచి సిపిఐ రాష్ట్ర మహాసభలు

**హైదరాబాద్, ఆగస్టు 17, ప్రభాతవార్త:** సమసమాజమే లక్ష్యంగా ఆవిర్భవించి అనేక త్యాగాల చరిత్ర కలిగిన భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభలు ఈనెల 20 నుంచి 22 వరకు మూడు రోజులు పాటు మేడ్చల్ జిల్లా గాజుల రామారంలో జరగనున్నాయి.

# పి4 నుంచి మరో 'విజయ'ప్రస్థానం

## 5,465 బంగారు కుటుంబాలకు మార్గదర్శిగా కృష్ణా మిల్క్ యూనియన్



పీ4 ప్రమాణ పత్రాలను ఎన్టీఆర్ జిల్లా కలెక్టరు లక్ష్మీశకు అందిస్తున్న కృష్ణా మిల్క్ యూనియన్ నాయకులు

**విజయవాడ,ఆగస్టు17,ప్రభాతవార్తప్రతినిధి:** పేదరికం లేని సమాజమే ధ్యేయంగా ముఖ్యమంత్రి ఆకాంక్షలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న వినూత్న పీ4 విధానంలో మరో మైలురాయిగా నిలుస్తోంది ఈ "విజయ" ప్రస్థానం. విజయ బ్రాండ్ పేరిట పాలు, పాల ఉత్పత్తులను విక్రయిస్తూ.. పాడి రైతుల సంక్షేమంతో పాటు ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది మందికి ఉపాధి కల్పిస్తున్న కృష్ణా మిల్క్ యూనియన్ పీ4లో మేము సైతం అంటూ 5,465 గ్రామీణ బంగారు కుటుంబాలకు మార్గదర్శనం చేసేందుకు స్వచ్ఛందంగా ముందుకొచ్చింది. ఈ మేరకు కృష్ణా మిల్క్ యూనియన్ అధ్యక్షులు చలసాని ఆంజనేయులు, పాలకవర్గ సభ్యులు తాజాగా నందిగామ మండలం, మునగచర్లలో జరిగిన సామూహిక గోకులం కార్యక్రమం సందర్భంగా కలెక్టర్ డా. జి.లక్ష్మీశకు ప్రమాణ పత్రాలు అందజేశారు. వత్సవాయి మండలం నుంచి 1,524 బంగారు కుటుంబాలు, పెనుగంచిప్రోలు మండలం నుంచి 1,192, విస్సన్నపేట మండలం నుంచి 1,255, విజయవాడ గ్రామీణ మండలం నుంచి 747, చందర్లపాడు నుంచి 747 బంగారు కుటుంబాలను దత్తత తీసుకుంటున్నట్లు ఆంజనేయులు ప్రకటించారు. బంగారు కుటుంబాల ఆర్థికస్థితిగతులను అధ్యయనం చేసి వారి జీవితాలను సాధికారత దిశగా నడిపించేందుకు అవసరమైన చేయూత అందించనున్నట్లు పేర్కొన్నారు. పాడి పశువుల కొనుగోలుకు కేడీసీసీ ద్వారా ఇచ్చే రూ. లక్ష చొప్పున రుణాలకు సంబంధించి వడ్డీని యూనియన్ భరిస్తుందన్నారు. పశు గ్రాసంతో పాటు పశు వైద్యసేవలు వంటి విషయాలపై యూనియన్ ప్రత్యేకంగా దృష్టిసారిస్తుందని.. అవసరం మేరకు సామూహిక గోకులాలు ఏర్పాటుచేసి వాటిని సద్వినియోగం చేసుకునేలా చేయిపట్టి నడిపిస్తామన్నారు. మహిళా పాడి రైతులను కూడా పెద్దఎత్తున ప్రోత్సహిస్తామని.. పాడితో కుటుంబాల జీవన ప్రమాణాలు మెరుగయ్యేలా జిల్లా అధికార యంత్రాంగంతో కలిసి అడుగులువేస్తామన్నారు. బంగారు కుటుంబాలకు చెందిన సభ్యులకు అవసరం మేరకు ఆరోగ్య సేవలు కూడా అందిస్తామని వివరించారు. మేలు జాతి పశు సంతతి, పాల ఉత్పత్తి వృద్ధికి వీలుగా పెయ్యి దూడలు పుట్టేలా లక్ష డోసుల లింగ నిర్ధారిత వీర్యాన్ని అందించేందుకు రూ. కోటి సహాయాన్ని కూడా కృష్ణా మిల్క్ యూనియన్ ప్రకటించింది. రూ. 150 విలువైన ఒక్కో డోసుకు రూ. 100 రాయితీ ఇవ్వనున్నట్లు వివరించింది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ ముఖచిత్రాన్ని మార్చే సత్తా పాడి పరిశ్రమకు ఉందని.. ఈ నేపథ్యంలో పాడితో పేదరికాన్ని తరిమికొట్టాలనే సంకల్పంతో వేల బంగారు కుటుంబాలను దత్తత తీసుకునేందుకు ముందుకొచ్చిన కృష్ణా మిల్క్ యూనియన్‌కు ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు.

ఇదే స్ఫూర్తితో మరిన్ని యూనియన్లు, స్వచ్ఛంద సంస్థలు, పారిశ్రామికవేత్తలు, వ్యక్తు లు, ఇలా మనసున్న ప్రతిఒక్కరూ స్వచ్ఛందంగా ముందుకు రావొచ్చని కలెక్టర్ పిలుపునిచ్చారు.

# వరస వివాదాల్లో అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి

**నిన్న దగ్గుబాటి, ప్రభాకర్ చౌదరి మధ్య మాటల యుద్ధం**

**నేడు జూనియర్ ఎన్టీఆర్, లోకేష్‌ను ఉద్దేశించిన ఎమ్మెల్యే ఆడియో వైరల్**

**అందరి చూపు అధిష్టానం పైనే**

**అనంతపురం, ఆగస్టు 17, ప్రభాతవార్త బ్యూరో:** అనంతపురం అర్బన్ శాసనసభ స్థానం నుంచి గత ఎన్నికల్లో మొదటి సారిగా ఎన్నికైన పారిశ్రామికవేత్త దగ్గుబాటి వెంకట ప్రసాద్ వరుస వివాదాల్లో చిక్కుకుంటున్నారు. మొన్న టిడిపి నేత, మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరిని ఉద్దేశించి పరోక్షంగా ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకట ప్రసాద్ విలేకరుల సమయం ఏర్పాటు చేసి ఆరోపణ స్పందిస్తే అదే రోజు అనంతపురం మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి కూడా విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పేరు చెప్పి డైరెక్టుగా ఘాటుగా స్పందించి కడిగిపారేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినాక 14 నెల కాలంలో ఏదో విధంగా తనను బదనానం చేసేందుకు ప్రయత్నం చేస్తున్నాడని, కొందరి టిడిపి నాయకులు ఆత్మహత్య చేసుకున్నారని, మహిళా తాళిబొట్టులు తెంచారని, సొసైటీ భూములను కాజేశారని తదితర ఆరోపణలను తెలుగుదేశం పార్టీకి చెందిన మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి ఉద్దేశించి ఎమ్మెల్యే దగ్గుబాటి ప్రసాద్ పలు ఆరోపణ లు చేశారు.. ఎమ్మెల్యే ఆరోపణలకు ప్రభాకర్ చౌదరి స్పందిస్తూ ఏడాదిన్నర కాలంలో అనంతపురం అర్బన్ లో ఎమ్మెల్యే దగ్గుబాటి పార్టీని భ్రష్టు పట్టించారని, అనంతపురం ఎమ్మెల్యే చర్యల వల్ల ఇతరు నియోజకవర్గాల్లో కూడా పార్టీకి చెడ్డ పేరు వస్తుందని, కార్యకర్తలను, ఇతరులను ఎమ్మెల్యే ఏ విధంగా బెదిరించాలన్నది నా వద్ద ఆరోపణలు ఉన్నాయని వెల్లడించారు. పార్టీకి చెడ్డ పేరు వస్తుందని నేను ఇంతవరకు చెప్పలేదని, ఇద్దరిపై వచ్చిన ఆరోపణలకు బహిరంగ చర్చకు సిద్ధమని, తేల్చుకునేందుకు సిద్ధమని ప్రభాకర్ చౌదరి సవాలు విసిరారు. ఇద్దరి మధ్య నెలకొన్న వివాదంపై టిడిపి అధిష్టాన వర్గం ఎలా స్పందిస్తుందో అన్నది పార్టీ క్యాడర్ లో చర్చ జరుగుతోంది.. సహజంగా అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుబాటి ప్రసాద్ పై గత కొన్ని నెలలుగా వివిధ ఆరోపణలు వస్తున్నాయి. ఎమ్మెల్యే వర్గీయులు కబ్జాలకు పాల్పడుతున్నారు అని, కార్యకర్తలను బెదిరిస్తున్నారు అని, స్థల వివాదాల్లో జోక్యం చేసుకుంటున్నారని, మద్యం షాపుల నిర్వహణలో దౌర్జన్యంగా వ్యవహరి స్తున్నారు అని, తదితర ఆరోపణలు బలంగా వచ్చాయి.. ఇందులో భాగంగా మద్యం మాఫియా డాన్ గా పేరున్న అనంతపురం టిడిపి నేత సుధాకర్ నాయుడు ను ఎమ్మెల్యే దగ్గుబాటి ప్రసాద్ వర్గీయులు హత్యకు ప్లానింగ్ చేసిన సంఘటన గతంలో చర్చనీయాంశం అయింది. ఈ విషయంలో సుధాకర్ నాయుడు జిల్లా ఎస్పీ జగదీష్ ని కూడా కలిసి ఫిర్యాదు చేశారు. పత్రికల్లో, టీవీల్లో ఈ సంఘటన వార్తలు అప్పట్లో ప్రముఖంగా వచ్చారు. ఆ సమయంలో రాయల సీమ జిల్లాల టిడిపి పరిశీలకుడు జోక్యం చేసుకొని ఎమ్మెల్యేను, సుధాకర్ నాయుడుని విజయవాడకు పిలిపించుకొని గట్టిగా మందలించారు. ఆ సంఘటనపై పార్టీ పెద్దలు జోక్యం చేసుకోవడం తో ఆ వివాదం సమీసి పోయి టీ కప్పులో తుఫానుగా మారిపోయింది. ఈ నేపథ్యంలో మొన్న మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి, ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మధ్య మాటల యుద్ధం జరిగింది. ఆరోపణలు, ప్రతి ఆరోపణలు చేసుకున్నారు. ఇది మర్చిపోకముందే ఆదివారం అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే ఆడియో వైరల్ అయ్యింది. జూనియర్ ఎన్టీఆర్ నటించిన వార్2 సినిమా ను అనంతపురంలో ఆడించే ప్రశ్నలేదని, తదితర విషయాలపై అనంతపురం ఎమ్మెల్యే దగ్గుబాటి మరో వ్యక్తితో మాట్లాడిన ఆడియో వివాదం ఆదివారం చర్చనీయాంశమైంది. ఆ ఆడియోతో తమకు సంబంధం లేదని ఎమ్మెల్యే చేసినప్పటికీ టిడిపిలో రసవత్తల చర్చ జరుగుతుంది. ఈ నేపథ్యంలో టిడిపి అధినేత, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సీరియస్ అయి అనంతపు రం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ వ్యవహారంపై విచారణకు ఆదేశించారు. అనంతపురం తో పాటు మరో రెండు అసెంబ్లీ స్థానాల్లో వివాదం వివాదాలు నెలకోడంతో ముగ్గరు ఎమ్మెల్యేలపై పార్టీ విచారణకు ఆదేశించింది.

# వరద ముంపు ప్రాంత ప్రజలు పునరావాస కేంద్రాలకు తరలి రావాలి : కమిషనర్ ధ్యానచంద్ర



## నగరపాలక సంస్థ సిబ్బందికి సహకరించమని విజ్ఞప్తి

**వినకపోతే పోలీసు,రెవెన్యూ శాఖలసహకారంతో పునరావాస కేంద్రాలకు తరలించాలని ఆదేశాలు**

**విజయవాడ కార్పొరేషన్,ఆగస్టు 17,ప్రభాతవార్త:** కొండ ప్రాంతాల్లో,వరద ముంపు ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలు పునరావాస కేంద్రాలకు తరలి రావాలని,మున్సిపల్ సిబ్బందికి సహకరించాలని మున్సిపల్ కమీషనర్ ధ్యానచంద్ర అన్నారు. ఆదివారం సాయంత్రం శాఖాధిపతులు,స్పెషల్ ఆఫీసర్లతో ఆయన టెలికాన్ఫరెన్స్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదానికి గురయ్యే అవకాశమున్న ఇల్లులు ఎన్ని,అందులో నివసిస్తున్న ప్రజలు ఎంతమంది ఉన్నారు అని అసిస్టెంట్ సిటీ ప్లానర్‌లను అడగ్గా సర్కిల్-1 అసిస్టెంట్ సిటీ ప్లానర్ చంద్రబోస్ కొండ ప్రాంతాల్లో ప్రమాదానికి గురయ్యే ఇళ్ళు 10 ఉన్నాయని,సర్కిల్-3 అసిస్టెంట్ సిటీ ప్లానర్ మోహన్ బాబు 15 ఉన్నాయని,15లో అత్యంత ప్రమాదానికి గురిఅయ్యే ఇల్లు రెండు ఉన్నాయని, వారికి ఎంత అవగాహన కల్పించినా వారు ఇప్పుడు కాదు తర్వాత వెళ్తామని దాటేస్తున్నారని తెలిపారు. దాంతో కొండ ప్రాంతాల్లో ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉన్న ఇళ్ళను పూర్తి స్థాయిలో పరిశీలించి సంపూర్ణ నివేదికను తమకు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. వరద హెచ్చరికలు ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ జారీ చేసిన దగ్గర నుంచి విజయవాడ నగరపాలక సంస్థ అధికారులు వరద ముంపు కొండ ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలకు హెచ్చరికలు జారీ చేసి, సురక్షిత ప్రదేశాలకు తరలిరావాలని అవగాహన కల్పిస్తున్నప్పటికీ వారు వినని పక్షంలో పోలీసు, రెవిన్యూ శాఖ సహకారంతో వారిని పునరావాస కేంద్రాలకు తరలించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి ముంపు ప్రాంతానికి దగ్గరలో అన్ని వసతులు కల్పించిన ఒక పునరావాస కేంద్రం ఉండేటట్లు ఖచ్చితంగా చూసుకోవాలని,ఎస్టేట్ ఆఫీసర్ ఏ.శ్రీధర్‌ను ఆదేశించారు. ప్రతి పునరావాస కేంద్రంలో ప్రజలకు భోజన సదుపాయాలను ముందుగానే ఏరాపటు చేసుకోవాలని ఆదేశించారు. స్పెషల్ ఆఫీసరుల తమ తమ వార్డుల్లో గల వర్షపు ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలను ప్రత్యేక శ్రద్ద తీసుకొని వారికి ఖచ్చితంగా అవగాహన కల్పించి హెచ్చరికలు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు.

# అద్దెకు దిగుతామంటూ ఇళ్ల యజమానుల బ్యాంకు ఖాతాలు వివరాల సేకరణ

**కొత్తపద్ధతిలో మోసానికి సైబర్ నేరగాళ్లు**

**హైదరాబాద్, ఆగస్టు 17, ప్రభాతవార్త:** సైబర్ నేరాలు కొత్త పుంతలు తొక్కుతున్నాయి. ఎప్పుడు ఎలా జరుగుతుందో తెలియకుండా వుండడంతో ఏ పాపం తెలియని అమాయకులు కేసుల్లో ఇరుక్కుని ఇక్కట్లు పడుతుండగా సైబర్ నేరగాళ్లు మాత్రం దర్జాగా అందినంత దోచుకుంటూ జల్సా గా జీవి స్తున్నారు. కొత్త తరహాలో వెలుగు చేసిన సైబర్ నేరాల్లో ముఖ్యమైనది అద్దె ఇంట్లో దిగుగూ ఇళ్ల యజమానుల ఆధార్ కార్డులు, బ్యాంకుల ఖాతాల వివరాలు తీసుకుని, వాటిని సైబర్ నేరాలకు సంబంధించిన లావాదేవాలకు వాడడం. ఈ తరహా నేరాల్లో సైబర్ నేరగాళ్లు మొదట అద్దె ఇంట్లోకి ది గుతారు. ఇంటి యజమాని ఆధార్ కార్డును తీసుకుంటారు. ఇంటి యజమాని ఆధార్ కార్డు వుంటేనే తాము పలానా వ్యక్తి ఇంట్లో అద్దెకు వుంటునా ్నమని, తమ కంపెనీ నమ్ముతుందని, ఇంటి అద్దె ఇస్తుందని నమ్మబలుకుతారు. దీని తరువాత ఇంటి యజమాని బ్యాంకు ఖాతాను, డెబిట్ కార్డు, క్రెడిట్ కార్డులు తీసుకుంటారు. వీటి ఆధారంగా లాగిన్ ఐడి, పాస్‌వర్డ్‌లు తీసుకుంటారు. వీటి ఆధారంగా సైబర్ నేరగాళ్లు నేరాలకు శ్రీకాకం చుడ తారు. ఇంటి యజమాని బ్యాంకు ఖాతాల ద్వారా సైబర్ నేకాలకు సంబంధించిన లావాదేవీలు నిర్వహిస్తారు. ఈ విషయం ఎప్పుడో కానీ ఇంటి యజమానులకు తెలియదు. తీరా తెలిసే సమయానికి పోలీసులు కేసు నమోదు చేసి వారిని నిందితులుగా చూపుతారు. అవసరం అయితే అరెస్టు చేసి వారిని జైళ్లకు కూడా పంపుతున్నారు. నగరంలోని సనత్‌నగర్‌కు చెందిన ఓ ఆటో డ్రైవర్ తన సొంత బావమరిదికి అడగగా ఆధార్ కార్డు, బ్యా ంకు ఖాతా వివరాలు, డెబిట్ కార్డు ఇచ్చాడు. మూడు నెలల తరువాత సదరు ఆటో డ్రైవర్ బ్యాంకు ఖాతాలో సైబర్ నేరాలకు సంబంధించి లక్ష లాది రూపాయల లావాదేవీలు జరుగుతున్నట్లు గుర్తించిన పోలీసులు అతనిపై కేసు నమోదు చేసి విచారణకు పిలిచారు. తనకు ఇదంతా ఏమీ తె లియదని, తన బావమరిది అడిగితే ఇచ్చానని చెప్పగా అదంతా నీవు...నీ బావమరిది తేల్చుకోవాలి...అంటూ ఆటో డ్రైవర్‌ను అరెస్టు చేసి జైలుకు పంపారు పోలీసులు. ఇటువంటిదే శివార్లలో వెలుగు చూసింది. 20 వేల రూపాయలకు పెద్ద ఇంటిని తీసుకున్న సైబర్ నేరగాళ్లు ఈ క్రమంలో ఇం టి యజమానిని దోస్తీ చేసుకుని అతని బ్యాంకు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు తీసుకుని వీటి ద్వారా సైబర్ నేరాలకు దిగారు. ఈ కేసులో ఇంటి య జమాని బ్యాంకు ఖాతాలో 25 లక్షల రూపాయల సైబర్ నేరాల లావాదేవీలు జరిగినట్లు తేలింది.

ఈ నేరం వెలుగుచూసే సమయానికి సైబర్ నేరగాళ్లు ఉడాయించగా ఇంటి యజమాని పోలీసు కేసులో ఇరుక్కుని ఊచలు లెక్కపెట్టాల్సి వచ్చింది. ఈ తరహా మోసాలు దేశ వ్యాప్తంగా అనేకచోట్ల వెలుగు చూడడం ఆయా ప్రాంతాలలో సంచలనం రేపింది. బడా సైబర్ నేరగాళ్లు విదేశాల్లో వుంటుండగా వారికి అనుచరులుగా వుంటున్న వారు భారత్‌లోని ఉత్తర, తూర్పు రాష్ట్రాలలో వుంటున్నారు. వీరికి ఏజెంట్లుగా దక్షిణాది రాష్ట్రాలకు చెందిన వారుంటున్నారు. ఈ ఏజెంట్లు కొందరు సబ్ ఏజెంట్లను నియమించుకుని తెలివిగా ఆయా బస్తీలలో వుండే ఆటో డ్రైవర్లు, సామాన్య కూలీల చేత బ్యాంకు ఖాతాలు తెరిపించి, వారికి కొంత క మీషన్ ఇస్తున్నారు.

ఇలాంటి కేసుల్లో కూలీలు, ఆటో డ్రైవర్లు పోలీసు కేసుల్లో ఇరుక్కోగా తాజాగా ఇళ్ల యజమానుల వంతు వచ్చింది. ముందుగా ఆయా ప్రాంతాలలో అద్దెకు వుండే ఇళ్లను కనుగొని సైబర్ నేరగాళ్లు అక్కడ దిగుతున్నారు. ఇంటి యజమాని అడిగినంత అద్దె ఇచ్చేందుకు సిద్ధమవ డంతో పాటు ఐదారు నెలల అడ్వాన్స్ కూడా ముందుగానే ఇచ్చేస్తున్నారు. అనంతరం వారి నమ్మకాన్ని చూరగొని ఆధార్ కార్డులు, బ్యాంకు ఖాతా లను, డెబిట్ కార్డులను తీసుకుని వీటి ఆధారంగా సైబర్ నేరాలకు సంబంధించిన లావాదేవీలు నడుపుతున్నారు. ఇక పోలీసులు కేసు నమోదు చేసి బ్యాంకు ఖాతాదారులను అరెస్టు చేసే సమయానికి నేరాలకు పాల్పడిన వారు ఉడాయిస్తున్నారు. ఎవరికి పడితే వారికి బ్యాంకు ఖాతాలు, ఆధార్ కార్డులు, డెబిట్ కార్డులు ఇవ్వకూడదని వారు హెచ్చరిస్తున్నారు.

# విదేశాలకు వ్యవసాయ ఉత్పత్తులను ఎగుమతి చేస్తున్న భారత్

**ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యానికి శ్రేయస్కరం**

**ఆధునిక సాంకేతిక పరిజ్ఞాన వినియోగం ఎంతో ప్రయోజనం: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి**

**వర్గల్, ఆగస్టు 17, ప్రభాతవార్త:** వ్యవసాయ రంగంలో దేశం విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టగా, వ్యవసాయ ఉత్పత్తులను ప్రపంచ దేశాలకు ఎగుమతి చేసే స్థాయికి భారత్ చేరుకున్నట్లు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం సింగాయ పల్లిలో క్రిస్టల్ విత్తనోత్పత్తి సంస్థను పరిశీలించి వివిధ విభాగాలను ప్రారం భించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అధిక దిగుబడులు సాధించాలని ఆకాంక్షిం చారు.

ప్రకృతి వ్యవసాయం ఆరోగ్యానికి శ్రేయస్కరం కాగా, క్రిమిసం హారక మందుల వినియో గాన్ని తగ్గించి కంపోస్టు ఎరువుల వాడకంపై దృష్టి పెట్టాలని సూచించారు. ఆధునిక వ్యవసాయ విధానంతో విత్తన ఎంపిక నుండి పంట కోత వరకు ప్రయోజనం, అలాగే నీరు, ఎరువుల వినియోగం సరైన మోతాదులో ఉంటుందన్నారు. ముఖ్యం గా క్రిమిసంహారక మం దులు అధిక ఎరువుల వినియోగంతో సాగు నేల ఆరోగ్యం దెబ్బ తింటుం దని, దీనిని దృష్టిలో పెట్టుకొని సహజ పద్ద తుల్లో పండించే సాగులో కంపోస్ట్ ఎరువులు వినియోగించి పర్యావరణానికి హాని కలగకుండా ఆరోగ్యకర పంట ఉత్పత్తులు చేసుకోవచ్చని చెప్పారు. అంతేకాకుండా వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచించే నూతన వంగడాలను ప్రోత్సహించి వాతావరణ మార్పులు, తెగుళ్ళ నుండి పంటలు కాపాడుకోవాలని కోరారు. కేంద్ర వ్యవసాయ, డైరీ రంగాన్ని ప్రోత్సహిస్తూ అవసరమైన నిధులు కేటాయించడంతో పాటు ఎంఎస్పీ పెంచుతూ పంటల బీమా పథకం వర్తింపజేస్తున్నట్లు పేర్కొన్నారు. భవిష్యత్తులో నీటి ఇబ్బందులు ఎదుర్కొనే క్రమంలో నీరు వృధా చేయకుండా భూమిలో చేర్చేందుకు దృష్టి పెట్టాలని, తద్వారా ప్రతి ఒక్కరికి ఎంతో ప్రయోజనం ఉంటుందని అన్నారు. ప్రధాని నరేంద్రమోడిపై ఎంత వత్తిడి వస్తున్నప్పటికీ ఇతర దేశాల పంట ఉత్పత్తుల దిగుబడుల జోలికి వెళ్లకుండా, దేశీయ వ్యవసాయం, రైతులను ప్రోత్సహిస్తున్నట్లు స్పష్టం చేశారు. అంతేకాకుండా ప్రపంచ దేశాలకు ధీటుగా భారత్‌ను గొప్ప ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దుతూ అమెరికా వంటి దేశాలకు ధీటైన సమాధానం చెబుతున్నట్లు వివరించారు.



క్రిస్టల్ విత్తనోత్పత్తి సంస్థలో పలు విభాగాలను ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

18-8P g7exHMNWJQE 11_18-8P g7exHMNWJQE.qxd 8/18/2025 12:42 AM Page 1



# ఊహాజనిత ఫ్యూచర్ సిటీకి భవిష్యత్ లేదు

## బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు 17:** పదేపదే చెప్పిన ఊహాజనిత ఫ్యూచర్ సిటీకి భవిష్యత్తు లేదని, కేవలం తన కుటుంబ సభ్యుల ప్రయోజనాల కోసం హైదరాబాద్ ఫార్మాసిటీ భూములలో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయాలన్న రేవంత్ రెడ్డి ఆకాంక్ష నెరవేరదని భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తెలంగాణ ఫార్మా సిటీ భూముల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై కేటీఆర్ తీవ్రంగా మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజన్ లేని నాయకుడని, ఆయన తీసుకుంటున్న నిర్ణయాల వల్ల ప్రజాధనం వృధా అవుతుందని ఆయన ఆరోపించారు. ఫార్మా సిటీ కోసం భూములిచ్చిన రైతులు మోసపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫార్మా సిటీ ప్రాజెక్టును రద్దు చేసి, దాని స్థానంలో ఫ్యూచర్ సిటీ అనే అవాస్తవ, ఊహాజనిత ప్రాజెక్టును ప్రవేశపెట్టారని దుయ్యబట్టారు. ఇది నిర్లక్ష్య నాయకుడు రాష్ట్రాన్ని పాలిస్తే ఏమవుతుందో దానికి ఫ్యూచర్ సిటీ ప్రచారం ఒక ఉదాహరణ అని పేర్కొన్నారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం, ఒక నిర్దిష్ట ప్రజా ప్రయోజనం కోసం సేకరించిన భూమిని ఇతరుల ప్రయోజనం కోసం రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులకు మళ్లించడం సాధ్యం కాదని కేటీఆర్ స్పష్టం చేశారు. ఈ చట్టాన్ని ఉటంకిస్తూ, తాను రెండేళ్ల క్రితమే అసెంబ్లీలో ఈ విషయంపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హెచ్చరించానని గుర్తుచేశారు. అయినా, రేవంత్ ప్రభుత్వం వందల కోట్ల రూపాయలు పీఆర్ కోసం ఖర్చు చేసి, ఇప్పుడు తీవ్రమైన న్యాయపరమైన అడ్డంకులను ఎదుర్కొంటోందని, చివరికి అధికారులు కూడా దీనిని అంగీకరిస్తున్నారని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో 56 గ్రామాల పరిధిలో హైదరాబాద్ ఫార్మాసిటీ కోసం 20,000 ఎకరాలతో ప్రతిపాదనలను తయారుచేసింది, స్థానిక రైతులు రాష్ట్ర ప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి వచ్చి తమ భూములను హైదరాబాద్ ఫార్మాసిటీ కోసం ఇచ్చారని కేటీఆర్ తెలిపారు. అయితే కొంతమంది తమ భూములు ఇవ్వడం పైన అభ్యంతరాలు వ్యక్తం చేస్తే కాంగ్రెస్ పార్టీ మాత్రం అధికారంలోకి రాగానే హైదరాబాద్ ఫార్మాసిటీ కోసం సేకరించిన ప్రతి ఎకరాన్ని తిరిగి రైతన్నలకు ఇస్తామని హామీలు ఇచ్చి, ఇప్పుడు రేవంత్ రెడ్డి కుటుంబ సభ్యులు స్నేహితుల కోసం అవే భూముల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూ వారిని నిండా మోసం చేసిందని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతన్నలు ఫార్మా కంపెనీల కోసం కేటాయించిన భూముల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారిందని కేటీఆర్ పేర్కొన్నారు. ఫార్మా సిటీ ప్రాజెక్టు కోసం గత ప్రభుత్వం కోట్లాది రూపాయల ప్రజాధనంతో మౌలిక వసతుల కల్పనను ప్రారంభించినా, రేవంత్ రెడ్డి ప్రభుత్వం దానిని పక్కనపెట్టి, ఇప్పుడు ఫ్యూచర్ సిటీ పేరుతో భూములను అక్రమంగా రియల్ ఎస్టేట్ కు మళ్లించే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. ప్రభుత్వ చర్యలు ప్రజా ప్రయోజనాలకు విరుద్ధంగా ఉన్నాయని, దీని వల్ల ప్రజలు, ముఖ్యంగా రైతులు నష్టపోతారని కేటీఆర్ హెచ్చరించారు. ఈ మొత్తం వ్యవహారంపై ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రజలకు, రైతులకు స్పష్టత ఇవ్వాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. లేనిపక్షంలో, బీఆర్ఎస్ పార్టీ రైతుల పక్షాన పోరాడుతుందని స్పష్టం చేశారు.

# యూరియా కొరత లేకుండా చర్యలు తీసుకోవాలి

## ప్రభుత్వానికి తెలంగాణ రైతు సంఘం డిమాండ్

**హైదరాబాద్, ఆగస్టు 17, ప్రభాతవార్త:** రాష్ట్రంలో యూరియా కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని.. తెలంగాణ రైతు సంఘం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. రైతులకు యూరియా కొరత లేకుండా, అందరికీ అందేలా చర్యలు తీసుకోవాలని సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి సాగర్ డిమాండ్ చేశారు. వర్షాలు సకాలంలో రావడంతో జలాశయాలు, చెరువులు, కుంటల్లో నీళ్లు ఉండడంతో వరి నాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయని.. ఈ నేపథ్యంలో రైతులకు ఎరువులు అందుబాటులో ఉండాలన్నారు. కానీ రాష్ట్ర వ్యాప్తంగా అనేక జిల్లాల్లో యూరియా కోసం సహకార సంఘాలు, డీలర్ షాపుల దగ్గర రైతులు బారులు తీరి నిలబడి ఉంటున్నారని అన్నారు.

సకాలంలో ఎరువులు అందుబాటులో లేకపోతే పంటలు దిగుబడి తగ్గే అవకాశం ఉంటుందన్నారు. యూరియా కొరతను అదునుగా చూపించి అనేకమంది డీలర్లు 40 కిలోల యూరియా బస్తాకు రూ. 267 వసూలు చేయాల్సి ఉండగా .. అదనంగా వసూలు చేస్తున్నట్లు రైతాంగం చెబుతున్నారని తెలిపారు.

కృత్రిమ కొరత సృష్టించి కూడా డీలర్లు రైతులను ఇబ్బంది పెడుతున్నారని అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం 2025 ఏప్రిల్-జూన్ నెలలకు 5 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కేటాయించిందని.. కానీ వాస్తవంగా కేవలం 3.06 లక్షల టన్నులు మాత్రమే అందించిందన్నారు. దీంతో 1.94 లక్షల టన్నుల లోటు ఏర్పడిందన్నారు. .ప్రస్తుతం ఈ లోటు 2.24 లక్షల టన్నులకు పెరిగిందని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి కేటాయించిన కోటా ప్రకారం యూరియాను, ఎరువులను సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. అలా చేయకపోతే రాష్ట్ర వ్యాప్త ఆందోళనలకు రైతాంగం పూనుకుంటుందన్నారు.

# వరంగల్ పంచాయతీపై నలుగురు సభ్యుల కమిటీ

## పిసిసి క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవి

# సమస్య పునరావృతమైతే రాజగోపాల్‌రెడ్డి చర్యలు తప్పవు

**హైదరాబాద్, ఆగస్టు 17, ప్రభాతవార్త:** కాంగ్రెస్ సీనియర్ నేత, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డికి పిసిసి క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవి వార్నింగ్ ఇచ్చారు. ఆదివారం మల్లు రవి మీడియాతో మాట్లాడారు. రాజగోపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై పిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తనతో మాట్లాడారని చెప్పారు. చాలా సేపు చర్చించినట్లు తెలిపారు. సమస్య రిపీట్ కాకుండా ఒకసారి చెప్పి చూస్తాం, మళ్లీ రిపీట్ అయితే తప్పకుండా రాజగోపాల్ రెడ్డిపై చర్యలు తీసుకుంటామని మల్లు రవి తెలిపారు. అనంతరం వరంగల్ పంచాయితీపై మల్లు రవి వివరణ ఇచ్చారు. వరంగల్‌కి నలుగురిని పంపించబోతున్నట్లు తెలిపారు. ఎవరెవరు వెళ్లాలి అనేది పార్టీ అధిష్టానం నిర్ణయిస్తుందని అన్నారు. వరంగల్ జరుగుతున్న అంశాలపై సీనియర్ కాంగ్రెస్ నాయకులతో కమిటీ వేయమని టిపిసిసి చీఫ్‌కు లేఖ రాశానని తెలిపారు. తాను పార్టీలో మంటలు పెట్టడానికి లేను, నా పని ఫైరింజన్ అని చెప్పారు. మంత్రి పదవి విషయంలో పదే పదే రాజ్ గోపాల్ రెడ్డి ఘాటు వ్యాఖ్యలు చేస్తున్నారు. ముఖ్యంగా సిఎం రేవంత్ రెడ్డిపై చేసిన వ్యాఖ్యల్ని కమిటీ సీరియస్‌గా తీసుకుందన్నారు. ఇక మరోవైపు, ఉమ్మడి వరంగల్ జిల్లాలో కొండా మురళి ఇటీవల చేసిన వ్యాఖ్యలపై ఆ జిల్లాకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు ఆయన వైఖరిపై క్రమశిక్షణ కమిటీకి ఫిర్యాదు చేశారు. దీనిపైనా క్రమశిక్షణ కమిటీ సమావేశంలో చర్చించారు. గజ్వేల్ దగ్గర డిసిసి నర్సా రెడ్డిదాడి చేశాడని మా దృష్టికి వచ్చింది దానిపై వివరాలు సేకరించామన్నారు. నలుగురు సభ్యులతో కూడిన కమిటీశ్యాం మోహన్ కమిటీ కన్వీనర్‌గా ఉంటారు. వచ్చే మంగళవారం సమావేశమై రాజగోపాల్ రెడ్డి అంశంపై చర్చిస్తామని మల్లు రవి స్పష్టం చేశారు.

# రాష్ట్రానికి యూరియా అందజేతపై కేంద్రం తీరు బాగా లేదు

## ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

**హైదరాబాద్, ఆగస్టు 17, ప్రభాతవార్త:** రాష్ట్రానికి యూరియా ఇచ్చే విషయంలో కేంద్రం వ్యవహరిస్తున్న తీరు బాగాలేదని ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం వైఖరి కారణంగానే తెలంగాణ రాష్ట్రంలో యూరియా కొరత ఉందన్నారు. కేంద్రమంత్రి నడ్డాకు ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, తాను ఐదారు సార్లు లేఖలు కూడా రాశానని తెలిపారు. యూరియా కొరత లేకుండా సరఫరా చేయాలని కేంద్రమంత్రి అధికారులను ఇచ్చారని, అయినప్పటికీ ఇంతవరకు మంత్రి చెప్పినట్లు ఎరువులు రాష్ట్రానికి సరఫరా కాలేదన్నారు. రాష్ట్రానికి ఖరీఫ్ సీజన్‌కు 9.80లక్షల మెట్రిక్ టన్నులు యూరియా అవసరం ఉందన్నారు. జులై వరకు 6.60లక్షల మెట్రిక్ టన్నులు యూరియా రాష్ట్రానికి ఇవ్వాల్సి ఉంది, కానీ ఇప్పటి వరకు ఇచ్చిన యూరియా కేవలం 4.36 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే అన్నారు. మకర్ ద్వారా ప్రొటెస్ట్ కూడా చేస్తాం....కచ్చితంగా రైతుల పక్షాన పోరాటం చేస్తాం...కేంద్రంపై ఒత్తిడి పెంచుతామని అన్నారు.

# అలసత్వం వద్దు.. అంతా అప్రమత్తంగా ఉండండి

## పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగంతో మంత్రి సీతక్క విడియో కాన్ఫరెన్స్

**హైదరాబాద్, ఆగస్టు 17, ప్రభాతవార్త:** పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ దానసరి అనసూయ సీతక్క ఆదివారం మధ్యాహ్నం పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిం చారు. ఈ సమావేశంలో నివిది ఎన్. అశోక్‌తో పాటు చీఫ్ ఇంజనీర్లు, సూపరింటెండింగ్ ఇంజనీర్లు, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.వర్షాలు, వరదల కారణంగా గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పడిన పరిస్థితులపై సమీక్ష నిర్వహిస్తూ, ఇప్పటివరకు మొత్తం 86.55 కిలోమీటర్ల మేర గ్రామీణ రహదారులు దెబ్బతిన్నాయని మంత్రికి నివేదించారు. ఈ రహదారుల తాత్కాలిక పునరుద్ధరణకు ఆరున్నర కోట్లు, శాశ్వత పునరుద్ధరణకు రూ.143 కోట్ల వరకు వ్యయం అవుతుందని ప్రాథమిక అంచనా వేసినట్లు తెలిపారు. మొత్తంగా రహదారులు మరియు ఇతర మౌలిక వసతుల పునరుద్ధరణకు రూ.150 కోట్ల వరకు అవసరమవుతుందని అధికారుల నివేదిక వెల్లడించింది.అలాగే వర్షాలు, వరదల కారణంగా 66 రహదారులు, 83 క్రాస్ డ్రైన్ పనులు, 60 చోట్ల గండ్లు పడినట్లు వివరించారు. అంతేకాకుండా శిథిలావస్థలో ఉన్న 36 భవనాలు గుర్తించామని, వాటిలో నివసిస్తున్న ప్రజలను ఇతర సురక్షిత ప్రదేశాలకు తరలిస్తున్నామని మంత్రికి తెలియజేశారు.గత రెండు రోజులుగా కురిసిన వర్షాల కారణంగా రవాణా సంబంధాలు తెగిపోయిన కొన్ని గ్రామాలకు మళ్లీ కనెక్టివిటీ పునరుద్ధరించినట్లు అశోక్ తెలిపారు. మంచిర్యాల జిల్లా భీమిలి మండలంలోని కర్జిభీంపూర్ గ్రామానికి, అదే మండలంలోని రాజారం గ్రామానికి రవాణా సంబంధాలను పునరుద్ధరించినట్లు వెల్లడించారు. అసిఫాబాద్ జిల్లా, అసిఫాబాద్ మండలంలోని రాజూర్ గ్రామానికి కూడా కనెక్టివిటీ పునరుద్ధరించినట్లు తెలిపారు.ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, అధికారులు, సిబ్బంది అందరూ అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. విధి నిర్వహణలో ఉన్నవారు పనిప్రదేశాలను వదిలి వెళ్లరాదని సూచించారు. వర్షాలు తగ్గిన వెంటనే తాత్కాలిక మరమ్మతు పనులను తక్షణం పూర్తి చేయాలని ఆదేశిస్తూ, కలెక్టర్ల వద్ద ఇప్పటికే నిధులు అందుబాటులో ఉన్నందున వాటిని వినియోగించి తక్షణ చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.

# కట్టిన ఇల్లులా.. పెట్టిన పొయ్యిలా కాళేశ్వరం!



సమావేశంలో మాట్లాడుతున్న మాజీమంత్రి హరీశ్‌రావు

## కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతుల ప్రయోజనాల కంటే రాజకీయాలే ముఖ్యం: మాజీమంత్రి హరీశ్‌రావు

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:** కట్టిన ఇల్లులా పెట్టిన పొయ్యిలా కాళేశ్వరం ఉంటే ఈ ప్రభుత్వం నీళ్లను సముద్రంలోకి వదిలి పడావు పెట్టిందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. ఆదివారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తన రాజకీయాల కోసం రైతులపై పగ,ప్రతీకారం తీర్చుకుంటుందన్నారు. ఎద్దైన ఉంటే మాపై కక్షసాధింపు చేయాలి తప్పా రైతులపై కాదని తెలిపారు.

అధికారంలోకి వస్తే ప్రజలకు మేలు చేయాలి తప్ప కీడు చేయకూడదన్నారు.నంది మేడారంలో కటక ఒత్తితే రోజుకు రెండు టీఎంసీల నీళ్లు వచ్చి మిడ్ మానేరు లో పడతా యాన్నారు. వారం రోజుల క్రితమే ఈ విషయాన్ని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డికి ఉత్తరం రాశానన్నారు. అన్నపూర్ణ, రంగనాయక సాగర్, మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్, బస్వాపూర్ రిజర్వాయర్లు ఖాళీగా ఉన్నాయి. నీళ్లను ఒడిసి పట్టండి వెంటనే మోటర్లు ఆన్ చేయండి అని ప్రభుత్వానికి విన్నవం చేశాము అయిన ప్రభుత్వం మోటర్లు ఆన్ చేయలేదు. ఇప్పుడు ఎల్లంపల్లి గేట్లెత్తి నీళ్లను సముద్రంలోకి వదులుతున్నారన్నారు.నీళ్ళ విలువ రైతులకు తెలుస్తది కాని ఉత్తంకుమార్‌రెడ్డి, రేవంత్‌రెడ్డికి ఏం తెలుసన్నారు.కేసీఆర్ కేంద్ర మంత్రిగా ఉన్నా, ముఖ్యమ ంత్రిగా ఉన్నా వ్యవసాయం చేసే ఒక రైతు ఆయన రైతు గనుకే ప్రతి చుక్కను ఒడిచి పట్టి నీళ్లను రైతులకు అందించారు.

కాంగ్రెస్ నేరపూరిత నిర్లక్ష్యం వల్ల రాష్ట్ర రైతాంగానికి తీవ్రమైన నష్టం జరుగుతుందన్నారు. కాళేశ్వరం కూలిందని చేసిన దుష్ప్రచారాన్ని కప్పిపుచ్చు కోవడానికే మోటర్ల ఆన్ చేయడం లేదు. వరద కాలువ ఓపెన్ చేసి మిడ్ మానేరు ఎల్ఎండి ఎందుకు నింపడం లేదో తెలపాలన్నారు. రిజర్వాయర్లన్ని నింపితే యాసంగిలో లక్షల ఎకరాల్లో పంట పండుతుందన్నారు. ఎరువులు, పంట భీమా,కరెంటు ఇవ్వడానికి ఆఖరికి నీళ్లను ఇచ్చేందుకు కూడా ఈ ప్రభుత్వం రైతులను గోసపెట్టుకుంటుదన్నారు. పదేళ్ళలో ఎన్నడు రైతులు ఎరువు బస్తాల కోసం అరుగుల మీద పడుకోలేదని,కాంగ్రెస్ వచ్చింది మార్పు వచ్చింది మళ్ళీ పాత రోజులు వచ్చాయియాన్నారు.

చెప్పులను లైన్లో పెట్టి అరుగుల మీద పడుకునే రోజులొచ్చాయన్నారు.నేను రాజకీయాల కోసం మాట్లాడటం లేదు రైతుల కోసం మాట్లాడుతున్నా రైతుల పక్షాన మాట్లాడుతన్నా మాజీ నీటి పారుదలశాఖ మంత్రిగా అవగాహనతో మాట్లాడుతున్నానని ధ్వజమెత్తారు. ఇప్పటికెనా కాళేశ్వరం మోటర్లను ఆన్ చేయడం చేతకాకపోతే మేమే వేలాది మంది రైతులతో కదిలి వెళ్లి మోటార్లను ఆన్ చేస్తామని హెచ్చరించారు.

# ఆర్ఎస్ఎస్‌పై రాహుల్‌గాంధీ విమర్శలు తగదు

## బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్

**హైదరాబాద్, ఆగస్టు 17, ప్రభాతవార్త:** ఆర్ఎస్ఎస్‌పై రాహుల్‌గాంధీ విమర్శలు చేయడం తగదని బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు డా.ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్ అన్నారు. ఆదివారం భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఆగస్టు 15 స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని భారత ప్రధాని నరేంద్ర మోడీ జాతీయ పతాక ఆవిష్కరణ తర్వాత జాతిని ఉద్దేశించి ప్రసంగించారు. ఆ ప్రసంగంలో ఆర్ఎస్ఎస్ సేవలను కొనియాడుతూ ప్రస్తావించారు. దీనిపై రాహుల్ గాంధీ రకరకాల విమర్శలు గుప్పించారని, రకరకాల మాటలు కూడా మాట్లాడారన్నారు. రాహుల్‌గాంధీ చరిత్ర తెలిసి మాట్లాడాడా? లేక చరిత్ర తెలియక మాట్లాడాడా? అంటూ ప్రశ్నించారు. కాంగ్రెస్‌లో తాను కొత్త పంథాను చూపించుకోవడం కోసం మాట్లాడాడా? అన్నది అర్థం కావడం లేదన్నారు. స్వయంగా ఆయన తాత జవహర్ లాల్ నెహ్రూ, చైనా యుద్ధ సమయంలో ఆర్ఎస్ఎస్ స్వయం సేవకులు చేసిన సేవలను గమనించి, జవాన్లకు అందించిన సహకారాన్ని గుర్తించారన్నారు. ఆ తీరును దృష్టిలో పెట్టుకొని, 1963 జనవరి 26న జరిగే రిపబ్లిక్ డే పరేడ్‌కు స్వయంగా భారత ప్రధాని నెహ్రూ ఆర్ఎస్ఎస్‌ను పాల్గొనాలని కోరుతూ ఆహ్వానించారన్నారు. ఈ విషయం రాహుల్ గాంధీకి తెలియనట్టుందని, దీనికి సంబంధించి దృశ్యాలు చూడవచ్చునని అన్నారు. చైనా భారత్‌పై ఆక్రమణ చేస్తుందని పలు సార్లు హెచ్చరికలు వచ్చాయి. కానీ ప్రభుత్వం, ప్రసార మాధ్యమాలు దానిని సీరియస్‌గా తీసుకోలేదు. చివరికి 1962లో చైనా భారత్‌పై ఆక్రమణ చేసింది. అలాగే భారత్-పాకిస్తాన్ యుద్ధాలలో కూడా స్వయంసేవకులు ప్రభుత్వం, సైన్యానికి అన్ని విధాలా సహకారం అందించారు. కొన్ని సంవత్సరాల తర్వాత గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో పాల్గొనడానికి పండిట్ నెహ్రూ స్వయంగా సంఘాన్ని ఆహ్వానిం చారు. సంఘంలోని వారు కూడా దేశభక్తులే అని నెహ్రూ అన్నారన్నారు.

# పేట్‌బషీరాబాద్ సరోగసి కేసు సంచలనం

## ఏజెంట్లుగా నిందితులు .. పలు ప్రైవేట్ ఆస్పత్రులకు నోటీసులు



**హైదరాబాద్ (పేట్‌బషీరాబాద్), ఆగస్టు 17, ప్రభాతవార్త:** రెండు తెలుగు రాష్ట్రాల్లో సరోగసి కేసులు వేల సంఖ్యలో వెలుగులోకి వస్తుండటం, అటూ అధికారులను, ప్రజలను ఆశ్చర్యానికి గురిచేస్తుంది. ఈ నేపథ్యంలో పోలీసులు వారి కర్తవ్యాన్ని నిర్వహిస్తూ.. ముందుకు దూసుకెళ్తున్నారు. తాజాగా మేడ్చల్ సరోగసి కేసును సుమోటో కేసుగా తీసుకుని పేట్ బషీరాబాద్ పోలీసులు ఎస్ఐఆర్ నమోదు చేశారు. పేట్ బషీరాబాద్ పరిధిలో వెలుగులోకి వచ్చిన సరోగసి రాకెట్ కేసు దర్యాప్తు వేగం అందుకుంది. ఈ కేసులో నిందితురాలు లక్ష్మి ్మ, ఆమె కుమారుడు నరేందర్ రెడ్డి పలు ప్రైవేట్ ఆస్పత్రులకు ఏజెంట్లుగా వ్యవహరించినట్లు పోలీసులు గుర్తించారు. ఈ నేపథ్యంలో పేట్ బషీరాబాద్ పోలీసులు పలు ప్రముఖ ఆస్పత్రులు, ఫెర్టిలిటీ సెంటర్లకు నోటీసులు జారీ చేశారు. ఈ మేరకు హెగ్డే హాస్పిటల్, లక్స్ హాస్పిటల్, అను టెస్ట్ ట్యూబ్ సెంటర్, ఈవీఎఫ్ ఐవీఎఫ్ సెంటర్, ఫర్టి కేర్, శ్రీ ఫెర్టిలిటీ, అమూల్య ఫెర్టిలిటీ సెంటర్‌లకు శనివారం నోటీసులు అందజేశారు.

ఈ సందర్భంగా పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, సరోగసి ముఠా ఈ ఆస్పత్రుల ద్వారా దందా కొనసాగించిన అవకాశాలు ఉన్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయంపై స్పష్టత కోసం ఆయా ఆస్పత్రుల యాజమాన్యానికి నోటీసులు పంపినట్లు సమాచారం.

**ఇంకా వెలుగులోకి రాబోయే అంశాలు..**

దర్యాప్తు కొనసాగుతున్న దశలో కొత్త విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. కొందరి ఆర్థిక అవసరాలు, ఇబ్బందులను, మరొకరి సంతాన సాఫల్యత కలను క్యాష్ చేసుకుంటున్నాయి. ఒకరు భర్తప్రాణాలను రక్షి ంచుకు నేందుకు సరోగసికి ఒప్పుకుంటే.. మరొక యువతి కుటుంబ అవసరాల కోసం అండం డొనేట్ చేసేందుకు ఒప్పుకుంది. ఇలాంటి అనేక విషయాలు సరోగసి అక్రమ దందా కేసులో వెలుగులోకి వస్తున్నాయి.

**కిడ్నీ ఆపరేషన్ కోసం..**

సరోగసి అక్రమ దందా కేసులో గర్భవతిగా ఉన్న ఓ మహిళ తన భర్త ప్రాణాలు కాపాడుకునేందుకు సరోగసికి ఒప్పుకున్నట్లు తెలుస్తుంది. ఇతర రాష్ట్రం నుంచి వచ్చిన ఈమెకు ఇప్పటికే ఇద్దరు పిల్లలున్నారు. భర్తకు రెండు కిడ్నీలు పాడవడంతో ఆపరేషన్ చేయాల్సి ఉంది. ఎవరూ సహకరించక పోవడంతో ఆమె సరోగసి దందా చేస్తున్న నారెడ్డుల లక్ష్మీ ్మరెడ్డిని సంప్రదించింది.

మహిళ అవసరాన్ని తెలుసుకుని అందుకు సహకరిస్తానని చెప్పి అన్నట్టుగానే భర్తకు ఆపరేషన్ చేయించింది. దీనికి సుమారు రూ.15 లక్షల వరకు చెల్లించినట్లు తెలుస్తుంది. తర్వాత బాధిత మహిళకు సరోగసి చేయించి ఆమెను పద్మానగర్‌లో ఉన్న తన ఇంట్లోనే ఆశ్రయం కల్పించింది.

**అండానికి రూ.10 వేలు..**

సరోగసి అక్రమ దందా చేస్తున్న మహిళ ఒక్కో అండ దానానికి రూ.10 వేలు చెల్లిస్తున్నట్లు చెబుతున్నారు. నెలలో ఓ మహిళ మూడు అండాలను ఇవ్వాల్సి ఉంటుంది. దీనికి మొత్తంగా రూ.30 వేలు బాధిత మహిళలకు అందిస్తుంది. ఈ క్రమంలోనే ఓ యువతి వద్ద నుంచి అండం సేక రిస్తున్న క్రమంలో విషయం బయటకు వచ్చినట్లు సమాచారం. దీని ఆధారంగానే పోలీసులు ఆకస్మిక తనిఖీలకు వెళ్లి సరోగసి అక్రమ దందా వ్యవహారాన్ని బట్టబయలు చేశారు.



# పేకాట ఆడుతూ దొరికిన ప్రముఖులు

## భారీగా నగదు స్వాధీనం.. 11 మంది అరెస్ట్

## పట్టుబడిన వారిలో ఓ ఎమ్మెల్సీ తండ్రి, కార్పొరేటర్

**హైదరాబాద్, ఆగస్టు 17, ప్రభాతవార్త:** పేకాట ఆడుతూ పలువురు ప్రముఖులు పోలీసులకు చిక్కారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఆదివారం రాత్రి కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని వైష్ణవికాలనీలో ఓ గెస్ట్‌హౌస్‌లో పేకాట ఆడుతున్నారనే సమాచారం అందుకున్న బాలానగర్ ఎస్వోటీ పోలీసులు పేకాట శిబిరంపై దాడిచేసి, 11 మంది పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 2.52 లక్షల నగదుతో పాటు 11 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. తదుపరి విచారణ నిమిత్తం నిందితు లను కూకట్‌పల్లి పోలీసులకు అప్పగించారు. ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. పట్టుబడిన వారిలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ నవీన్ రావు తండ్రి కొండలరావు(72), అల్విన్‌కాలనీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్(64), కూకట్‌పల్లికి చెందిన ప్రముఖులు, వ్యాపార వేత్తలు నాయినేని తులసిరావు(58), గన్నమనేని బాలరావు(61), వడ్డేల భాస్కర్(60), కల్వకుంట్ల రంగారావు(57), అవధూత నాగేశ్వరరావు(61), మురళి మోహన్ కృష్ణ కుమార్(79), చింతపట్ల అనిల్‌కుమార్(55), తీగల శ్రీనివాస్ రావు (55), సిహెచ్.భాస్కరరావు(62)లు ఉన్నారని పోలీసులు తెలిపారు.

# నకిలీ సరుకుల కేరాఫ్‌గా మారుతున్న న్యూఢిల్లీ

## ఖరీదైన విదేశీ సిగరెట్ల పేరిట కల్తీ వస్తువుల తయారీ

## నికోటిన్ సహా ప్రమాదకర రసాయనాలతో ఇ-సిగరెట్ల తయారీ

**హైదరాబాద్, ఆగస్టు 17, ప్రభాతవార్త:** దేశ రాజధాని ఢిల్లీ నగరం కల్తీ వస్తువుల తయారీకి కేరాఫ్‌గా మారుతోంది. నిన్నటి వరకు కొన్ని రకాల న కిలీ వస్తువుల తయారీ వరకే పరిమితమైన ఢిల్లీ నగరం నేడు ఖరీదైన విదేశీ సిగరెట్ల పేరిట నాసీరకం పొగాకుతో కల్తీ వస్తువుల తయారీతో పాటు నికోటిన్ సహా ప్రమా దకర రసాయనాలతో ఈ..సిగరెట్ల తయారీ కూడా ఎక్కువగా జరుగుతుండడం పోలీసులకు పెద్ద సవాల్‌గా మారుతోంది. ఢిల్లీ నగరంలో తయారవుతున్న కల్తీ సరుకు హైదరాబాద్ సహా దేశంలోని అన్ని నగరాలకు సరఫరా అవుతుండగా ఆయా నగరాలలోని చోటా వ్యాపారు లు, నేరగాళ్లు వీటికి ఏజెంట్లుగా వ్యవహరిస్తూ మార్కెట్లను శాసించే స్థాయికి చేరుకోవడం విశేషం. ఢిల్లీ సరుకు అంటే ఒకప్పుడు కచ్చితంగా మంచిదనే పేరుండేది. కానీ నేడు అక్కడ నుంచి వచ్చే సరుకంతా నకిలీదిగా వుంటోందని పోలీసులకు అందుతున్న ఫిర్యాదులు చెబుతున్నాయి. ప్రముఖ బ్రాండెడ్ కంపెనీల దుస్తుల ఉత్పత్తులు మొదలుకొని విద్యుత్ ఉపకరణాలు, సిగరెట్లు, గృహోపక రణాలు, ఆహార వస్తువులు ఇలా అనేక రకాల ఉత్పత్తుల నకిలీకి ఢిల్లీ కేంద్రంగా మారడం ఇప్పుడు హాట్ టాఫిక్‌గా మారింది. హైదరాబాద్‌లోని కోఠి, బేగంబజార్ సహా అనేక ప్రాంతాలలో నగర పోలీసులతో పాటు ఢిల్లీ పోలీసులు బడా కంపెనీల ప్రతినిధులతో కలిసి నకిలీ ఉత్పత్తులను అమ్మేవారి కోసం తరచూ సోదాలు జరుపుతున్నారంటే వీటి చలామణి మార్కెట్లో ఏ స్థా యిలో వుందో ఊహించుకోవచ్చు. ఒక్క హైదరాబాదే కాదు దేశంలోని అన్ని ప్రముఖ నగరాలలోనూ ఇదే తరహాలో నకిలీలు రాజ్యమేలుతున్నాయంటే అతిశయోక్తి కాదు. ఇటీవల కాలంలో నకిలీ ఉత్పత్తుల వెల్లువలో ఎ క్కువగా పట్టుబడుతున్నవి నకిలీ విద్యుత్ ఉపకరణాలు, దుస్తులు, నూనెలు, సబ్బులు, ఆహార వస్తువులతో పాటు ఖరీదైన విదేశీ సిగరెట్ల పేరిట న కిలీ, నాసీరకం సిగరెట్లు, నికోటిన్ సహ ప్రమాదకర రసాయనాలతో తయారవుతున్న ఈ..సిగరెట్లు వుంటున్నాయి. ఇతర వస్తువుల విషయం ఎలా వున్నా ఆహార వస్తువులతో పాటు నకిలీ సిగరెట్లు ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నాయనడంలో ఎలాంటి సందేహం లేదు. వీటిని చలామణి చేస్తున్న నేరగాళ్లు ప్రజల ఆరోగ్యంతో ఆటలాడుకుంటున్నారు. ముఖ్యంగా గడచిన రెండేళ్ల కాలంలో నకిలీ విదేశీ సిగరెట్లు, నకిలీ ఈ..సిగరెట్ల వరుసగా పట్టుబడుతుండడం గమనార్హం. భారత్‌లో సిగరెట్ ప్రియులకు కొదవలేదన్న సంగతి బహిరంగ రహస్యమే. ఇందులో విదేశీ సిగరెట్లు అంటే మోజుపడే వారు మరింత మంది వుండేది విదితమే. సరిగ్గా ఈ అంశాన్ని సొమ్ము చేసుకుంటున్న స్మగ్లర్లు బీడీల తయారీలో వాడే నాసికరం పొగా కును వాడుతూ అందులో కొంత రంగు, వాసన కలిపి విదేశీ సిగరెట్ల మా దిరిగా చక్కగా ప్యాకింగ్ చేస్తూ వాటిని అనేక నగరాలలోని ఇష్టారాజ్యంగా పంపిణీ చేస్తున్నారు. పట్టుమని అర్థ రూపాయి కూడా ఖరీదు చేయని నకిలీ సిగరెట్లు డీలర్లకు రెండు రూపాయల నుంచి మూడు రూపాయలకు ఇస్తున్నారు. వీటిని కొంటున్న వ్యాపారులు 25 రూపాయల నుంచి 40 రూపాయల వరకు అమ్ముతూ రెండు చేతులా సంపాదిస్తున్నారు. విదేశీ సి గరెట్ల పేరిట దమ్ము పీలుస్తూ రింగు రింగులుగా పొగ వదులుతున్న పొగరాయుళ్లు తాము తాగేది నకిలీ సిగరెట్ అనేది తెలియక తమ ఆరోగ్యాన్ని తామే పాడు చేసుకుంటున్నారు. సాధారణంగా విదేశీ సిగరెట్లు అంటే ఫారిన్, బ్రిటీష్, జర్మనీ దేశాల సరుకుకు బాగా డిమాండ్ వుంటుంది. ఇదే క్ర మంలో న కిలీ సరుకును తయారుచేస్తున్న స్మగ్లర్లు సిగరెట్ ప్రియుళ్ల ఆరోగ్యాన్ని హరిస్తున్నారు.

**కల్తీ ఆహార వస్తువులు, నకిలీ సిగరెట్లతో ప్రమాదంలో ప్రజల ఆరోగ్యం: వైద్య నిపుణులు**

ఇదిలా వుండగా కల్తీ ఆహార వస్తువులతో పాటు నకిలీ సిగరెట్లతో ప్రజారోగ్యం ప్రమాదంలో పడిందని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఆహార వస్తు వుల తయారీ, విక్రయాల విషయంలో సర్కారీ విభాగాలు కఠినంగా వుండాలని వారంటున్నారు. ఇదే సమయంలో నకిలీ సిగరెట్ల క్రయవిక్రయాల లోనూ ఇదేరీతిన వుండాలని వారు చెబుతున్నారు. సిగరెట్ పీల్చడమే ప్రమాదకరం అయినపుడు నకిలీ సిగరెట్ మరింత ప్రమాదకరమని క్యాన్సర్ ఆసత్రి వైద్యులు చెబుతున్నారు. దేశ వ్యాప్తంగా అన్ని నగరాలలో నకిలీ సిగరెట్ల అమ్మకాలపై తమకు సమాచారం వుందని, ఈ విషయంలో ఆయా ప్రాంతాల పోలీసులతోపాటు పౌర విభాగాల అధికారులు కఠినంగా వ్యవహరించాలని వారు కోరుతున్నారు. కల్తీ సిగరెట్ల వాడకం వల్ల నోటి క్యాన ్సర్, గుండె క్యాన్సర్, రక్త క్యాన్సరవంటి ప్రమాదకర జబ్బులు వచ్చే అవకాశాలున్నాయని వారంటున్నారు. సిగరెట్లు వాడు తున్న వారు క్యాన్స ర్ బారినపడుతూ నిత్యం తమ వద్దకు వస్తున్నారని, ఇందులో నకిలీ సిగరెట్ల బారిన పడ్డ వారు కూడా వున్నారని వైద్య నిపుణులు తెలిపారు.

# ఆసియా కప్ అత్యధికసార్లు భారత్‌కే




## 16 ఎడిషన్లలో 8 సార్లు విజయం

## శ్రీలంక 6, పాక్2 సార్లు విన్

**న్యూఢిల్లీ:** ఆసియా కప్ 2025 సందడి మొదలైంది. క్రికెట్ అభిమానుల ఆసక్తి అంతా ఇప్పుడు ఏషియా కప్‌పైనే ఉంది. ఈ మెగా టోర్నమెంట్ సెప్టెంబర్ 9 నుంచి అదే నెల 28 వరకు యూఏఈలోని దుబాయ్, అబుదాబి నగరాల్లో జరగనుంది. ఈసారి భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ఈ టోర్నీని నిర్వహిస్తోంది. ఇది ఆసియా కప్ 17వ ఎడిషన్ కావడం విశేషం. ఈసారి ఈ టోర్నీని టీ20 ఫార్మాట్‌లో నిర్వహిస్తున్నారు. వాస్తవానికి, ఆసియా కప్ టీ20 ఫార్మాట్‌లో జరగడం ఇది మూడోసారి మాత్రమే. మిగిలిన 14 సార్లు వన్డే ఫార్మాట్‌లో జరిగింది. ఇప్పటి వరకూ జరిగిన ఏషియాకప్‌లో టీమిండియాదే అత్యధిపత్యం. ఆసియాలోనే అతిపెద్ద క్రికెట్ టోర్నమెంట్ అయిన ఆసియా కప్‌ను 1984లో ఆసియా క్రికెట్ కౌన్సిల్ ప్రారంభించింది. 2016 నుంచి ఈ టోర్నమెంట్ ఐసీసీ ప్రధాన టోర్నమెంట్ల ఫార్మాట్‌కు అనుగుణంగా వన్డే లేదా టీ20 ఫార్మాట్‌లో జరుగుతోంది. ఈ టోర్నమెంట్‌ను టీ20 ఫార్మాట్‌లో నిర్వహించడంతో దీనికి ప్రాధాన్యత ఏర్పడింది. ఆసియా కప్ చరిత్రలో భారత్, శ్రీలంక, పాకిస్తాన్ జట్లు ఆధిపత్యం చెలాయించాయి. ముఖ్యంగా భారత్, పాకిస్తాన్, శ్రీలంక మధ్య జరిగే మ్యాచ్‌లు ఎప్పుడూ థ్రిల్లింగ్‌గా ఉంటాయి. ఈ టోర్నీలో అత్యధికంగా విజయం సాధించిన జట్టుగా భారత్ నిలిచింది. ఇప్పటివరకు టీమిండియా ఏకంగా 8 సార్లు (1984, 1988, 1991, 1995, 2010, 2016, 2018, 2023) విజేతగా నిలిచింది. ఆ తర్వాత శ్రీలంక 6 సార్లు (1986, 1997, 2004, 2008, 2014, 2022) ట్రోఫీని గెలుచుకుంది. పాకిస్తాన్ కూడా 2 సార్లు (2000, 2012) విజేతగా నిలిచింది. బంగ్లాదేశ్ మూడు సార్లు ఫైనల్‌కు చేరినా, ఇప్పటివరకు ఒక్కసారి కూడా టైటిల్ సాధించలేకపోయింది. ఈసారి ఆసియా కప్‌లో మొత్తం 8 జట్లు పాల్గొంటున్నాయి. వీటిని ఒక్కో గ్రూప్‌లో నాలుగు జట్ల చొప్పున రెండు గ్రూప్‌లుగా విభజించారు. భారత్ తన మొదటి మ్యాచ్‌ను సెప్టెంబర్ 10న యూఏఈతో ఆడనుంది. ఈ టోర్నీలో అత్యంత ఆసక్తికరమైన విషయం భారత్‌పాకిస్తాన్ మ్యాచ్‌లు. ప్రస్తుతం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం, రెండు జట్లు ఒకే గ్రూప్‌లో ఉన్నాయి. అంటే కనీసం లీగ్ దశలో ఒక మ్యాచ్ ఆడతాయి. ఒకవేళ ఇరు జట్లు సూపర్ ఫోర్ రౌండ్‌లోకి వెళ్తే, అక్కడ మరోసారి తలపడతాయి. ఇక ఫైనల్‌కు కూడా చేరితే, టైటిల్ కోసం మరోసారి పోరాడతాయి. ఈసారి భారత్, పాకిస్తాన్ మధ్య మూడు హైవోల్టేజ్ మ్యాచ్‌లు జరిగే అవకాశం ఉంది.

ఆట



## స్క్వాష్ బేగా ఓపెన్‌లో..

# అనహత్ నిష్క్రమణ

**న్యూఢిల్లీ:** ఎన్ఎస్‌డబ్ల్యూ స్క్వాష్ బేగా ఓపెన్‌లో తొలి పిఎస్ఎ కాపర్ ఫైనల్‌లో అనాహత్ సింగ్ నిష్క్రమించింది. నాల్గవ గేమ్‌లో గాయంతో వాకోవర్ ఇచ్చింది. ఆదివారం ఆస్ట్రేలియాలోని బేగాలో జరిగిన పిఎస్ఎ వరల్డ్ టూర్ ఈవెంట్-2025 ఎన్ఎస్‌డబ్ల్యూ స్క్వాష్ బేగా ఓపెన్‌లో భారత టీనేజ్ సంచలనం అనహత్ తన తొలి ఫైనల్‌లో రన్నరప్‌గా నిలిచింది. సెమీఫైనల్ సమయంలో చీలమండ గాయం కారణంగా ఆ యువతి తన విజయ పరంపరను కొనసాగించలేకపోయింది, దీంతో ఆమె ఈజిప్టుకు చెందిన హబీబా హానితో జరిగిన నాల్గవ గేమ్‌లో 11-9, 5-11, 8-11, 4-10 తేడాతో ఫైనల్ మ్యాచ్ నుండి వైదొలగాల్సి వచ్చింది. ప్రపంచ 53వ ర్యాంకర్ అనాహత్ ఈ టోర్నమెంట్‌లో అద్భుతమైన ప్రదర్శన ఇచ్చి వరల్డ్ టూర్‌లో తన తొలి ఫైనల్‌కు చేరుకుంది. ఇది ఆమె మొదటిసారిగా ప్రపంచంలోని టాప్ 50 ర్యాంక్ క్రీడాకారిణుల జాబితాలోకి ప్రవేశించడానికి కూడా సహాయపడుతుంది. ఫైనల్లో, అనాహత్ మెరుగైన ఆరంభాన్ని ఇచ్చి ప్రారంభ గేమ్‌ను 11-9 తేడాతో గెలుచుకుంది. కానీ తర్వాత ఆమె గాయం తీవ్రం కావడంతో ఆమె యువ ఈజిప్షియన్ క్రీడాకారిణి వేగాన్ని అందుకోలేకపోయింది. దీంతో రెండవ గేమ్‌ను కోల్పోయింది. 17 ఏళ్ల ఆమె మూడవ గేమ్‌లో పోరాటం కొనసాగించినా కానీ 8-11తో దగ్గరగా ఓడిపోయింది.

## ఆసియా కరాటే ఛాంపియన్‌షిప్‌లో

# హృదాన్‌కు స్వర్ణం

## 7 పతకాలతో ముగిసిన భారత్ పోరు



**న్యూఢిల్లీ:** ఆసియా కరాటే యూత్ ఛాంపియన్‌షిప్-2025ను భారత్ 7 పతకాలతో ముగించింది. హ్రిడాన్ జట్టు గతంలో మూడు పతకాలు సాధించిన ప్రదర్శనను మెరుగుపరుచుకోవడంతో ఈ సారి స్వర్ణంతో మెరిసింది. చివరి రోజు ఆదివారం హృదాన్ స్వర్ణంతో టోర్నమెంట్‌ను ముగించాడు. ఈ నెల 12 నుండి చైనాలోని లిస్పింగ్‌లో జరిగిన 2వ ఆసియా యూత్ ఓపెన్ ఛాంపియన్‌షిప్‌లో భారత్ కరాటే జట్టు స్వర్ణంతో సహా మొత్తం ఏడు పతకాలను గెలుచుకుంది. కుమితేలో 4 మరియు కటాలో 3 పతకాలు గెలుచుకున్న యువ భారత బృందం. అండర్ 14 విభాగంలో హృదాన్ (50 కిలోల కుమితే) స్వర్ణం సాధించగా, కుష్ (40 కిలోల కుమితే) రజతంతో సరిపెట్టుకున్నాడు. క్యాడెట్‌లో లోహిత్ (63 కేజీల కుమితే). రైనా ( అండర్ 10 కటా) కాంస్య పతక విజేతల్లో ఉన్నారు. అండర్ 12 (45 కిలోల కుమితే) విభాగంలో విభు భారత్ పతకాల జాబితాలో మరో కాంస్యం సాధించాడు. హృదాన్, అర్మాన్, కుష్‌లతో కూడిన అండర్ 14 కటా జట్టు, శ్రేయాన్ష్, తుషార్, వశిష్టలతో కూడిన క్యాడెట్, జూనియర్ కటా టీమ్ ఒక్కో కాంస్యం గెలుచుకుంది. కాగా గత ఎడిషన్‌లో భారత బృందం కేవలం మూడు పతకాలు మాత్రమే గెలుచుకుంది.

# డ్యూరాండ్ కప్‌లో ఇండియన్ నేవీ ఎఫ్‌టి ఓటమి

## సెమీఫైనల్స్‌కు షిల్లాంగ్



**న్యూఢిల్లీ:** డ్యూరాండ్ కప్ తొలి క్వార్టర్ ఫైనల్‌లో షిల్లాంగ్ లాజోంగ్ ఎఫ్‌సి 2-1 తేడాతో ఇండియన్ నేవీ ఎఫ్‌టిని ఓడించి వరుసగా రెండో సెమీఫైనల్‌కు చేరుకుంది. విజయ్ మరాండి తొలి అర్ధభాగంలో భారత నేవీకి ఆధిక్యాన్ని అందించిన తర్వాత, దమైట్‌ఫాంగ్ లింగ్డో, ఎవర్‌బ్రైట్‌సన్ సనా మైలియంప్డా రెండవ అర్ధభాగంలో చేసిన గోల్స్ ఆతిథ్య జట్టుకు విజయాన్ని అందించాయి. షిల్లాంగ్ లాజోంగ్ 4-3-3 ఫార్మేషన్‌లో ప్రారంభమైంది. ప్రధాన కోచ్ బీరేంద్ర థాపా ఫ్రాంగ్కి బువామ్, ఎవర్‌బ్రైట్‌సన్ సనా, షీన్ స్టీవెన్‌సన్‌లను మిడ్‌ఫీల్డ్‌లో డమైట్‌ఫాంగ్ లింగ్డో, ట్రెయిమికి లామురోంగ్, గ్లాడీ ఖర్బులితోను, భారత నేవీ హెడ్ కోచ్ రామన్ రాయ్ తన జట్టును సాంప్రదాయ 4-4-2 ఫార్మేషన్‌లో రంగంలోకి దించారు. కెప్టెన్ భాస్కర్ రాయ్ గోల్‌ను కాపాడుతుండగా, శ్రేయాస్ వీజీ, విజయ్ మరాండి బరిలోకి దిగారు. మొదటి అర్ధభాగంలో 35వ నిమిషం వరకు చాలా తక్కువ అవకాశాలు మాత్రమే వచ్చాయి. రెండు నిమిషాల ముగింపులో భారత నేవీ ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. రెండు ఎండ్లలో గోల్ కీపర్లు అద్భుతమైన సేవ్‌లు చేసేలోపు గోల్ వచ్చింది. రెండవ అర్ధభాగంలో షిల్లాంగ్ లాజోంగ్ సమం చేసే క్రమంలో 69వ నిమిషంలో లక్కీ బ్రేక్‌తో చివరికి దమైట్‌ఫాంగ్ లింగ్‌డో ఇచ్చిన క్రాస్ బంతి గోల్ చేసింది. 79వ నిమిషంలో యువ ఆటగాడు ఎవర్‌బ్రైట్‌సన్ సనా గెలిచి పెనాల్టీని గోల్‌గా మార్చడంతో షిల్లాంగ్ లాజోంగ్ ఆధిక్యంలోకి వెళ్లి పెనాల్టీని గోల్‌గా మార్చాడు. దీంతో షిల్లాంగ్ లాజోంగ్ సెమీ ఫైనల్‌కు చేరుకుంది.

# మహిళల వన్డేలో భారత్ ఓటమి


## 9 వికెట్ల తేడాతో ఆస్ట్రేలియా ఘన విజయం

**న్యూఢిల్లీ:** మహిళల వన్డే మూడో మ్యాచ్‌లో ఆస్ట్రేలియా చేతిలో భారత్ ఓటమి చెందింది. 9 వికెట్ల తేడాతో ఆస్ట్రేలియా ఘన విజయం సాధించింది. అయితే ఇప్పటికే జరిగిన రెండు వన్డే మ్యాచ్‌ల్లో భారత్ గెలుపొంది 2-0తో సిరీస్‌ను కైవసం చేసుకుంది. ఇక బ్రిస్బేన్‌లో ఆదివారం జరిగిన మూడో వన్డేలో తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ తడబడింది. ఆస్ట్రేలియా బౌలర్లు తహ్లియా మెక్‌గ్రాత్ (8-0-40-3), అనిక లియారాయ్డ్ (3-0-16-2), ఎల్లా హేవర్డ్ (10-0-40-2), సియన్నా జింజర్ (8.4-0-50-2), లూసీ హ్యామిల్టన్ (10-2-34-1) సత్తా చాటడంతో 47.4 ఓవర్లలో 216 పరుగులకు ఆలౌట్ అయింది.



షెఫాలీ వర్మ (52), యస్తికా భాటియా (42) పోరాటపటిమ కనబర్చి భారత్‌కు ఈ మాత్రం స్కోరైనా అందించారు. వీరు మినహా టీమిండియాలో ఎవరూ రాణించ లేదు. నందిని కశ్యప్ (28), రఘవి బిస్త్ (18) తనుశ్రీ సర్కార్ (17), కెప్టెన్ రాధా యాదవ్ (18), తనుజా కన్వర్ (15) రెండంకెల స్కోర్లు చేయగా, తేజల్ హసబ్నిస (1), మిన్నూ మణి (5), సైమా ఠాకోర్ (0), షబ్నమ్ షకీల్ (7 నాటౌట్) సింగిల్ డిజిట్ స్కోర్లకే పరిమితమయ్యారు. అనంతరం స్వల్ప లక్ష్యాన్ని ఆస్ట్రేలియా సునాయాసంగా ఛేదించింది. ఓపెనర్ అలిస్సా హీలీ (84 బంతుల్లో 137 నాటౌట్, 23 ఫోర్లు, 3 సిక్సర్లు) సుడిగాలి శతకంతో ఆస్ట్రేలియాను విజయతీరాలకు చేర్చింది. ఆమెకు మరో ఓపెనర్ తహ్లియా విల్సన్ (59), రేచల్ ట్రెనామన్ (21 నాటౌట్) సహకరించారు. కాగా ఇరు జట్ల మధ్య ఏకైక టెస్ట్ మ్యాచ్ ఈ నెల 21 నుండి ప్రారంభం కానుంది. ఈ మల్టీ ఫార్మాట్ సిరీస్ కోసం టీమిండియా ఆస్ట్రేలియాలో పర్యటిస్తోంది.

# వాణిజ్యం



## ఇకపై గూగుల్‌లో వ్యక్తిగత ఇంటర్వ్యూలు నిర్వహిస్తాం

### గూగుల్ సిఇఒ సుందర్ పిచాయ్

**న్యూఢిల్లీ, ఆగస్టు 17:** వర్చువల్ విధానంలో ఉద్యోగనియామకాలు జరుపుతుంటే నమ్మకం కలిగిన వ్యక్తులు రావడంలేదని గూగుల్‌సిఇఒ సుందర్‌పిచాయ్ అన్నారు. అందుకే గూగుల్‌లో మళ్లీ వ్యక్తిగత ఇంటర్వ్యూలు నిర్వహించేందుకు ప్రణాళిక సిద్ధంచేస్తున్నట్లు వెల్లడించారు. మంచి నైపుణ్యం కలిగిన వ్యక్తులను నిర్ధారించుకోడానికి అభ్యరునతలను కనీసం ఒకవిడత వ్యక్తిగే ఇంటర్వ్యూలతో పరీక్షించాలని గూగుల్ యోచిస్తోందని పిచాయ్ తెలిపారు. కృత్రిమ మేథ అంటే ఎఐ విస్త1తంగా వ్యాప్తిచెందిందని, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లకు రిమోట్ జాబ్ ఆన్‌లైన్ ఇంటర్వ్యూలు నిర్వహించవద్దని గూగుల్ ఉదోనయగులు కంపెనీ మేనేజ్‌మెంట్‌ను డిమాండ్‌చేస్తున్నారు. ఉదోనయగంలోకి వచ్చాక అభ్యర్థులు రియల్‌టైమ్ కోడింగ్ సవాళ్లను పరిష్కారించాల్సి ఉంటుందని ఆన్‌లైన్ ఇంటర్వ్యూల సమయంలో కెమేరా బయట ఎఐ సాధనాలను ఉపయోగించడంవల్ల అభ్యర్థుల వాస్తవిక సత్తా తెలియడంలేదన్నారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యే అభ్యర్థుల్లో 50శాతం కంటే ఎక్కువమంది ఎఐ సాధ నాలసాయంతోమోనంచేస్తున్నారని నియామక నిర్వాహకులు పేర్కొంటున్నట్లు తెలిపారు. మనమంతా హైబ్రిడ్‌గా పనిచేస్తున్నందున ఇంటర్వ్యూలలో కొంతభాగాన్ని వ్యక్తిగతంగా నిర్వహించడంపై ఆలోచించడం మంచిదని చెపుతున్నారు. గూగుల్ సంస్కృతిని అభ్యర్థులు అర్థంచేస ుకోడానికి ఇది సాయపడుతుందని పిచాయ్ అన్నారు. ఈ సమస్య కేవలం గూగుల్‌కే పరిమితం కాలేదని ఐటిపరిశ్రమ వ్యాప్తం సంక్షోభంగా మారిందన్నారు. ఈ సమస్య సత్వరపరిష్కారానికి కృషిచ ేస్తున్నామని గూగుల్ వైస్‌ప్రెసిడెంట్ బ్రియాన్ ఓంగ్ అన్నారు.



# జిఎస్టీ సంస్కరణలకు రాష్ట్రాలు సహకరించాలి

## ప్రధాని నరేంద్ర మోడీ సూచనలు


**న్యూఢిల్లీ, ఆగస్టు 17:** జిఎస్టీ భావితరం సంస్కరణలకు సంబంధించిన ముసాయిదాను ఇప్పటికే రాష్ట్రాలకు పంపించామని, వాటి అమలుకు సహకరించాలని ప్రధానిమోడీ విజ్ఞప్తిచేసారు. ఈముసాయిదాలో మార్పులు పేద మధ్యతరగతి ప్రజలతోపాటు వ్యాపారులకు ఎంతోప్రయోజనకరంగా ఉంటాయన్నారు. ఢిల్లీలో రెండు హైవే ప్రాజెక్టుల ప్రారంభోత్సవం అనంతరం మాట్లాడిన ప్రధానిమోడీ జీఎస్టీ చట్టాన్ని సరళీకృతంచేసి పనున రేట్లను సవరించాలని కేంద్రం భావిస్తోందన్నారు.
ఎన్డీయే దృష్టిలో సంస్కరణలు అనేవి సుపరిపాలన పురోగతిని సూచిస్తాయని సమీప భవిష్యత్తులో వ్యాపార కార్యకలాపాలు మరింత సులువుగా మార్చే లక్ష్యంతోనే సంస్కరణలు అమలుచేసేందుకు నెక్స్ట్‌జెన్ జీఎస్టీతో సిద్ధం అయ్యామని మోడీ అన్నారు. దీపావళినాటికి ఈసంస్కరణలు రెట్టింపు బోనస్ ఇస్తాయన్నారు. జీఎస్టీ సంస్కరణలకు సంబంధించిన ముసాయిదాను రాష్ట్రాలకు కేంద్రం పంపించింది. వీటికి అన్ని రాష్ట్రాలు సహకరిస్తాయని ఆశిస్తున్నట్లు చెప్పారు. సాధ్యమైనంత త్వరగా ఈప్రక్రియను పూర్తి చేయాలని విజ్ఞప్తిచేసారు.
ఈసంస్కరణలప్రతిపాదనలపై చర్చించేందుకు వచ్చేనెలలో జీఎస్టీ కౌన్సిల్‌భేటీ అవుతోందన్నారు. ప్రతిపాదిత రెండు శ్లాబుల విధానాన్ని జీఎస్టీ మండలి ఆమోదిస్తే ప్రస్తుతం ఉన్న నాలుగు శ్లాబుల్లో 12,28 శాతం శ్లాబులు తొలగిపోనున్నాయని 5, 18శాతం శ్లాబులు మాత్రమే ఉంటాయన్నారు. ఇది గేమ్‌ఛేంజర్ సంస్కరణగా మిగిలిపోతుందని నిపుణులు చెపుతున్నారు.
ఆరునెలలపాటు సాగిన చర్చలు డజన్ల సమావేశాల తర్వాత ప్రతిపాది జీఎస్టీ విధానం తెరమీదకు వచ్చిందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి.



## మార్కెట్‌లోకి స్మార్ట్ యమాహా హైబ్రిడ్ స్కూటర్

**చెన్నై, ఆగస్టు 17:** యమాహా దేశీయ మార్కెట్‌లోకి హైబ్రిడ్ స్కూటర్‌ను పరిచయం చేసింది. 125సిసి ఇంజిన్‌తో తయారైన ఈ స్కూటర్ ఐదు రకాల్లో లభిస్తోంది. ఫాసినో 125 ఎఫ్ఐ హైబ్రిడ్, రేజెడ్‌ఆర్ 125 ఎఫ్ఐ హైబ్రిడ్‌లు అడ్వాన్స్ స్మార్ట్‌ఫీచర్స్, స్టైలిష్ లుక్‌తో తయారుచేసింది. ఈ స్కూటర్‌ప్రారంభ ధర రూ.79, 340నుంచి రూ.1,02,790ధరల్లో లభిస్తున్నాయి. స్మార్ట్‌మోటర్ టెక్నాలజీ, సైలంట్ స్టార్ట్ అండ్ స్టాప్ సిస్టమ్, నావిగేషన్ సిస్టమ్ వంటి ఫీచర్స్‌తో తయారుచేసింది.

# ఐటి పరిధిలో లేకున్నా రిటర్నులు దాఖలు చేయాల్సిందే!




**న్యూఢిల్లీ, ఆగస్టు 17:** ఆదాయ పన్ను (ఐటీ) రిటర్నుల ఫైలింగ్ గడువు దగ్గర పడుతోంది. ఏటా జూలై ఆఖరు వరకు ఉండే గడువును ఈ సంవత్సరం ప్రభుత్వం సెప్టెంబరు 15 వరకు పొడిగించింది. చాలామంది తాము ఐటిపరిధిలోలేమని రిటర్న్ ఫైల్ చేయాల్సిన అవసరం ఏముందని అనుకుంటారు. అయితే ఆదాయం, పన్ను మినహాయింపు పరిధికి లోబడి ఉన్నా కొన్ని సందర్భాల్లో రిటర్న్ ఫైల్ చేయక తప్పదు. ఆదాయం తక్కువగా ఉన్నా చాలా మంది విదేశీ పర్యటనల్లో జోరుగా ఖర్చు చేస్తుంటారు. ఒక ఆర్థిక సంవత్సరంలో ఈ ఖర్చులు రూ.2 లక్షలు లేదా అంతకు మించి ఉంటే వారి ఆదాయం పన్ను మినహాయింపు పరిమితికి లోబడి ఉన్నా వారు తప్పనిసరిగా ఐటీ రిటర్న్ దాఖలు చేయాలి. ప్రపంచీకరణ పుణ్యమానీ భారతీయులూ పెద్దఎత్తున విదేశాల్లో ఆస్తులు కూడబెడుతున్నారు లేదా విదేశీ కంపెనీల షేర్లు, రుణ పత్రాల్లో మదుపు చేసి వాటిపై వచ్చే డివిడెండ్, వడ్డీ ఆదాయం పొందుతున్నారు. ఇలాంటి వ్యక్తుల ఆదాయం మన దేశంలో పన్ను మినహాయింపు పరిమితికి లోబడి ఉన్నా.. తప్పనిసరిగా తమ విదేశీ ఆస్తులు, పెట్టుబడులు, ఆదాయ వివరాలతో ఐటీ రిటర్న్ ఫైల్ చేయాలి. గత ఆర్థిక సంవత్సరం (2024-25) లో మీ ఆదాయం నుంచి టీడీఎస్ లేదా టీసీఎస్ రూ.25,000 లేదా అంతకు మించి ఉన్నా ఐటీ రిటర్న్ చేయడం తప్పనిసరి. ఒక ఆర్థిక సంవత్సరంలో ఒక వ్యక్తి వ్యాపార అమ్మకాలు, టర్నోవర్, ఆదాయం రూ.60 లక్షలు మించితే ఆ వ్యక్తి తప్పనిసరిగా రిటర్న్ ఫైల్ చేయాలి. అదే వృత్తి నిపుణులైతే వార్షిక ఆదాయం రూ.10 లక్షలు మించితే తప్పనిసరిగా రిటర్న్ దాఖలు చేయాలి. ఆర్థిక సంవత్సరంలో మీ వార్షిక కరెంటు బిల్లు రూ.2 లక్షలు లేదా అంతకు మించి ఉంటే తప్పనిసరిగా ఐటీ రిటర్న్ ఫైల్ చేయాలి. మీ వార్షిక ఆదాయం పన్ను మినహాయింపు పరిమితికి లోబడి ఉన్నా, ట్యాక్స్ రిఫండ్ ఏమైనా ఉంటే, ఐటీ రిటర్న్ ఫైల్ చేయడం తప్పనిసరి. ఈ రిటర్న్‌లోని సమాచారాన్ని సరిచూసుకునే ఆదాయ పన్ను శాఖ రిఫండ్ జారీ చేస్తుంది. ఏ వ్యక్తికైనా ఒక ఆర్థిక సంవత్సరంలో బ్యాంకు కరెంట్ ఖాతాలో అయితే రూ.కోటి లేదా అంతకు మించి, సేవింగ్స్ బ్యాంకు ఖాతాలో అయితే రూ.50 లక్షలు లేదా అంతకు మించి డిపాజిట్లు ఉంటే వారు తప్పనిసరిగా ఐటీ రిటర్న్ ఫైల్ చేయాలి. వార్షిక ఆదాయం పన్ను మినహాయింపు పరిమితికి లోబడి ఉన్నా పెట్టుబడి లాభాలపై దీర్ఘకాలిక మూలధన లాభాల పన్ను (ఎల్‌టీసీజీ) మినహాయింపు కోరుకునే వ్యక్తులూ తప్పనిసరిగా ఐటీ రిటర్న్ ఫైల్ చేయాలి.




## ట్యారిఫ్ భయాలను అధిగమించే కొత్త జిఎస్టీ!

**న్యూఢిల్లీ, ఆగస్టు 17:** ప్రతిపాదిత జిఎస్టీ సంస్కరణలను నెక్స్ట్ జెన్‌జీఎస్టీగా అధికారులు చెపుతున్నారు. సింగిల్ ట్యాక్స్ శ్లాబ్‌గా మారే అవకాశం ఉందని చెపుతున్నారు. కొత్త జిఎస్టీ విధానంలో ఐదుశాతం, 18శాతం శ్లాబులు మాత్రమే ఉండటంతో ఆర్థికవ్యవస్థ ఉత్తేజితం చేస్తుందని సదరు అధికారి తెలిపారు. టారిఫ్ భయాలను అధిగమించేలాచేస్తుందన్నారు జిఎస్టీ మండలి ఆమోదిస్తే ఇకపై 5,18 శ్లాబులు మాత్రమే ఉంటాయని అంటున్నారు. ఇదొక గేమ్‌ఛేంజర్ సంస్కరణ అని చెపుతున్నారు నిత్యావసరాలన్నింటిపైనా ఇక ఐదుశాతం జీఎస్టీ ఉంటుంది. జీఎస్టీ మండలి సమావేశంలో ఆమోదం పొందితేపన్నురేట్ల ఆధిక్యం ముగుస్తుందని, స్థిరత్వాన్ని తెస్తుందని అంచనా. ఇదే కొనసాగితే బహుశా 2047 నాటికి ఒకే శ్లాబ్ జీఎస్టీ స్థాయికి చేరతామనిజీఎస్టీ అధికారులే చెపుతున్నారు. ఇదే విధానం అమలులోకి వస్తే దేశం అభివృద్ధిచెందిన దేశాల జాబితాలోకి మారిపోతుందన్నారు. అప్పుడు ఇక దేశవ్యాప్తంగా ఒకే శ్లాబులో జీఎస్టీ కొనసాగుతుందని అధికారులు చెపుతున్నారు. ప్రతిపాదిత జిఎస్టీ విధానంలో సామాన్యుడి అవసరాలన్నీ కూడా ఐదుశాతం శ్లాబ్‌లోనే ఉంటాయి. ధరలు తగ్గడంతో వినియోగం కూడా పెరిగే అవకాశం ఉంది. తక్కువ పన్నులు విధించడం అంటే ప్రజల జేబుల్లో మరింతగా ఆదాచేయడమేనని ప్రభుత్వం చెపుతోంది. ఆరునెలలపాటు జరిగిన సుదీర్ఘ తర్జనబర్జనల తర్వాత ఈ కొత్త నెక్స్ట్‌జెన్ జిఎస్టీ అమలుకువచ్చిందన్నారు.

## ఈవారం ఏడు పబ్లిక్ ఇష్యూలు!




**ముంబయి, ఆగస్టు 17:** మార్కెట్లలోకి ఈవారం ఏడు పబ్లిక్ ఇష్యూలు వస్తున్నాయి. మెయిన్‌బోర్డులో విక్రమ్‌సోలార్, శ్రీజీ షిప్పింగ్, జెమ్ ఏరోమాటిక్స్, పటేల్ రిటైల్ మంగళ్ ఎలక్ట్రికల్ ఇండస్ట్రీస్‌లు ఇష్యూకు వచ్చాయి. వీటిలో మంగళ్ ఎలక్ట్రికల్ 28న స్టాక్ ఎక్ఛేంజిల్లో నమోదు అవుతుండగా మిగిలి నాలుగు కూడా 26న నమోదవుతున్నాయి. ఎస్ఎంఇ విభాగంలో రెండు కొత్త పబ్లిక్ ఇష్యూలు ఉన్నాయి. స్టూడియో ఎల్ఎస్‌డి, ఎల్జీటీ బిజినెస్ కనెక్షన్‌లు ఉన్నాయి. ప్రధాన ఇష్యూల్లో ఈవారం బ్లూస్టోన్ జ్యూయెలరీ 19వ తేదీ రెగాల్ రీసోర్సెస్ 20న నమోదవుతున్నాయి. ఎస్ఎంఇ విభాగంలో 18న ఎఎన్‌బీ మెటల్‌క్యాస్ట్, స్టార్ ఇమేజింగ్; మెడిస్టెప్ హెల్త్‌కేర్, 19న ఇకోడెక్స్ పబ్లిషింగ్, 20న మహీంద్ర రియాల్టర్స్ ఎన్ఎస్ఇ ఎస్ఎంఇ ప్లాట్‌ఫామ్‌పై నమోదవుతూన్నాయి.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No. 64861/96 , Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14